THE BOOK WAS DRENCHED

TEXT LITE WITHIN THE BOOK ONLY

UNIVERSAL LIBRARY
OU_204769
UNIVERSAL LIBRARY

श्रीः

श्रीमत्

# वाल्मीकिरामायणम्

# శ్రీమద్వాల్మీకి రామాయణము.

భమిడిపాటి కామేశ్వరశాస్త్రి
విరచిత సంపూర్ణాంధ్రవ్యాఖ్యా
సమేతము.

ప్రథమసంపుటము.

శ్రీరస్తు.

శ్రీరామచంద్రపరబ్రహ్మణేనమః.

# శ్రీమద్వాల్మీకి రామాయణము.

ప్రతిపదార్థవివరణ, భావ, నానార్థ ప్రతినామసమేతము,

భమిడిపాటి కామేశ్వరశాస్త్రిచే

ప్రకటితము.

రాజమహేంద్రవరము.

మొదటికూర్పు 1000 ప్రతులు.

శ్రీ సత్యవోలు గున్నేశ్వరరాయసోదరుల

శ్రీచింతామణిముద్రాలయమున

ముద్రితము.

౧౯౨౨.

శాలివాహనశకము ౧౮౪౪ దుందుభి.

సర్వస్వామ్యసంకలితము.] [వెల రు. ౨-౧-౦.

# ప్రధాన పోషకులు.

———:o:———

బ్ర॥ శ్రీ॥ మ॥ రా॥ శ్రీ॥

౧ శ్రీ, హోతా వీరభద్రయ్యగారు, ప్రొప్రయిటర్ ఆఫ్
గంగోలుఎస్టేటు, రాజమండ్రి.

౨ సత్యవోలు గున్నేశ్వరరాయసోదరులు,
ప్రొప్రయిటర్సు ఆఫ్ చింతామణి ప్రెస్ ప్రింటింగువర్క్సు,
అండ్ చింతామణి [illegible], రాజమహేంద్రవరము.

౩ ఆద్దేపల్లి లక్ష్మణస్వామినాయుడుగారు, ఆంధ్రపరిచారిణీ
గ్రంథమాలా పునరుద్ధారకులు, భాషాభిమానులు, రాజమండ్రి.

---

# రాజపోషకులు.

———:o:———

బ్ర॥ శ్రీ॥ మ॥ రా॥ శ్రీ.

౧ శ్రీ, తుంగమర్తి నరసింహారావుపంతులుగారు జమీందార్,
హనుమకొండ, నైజాం.

౨ వేదాంతం రామనాథముపంతులుగారు, డిప్యూటీకలెక్టర్, గంజాం

౩ ఆర్. నాగేశ్వరయ్యర్‌గారు, డిస్ట్రిక్టుమున్సిఫ్, రాజమండ్రి.

౪ బ్రహ్మజోస్యుల సీతారామయ్యపంతులుగారు, భాషాభిమానులు,
రాజమండ్రి.

౫ గంగిరెడ్ల కృష్ణమూర్తిగారు, రాజమండ్రి, ఇంజనీయర్,
కర్ణాటిక్ పేపరుమిల్లు.

౬ గాడిచెర్ల నరసింహారావుగారు, ప్రొప్రయిటరు, రాజమండ్రి.

౭ అయ్యంకి వెంకటరమణయ్యపంతులుగారు, బెజవాడ.

౮ చందూరి వెంకటరామసుబ్బారాయుడుగారు, అడివికొల్లు.

౯ బోడపాటి రామలింగముపంతులుగారు, మునిసిపల్‌కవున్సిలరు,
రాజమండ్రి.

౧౦ సూరి పూర్ణానందముపంతులుగారు, కవులు, పోలీసుసబుఇనస్పెక్టర్,
అయినవోలు, వినుకొండ గుంటూరుడిస్ట్రిక్టు.

౧౧ పెనుమత్స వీర్రాజుగారి కు॥ నరసింహరాజుగారు, కేలంగి.

౧౨ పేరివేల రామకృష్ణయ్యగారు, రాజమండ్రి, ఆర్యాపురము.

౧౩ సూరివరపు కామయ్యగారు, భద్రాచలము.

౧౪ వద్దిపర్తి వెంకటరాయుడుపంతులుగారు గవర్నమెంటు, పెన్షనర్, అందు హెడ్ క్వార్టరుసూపరువైజరు, బొబ్బిలిసంస్థానము.

౧౫ భమిడిపాటి సూర్యనారాయణగారు, సాల్టుసబుఇనస్పెక్టరు, అడ్డతీగల.

౧౬ కనుమూరి రామచంద్రరావుగారు, కేలంగి.

౧౭ కాకి కృష్ణమూర్తి అండు సన్సువారు, రాజమండ్రి.

౧౮ నాగుమిల్లి వెంకటసుబ్బయ్యగారు, రాజమండ్రి.

౧౯ గ్రంథి సత్తిరాజుగారు, రాజమండ్రి.

౨౦ బత్తుల ధనరాజుగారు, రాజమండ్రి.

౨౧ పందిరి వీరన్న అండు సన్సువారు, రాజమండ్రి.

౨౨ వీరిన లత్సయ్య అండు సన్సువారు, రాజమండ్రి.

౨౩ కర్రా అచ్చయ్య అండుసన్సువారు, రాజమండ్రి,

౨౪ సర్వదేవభట్ల జగ్గయ్యపంతులుగారు, ప్లీడరు, కంభంమెట్టు.

---

# పోషకులు.

బ్ర॥ శ్రీ॥ మ॥ రా॥ శ్రీ॥

౧ శ్రీ, చల్లా సూర్యనారాయణశాస్త్రిలుగారు, తర్క వేదాంతమంత్రతీర్థులు, రాజమండ్రి.

౨ ముట్నూరి వెంకటసుబ్బారాయుడుగారు, బి. ఏ., సుప్రసిద్ధాంధ్రకవులు అక్కౌంటెంటు, అండు మేనేజరు, పి. డబ్లియు. డి. ధవళేశ్వరం.

౩ గాడేపల్లి వెంకటేశ్వర్లుగారు బి. ఏ., యల్. టీ., సబ్ అశిస్టాంటు ఇన్స్పెక్టరు ఆఫ్ స్కూల్సు రేంజ్ రాజమండ్రి.

౪ అయినాపురపు వెంకటరమణయ్యపంతులుగారు, సబ్ డివిజనల్ ఆఫీసర్, నాగర్కర్నూల్ నైజాం.

౫ ఉప్పులూరి సుబ్బారావుపంతులుగారు, ప్రొవరుసీర్ పి. డబ్లియు. డి. సౌత్ పల్లూరు.

౬ మూనుగరి సుబ్బారావుగారు, హెడ్‌క్లర్కు పి. డబ్లియు. డి. రాజమండ్రి, ఆర్యాపురము.

౭ వద్దిపర్తి నారాయణరావుగారు, కలక్టేరిటుక్లర్కు, కాకినాడ.

౮ భమిడిపాటి నరసింహశర్మగారు, గవర్నమెంటుహైస్కూలు టీచరు, భద్రాచలము.

౯ వంగల సుబ్రహ్మణ్యశాస్త్రిలుగారు, పండితులు, ఆయుర్వేదవైద్యులు, కుమారదేవము.

౧౦ వంగవేటి లక్ష్మీనరసింహశాస్త్రిలుగారు, పండితులు, ఆయుర్వేదవైద్యులు, రాజమండ్రి.

౧౧ హోరావిశారద, సామవేదుల సూర్యనారాయణశాస్త్రిలుగారు అష్టావధాని, నేత్రావధాని, కాశరపద్రు అగ్రహారము.

౧౨ శివపురపు వీరభద్రపాకయాజిగారు, శ్రుతిధర్మసంజీవనీ పత్రికాధిపతులు, బెజవాడ.

౧౩ సాగి సుబ్రహ్మణ్యశాస్త్రిలుగారు, ఆయుర్వేదవైద్యులు. రాజమండ్రి.

౧౪ సత్యవ్రోలు అప్పారావుగారు, ఆంధ్రకవులు, రాజమండ్రి.

౧౫ వాజపేయాజుల రామసుబ్బారాయుడుగారు, బి. ఏ., రాజమండ్రి.

౧౬ ఆచంట నారాయణరావుగారు బి. యే., వేమవరం.

౧౭ సరిపల్లె కామేశ్వరరావుగారు, రాజమండ్రి.

౧౮ సరిపల్లె విశ్వేశ్వర ప్రసాదరావుగారు, రాజమండ్రి, ఆర్యాపురము.

౧౯ సామవేదము సుబ్బారావుగారు, క్లార్కు మున్సఫ్‌కోర్టు రాజమండ్రి.

౨౦ జటప్రోలు వెంకటేశ్వర్లుగారు, భాషాభిమానులు, రాజమండ్రి.

౨౧ పొలసు వెంకటకృష్ణయ్యగారు, తాడేపల్లిగూడెం.

౨౨ దేవులపల్లి లక్ష్మీనారాయణగారు, తాడేపల్లిగూడెము.

౨౩ కల్లూరి రామమూర్తిగారు, ముమ్మిడివరము, గోదావరి.

౨౪ దండు సుబ్బరాజుగారు, నేలపోగుల.

౨౫ అవధానుల వేంకటరామశాస్త్రిలుగారు, రాజమండ్రి.

౨౬ బహురోజు వెంకటరత్నంగారు, కొమ్మర.

౨౭ సాగిరాజు జోగిరాజుగారు, ఏలేరు, కృష్ణా.

౨౮ అడివికొలను మల్లయ్యగారు, అసిస్టెంటుకరణము, అడివికొలను.

౨౯ అంజాల రామారావునాయుడుగారు, సాల్టుడిపార్టుమెంటు, రాజమండ్రి.

౩౦ తణుకు కొండయ్యదీక్షితులుగారు, ఆర్యాపురం రాజమండ్రి.

శ్రీ

# ఉపోద్ఘాతము.

—:)o(:—

కావ్యం యశసే ఽర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే।
సద్యఃపరనిర్వృతయే కాంతాసమ్మితతయోపదేశయుజే॥

కావ్యప్రకాశిక.

యశము, ధనము, వ్యవహారజ్ఞానము, ఆపదుత్తరణము, ఇహపరసౌఖ్యము, సదుపదేశము నొసంగునది కావ్యమని యాలంకారికులమతము. ఇందొక్కొక్క ప్రయోజనమును సమర్థించు కావ్యములుగొన్ని యున్నను వీనికన్నిటికిం దావలమై సకలశ్రేయము లొసంగు కావ్యరాజము వాల్మీకిమహర్షి విరచిత మగు శ్రీమద్రామాయణమునకు మించి వేఱొకటి లేదని నిశ్చయముగాఁ జెప్పవచ్చు. చిత్తము చలించి విచారగ్రస్తమైయున్నప్పు డనేకులు రామాయణములోని సుందరకాండాదిభాగములఁ బారాయణము చేయుటయుఁ బారాయణము చేసినవారి కర్థసిద్ధి చేకూరి చిత్తశాంతిగలుగుటయు మనముచూచుచునే యున్నాము. క్షరముగాని యక్షరసంయోగమువలన నన్ని కార్యములు సాధింపఁబడు నను మంత్రశాస్త్రవేత్తల మతప్రకారము బీజాక్షరసంయోగమువలన సకలము సాధించు మార్గము లనేకములు రామాయణంబునఁ బొందుపఱుపఁబడియున్నవి. కావుననే పారాయణాదిసందర్భములందు భాషాంతరీకృత గ్రంథములువలను పడవని పెద్దలు చెప్పియున్నారు. దానంజేసి పారాయణాదికర్తలకు వాల్మీకిరామాయణమె శరణ్య మగుచున్నది. సామాన్యభాషాపరిచయముగలవారికది దుర్గ్రహమగుటచే మహేశ్వరతీర్థాదు లనేకులు (రామాయణమునకు) వ్యాఖ్యానములు వ్రాసియున్నారు. కాని యవి సంస్కృతభాషలో నుండుటచే నాంధ్రభాషాపరిచయముగలవారి కెంతమాత్ర ముపకరింపకున్నయవి. ఈలోపమును దీర్చుటకై బ్ర॥ శ్రీ॥ చదలవాడ సుందరరామశాస్త్రులువారు ప్రతిపద టీకా తాత్పర్య విశేషార్థసహితముగ రామాయణమునకుఁ బరమార్థచంద్రికయను నాంధ్రవ్యాఖ్యానమును వ్రాసి యాంధ్రలోకమునకు మహోపకార మొనర్చిరి.

యదిక్షుణ్ణం పూర్వైరితిజహాతి రామస్య చరితం।
గుణైరే తావద్భిర్జయతి పున రన్యోజగతి కః।
స్వ మాత్మానం తత్తద్గుణగరిమగంభీరమధుర।
స్ఫురద్వాగ్బ్రహ్మాణః కథ ముపకరిష్యంతి కవయః॥

అని భట్టుమూర్తి వచించినట్లు రామాయణమునందలి నైజభక్తిచేతను,
సంస్కృతమునందువలె నాంధ్రభాషయందును రామాయణమున కనేకవ్యా
ఖ్యానములుండవలదా యనుతలంపునను, ఎల్లప్పుడు రామాయణశ్లోకములం
జదువుటయు రామాయణకాలక్షేపము సేయుటయుం జూచి మామిత్రులు
కొందఱు రామాయణమునకు సంపూర్ణాంధ్రవ్యాఖ్యానము వ్రాసి మాససం
పుటములుగా వెలువరింపుఁడని ప్రోత్సహించుటచేతను కొండొకకాలము
క్రిందట ముద్రితము లగుగోవిందరాజీయాదివ్యాఖ్యానముల నముద్రితము
లగుసుబోధిని చాతుర్థి మున్నగువ్యాఖ్యానములఁ బురస్కరించికొని యీ
వ్యాఖ్యానమును బ్రతిపదాంధ్రవివరణ భావనానార్థసమేతముగా వ్రాయఁ
గడంగితిమి. కానిగ్రంథప్రకటనము విశేషద్రవ్యసాధ్యమనియు నీయుద్యమము
బహుజనసాహాయ్యమునంగాని కొనసాగ దనియుం దలంచుచుండ నొకప్పుడు
బ్రహ్మశ్రీ యీమని వేంకటేశ్వర్లుపంతులుగారు, (గణపవరం, వుయ్యూరుఎస్టేటు
మేనేజరు) ప్రసంగవశమున మాప్రయత్నము నాలకించి తప్పక పొత్తముం బ్రకటింపుఁ
డనియు సాధ్యమైనంత సాహాయ్యమును జేయుటకు నేను సంసిద్ధుఁడనై యున్నా
ననియుఁ జెప్పి విశేషముగఁ బ్రోత్సహించి రు. 150—0—0 లు తత్క్ష
ణమె యిప్పించి ముందుపనులు చూడుఁడని చెప్పిరి. వేంకటేశ్వర్లుపంతులుగా
రుదారస్వభావులు; విద్యాభిమానపూరితులు; భీమవరంతాలూకా గణపవర
సమీపమున నరిపల్లెలోని సత్యాభివర్థకనిలయమునకు మూలపురుషులు;
40 విద్యార్థుల కన్నదానము విద్యాదానముగావించుచున్న సంస్కృత
పాఠశాలకుఁ బ్రధానాధారులు. కావున వారియెడమాకుఁ గలవిశేషవిశ్వాస
ముచే వారిగ్రంథమాల కధ్యక్షులుగా నుండఁదగినవా రనితలంచి వారిపేరఁ
బ్రచురణపత్రములుగొన్ని ప్రకటించితిమి. పంతులుగారు నిరీహాబుద్ధితో
నధ్యక్షతాదిపదవులం జేకొనఁబడుట కుత్సహింప ననియు మీకు సాధ్యమై
నంత సాహాయ్యము చేయుటకు నేనెప్పుడు సంసిద్ధుఁడనేయనియుఁ దెలియఁబఱిచి
నందున వెంటనే యారీతి నుపసంహరించికొని గ్రంథప్రకటనమునకుఁ బూని
కొంటిమి. కానియనివార్యము లగునిబ్బందులచే ననుకొనినంతన గ్రంథ
మును బాఠకమహాశయుల కందఁ జేయఁజాలక పోయితిమి. ప్రతిమాసమున
యుక్తకాలమున సంపుటములు వెలువడుటకు వలయు పరికరములు సిద్ధముచేసి
కొని ప్రథమసంపుటమును బయలుపఱుపవలయు ననుతలంపుచే నింతకాలము
నిరీక్షించితిమి. అయినను రెండుమూడుమాసములవఱకు యుక్తకాలమున సం
పుటములు ప్రకటించుట కనుకూలపరిస్థితులింకను గలుగనందున సాధ్యమై
నంత శీఘ్రముగఁ బ్రకటించుటకుఁ బ్రయత్నించుచుఁ బ్రథమసంపుటమును
వెలువరించితిమి. పాఠక మహాశయులు ముందు రెండుమూడు సంపుటముల

వఱకు నించుకవిలంబ మైననుసహించి మాయుద్యమమునకు మిగులఁ జేయూత నొసంగుదురుగాకయని కోరుచున్నాము. విశేషద్రవ్యసాధ్య మగునీయుద్యమమునకుఁ బ్రథమప్రోత్సాహకు లగు బ్రహ్మశ్రీ॥ వెంకటేశ్వర్లుపంతులుగారికి సహజభాషాభిమానముతో నిండుప్రోత్సాహ మొసంగిన ప్రధానరాజపోషకులకు రాజపోషకులకుఁ బోషకులకును (గ్రాహకులకు) గృతజ్ఞతను దెలియఁ బఱుచుచు వారినామావళిని బ్రతిమాసమున సంపుటములందుఁ బొందుపఱుచుచున్నాము. ఈయసాధారణోద్యమవిషయమై తోడ్పడినసోదర దేశీయ మహాజనులకు మే మెంతయుఁ గృతజ్ఞులము. ప్రతిపదాంధ్రవివరణాది సమేతముగా వాల్మీకి రామాయణముఁ బ్రకటించుటకు దొరకొనినమాకుఁ బెన్నిధివలె లభించి యనిశము సర్వవిషయములందు సంపూర్ణసాహాయ్య మొనర్చుచు నీమహత్తరోద్యమమునకు వన్నెగలిగించిన గీర్వాణాంధ్రోభయ భాషాధురీణులు కవులు మాకత్యంతబంధుమిత్రులు నగు బ్ర॥ వారణాసి సూర్యనారాయణ శాస్త్రులవారి కనేకకృతజ్ఞతాభివందనము లర్పించి పాఠకమహాశయులకు శ్రీరామచంద్రుఁ డనవరతమాయురున్నతుల నొసంగి సర్వదా రక్షించుఁగాత యని ప్రార్థించుచు నింతటితో విరమించుచున్నారము.

ఇట్లు విద్వజ్జనవిధేయుఁడు,

భ మి డి పా టి కా మే శ్వ ర శా స్త్రి.

# విషయసూచిక.

—(:o:)—


| | | |
|---|---|---|
| 1 | పీఠిక. | |
| 2 | శ్రీమద్రామాయణ పఠనశ్రవణవిధి. | |
| 3 | శ్రీవైష్ణవ సాంప్రదాయశ్లోకములు ... ... ... | ౫ |
| 4 | ఉపసంహార శ్లోకములు ... ... ... ... | ౧౯ |
| 5 | స్మార్తమాధ్వాదులచేఁ బారాయణారంభమునఁ జదువఁదగిన ... | |
| | మంగళశ్లోకములు ... ... ... ... | ౨౭ |
| 6 | ఉపసంహార శ్లోకములు ... ... ... ... | ౪౪ |
| 7 | గాయత్రీరామాయణము ... ... ... ... | ౫౩ |
| 8 | షట్త్రింశచ్ఛ్లోక ఫలశ్రుతి ... ... ... ... | ౬౨ |
| 9 | సంగ్రహ రామాయణము ... ... ... ... | |


# చిత్రపటములు.


1 శ్రీరామపంచాయతనము. ... ... ... ...

2 నారదుఁడు వాల్మీకికి శ్రీరామచరిత్ర ముపదేశించుట. ... ...

శ్రీరస్తు.

శ్రీమహాగణాధిపతయేనమః.

# శ్రీమద్వాల్మీకిరామాయణాంధ్రవ్యాఖ్యానపీఠిక.

---:o:---

( పూర్వభాగము. )

---

శ్రీమద్రామాయణమును వాల్మీకిమహర్షి రచించె నని, శ్రీమద్వాల్మీకీయే, ఇత్యాదిసర్గాంతవాక్యములచేతను, గ్రంథమున కుపోద్ఘాతముగ వ్రాయఁబడిన మొదటి ౨, ౩, ౪, సర్గములవలనను,

'ఆదికావ్య మిదం చార్షం పురా వాల్మీకినా కృతమ్।
యః పఠే చ్ఛృణుయా ల్లోకే నరః పాపా ద్విముచ్యతే॥ ౧
శ్రుణోతి య ఇదం త్వాఖ్యానం పురా వాల్మీకినా కృతమ్।
శ్రద్ధధానో జితక్రోధో దుర్గాణ్యతితరత్యసౌ'॥ ౨

అను యుద్ధకాండాంతఫలశ్రుతియందలిశ్లోకములనుబట్టియు విస్పష్టమగుచున్నది. కాని యీవాల్మీకి యెప్పటివాఁడో, తలిదండ్రు లెవరో మొదలగు విశేషము లేమియు నీగ్రంథమునం దెచ్చట వ్రాయఁబడి యుండ లేదు. వాల్మీకి వేదవేదాంగముల నధ్యయనము చేసినతపశ్శాలి యనియు మహాభక్తుఁడనియు గంగాతీరమునఁ దమసానదియొడ్డున నాశ్రమముఁ గల్పించికొని శిష్యులకు వేదశాస్త్రములు బోధించుకులపతి యనియు నీతనిశిష్యులలో భరద్వాజుఁడు ప్రముఖుఁ డనియును వాల్మీకిచరిత్రము, రామాయణమువలన మనకుఁ దెలియుచున్నది. మఱియు నుత్తరకాండమున ౯౬ సర్గములో (శ్లో. ౧౯-౨౦.)

ప్రచేతసోఽహం దశమః పుత్రో రాఘవనందన।
నస్మరా మ్యనృతంవాక్య మిమౌతు తవపుత్రకౌ॥ ౩
బహువర్షసహస్రాణి తపశ్చర్యాకృతా మయా।
నోపాశ్నీయాం ఫలం తస్యా దుష్టేయం యదిజానకీ॥ ౪

అనువాల్మీకి శపథరూపము లగుశ్లోకములవలన వాల్మీకిమహర్షి ప్రచేతసునిదశమపుత్రుఁ డనియు ననేకవేలసంవత్సరములు బహునిష్ఠతోఁ దపం

బోనర్చినవాం డనియు నవగత మగు చున్నది. శ్రీమద్రామాయణమునకు రామాయణతత్త్వభూషణ వ్యాఖ్యానకర్త యగుగోవిందరాజులు విష్ణుపురాణో త్తరఖండమునందలి ' వక్రే ప్రచేతసఃపుత్రస్తం బ్రహ్మాప్యన్వమన్యత ' అను వాక్యము, విష్ణుపురాణమందలి 'ఋక్షో భూద్భార్గవస్తస్మాద్వాల్మీకిర్యో భిధీయతే' అనువాక్యము, బ్రహ్మవైవర్తపురాణమునందలి-

అథ బ్రహ్మా మహాతేజా బ్రహ్మలోకపితామహః।

వల్మీకాద్ధి ప్రయాస్తాత స్తాద్వాల్మీకిరితి స్మృతః॥ ౫౹

అను శ్లోకము నుదాహరించి వాల్మీకి తొలుత భృగువంశోత్పన్నుం డగు ప్రచేతసునకు జనించి యుక్తాంశ మనునేం బోయలతో చేరి నివసించుచు బ్రహ్మర్షి మహాత్ముల సన్నిధానమున నుండి నానావిధములగు ఘట్టలను ... దేవుడు స్వప్న ... శ్రీరామ తారకమంత్రము నుపదేశించి ... తిన్నగ నిరంతర ప్రయత్నము గావించిన ... ప్రభావంబున ... దివ్యదేహముతోం బయలువెడలి బ్రహ్మచే వాల్మీకి యని పిలువబడెనని నారదుడనియు వాల్మీకి నామంబునం బ్రసిద్ధిం జెందె నని వ్రాసియున్నారు. శ్రీరామాయణతత్త్వ దీపికా వ్యాఖ్యానకర్త యగుమహేశ్వరతీర్థులు

వాల్మీకరభవద్బ్రహ్మా వాణీ వాక్యే ప్రరూపిణీ।

చకార రామచరితం పావనం చరితవ్రతః॥ ౬౹

అనుస్కాందపురాణమునందలి వాల్మీకినిగూర్చిన యీవాక్యము నుదాహ రించి సత్యలోకప్రసిద్ధ మగుశతకోటి ప్రవిస్తర రామాయణమును భూలోకమునం బ్రవర్తింపం జేయ బ్రహ్మయే వాల్మీకి యై యవతరించె నని వ్రాసియున్నారు. వాల్మీకి యేకాలమువాం డని రామాయణమునం గంఠోక్తము గాకున్నను రామాయణకథానాయకుం డగుశ్రీరామునితో సమకాలికుం డని మన మీక్రిందిసందర్భములంబట్టి గ్రహింపవచ్చును. వాల్మీకి మొదట 'కోన్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్ ' అని ప్రశ్నించి యున్నాడు. ఇప్పు డీలోకమున నెవ్వండు గుణవంతుం డనియడిగినప్పుడు నారదుం డిప్పటికాలమువానిం గూర్చియే సమాధానముం జెప్పును గాని ముందు జనింపంగలవానినో గత కాలపువానినో గుఱించి వాకొనండుగదా! నారదుండు లోకసంచారి యగుటచే ననేకదేశములందలిదివ్యపురుషుల నెఱింగి యుండవచ్చు ననునాశ యముతో వాల్మీకి యట్టిపుణ్యశ్లోకునిపేరుంగోరి ప్రశ్నించె. నారదుండును వడను

కూలుఁ డగుమహాపురుషుఁ డెవ్వఁడై యుండు నని యించుక బుద్ధిసేయువిమ ర్శించి శ్రీరాముఁ డట్టిగుణవంతుఁ డని నిశ్చయించి రామచరిత్ర ముపదేశించెను. కావుననే నారదుఁడు-

బహవో దుర్లభాశ్చైవ యే త్వయా కీర్తితా గుణాః।
మునే వక్ష్యామ్యహం బుద్ధ్వా తైర్యుక్తశ్శ్రూయతాం నరః॥ ౭౪

అని చెప్పియున్నాఁడు. మఱియు నయోధ్యాకాండము ౫౬ సర్గములో-

ఇతి సీతా చ రామశ్చ లక్ష్మణశ్చ కృతాంజలిః।
అభిగమ్యాశ్రమం సర్వే వాల్మీకిమభివాదయన్॥
తాన్మహర్షిః ప్రముదితః పూజయామాస ధర్మవిత్।
ఆస్యతామితి చోవాచ స్వాగతం తు నివేద్య చ॥
తతోఽబ్రవీన్మహాబాహుర్లక్ష్మణం లక్ష్మణాగ్రజః।
సన్నివేద్య యథాన్యాయమాత్మానమృషయే ప్రభుః॥ ౧౦౪

అని శ్రీరాముఁడు సీతాలక్ష్మణసమేతుఁడై వాల్మీకాశ్రమమున కేగి యమ్మహర్షిచేఁ బూజితుండై తనవృత్తాంత మమ్మునివర్యున కెఱిఁగించినట్లు చెప్పఁబడి యున్నందున శ్రీరామవాల్మీకులు సమకాలికులని కంఠోక్త మగుచున్నది.

వాల్మీకి శ్రీరామచరిత్రమును సాకల్యముగాఁ దా నెఱిఁగి యున్నప్పుడు నారదువలన తెలిసికొనుట యెట్లు సంఘటించు నని శంక యుదయింపవచ్చును. వాల్మీకి శ్రీరామచరిత్రమునే చెప్పు మని నారదు నడుగ లేదు. ఈశ్లోకమున నిప్పు డిట్టిగుణగణము గలవాఁ డెవ్వఁ డని మాత్రము ప్రశ్నించెను. నారదుఁడు శ్రీరామచరిత్రమును వాల్మీకి కెఱిఁగింపఁ బ్రహ్మచేఁ బ్రేరితుండై తత్ప్రశ్నమున కుపదేశించెను. కాన వాల్మీకిప్రశ్నమునకు శ్రీరామునిసమాధానముగాఁ జెప్పుటకు (జ్ఞాతుమేవంవిధం నరం) అనుపదము బోధక మగునా యని యించుక సంశయించెను. మనుష్యచరిత్రమును వినఁగోరుచున్నముని కతిలోకుఁ డగు భగవంతునిచరిత్రము బోధించు టెట్లు? ఆలోచింపఁగా వాల్మీకిమహర్షిచే వర్ణింపఁబడినగుణములు వేదాంతప్రతిపాదితము లగుమహాగుణములై యుండె. అట్టిగుణములు కేవలనరునియం దెట్లు సంభవించును? ఈశ్లోకమం దిప్పటి నరుఁ డనుటచే లోకాంతరస్థులఁ గాని కాలాంతరస్థులఁ గాని యుద్దేశించి ప్రస్తావించుటకు వీలు లేదు. తా నెవ్వనిచరిత్ర ముపదేశింపఁదలంచి వచ్చెనో

యట్టిశ్రీరామచంద్రుఁ డే యిప్పు డీలోకమున వేదాంతప్రసిద్ధము లగుగుణములు గలనరపుంగవుఁ డై యున్నవాఁ డని సమన్వయించికొని పరమహర్షముతో శ్రీరామచరిత్రమును జెప్పఁ గలిగెను. తమదేశమును బాలించు ప్రభువు లోకవిలక్షణగుణగణమండితుఁ డని త్రిలోకజ్ఞు లగుపెద్దలచే నిర్ణయింపఁబడినప్పు డెవ్వఁ డమందానందకందళితహృదయుఁ డై యప్పుణ్యశ్లోకు నభినుతింప దొరకొనకుండు? అదియుఁ గాక-

మచ్ఛందాదేవ తే బ్రహ్మన్ ప్రవృత్తేయం సరస్వతీ।
రామస్య చరితం సర్వం కురు త్వమృషిసత్తమ॥ ౧౧౪

అని బ్రహ్మచే ననుజ్ఞాతుం డగుటచేఁ గూడ నధిగతసకలరామవృత్తాంతుం డై వాల్మీకి 'కృత్స్నం రామాయణం కావ్య మీదృశైః కరవాణ్యహమ్' అని సంకల్పించెను. ౧౧౫

వాల్మీకి పూర్వజన్మవృత్తాంతము.

ఆనందరామాయణము రాజ్యకాండోత్తరార్ధము.

———:(౦):———

స. ౧౦.

శ్రీరామచంద్రుఁ డొకప్పుడు రాజసభ నలంకరించి యున్న వాల్మీకిమహర్షి నిట్లు ప్రశ్నించెను. మహాత్మా! నాయవతారముకంటెఁ బూర్వమె నాచరిత్రము మీచే నెట్లు గ్రంథరూపముగ రచింపఁబడినది? నీకు నాచరిత్రమెట్లు తెలిసినది? ఎవ్వరు మీ కుపదేశించిరి? పూర్వజన్మమున నీ వెట్టిపుణ్య మొనర్చి యిట్టిబ్రహ్మర్షిత్వముఁ బడయఁ గల్గితివి? అనెను. వాల్మీకి యంతయు విని యిట్లు వివరించెను, "రామచంద్రా! చక్కఁగా నడిగితివి. నేను నీనామమహిమవలననే యిట్టి యుత్కృష్టతఁ గాంచఁ గలిగితిని. నాపూర్వజన్మవృత్తాంతమును వినుము.

పంపాతీరమునఁ దపశ్శాలి యగుశంఖుఁ డనుమహాముని యొకఁ డుండెడివాఁడు. ఆతఁడు గురువులవలనఁ దపస్సిద్ధి ననుగ్రహింపఁ బడినవాఁ డై గోదావరి కేగి యందుఁ గృతావగాహుం డై యున్నదిం దాటి కంటకపాషాణాదులచే దుర్గమం బై యున్నయొకయడవిం బ్రవేశించి వైశాఖమాసమందొకనాఁటిమధ్యాహ్నసమయమున సంతాపపీడితుఁ డై పోవుచుండెను. కొంతదవ్వు వెళ్లి ముందునడువఁజాలక విశ్రాంతికొఱ కై యొకచెట్టునీడఁ గూరుచుం

డెను. అప్పుడు దురాత్ముఁ డగుకిరాతుఁ డొకఁడు ధనుస్సు, ఖడ్గము, ధరించి కేవలము యమునివలె మాఁడిపడుచు కీక్షితుండు గావునఁ గుండలాలంకృత కర్ణుం డై యున్నయాబ్రాహ్మణుం జూచి కత్తిం గేలఁ గ్రైకొని ఝళిపించుచు నోయి! బ్రాహ్మణుఁడా! నీవు నీయొద్దనున్న సమస్తద్రవ్యమును నా కిచ్చి నీప్రాణములు దక్కించికొని పొమ్ము! లేకున్న నీజీవితము నేఁటితో సరి! యని గద్దించి య వ్విప్రునియొద్దనుండి కుండలములు, చెప్పులు, గొడుగు, బట్టలు, కమండలువు మున్నగువాని నపహరించి పొమ్మని ధిక్కరించెను. ఆబ్రాహ్మణుఁడు సూర్యాంశుతప్త మగునయ్యిసుకనేల నడువఁజాలక మిగుల బాధ పడుచుఁ దృణాన్వితప్రదేశమం దడుగు లిడుచు మధ్యమధ్య గుడ్డపఱచి నిలువఁబడుచు హా! హా! యని యెదరుచుఁ బోవుచుండెను. అప్పు డక్కిరాతుం డమ్మునిం జూచి జాలిపడి తనలోఁ దిపాదరక్షల నితని కిచ్చెదను. నేను స్వధర్మముచే నీతని సర్వస్వ మపహరించితి. ఈపాత్రంబయు కిరాతధర్మము వలన నాయధీన మైనది. నాకు మంచిపాదరక్షలున్నవి కదా! ఈపాతచెప్పు లతో నా కేమియుపయోగము? ఇవి యీబాపని కొసఁగినందున నేకొలఁది పుణ్యమైన నాకు లభింపఁ గలదని తలంచి య ట్లొనర్చెను. బ్రాహ్మణుఁ డాపాదరక్షలం దొడిగికొని మిగులసుఖించి యాచోరుని సుఖి యగు మని దీవించి యోవనచరా! నీవు పూర్వజన్మమున నొనర్చినపుణ్యానిశేషమున నా కీయుపకారము నొనర్చితివి యిది నిక్కమని చెప్పెను. అంతట నా వనచరుఁడు శంఖమునిం జూచి మహాత్మా! పూర్వజన్మమున నేనొనర్చినపుణ్య మేమో యని విస్తరముగాఁ జెప్పు మని ప్రార్థించెను. శంఖుఁ డిట్లు పలికెను. ఓయీ! యెండ మిగుల తాపించుచున్నది. ఇప్పుడు నచ్చటను నీడ గానుపింపదు. మఱియు నొకింతజలం బైన లభింపదు. కొంచెముసేపు నీడు గల చోటఁ బోవుచుండి నీవడిగినది చెప్పఁ గలవాఁడ నన వ్వుఁడు కిరాతుండు స్వామీ! యిచ్చటిసమీపమున ఫలభరితంబు లగుకపిత్థవృక్షములచే నలంకృతతటం బగు నిర్మలజలాశయం బొండు గలదు. మన మచటి కేగుద మని తత్తీరమున క మ్మునిపుంగవుని దీసికొని పోయెను. శంఖుఁ డాసరోవరంబునఁ గృతావగాహుండు ధౌతవసనుండుఁ గృతమాధ్యాహ్నికుండు నై యించుక విశ్రమించినంతలోఁ గిరాతుండు గొనితెచ్చినకపిత్థఫలంబు లారగించి చల్లనినీరంబుఁ ద్రావి ప్రచ్ఛాయశీతల తరుతలమున నుపవిష్టుం డై కిరాతుని పూర్వవృత్తాంతమును జెప్పుట కుపక్రమించెను. కిరాతా! వెనుకటిజన్మమున నీవు శాకల మనుగ్రామమున

వసించు శ్రీవత్సగోత్రజుఁడగు స్తంభుఁడను బ్రాహ్మణుఁడనై వేదజ్ఞుఁడనైతివి. నీవు దుష్టసహవాసమువలనఁ గ్రమముగాఁ బాపాత్ముఁడనై మహాపాపాత్మురాలగు వేశ్యాంగననొకదానిం బ్రేమించి కర్మహీనుఁడనై చెడిపోయితివి. నీభార్య కాంతిమయి చాలసౌందర్యము గలసాధ్వి. ఆనుగుణశీల నీయందలిభక్తిచే నావేశ్య పెట్టుబాధలనెల్ల సైచుచు నీకు నీవెలయాలికిఁ బాదసేవ లొనర్చుచుండె. ఇట్లుండ నాకుత్సితుఁ డొకనాఁడు బచ్చలిపెఱుగుతో మొల్లంగిదుంపయు, నువ్వులతో ననుములును, గలిపి తెగతినెను. దానం జేసి వాంతులు విరేచనములు గలిగి యపథ్యదోషంబున భగంధరరోగ ముదయించె. వాఁడు దివారాత్రము లశక్యవిధముగా నారోగమువలన బాధపడుచు మిగులఁ బరితపింపసాగెను. చికిత్స చేయించికొనుటకుఁ గొంట నేమియు లేదు వానిసొమ్మంతయు నపహరించి వానియిల్లు గుల్లచేసిన యాపాపాత్మురాలు వేఱొకవిటునితో రమించుచు స్తంభునిమాట నైన స్మరింపదయ్యె. అపుడు వాఁడు పశ్చాత్తప్తుఁడై సతీమణి యగు కాంతిమయిం జూచి సాధ్వీతిలకమా! నిన్ను నే మిగులఁ బరాభవించితిని. నావంటిపాపాత్ముఁడు లేఁడు. ఒక్క నిమేషమైన నిన్నుఁ బ్రేమించి నీహృదయమునకు సంతోషముఁ గూర్పఁజాలనైతి. ఎన్నఁడు తనయందలి ప్రేమాతిశయముచేఁ బ్రాణులంబునిల్లాలిఁ బరిభవించు నాచెనటి పదునేడుజన్మములు నపుంసకుఁడై దుఃఖములందుఁ బుట్టునని శాస్త్రము చెప్పుచున్నది. నేనది యెఱింగియు నహంకారాతిశయమున నిన్ను దిరస్కరించి దుష్టురాలగు వేశ్యయం దాసక్తుఁడనై నిన్నవమానించి యిట్టిదుస్థితికి లోనైతి; నన్ను క్షమింపుమని నాపాదపద్మంబులం బడి పతివ్రతాతిలక మగుకాంతిమయి 'నాథా! మీ రిట్లు దైన్యము నొందవలదు. నావిషయమై మీరు సిగ్గుపడుట భావ్యము కాదు. మీయెడ నా కొకింతయుఁ గోపము గాని వైమనస్యము గాని లేదు. స్త్రీ గాని పురుషుఁడు గాని పూర్వకర్మఫల మనుభవించుచుండు. కావున నాకష్టసుఖంబులఁ గూర్చి మీరు చింతింపవలసినపని లేదని సమాధానపఱిచి తనపుట్టినింటినుండియు బంధువులనుండియు ద్రవ్యమును దెచ్చి కొనివచ్చి యహోరాత్రి కుపచర్య సేయుచు నాతని ప్రేమనారాయణునిగాఁ దలఁచుచు మలమూత్రములఁ దక్కఁగాఁ గడుగుచు గోళ్ళతోడ వ్రేళ్ళతోడఁ బుళ్లల తోడను వ్రణములనుండి వచ్చుక్రిమిసమూహములం దీసివైచుచు నొకింతయు నేవగించికొనక రేయింబవళ్ళు నిద్రాహారములు మాని నిరంతరము పతిసేవాపరాయణయై యుండె. మఱియు నాసతీతిలకము నాభర్తను దేవతలు

రక్షింతురు గాక! పితృదేవతలు నానాథుని రోగహీనుం జేయుదురు గాక! నాప్రియుని గాపాడినచండికాదేవికి రక్తమాంసగంధమాషము లర్పించెద. మహిషబలియు నన్నబలియు నర్పించెద. మహాప్రభావుం డగుగణనాథునకుం గుడుములు నివేదించెద. శనివారము నుపవాసదీక్ష యొనర్చుచు [illegible], నేయిం, తైలాభ్యంగనముం బతిసుఖంబునకై యావజ్జీవముం బరిత్యజించెద. నాహృద యేశ్వరుండు సుఖియై నీరోగుండై శతాయుష్మంతుండై యుండినం జాలు, నని ప్రార్థించుచుండె. ఇట్లు కొన్నిదినంబులు గడచినపిమ్మట వైశాఖమాసమునం దొకనాడు దేవలుండనుముని గ్రీష్మవేదనం [illegible] నాయింటికి [illegible] అప్పుడు [illegible] నాథా! యీమహాత్ముఁడు [illegible] నున్నాఁడు. ఈతని [illegible] సమునిపుంగవునకుం బూజాదికము [illegible]. [illegible] యొసంగినచో [illegible] నన్నుం [illegible] లను. [illegible] దుల [illegible] గాంగమును [illegible] యుప్పుజలంబులం [illegible] స్వరూపముగా [illegible]. దేవలుం [illegible] [illegible] దుల [illegible] మహా [illegible] భుజియించి మరునాం డుదయమున గ్రామాంతరమునకుం జనెను. అంత [illegible] కాలమునకు [illegible] [illegible] సన్నిపాతరోగపీడితుండై [illegible] మును [illegible] బోయుచున్న భార్య యొక్క [illegible] వేళ్లు [illegible]కెను. మృడ [illegible] [illegible] [illegible] [illegible] దలంచుచుం బ్రాణములు విడిచెను. [illegible] [illegible] [illegible] దికము లర్పి [illegible] [illegible] నకు [illegible] యాచరించి యాతనియంగము లతో సంగములం [illegible] [illegible] శాశ్వత [illegible] ము నందెను. దుష్టుండగు [illegible] వెలయాలిం దలంచుచుం బ్రాణములు విడిచినందునం [illegible] [illegible]. [illegible] చెప్పితి [illegible]! వైశాఖమాసమున దేవలునకు [illegible] [illegible] [illegible] [illegible] కంగీకరించినపుణ్యముచే నిప్పుడు [illegible] బుద్ధి యుదయించినది. [illegible] యనుపాదోదకము నుపయోగించి నందున నిప్పుడు నాతో [illegible] గలిగినది. ఈయుదంతమును సావధానముగ వినం [illegible] యుం గలిగినది. [illegible] యొక్క [illegible] యది [illegible] ముసం నుండి వచ్చితివి గాన మాంసభక్షకుండవైతివి. [illegible] మరణించుటచే నీవెప్పుడు భూతలశయనుండవై యుందువు. [illegible] భార్యగా నున్న దావేశ్యయే. ఇది నీపూర్వజన్మవృత్తాంతము.

భావిగతి నించు కెఱిఁగించెద వినుము. కృణుం డనుమహామునియొకం
డొకసరస్తీరమున ఘోరతపం బొనర్ప నాతనికన్నులనుండి వీర్యము పొంగును
దాని నొకనాగకన్యక ఋతుకాలమున భుజియించు. అప్పుడుపుట్టుసుతుఁ
బుత్రుండ వై యుదయించి కిరాతులచేఁ బోషింపఁబడి వ్యాధవృత్తి నవలం
బించి పాపి వై యుందువు. వైశాఖమాసమున నా కుపానద్దానం బొనర్చిన
యీపుణ్యమున ముందుజన్మమున నీకు సప్తమహర్షులతో సమావేశం బగు.
నీవు వాల్మీకి నాఁ బరఁగుమునీంద్రుఁడ వై శ్రీరామచరిత్రమును మహా
కావ్యముగా వ్రాయఁగలవు. అని దివ్యజ్ఞానమహిమచేఁ దనభూతభవిష్య
దుదంతము నెఱిఁగించినశంఖమునిం జూచి హర్షితుం డై కిరాతుండు మిగులఁ
బూజించి యాతనివలన వైశాఖధర్మముల నడిగి తెలిసికొని మున్ను దా నపహ
రించినకుండలాదికము లర్పించి పంపివైచెను. శంఖముని గౌతమీతీరమునకు
వెడలిపోయెను. కిరాతుండు సస్యద్రవ్యములచే వైశాఖధర్మముల నొనర్చి
యుంటికిం జనెను. కాలక్రమమున నాబోయ మరణించి శంఖమునివచించిన
క్రమంబున నాగకన్యాగర్భంబున నవతరించెను. బ్రహ్మబీజసముత్పన్నుం డైనను
గిరాతులచేఁ బోషింపఁబడి వ్యాధమార్గావలంబియుఁ బాపియు శూద్రాంగ
నాసక్తుఁడు నై పెక్కురుబిడ్డలం గాంచి తత్పోషణభారమునఁ గృశించుచు,
చోరవృత్తివలనఁ గాలముఁ గడపు చుండెను. ఇట్లు ధనుర్బాణాసిధారి యై జీవ
ములపాలిఁటియముం డై యున్నయక్కృణుపుత్రుం డొకనాఁడు దారిఁ గాచి
యుండి సప్తమహర్షులం బొడఁగాంచి వారిపై పుట్టములు మున్నుగా నపహ
రింపఁదలంచి వెంటఁ బరువెత్తుచు 'నిలుఁడు! నిలుం! డో హోం!' యని బెద
రించుచు నడచెను. మహర్షు లించుకయుఁ జలింపక 'ఏమిరా! బ్రాహ్మణాధమా!
అట్లాయాసపడుచు వచ్చితి' వని యడిగిరి. కిరాతుఁడు, ఏ మని యడుగు
చున్నారా? నాభార్యాపుత్రులఁ బ్రదికించు టెట్లు? వా రాఁకటిచే నకనక
లాడుచు నాకై యెదురు చూచు చుందురు. మీయొద్దనుండి యేమేని సంగ్ర
హింపక నేఁడు వారల నెట్లుసంతృప్తి పరుపఁగలను? నాపోష్యవర్గము చాల
గల దని మీ రెఱుంగరు కాఁబోలును అనెను. మునీంద్రు లి ట్లనిరి. అట్లేని
నీ కొకటి చెప్పెదము. నీవు దొంగిలించి తీసికొని పోయినద్రవ్యమును నీయాలు
బిడ్డ లనుభవించు చున్నారు గదా! నీకు దాన ఘటిల్లినపాతకమున వా రేమేనిఁ
బా ల్గొందురా? నీ వీసంగతిని వారి నందఱ వేర్వేరుగా నడిగి రమ్ము. నీవు
వచ్చుదనుక మే మిచ్చటనుండి యొక్కయడుగైనఁ గదలము. గదలినచో

మాకుఁ బంచమహాపాతకములు సంభవించుఁ గాక యని శపథపూర్వకముగా నుడివిరి. కిరాతుఁ డెట్టకేలకు వారిపలుకులు నమ్మి భార్యాపుత్త్రాదుల నందఱఁ బ్రత్యేకముగ మునిపుంగవు లానతిచ్చినభంగిఁ బ్రశ్నించెను. వార లందులకు నీవు తెచ్చినది కుడుచుటే మాపని కాని పాపమే చేయు చుంటివో పుణ్యమే చేయు చుంటివో మా కేమియు సంబంధము లేదు. ఇది మానిశ్చయము. అని ఖండితముగఁ జెప్పిరి. అంత బ్రాహ్మణబ్రువుండు నిరాశాహతుండై మునిపుంగవు లున్నయెడకుం జని ధనుర్బాణములం బాఱవైచి తద్దర్శనమాత్రమునఁ బూతుండై యున్నవాఁడు గాన సంజాతవైరాగ్యుండై వారిపాదములం బడి మహాత్ములారా! నరకసముద్రమునుండి నన్నుద్ధరించి రక్షింపుఁడు రక్షింపుఁ డని మొఱవెట్టసాగెను. అప్పు డమ్మునిపుంగవులు లెమ్ము. లెమ్ము. సత్సమాగమ మెన్నఁడు వ్యర్థము కాదు. అని చెప్పి వీఁడు పాపాత్ముఁడైనకతన నుపదేశానర్హుఁ డై యున్నవాఁడు. అయినను శరణాగతుండుఁ గావున వీని విడువం జనదు. అని యొండొరుఁగూడి బలికికొని వ్యత్యస్తాక్షరముగా 'మరా' యని నీ నామ ముపదేశించి దానిం జపింపు చుండుమని నుడివి వా రరిగిరి. అంత నక్కిరాతనూజుం డొకదండము నచట గుఱుతుగాఁ బాతి బాహ్యప్రపంచమును మఱచి నిశ్చలనిష్ఠతోఁ దపంబుఁ గావించు చుండెను. అంత వానిపైఁ బుట్టలు తీఁగలు మొలిచెను. అతనితపఃప్రభావంబున నాదండాగ్రమున నొకమహావృక్ష ముత్పన్నం బయ్యె. తరువాత వేయియుగంబులకు సప్తమహర్షులు తిరిగి వచ్చి యాతని లేచి రమ్మనిరి. కృణుపుత్రుఁ డావల్మీకసమూహామునుండి బయలువెడలి వచ్చెను. వల్మీకమునుండి వెడలి వచ్చితివి గాన వాల్మీకి వగు మని వారాతనికి నామకరణ మొనర్చిరి. ఇది నీకు రెండవజన్మమని కూడ వా రానతిచ్చి యథేష్టముగఁ జనిరి.

రామా! నాఁటినుండియు నీనామమంత్రమును జపించుచుఁ దపోనిష్ఠాగరిష్ఠుఁడ నై యుంటి. ఇట్లుండ నొక్కనాఁడు బ్రహ్మ శివునివలన నీచరిత్రము నాకర్ణించి నారదున కుపదేశించెను. నారదుఁడు నా కుపదేశించెను. అట్లుపదేశితుండ నై తమసం గ్రుంకులిడం జని కిరాతహతకనిహతం బగు క్రౌంచము నవలోకించి జాలిచే మానిషాద యనుశ్లోకము నప్రయత్నముగ నుచ్చరించితిని. దాన నపరిమితాశ్చర్యము నొందు చుండ బ్రహ్మ వచ్చి నాకు సరస్వత్యవతరణాదు లెఱిఁగించి ప్రేరేప శతకోటిప్రవిస్తర మగురామాయణము నభివర్ణించితిని. ఇది నాజన్మత్రయవృత్తాంత మనివినిపింప శ్రీరాముఁ

డవతీము కౌసరడభరితుండై వాల్మీకి నర్చించె.

ఈకథవలనంగూడ రామవాల్మీకు లేక కాలము వారని స్పష్టమగుచున్నది. కావున వాల్మీకి త్రేతాయుగాంతమున శ్రీమద్రామాయణమును రచించె నని గ్రహింపవలసి యున్నది. మఱియు—

ప్రాప్తరాజ్యస్య రామస్య వాల్మీకిర్భగవానృషిః।
చకార చరితం కృత్స్నం విచిత్రపదమాత్మవాన్॥ ౧ ౨౪

అని యుండుటచే శ్రీరాముం డరణ్యవాసంబుం బూర్తి చేసి సాకేతము నకేగి మూర్ధాభిషిక్తుండై ప్రజారంజకముగం బుడమిం బాలింపుచుండం బరమపూజ్యుం డగువాల్మీకమహర్షి శ్రీమద్రామాయణంబు రచియించె నని వ్యక్తమగు చున్నది. శ్రీరాముం డరణ్యవాసము చేయు నప్పుడు చిత్రకూటమున నివసించుచున్న వాల్మీకి రామాయణరచనాకాలమునం దమసాతీరవాసియైయుండెనని యూహింపవలసియున్నది. చిత్రకూటమునువిడిచి తమసాతీరము నాశ్రయించుటకుం గారణ మూహించుట కవకాశ మేమియు లేదు. శ్రీరాముడు రాజ్యపాలన మొనర్చుసమయమున రామాయణము రచియించుటకుం బ్రారంభించి వాల్మీకి యప్పటికి వృత్తపూర్వ మగుపట్టాభిషేకాంతకథాభాగముతో నొకవిధముగ గ్రంథమును బూర్తి చేసెను. కావుననే యుద్ధకాండమున ఫలశ్రుతి యుపాఖ్యానఫలశ్రుతికంటె భిన్నమై గ్రంథావసానసందర్భము గలదై యున్నది. మఱియు బాలరామాయమున శ్రీరాముని రాజ్యపాలన పద్ధతి నభివర్ణించుచు—

గవాంకోట్యయుతం దత్త్వా బ్రహ్మలోకం ప్రయాస్యతి।
రాజవంశాన్ శతగుణాన్ స్థాపయిష్యతి రాఘవః॥
చాతుర్వర్ణ్యం చ లోకేఽస్మిన్ స్వే స్వే ధర్మే నియోక్ష్యతి।
దశవర్ష సహస్రాణి దశవర్ష శతాని చ॥
రామో రాజ్యముపాసిత్వా బ్రహ్మలోకం ప్రయాస్యతి॥ ౧౬౪

అని భవిష్యత్కాలబోధకము లగుక్రియలతో నారంభించి యుద్ధకాండమున—

ఈజేబహువిధైర్యజ్ఞైః ససుహృజ్జ్ఞాతిబాంధవః।
దశవర్ష సహస్రాణి దశవర్ష శతాని చ
భ్రాతృభిస్సహిత శ్శ్రీమాన్ రామో రాజ్యమకారయత్॥

అని భూతక్రియలు ప్రయోగించుటచే వాల్మీకి రామాయణమును రచింపఁ బ్రారంభించునప్పటికి శ్రీరాముఁడు నూతనముగా సింహాసనము నధిష్ఠించె ననియు మొదటినుండి యారుకాండములు వ్రాయునప్పటికి రామపరిపాలనము మిగులఁ బ్రౌఢిమ గాంచె ననియుఁ బట్టాభిషేకోత్తరకాలసందర్భము గల దగుటచే నేడవకాండమున కుత్తరకాండసంజ్ఞ గలిగె ననియు నూహింపవలసి యున్నది. 'సభవిష్యం సహోత్తరం' అనుటచే నుత్తరకాండమంతయు భవిష్యత్కథ కా దనియు సీతాభూగర్భప్రవేశాదికమె ముందు జరుగవలసినకథాభాగ మనియు వ్యక్త మగుచున్నది. కాఁగలకథాసందర్భముఁ దనజ్ఞానదృష్టిం బరికించి సభవిష్యోత్తరముగా శ్రీమద్రామాయణముఁ బూర్తి చేయునప్పటికిఁ గుశలవులు గ్రహణధారణసమర్థులై యుండిరి. వాల్మీకి మహర్షి తనయాశ్రమమున జనించి తనచే సంస్కారాదులు గావింపఁబడి క్రమశిక్షితులై శ్రావ్యకంఠస్వరములతో నలరారుకుశలవులం జూచి వారిచే రామాయణము గానము చేయించెను. వారు శ్రీమద్రామాయణమును వాచోవిధేయముఁ గావించికొనునప్పటికి శ్రీరాముఁడు హయమేధదీక్షితుఁడై యుండె. కుశలవులు వాల్మీకిప్రేషితులై శ్రీరామసన్నిధిని రామాయణము గానము చేసిరి. శ్రీరాముఁడు వారు సీతాపుత్రు లనిగ్రహించి మహర్షిసన్నిధికి సీత సాధ్వియని మీకు విశ్వాస మున్నచో, సీత తనను చరిత్రతను మహాజనసమక్షమున స్థాపించికొనఁ గలిగినచో జానకీపరిగ్రహమునకు నాకేయాభ్యంతరము లేదని వర్తమానించెను. వాల్మీకిమహర్షి యందులకు సమ్మతించి సీతాసమేతుఁడై శ్రీరామసమక్షమున కరిగెను, అప్పుట సీతాభూగర్భప్రవేశము జరిగెను. శ్రీరాముఁడు క్రోధసంక్షుభితుఁడై యుండ బ్రహ్మ వచ్చి యుచితవాక్యముల నప్పురుషపుంగవు శాంతింపఁజేసి రామాయణశేష మగుభవిష్యద్వృత్తాంతమును విను మనియుపదేశించెను. శ్రీరాముఁ డట్లుగావించెను.

వాల్మీకి కుశలవోత్పాదియాశ్వమేధాదులకుఁ బూర్వమె రామాయణము రచించె నేని బాలకాండమునందలి నాలుగవసర్గమునందుఁ గుశలవాది వృత్తాంతమును వ్రాయు టెట్లుసందర్భించును. ఈవిషయ మై గోవిందరాజీయ వ్యాఖ్యానమునం దిట్లు వ్రాయఁబడినది.

'నను రామాయణనిర్మాణానంతరభావినఃకథాశరీరస్యాస్య కథంతత్పూర్వభావ ఇతిచేన్న అనంతరభావిత్వేఽపి త్రికాలజ్ఞేన మహర్షిణా ప్రథమం తన్నిర్మాణసంభవాత్.'

(వాల్మీకిమహర్షి త్రికాలజ్ఞుండుగావున భవిష్యత్కథ రచించినట్లే యీభాగముఁ గూడ ముం దిట్లుజరుగఁగల దనియెఱింగి వ్రాసియుండ వచ్చును).

మఱియు నావ్యాఖ్యాతయే వాల్మీకి యాత్మస్తుతిపర మగుసందర్భము నెట్లువ్రాయు ననిశంకించి తనకంటె నితరు లెవ్వ రెఱుఁగనందునఁ బ్రేక్షావత్ప్రవృత్త్యర్థమై యీసందర్భమును దానె వ్రాసియుండు ననియు, లేదా వాల్మీకి శిష్యులం దొక్కఁ డీభాగమును సద్గతియముగా వ్రాసి రామాయణమునం దదికి యుండవచ్చు ననియు, యాజ్ఞవల్క్యస్మృత్యాదియందు విజ్ఞానేశ్వరుఁ డిట్టియభిప్రాయముననె వెలిబుచ్చె ననియు వ్రాసియున్నాఁడు.

బింబాదివృద్ధ్యన్వే బింబా రామదేహాద్వినిస్సృతౌ। ౧౨౪

అనుటచే రాముఁడు కుశలవులు తనకుమారు లని యేలశంకింపలే దన నందు రామసాదృశ్యము చెప్పఁబడినదని కాని తదపత్యత్వము స్ఫురించుట కాధారము లే దనిక డ నావ్యాఖ్యానమునసే వ్రాయఁబడెను. దీనివలనఁ గుశలవులుసభవిష్యోత్తర మగుశ్రీమద్రామాయణమును వాచోవిధేయముఁ గావించికొని యశ్వమేధసమయమున శ్రీరామసన్నిధిని గానముచేయుచుండఁ గుశలవజననాదివృత్తాంతశ్రవణానంతరము వారిరువురుఁ దనకుమారు లనియెఱింగి శ్రీరాముఁడు సీతం దోడితేఱ వాల్మీకిసన్నిధికిఁ జారులఁబుత్తెంచెననియు నంతటితో నిలిచిపోయిన రామాయణశ్రవణము బ్రహ్మప్రేరణచేఁ బూర్తియయ్యె ననియు సమన్వితమగుచున్నది.

ఇట్లు ప్రకటితంబైనరామాయణము జగద్విలక్షణప్రఖ్యాతిం గాంచుటకు వాల్మీకిమహర్షియొక్క యనిర్వచనీయప్రతిభావిశేషము కారణం బని వేరుగాఁ జెప్పవలయునా? అమ్మహాత్మునితపోవిశేషంబు జన్మనైర్మల్యంబు నిరంతర భక్తిపారవశ్యంబు వివిధవిజ్ఞానసంపద సర్వతంత్రస్వతంత్రత రామాయణరూపమునఁ బరిణమించి పాఠకుల హృదయఫలకంబులఁ బ్రతిఫలించుచు నాచంద్రతారార్కముగ విలసిల్లుచున్నయది.

తపస్స్వాధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాం వరమ్।
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకి ర్మునిపుంగవమ్॥ ౧-౧

అనుటచేతనే వాల్మీకియొక్క యాధిక్యము వెల్లడియగుచున్నది. ఇందు వాల్మీకి తపశ్శాలి యని చెప్పఁబడినది. వాల్మీకి యేకొండగుహాలోనో ముక్కు

మూసికొని కూరుచుండు నితరతపశ్శాలురవంటివాఁడు కాఁడు. నిరంతరము లోకజ్ఞులవలన లోకవృత్తాంతములం దెలిసికొనుచు నాత్మానుభవముతోఁబాటు లోకానుభవముఁ గూడ సంపాదించు స్వభావముగలవాఁ డని యిందువలన వ్యక్తమగుచున్నది. పరిపప్రచ్ఛ యనుటచే వాల్మీకివిధేయత సూచితము. ఈశ్లోకమందలి విశేషములు సమగ్రముగా నానార్థములు వ్రాయుసందర్భమునఁ బొందుపఱచినారము.

అకర్దమ మిదం తీర్థం భరద్వాజ నిశామయ।
రమణీయం ప్రసన్నాంబు సన్మనుష్యమనో యథా॥

ఇందలి 'సన్మనుష్యమనోయథా' యనునుపమానముచేఁ గవియొక్క చిత్తనైర్మల్యము సూచింపఁబడుచున్నది.

న్యస్యతాం కలశ స్తాత దీయతాం వల్కలం మమ।
ఇదమే వావగాహిష్యే తమసాతీర్థ ముత్తమమ్॥

ఇందుఁ 'దాత' యను సంబోధనముచే శిష్యవాత్సల్యము ప్రకటితము.

మా నిషాద ప్రతిష్ఠాం త్వ మగమ శ్శాశ్వతీ స్సమాః।
య త్క్రౌంచమిథునా దేక మవధీః కామమోహితమ్॥ ౧౯-౪

ఈశ్లోకము భారతీయ మున్నగు గుణములకు స్ఫోరకము. ఇందలివిశేషార్థములు తత్సందర్భమున నానార్థములందుఁ జెందుపఱుపఁబడును. ఇట్టి సద్గుణములుగలవాఁడు గావుననే నారదునివంటిసద్గురుని నప్రయత్నముగఁ బడయఁగలిగెను. మహాత్ములయుపదేశము సాధారణముగాదు. కావుననె వెనువెంటనె ఫలింపఁదొడఁగెను. వాల్మీకినారదుం బంపివైచి తమసాతీరమున కేగుచున్నప్పటికిఁ గిరాతహత మగుక్రౌంచ మాతనికి లోచనగోచరం బయ్యె. వెంటనె యప్రయత్నముగ 'మానిషాద' యనుశ్లోక మాతనిముఖమునుండి వెలువడెను. ఇదియె లౌకికవాఙ్మయముయొక్క శ్రీగోదయము.

## రామాయణోత్పత్తిని గుఱించినపురాణగాథలు.

వాల్మీకిచే స్వచరిత్రమును ప్రబంధరూపమున రచింపఁజేయఁ దలంచి కేవలముఁ గరుణారసప్రధాన మగుతనచరిత్రమును రచించుటకుఁ దగినయతి దయాపరత్వ మమ్మునిపుంగవునందు గలదా యనిపరీక్షింపఁ గోరి శ్రీరామచంద్రుఁడే వ్యాధరూపి యై క్రౌంచరూపముతో నున్నరాక్షసుని సంహరించె నని స్కాందపురాణ పాతాళఖండమునందలి యీక్రిందిశ్లోకములవలనఁ దెలియుచున్నది.

శాపోక్త్వా హృదిసంతప్తం ప్రాచేతస మకల్మషమ్।
ప్రోవాచ వచనం బ్రహ్మా తత్రాగత్య సుసత్కృతః॥
న నిషాద స్స వై రామో మృగయాం చర్తు మాగతః।
తస్య సంవర్ణనే నైవ సుశ్లోక స్త్వం భవిష్యసి॥
ఇ త్యుక్త్వా తం జగా మాశు బ్రహ్మలోకం సనాతనమ్।
తత స్సంవర్ణయామాస రాఘవం గ్రంథకోటిభిః॥

మఱియుఁ బాద్మపురాణమున శివశివాసంవాదఘట్టమున సీతాత్యాగమునకు భార్గవుఁ డగువాల్మీకియొక్క శాపముగాని జనాపవాదము కారణము గాదని చెప్పుచు నీయర్థము సూచింపఁబడినది.

ఆహూయ లక్ష్మణం ప్రాహ రామో రాజీవలోచనః।
శృణు మే పరమం గుహ్యం సీతాసంత్యాగకారణమ్॥
వాల్మీకినాఽథ భృగుణా శప్తోఽస్మి కిల లక్ష్మణ।
తస్మా దేనాం త్యజా మ్యద్య జనో వై నాత్ర కారణమ్॥

ఇట్లు కథానాయకుఁడే రామాయణరచనకుఁ దగినమహాకవియని నిర్ణయించియున్న వాల్మీకియొక్క పాత్రశస్త్యము వేఱుగాఁ జెప్పవలయునా? 'మహితాత్ములయొక్క మహిమ.' 'అనుకవి రామచరిత్రమునకుఁ దగినవాఁడు వాల్మీకియు, వాల్మీకిరచనాసంరంభమునకుఁ దగినకథానాయకుఁడు శ్రీరాముఁడు గావున నే—

కవే రల్పాపి వాగ్వృత్తి ర్విద్వత్కర్ణావతంసతే।
నాయకో యస్య నిర్దిష్టో లోకోత్తరగుణోత్తరః॥
ఉపశ్లోకస్య మాహాత్మ్యా దుజ్జ్వలాః కావ్యసంపదః॥

ఇత్యాద్యాలంకారికవచనప్రథమలక్ష్యం బై రామాయణ మలరారుచున్నయది. కవికింతకంటెఁ దరణోపాయ మేమున్నది. అట్లగుటచేతనే చతురాననుఁడు వాల్మీకితో —

కురు రామకథాం పుణ్యాం శ్లోకబద్ధాం మనోరమామ్।
యావత్ స్థాస్యంతి గిరయ స్సరిత శ్చ మహీతలే॥
తావ ద్రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి।
తావ దూర్ధ్వ మధ శ్చ త్వం మల్లోకేషు నివత్స్యసి॥ —రా

అని వచించియున్నాఁడు.

ఆనందరామాయణమున యాత్రాకాండమునందు మొదటి రెండు సర్గములలో రామాయణోత్పత్తిని గురించి వ్రాయుచు వాల్మీకి తమసాతీర్థమున కేగుట క్రౌంచము నవలోకించుట పిమ్మట బ్రహ్మోపదేశంబున నమ్ముని శతకోటిప్రవిస్తర మగురామాయణము రచించుటయుఁ జెప్పి పిమ్మట నిట్లు వ్రాయఁబడినది. శతకోటిప్రవిస్తర మగునారామాయణమును సమస్తమహర్షులు నారదముఖులోఁ జదువుచుఁ జెప్పఁదొడంగిరి. దేవగంధర్వాదు లత్యానందముతో నాకసమున విమానములం దుండి వినుచుండిరి. అప్పు డారామాయణమును దమతమలోకములకుఁ గొనిపోవలయు నని దేవదానవనాగయక్షకిన్నరాదులు బ్రహ్మ మునులు రాజులు మొదలగువారందఱుఁ బరస్పరముఁ గలహించిరి. శంకరుఁడు వారి సంశయ నివారించి క్షీరాబ్ధిశయను నేకసూక్తములచే సన్నుతించెను. అంత నా జగన్నాథుఁడు యోగనిద్రనుండి మేలుకాంచి యక్కలహవృత్తాంతము నాలించి యించుక హసించి రామాయణమును మూడుభాగములుగా విభజించి యొక్కొక్కభాగమునకు ౩౩౩౩౩౩౩౩౩ శ్లోకములు గలుగునట్లు దశాక్షరమంత్రముగ నేర్పఱచి మిగిలినశ్లోకాత్మక మగుతారకమంత్రమును శంకరున కుపదేశించెను. హరుఁ డా మంత్రమును గాశీపట్టణమునఁ బ్రాణుల కంత్యకాలమునఁ జెవిలో నుపదేశించుచుండు. పిమ్మట నామహావిష్ణువు తన్నుఁ బ్రార్థించుచున్న లక్ష్మీగరుడశేషుల కందుండి మూలమంత్రములుపదేశించెను. వారిలో లక్ష్మి యామంత్రములను స్వర్గమునకుఁ గొనిపోయి దేవతల కుపదేశించెను. శేషుఁడు పాతాళమునకుఁ గొనిపోయి పన్నగులకుఁ జెప్పె. గరుడుండు మనుష్యలోకమున విస్తరింపఁజేసె. ఆమంత్రములు మంత్రశాస్త్రప్రసిద్ధములుగావునఁ దదనుభవజ్ఞులచేఁ దెలిసికొనందగు. నారాయణుఁడు మొదట మువ్విధములుగా నొనర్చినరామాయణభాగములఁ గ్రమముగా దేవతలకు మునులకు నాగులకు నొక్కొక్కటి యుపదేశించిన వారు తమతమలోకముల విస్తరింపఁజేసిరి. భూలోకమునఁ బ్రచురిత మగుభాగమును విష్ణువు సప్తద్వీపములకు ౪౭౬౧౯౦౪౭ పంతునఁ బంచి యందు మిగిలిననాలుగుశ్లోకములనుఁ జతురాస్యున కుపదేశించెను. తిరిగి ద్వీపాంతర్గతవర్షసంఖ్యచే నాభాగములను విభజించి వర్షవాసుల కొసంగెను. ఆక్రమమున జంబూద్వీపమున భరతవర్షమునకు ౫౨౯౧౦౦౫ శ్లోకములు సప్తాక్షరమంత్రములుగా రచించెను. అందు మిగిలినశ్రీకారమును సర్వమంత్రములందు నాదినుపయోగింప నానతిచ్చి మహావిష్ణు వంతర్హితుఁ డయ్యె. తరువాతఁ గొంతకాలమునకు

రావణుఁడు గలియుగంబునఁ బ్రాహ్మణాదివర్ణములవారు భయచకితులు నల్పాయుష్కులు మందబుద్ధులు నగుదు రని వేదములను శతఖండములనుగా విభజించెను. పిదప శ్రీకృష్ణుఁడు వ్యాసరూపధరుండై యవ్వేదములఁ జక్కఁగా విభజించి భరతఖండవ్యాప్తం బగు రామాయణభాగమునుండి వేరువేరుగాఁ బదునేడుపురాణములను సకలధర్మసమ్మితంబుగా శ్రీమహాభారత మనునితిహాసముఁ గూడ రచించెను. ఇట్లు రచియించియు శాంతచిత్తుండుగాక సరస్వతీతటంబున విచారాక్రాంతహృదయుండై యుండ నారదుండు యదృచ్ఛాగతంబున నచ్చటి కేగుదెంచి యాచందం బెఱింగి నారాయణునివలనం బడసి చతురాననుండు తన కుపదేశించిన రామాయణశ్లోకముల నమ్మునికి ట్లుపదేశించెను.

అహమేవాసమేవాగ్రే నాన్యద్యత్సదసత్పరమ్।
పశ్చాదహం యదేతచ్చ యోఽవశిష్యేత సోఽస్మ్యహమ్॥
ఋతేఽర్థం యత్ప్రతీయేత న ప్రతీయేత చాత్మని।
తద్విద్యాదాత్మనో మాయాం యథాఽఽభాసో యథా తమః॥
యథా మహాంతి భూతాని భూతేషూచ్చావచేష్వను।
ప్రవిష్టాన్యప్రవిష్టాని తథా తేషు న తేష్వహమ్॥
ఏతావదేవ జిజ్ఞాస్యం తత్త్వజిజ్ఞాసునాఽఽత్మనః।
అన్వయవ్యతిరేకాభ్యాం యత్స్యాత్సర్వత్ర సర్వదా॥ 334

వ్యాసుం డాశ్లోకార్థమును జక్కఁగా ననుసంధానముఁ జేసికొని తదర్థావబోధకముగాఁ బదునెనిమిదవపురాణ మగుభాగవతంబు రచించె. కావుననె భాగవతశైలి యితరపురాణశైలికంటె విలక్షణంబై తనరారుచున్నయది ఇట్లు రచించి వెండియు నారామాయణభాగమునుండి సారసారముం గ్రహించుచుఁ బదునెనిమిదియుపపురాణములరచించెను. కాలక్రమమున మొదటిరామాయణము ఖిలమై పోఁగాఁ గథాసందర్భములు సెడకుండఁ దత్తద్భాగములనుండి శతకోటిసంఖ్యచే (అనఁగా శతస్థానము మూఁడవది యగుటచే శత=మూఁడు, కోటిస్థాన మెనిమిదవ దగుటచే కోటి= యెనిమిది, ఒకదానిచే నొకటి హెచ్చింపఁగా వచ్చినసంఖ్యచేత 3, 8-24, నిరువదినాలుగువేలశ్లోకములను సంగ్రహించి భద్రపఱిచెను. ఆగ్రంథమే యిప్పుడు శ్రీమద్వాల్మీకిరామాయణ మని ప్రసిద్ధంబై యున్నయదిఁ ఖిలంబైనరామాయణ భాగమునుండి యగస్త్యాదులు

వేలకొలఁది రామాయణములను రచించిరి. అవి యన్నియు నాదిరామాయణమునుండి యెత్తి వ్రాయఁబడిన వనియె గ్రహింపందగు. ఇట్లెల్ల పురాణములకు వేదములకు శాస్త్రములకు వేయేల భూమియందలియెల్ల వాఙ్మయవిలసితంబునకు నాదిరామాయణమె మూదల. అది శతకోటిప్రవిస్తరము. ఆగ్రంథమంతయు వివరించి చెప్పుటకుఁ బంచవదనుఁ డగుశంకరునకు నశక్యంబు. వాల్మీకిమహర్షి దానిం దనతపోమహిమచే రచియించె. ఆనందరామాయణమున మనోహరకాండమున ౮ సర్గమునందు రామాయణము లిట్లు పరిగణింపఁబడినవి.

వాల్మీకినా కృతం యచ్చ శతకోటిప్రవిస్తరమ్।
తత్సర్వేషా మాదిభూతం సుమహామంగళకారకమ్॥
రామాయణా దేవ నానా సంతి రామాయణాని హి।
శేషభూతం చతుర్వింశత్సహస్రం ప్రథమం స్మృతమ్॥
తథా చ యోగవాసిష్ఠ మధ్యాత్మాఖ్యం తథా స్మృతమ్। ౧
వాయుపుత్రకృతం చాపి నారదోక్తం తథా పునః। ౪
లఘురామాయణం చైవ బృహద్రామాయణం తథా।
అగస్త్యోక్తం మహాశ్రేష్ఠం సారరామాయణం తథా॥ ౪
దేహరామాయణం వాపి వృత్తరామాయణం పునః।
బ్రహ్మరామాయణం రమ్యం భారద్వాజం తథైవ చ॥ ౪
శివరామాయణం క్రౌంచం భరతస్య చ జైమినేః।
ఆత్మధర్మశ్వేతకేతుబుధేష్వైవ జటాయుషః॥ ౮
రవేః పులస్త్యేర్దేవ్యాశ్చ గుహ్యాకం మంగళం తథా।
గాధిజం చ సుతీక్ష్ణంచ సుగ్రీవం చవిభీషణమ్॥ ౯
తథాఽనందరామాయణ మేతి న్మంగళకారకమ్। ౧
ఏవం సహస్రశ స్సంతి శ్రీరామచరితాని తు॥ ౩౧
క స్సమర్థోఽస్తి తేషాం హి సంఖ్యాం వక్తుం సవిస్తరాత్।
శతకోటిమితా దేవ విభక్తాని పృథక్పృథక్॥ ౪-౫

ఆదిరామాయణము సత్యలోకమున, వైకుంఠమునఁ, గైలాసమునను శతకోటిప్రవిస్తరము, ధృవలోకమున, సూర్యలోకమున నేబదికోట్ల శ్లోకములచే విస్తీర్ణంబు, గోలోకమున దశకోటిసమ్మితంబు, నింద్ర, గంధర్వ, యక్షాది

లోకంబులఁ గోటిసంఖ్యాకంబు, మనుష్యలోకమునఁ జతుర్వింశత్సహస్రపరిమితంబు నై వ్యాపించియున్నట్లు పారాశర్యోపపురాణాంతర్గతరామాయణమాహాత్మ్యమునం దైదవయధ్యాయమున నిట్లు పేర్కొనఁబడినది.

ఏత ద్రామాయణం శ్రీమ చ్ఛతకోటిప్రవిస్తరమ్।
మల్లోకే విష్ణులోకే చ సత్యలోకే చ భామిని।
పంచాశత్కోటివిస్తీర్ణం ధ్రువలోకే మహీయతే॥
గీయతే హి గవాం లోకే దశకోటిప్రవిస్తరమ్।
మహేంద్రస్య సమీపేతు గీయతే కోటివిస్తరమ్॥
పంచాశ త్కోటిసంఖ్యాకం సూర్యలోకే తు గీయతే।
గంధర్వయక్షముఖ్యానాం లోకే కోటిప్రవిస్తరమ్॥
వ్యాఖ్యాతి నారద స్తేషాం పరమానందనిర్భరః।
చతుర్వింశతిసాహస్రీం శ్రీరామాయణసంహితామ్॥
ఉపాదిశ ద్వాల్మీకి ర్లోకే ప్రచీకశ త్స తామ్॥
యా మేతాం నారదా చ్ఛ్రుత్వా త్వం నిత్యం పఠసి ప్రియే॥ రు

ఇట్టి సమస్తలోకప్రసిద్ధ మగురామాయణమునకుఁ గథానాయకుఁడగుశ్రీరామచంద్రుఁడు సకలవేదాంతవేద్యమహిమాతిశయుండు సకలజగదుత్పత్తిహేతుభూతుండు సంస్మరణమాత్రవిధ్వస్తసమస్తకల్మషుండు మాయామానుషవిగ్రహుండు నగుటచే నమ్మహనీయుని గుఱించి యతిశయించి వాకొన దొరంకొంట దినకరుని కరాంగుళిచే నిర్దేశించుట ట్లుపహాస్యంబు. సంసారతాపనిబర్హణచణం బగునప్పురుషోత్తముని చరితామృతం బనిశంబుఁ గ్రోలి చరితార్థు లగుటయే ముఖ్యకర్తవ్యము.

కాని సమస్తవిషయముల కాదర్శ మగురామాయణమునందలిగుణగణంబులు శక్తికొలంది నించుక విమర్శించి తెలిసికొనక తప్పదు. రామాయణమునకుఁ బ్రధానపాత్రము శ్రీరాముఁడు. ఆతనియందు ధీరోదాత్తనాయకగుణంబులు చక్కఁగా నిరూపింపఁబడినవి. మహాసత్త్వము, అతిగాంభీర్యము, కృపావత్త్వము, అవికత్థనత్త్వము, ధైర్యసంపన్నత, ధీరోదాత్తుని లక్షణములు.

శ్రీరామునిసత్త్వము త్రివిధము. ఒకటి సమస్తజగదుత్పత్తిహేతుభూతము. రెండవది శివధనుర్భంగ, పరశురామగర్వనిర్వాపణ, రావణసంహారప్ర

ముఖలక్షణోన్నేయము. మూడవది సముద్రశోషణ, సేతుబంధన, లక్ష్మణ మూర్ఛాపనయనాద్యనుమేయము.

తతః పద్మపలాశాక్షః కృత్వాఽఽత్మానం చతుర్విధమ్।
పితరం రోచయామాస తదా దశరథం నృపమ్॥
కౌసల్యాఽజనయ ద్రామం సర్వలక్షణసంయుతమ్।
విష్ణో రర్ధం మహాభాగ మిక్ష్వాకుకులనందనమ్॥

ఇత్యాదిసందర్భములచే సమస్తలోకకర్త యగుశ్రీమహావిష్ణువు రాముఁడై యవతరించె నని తెలియుచున్నందున శ్రీరాముఁడే యెల్లజగంబులకుఁ గర్త భర్త సంహర్తయుఁ గాన నాతనిసత్త్వము వేదాంతవేద్య మనియెఱుంగునది. అహల్యాశాపమోచనమందుల కుపష్టంభకము.

ఇదం ధనుర్వరం బ్రహ్మన్ జనకై రభిపూజితమ్।
రాజభి శ్చ మహావీర్యై రశక్తైః పూరితుం పురా॥

అనిజనకమహారాజు నిర్దేశింప

లీలయా స ధను ర్మధ్యే జగ్రాహ వచనా న్మునేః।
పశ్యతాం నృసహస్రాణాం బహూనాం రఘునందనః॥
ఆరోపయిత్వా ధర్మాత్మా పూరయామాస తద్ధనుః।
తద్బభఞ్జ ధనుః శ్రేష్ఠో ధను ర్మధ్యే మహాయశాః॥

ఇత్యాదికముచే శ్రీరాముని యపరిమేయబలసంపన్నత వ్యక్తమగుచున్నది.

చాప మానయ సౌమిత్రే శరాం శ్చాశీవిషోపమాన్।
సముద్రం శోషయిష్యామి పద్భ్యాం యాంతు ప్లవంగమాః॥ ౨౮

అని శ్రీరామచంద్రుఁడు క్రోధతామ్రాక్షుఁడై నిలిచినప్పుడు సముద్రుఁడు స్వశరీరంబులోఁ బ్రత్యక్షుండై —

అబ్రవీ త్ప్రాంజలి ర్వాక్యం రాఘవం శరపాణినమ్।
పృథివీ వాయు రాకాశ మాపో జ్యోతి శ్చ రాఘవ॥
స్వభావే సౌమ్య తిష్ఠంతి శాశ్వతం మార్గ మాశ్రితాః।
త త్స్వభావో మమా ప్యేష యదగాధోఽహ మప్లవః॥
వికార స్తు భవే ద్గాధ ఏత త్తే ప్రవదా మ్యహమ్।
న కామా న్నచ లోభా ద్వాన భయా త్పార్థివాత్మజ॥

గ్రామానకార్యకులజలం న్స్తంభయేయం కథంచన।
విధాస్యే రామ యేనాపి విమహిష్యే హ్యహం తథా॥
గ్రాహా నప్రహరిష్యంతి యావ త్సేనా తరిష్యతి।
హరీణాం తరణే రామ కరిష్యామి యథాస్థలమ్॥ ౫౯

అని ప్రార్థించి యప్పురుషోత్తముని విలక్షణసత్త్వమునకు వెరగుపడి నవాఁ డయ్యె. ఇట్లె యితరలక్షణములు నూహింపందగు.

శ్రీమద్వాల్మీకిరామాయణాంధ్రవ్యాఖ్యానపీఠిక.

(ఉత్తరభాగము)

---

పాపభూయిష్ఠ మగులోకమును స్వచరిత్రముచే ననుశాసింప భగవంతుఁడు శ్రీరామచంద్రావతారంబు పరిగ్రహించె నని వేదశాస్త్రపురాణాదులచే నిర్ణయింపఁబడుచున్నది గావున లోక మష్టుహనీయునిచరిత్రమునుండి గ్రహింపవలసిన మహద్విషయముల నెట్లు మహాకవివాల్మీకి సమర్థించెనో స్థాలీపులాకన్యాయముగా విమర్శింతము. స్థూలదృష్టిచేఁ బరికింప సోదరైకమత్యము, గురుశుశ్రూష, సత్యసంధత, పితృవాక్యపాలనము, తృష్ణారాహిత్యము, పరదారాపరాఙ్ముఖత్వము, సతీవ్రత్యము మున్నగు ననుకార్యధర్మము లనేకములు మనకు గోచరించును. కాని యంతమాత్రముతో రామాయణముయొక్క యుద్దేశముపూర్తి కా లేదు. ఇంచుక సూక్ష్మదృష్టితో నవలోకించితి మేని వసుంధరాగర్భస్థము లగునాకరమ్ముల వలె నెన్నియో మహద్విషయములు మనకు గోచరించును. దిఙ్మాత్ర మరయుదము గాక!

బాలరామాయణమున దశరథుఁడు శ్రీరామునకు యౌవరాజ్యాభిషేక మొనర్పఁదలంచె నని చెప్పుసందర్భమున—

త మేవంగుణసంపన్నం రామం సత్యపరాక్రమమ్।
జ్యేష్ఠం శ్రేష్ఠగుణై ర్యుక్తం ప్రియం దశరథ స్సుతమ్॥
ప్రకృతీనాం హితై ర్యుక్తం ప్రకృతిప్రియకామ్యయా।
యౌవరాజ్యేన సంయోక్తు మైచ్ఛ త్ప్రీత్యా మహీపతిః॥ ౬౧

అని రెండుశ్లోకము లుదాహరింపఁబడినవి. ఇందు మొదటిశ్లోకమున శ్రీరామునియౌవరాజ్యార్హత మనోహరముగా వర్ణింపఁబడినది. రెండవశ్లోకమున దశరథుఁడు శ్రీరామునకు యౌవరాజ్యాభిషేక మొనర్పఁబూనుటకు

' పరికృతిప్రియకామ్యయా ' అని హేతువునిగదింపఁబడినది. శ్రీరాముఁడు పట్టాభిషేకముగాకపూర్వమె సమస్తజనులం బ్రేమించి వారికి హితం బొడఁగూర్చుచుండెడివాఁడు. అతనికిఁ బ్రజాసేవయందలిలౌల్యము మెండనిగ్రహించుటలోఁ డనే దశరథుఁడు తానుబూర్వము కైకేయీవివాహసమయమునఁ గైకేయీపుత్రునకు రాజ్యాభిషేక మొనర్పఁగల ననిప్రతిజ్ఞయొనర్చిన వాఁడైనను సమయమున నెవ్వరుజ్ఞాపకముచేయలే దనునెపంబున నాప్రతిన నుల్లంఘింపఁ దలఁచినవాఁడై భరతశత్రుఘ్నులకును వర్తమాన మంపక రామునకు రాజ్య మొసంగఁబూనెను. ఆవిషయమున నాతనిముఖ్యోద్దేశము పరికృతిప్రియకామనగాక వేరొండు గాదు. రామునియందు వలెఁ బ్రజలు భరతునం దనురక్తులుగా రనియాతఁ డెఱుంగును. ఆతనికిఁ బుత్రచతుష్టయమందును బ్రేమ సమానమె. అయినను శ్రీరాముఁడు ప్రజారంజనాదిమహాగుణగరిష్ఠుఁ డని యాతనియం దగ్గలంపుఁబ్రేముడిఁ గలిగియుండెను. ఈవిషయమై అయోధ్యాకాండమునఁ బ్రథమసర్గమం దిట్లు చెప్పఁబడినది.

సర్వ ఏవ హి తస్యేష్టా శ్చత్వారః పురుషర్షభాః।
స్వశరీరా ద్వినిర్వృత్తా శ్చత్వార ఇవ బాహవః॥
తేషా మపి మహాతేజా రామో రతికరః పితుః।
స్వయంభూ రివ భూతానాం బభూవ గుణవత్తరః॥ ౬౩

అందులకుఁగారణంబుగా నాతనిగుణంబు లభివర్ణించుచు—

అనురక్తః ప్రజాభి శ్చ ప్రజా శ్చా ప్యనురజ్యతే।
వృద్ధికామో హి లోకస్య సర్వభూతానుకంపనః॥
స తు శ్రేష్ఠై ర్గుణై ర్యుక్తః ప్రజానాం పార్థివాత్మజః।
బహిశ్చర ఇవ ప్రాణో బభూవ గుణవత్తరః॥
తమేవం వ్రతిసంపన్న మప్రధృష్యపరాక్రమమ్।
లోకపాలోపమం నాథ మకామయత మేదినీ॥ ౬౬

అని శ్రీరాముని ప్రజావాత్సల్యమును విశేషముగాఁ బొగడియున్నాఁడు. దశరథుఁ డట్టియోగ్యత రామభద్రునం దున్నదనియే యాతని యౌవరాజ్యపట్టభద్రుం జేయఁగోరి ప్రభుత్వము ప్రజానురాగమూలకము గావున ముఖ్యబంధువు లగు కేకయజనకాదినరపాలురం బిలువనంపక పోయినను దన యేలుఁబడి కావశ్యకు లగుసామంతరాజుల రాష్ట్రవాసు లగుప్రజాప్రముఖులను రావించి

శ్రీరామ్యాభిషేకము మీ కందఱ కభిమత మా యని యడిగెను. అందులకు వా రేకగ్రీవముగా—

ఇచ్ఛామో హి మహాబాహుం రఘువీరం మహాబలమ్।
గజేన మహతా యాంతం రామం ఛత్రావృతాననమ్॥ ౬౭

అని నొడివిరి. దశరథుఁడు ప్రజాశయము దృఢముగా నెఱుఁగఁ దలంచి—

కథన్ను మయి ధర్మేణ పృథివీ మనుశాసతి।
భవంతో ద్రష్టు మిచ్ఛంతి యువరాజం మమాత్మజమ్॥ ౬౮

అనిచమత్కరించెను. వారందులకు శ్రీరామునిగుణగణములే కారణ మనిచెప్పుచు—

పౌరాన్ స్వజనవ న్నిత్యం కుశలం పరిపృచ్ఛతి।
పుత్రే ష్వగ్నిషు దారేషు ప్రేష్యశిష్యగణేషు చ।
నిఖిలే నానుపూర్వ్యా చ్చ పితా పుత్రా ని వౌరసాన్।
శుశ్రూషంతే చ వ శ్శిష్యాః కచ్చి త్కర్మసు దంశితాః।
ఇతి నః పురుషవ్యాఘ్రః స్సదా రామోఽ భిభాషతే।
వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః।
ఉత్సవేషు చ సర్వేషు పి తేవ పరితుష్యతి।
సత్యవాదీ మహేష్వాసో వృద్ధసేవీ జితేంద్రియః ౭౧

అనివ్యక్తీకరించి—

ఆశంసతే జన స్సర్వో రాష్ట్రే పురవరే తథా।
ఆభ్యంతర శ్చ బాహ్యా శ్చ పౌరజానపదో జనః॥
స్త్రియో వృద్ధాస్తరుణ్యా శ్చ సాయం ప్రాతి స్సమాహితాః।
సర్వాన్ దేవా న్నమస్యంతి రామస్యార్థే యశస్వినః॥
తేషా మాయాచితం దేవ త్వత్ప్రసాదా త్సమృధ్యతామ్।
రామ మిందీవరశ్యామం సర్వశత్రునిబర్హణమ్।
పశ్యామో యౌవరాజ్యస్థం తవ రాజో త్తమా త్మజమ్॥
తం దేవదేవోపమ మాత్మజం తే సర్వస్య లోకస్య హితే నివిష్టమ్।
హితాయనఃక్షిప్రముదారజుష్టంముదాఽభిషేక్తుంవరదత్వమర్హసి ౭౬౪

అనిప్రార్థించిరి. దీనివలన సర్వదా ప్రజలయొక్క యోగక్షేమములకై పాటుపడువాఁడే రాజగుట కర్హుఁ డనియుఁ బ్రజారంజకుఁడు గానిచో నాతని

రాజుగాఁజేయుట యుచితేతర మనియుఁ బ్రజ లే తమయేలిక నెన్నికొనుట యుచిత మనియు ధ్వనించుచున్నది. మఱియు రాజు స్వతంత్రుఁడై యున్నట్లు కనుపట్టుచే కాని మంత్రిపురోహితాదులకు వ్యతిరేకముగ నొకింతయుఁ జేయఁ జాలకుండెననిమనము దశరథవృత్తాంతమువలన గ్రహింపవచ్చును.

స నిశ్చితాం మతిం కృత్వా యష్టవ్య మితి బుద్ధిమాన్।
మంత్రిభి స్సహ ధర్మాత్మా సర్వై రేవ కృతాత్మభిః॥

అని దశరథుఁడు సంతానార్థియై పుత్రికామేష్టి యొనర్పం దలఁచి మంత్రుల యనుమతిఁ బడసినట్లు చెప్పఁబడినది.

యది వ్రో రోచతే వృత్తం జనకస్య మహాత్మనః।
పురీం గచ్ఛామహే శీఘ్రం మాభూ త్కాలస్య పర్యయః॥

అని శ్రీరామవివాహమునకుఁ గూడ దశరథుఁడు మంత్రులయంగీకారమును బడయవలసినవాఁ డయ్యెను.

మఱియు రాజు ప్రజల కై తనసర్వస్వమును ధారపోయవలసినవాఁడు గావున నే దశరథుఁడు తనకరువదివేలసంవత్సరముల కుదయించిన బాలుర నకృతాస్త్రుల రామలక్ష్మణుల యజ్ఞసంరక్షణార్థము విశ్వామిత్రునివెంట నంపివైచెను. శ్రీరాముఁడు సత్వసంపన్నుఁ డనిమాత్రము దశరథుఁ డెఱుఁగును కాని యాతనిసత్వ మింతవఱ కెచ్చటను బయలుపడలేదు. కావున నే

"శక్తో హ్యేష మయాగుప్తో దివ్యేన స్వేన తేజసా।
రాక్షసా యే వికర్తారస్తేషా మపి వినాశనే"

అని యమ్మహర్షి చెప్పినను సుబాహుమారీచులవంటిరాక్షసులసంహరింపఁ గలసామర్థ్యము రామభద్రునం దున్నదాయని యామహారాజుసంకోచించి ...

ఊనషోడశవర్షో మే రామో రాజీవలోచనః।
స యుద్ధయోగ్యతా మస్య పశ్యామి సహరాక్షసైః॥

అనియు—

యది వా రాఘవం బ్రహ్మ నేతు మిచ్ఛసి సువ్రత।
చతురంగసమాయుక్తం మయా చ సహితం నయ॥ ౨౦-౪

అనియుఁ గోరెను. పుత్రవాత్సల్యముచే విశ్వామిత్రుఁడు తొలుతఁ జెప్పిన—

అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమమ్।
వసిష్ఠోఽపి మహాతేజా యేచేమే తపసిస్థితాః॥

అనువాక్యములయొక్క గూఢార్థమును యోజించుకొనలేక రావణబంధువులతో విరోధము నెట్లు సహింపవచ్చు నని సంభ్రాంతుఁడై చకితుఁ డయ్యెను. తోడనే రాజహితార్థి యగు వసిష్ఠునిచే బోధితుండై హృదయపూర్వకముగ రామలక్ష్మణులను విశ్వామిత్రున కిచ్చివైచెను.

ఈసందర్భమున విశ్వామిత్రునిజీవితము నించుక స్మరింపకతప్పదు. ఆతఁడు స్వస్తివాచనికుఁ డగు కేవలబ్రాహ్మణుఁడు కాఁడు. వేదవేదాంగము లభ్యసించి యథోక్తముగఁ గ్రతువు లొనర్చి బ్రహ్మబృందమును సంతృప్తిపఱుచుటతో నాతఁడు తనివిఁజెంది యుండలేదు. పూర్వాశ్రమమున—

రాజా ఽభూ దేష ధర్మాత్మా దీర్ఘకాల మరిందమ।
ధర్మజ్ఞః కృతవిద్యశ్చ ప్రజానాం చ హితే రతః॥

అనునట్లు ప్రజాసేవ యొనర్చిన యనుభవశాలియు,

అయం మునిసుతో బాలో మత్తశ్శరణ మిచ్ఛతి।
అస్య జీవితమాత్రేణ ప్రియం కురుత పుత్రకాః॥

అని చెప్పినస్వార్థత్యాగియు,

కథ మాత్మసుతాన్ హిత్వా త్రాయసే ఽన్యసుతం విభో।
అకార్య మివ పశ్యామ శ్శ్వమాంస మివభోజనే॥

అని ప్రతికూలోక్తు లాడుపుత్త్రులను శపించి

తస్య వర్షసహస్రస్య వ్రతే పూర్ణే మహావ్రతః।
భోక్తు మారబ్ధవా నన్నం తస్మిన్ కాలే రఘూత్తమ।
ఇంద్రో ద్విజాతి ర్భూత్వా తం సిద్ధ మన్న మయాచత।
తస్మై దత్త్వా తదా సిద్ధం సర్వం విప్రాయ నిశ్చితః।
నిశ్శేషితే ఽన్నే భగవా నభుక్త్వైవ మహాతపాః।
న కించి దవద ద్విప్రం మౌనవ్రత ముపస్థితః।
అథ వర్షసహస్రం వై నోచ్ఛ్వసన్ మునిపుంగవః।
త స్యానుచ్ఛ్వసమానస్య మూర్ధ్ని ధూమో వ్యజాయత।
త్రైలోక్యం యేన సంభ్రాంత మాదీపిత మి వాభవత్॥ ౯౦

అట్టి నిరాహార, నిశ్శ్వాసనిష్ఠలతో నార్జించినజగద్భయంకరతపోమహిమచే శునశ్శేఫుం గాపాడినదయాశాలియు నగుటచేఁ బ్రస్తుతము దేశమునకు వాటిల్లినయరిష్టమును గుఱుతించి శ్రీరామునిచే రావణునిపైఁ గత్తికట్టించి యందులకుఁ దగినకట్టుదిట్టములు చేయనారంభించెను. రామభద్రునకు-

కౌసల్యాసుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే।
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవ మాహ్నికమ్॥ ౯౧

అని కర్త్యాసక్తిం బురికొల్పి యిట్లుపదేశించెను.

చాతుర్వర్ణ్యహితార్థాయ కర్తవ్యం రాజసూనునా।
నృశంస మనృశంసంవా ప్రజారక్షణకారణాత్॥
పాతకం వా సదోషం వా కర్తవ్యం రక్షతా సదా।
రాజ్యభారనియుక్తానా మేషధర్మ స్సనాతనః॥

శ్రీరాముఁ డందులకు,

గోబ్రాహ్మణహితార్థాయ దేశ స్యాస్య సుఖాయచ।
తవ చైవాప్రమేయస్య వచనం కర్తు ముద్యతః॥

అని యుత్తర మొసంగెను. ద్వీపాంతరస్థుఁ డై తనసహచరులచే యజ్ఞాదిమహాకార్యములు ధ్వంసముచేయించుచు నాస్తికతుల్యుఁడు, సాధుహింసకుఁడు నగురాక్షసజాతీయుఁ డైనరావణుని సంహరించి తదనుయాయుల దేశమునుండి వెడలఁ గొట్టినఁ గాని దేశమునకు దేశీయధర్మములకు దేశవాసులకు స్వాస్థ్యంబు సమకూర దని యెప్పు డాతఁడు జ్ఞానదృష్టిచే నవలోకింపఁ గలిగె నో నాఁడే రామరావణవైరమునకు బీజావాప మొనర్ప సంకల్పించి శ్రీరామునకు బలవద్విరోధము ప్రబలఁగల దని యాతని దివ్యాస్త్రకోవిదుఁ గావించి తాను మహాయజ్ఞమునఁ దీక్షితుం డై శ్రీరాముని కర్మయజ్ఞమునఁ బ్రవేశపెట్టెను. తాటకాసుబాహువు లాయజ్ఞమున వేల్వఁబడిరి. మారీచుఁ డందు నిర్మాల్య మయ్యెను. విశ్వామిత్రుఁ డంతమాత్రముతో నూఱకుండక పూర్వము తనకు వసిష్ఠునితోఁ గలిగిన సంగ్రామమున ధేనుదేహసంభూతు లగు శక, యవన, పహ్లవ, కాంభోజ, మ్లేచ్ఛ, హారీత, కిరాతాదు లేక మై తనసైన్యంబుల నెల్ల నశింపఁ జేసి తన్నుఁ బదభ్రష్టునిఁ గావించినప్పుడు రా జధర్మవర్తనుఁడేని యల్పసారు లైనను దేశీయులందఱొక్కటియై యాతని సంరంభము నిరోధించి తప్పక విజయంబు వడయఁగలుగుదు రని కన్నులార గ్రహించిన వాఁడు గావున శ్రీరాముఁడు దక్షిణాపథమునకుఁ దటస్థించినసంకటస్థితిని దక్షిణాపథవాసులచేతనే నిర్మూలింపఁ జేయఁ గలం డనినిశ్చయించి యార్యావర్తమునఁ గల్లోల ముదయించుట కవకాశము లేకుండ జనకమహారాజుతో బంధుత్వముఁగలిపి యక్కాలంబున నప్రధృష్యము లై విజృంభించు కేకయ, కోసల, మైథిలదేశముల నేకముఖంబునకుఁ దెచ్చి విడిచెను. శ్రీరామచంద్రుఁడు

దేవకార్యార్థ మరణ్యమునఁ బ్రవేశించినపిమ్మట నన్మహర్షి స్వాస్థ్యము వహించెను. ఈయర్థమునే భట్టమురారి తనయనర్ఘరాఘమున నిట్లుపొందుపఱిచియున్నాఁడు.

విశ్వామిత్రవాక్యము:—

నిర్వ్యూఢో బహు తావ దేష్వరభుజా మాతర్పణో యం విధి।
ర్గ్రామ్యాదేన సమం సుకేతుతనయా చాద్యైవ ఘానిష్యతే।
పాణౌ కృత్య పున ర్వృషధ్వజధనుర్ద్వంద్వైకశుల్కాం వధూ।
మైథ్యోకే సురకార్యదీక్షు చలతి స్వాస్థ్యం విధాతాస్మహే॥ ౯౬

శివధనుర్భంగాదులచే శ్రీరాముని పరాక్రమము గ్రహించి దశరథుండు యువరాజ్యమున నాతని నియోగింపఁ దలఁచెను. ప్రజాసేవయం దాతఁడు తనివిజెంది యట్లు సంకల్పింపలేదు. తనకన్నను సమగ్రతతో రాముఁడు ప్రజాపాలనముఁ గావింపఁ గలఁడనియు నాతనిశిక్షణమున దేశ మింకను సభ్యున్నతిఁ గాంచుచుండ వీక్షింపవలయు ననియు నాతనికోరిక. శ్రీరాముఁడు ప్రజాసేవ కెప్పుడు సంసిద్ధుఁడే. కాని రాముఁడప్పుడు రాజుగానుండి చేయఁదగినదానికంటె వనస్థుఁడై యొనర్పవలసిన దధికముగ నున్నందున భగవత్ప్రేరితయై కైకేయి వరద్వయమును నిమ్మని దశరథుని నిర్బంధించెను. దశరథుఁడు సర్వస్వాతంత్ర్యముగల రాజైనఁ బ్రజాశయమునకు విపరీతముగ నడచుటకు మాత్రము సమర్థుఁడు కాకపోయెను. ప్రజ లందఱు శ్రీరాముని రాజుగా నెన్నికొనిరి; దశరథుఁ డందులకుఁ బూర్తిగా నంగీకరించెను. దానికి భిన్నముగా నడచుట కాతని కవకాశ మెక్కడిది? కావుననె యాతఁడు శ్రీరాము నరణ్యమునకుఁ బొమ్మనివచింపలేకపోయెను. రాముఁడు పితృభక్తిగల నిరీహుఁడు. తాను రాజుగానున్న లేకున్నఁ బ్రజాసేవ కెన్నఁడు సంసిద్ధుఁడే! తానయోధ్యలో నుండి యొనరింపవలసినదానిని భరతుఁడు నిర్వహింప విశ్వామిత్రుని బీజావాపములు ఫలించుటకుఁ దనవనవాసము దోహదమని తలంచి తనంతటఁ దానె తండ్రిసత్యమును బాలించుటకై యరణ్యమునకు బయలువెడలెను. భరతుఁ డత్యధికమగు సోదరప్రేమ గలవాఁడు. తాను రామునివలె ప్రజారంజన మొనర్పఁ జాల ననియాతఁ డెఱుంగును. ప్రజ లేకగ్రీవముగా రాముని రాజుగాఁ గోరుచుండఁ దా నెందులకు సింహాసనము నధిష్ఠింప వలయునో యాతనికిఁ దెలిసినదికాదు. ప్రజాశాంతికి భంగముగలిగించునప్పుడు రాజాత్మజుఁ డనికాని సోదరుఁ డనికాని, సైన్యాధిపతియనికాని గురు వని

కాని చూడక ఘాతుకజంతువునుబోలె ఖండింపవలయు నని పెద్దలు తమప్రవర్తనముచే ననుశాసించియున్నారు.

ఏవం పాపసమాచారః స్వజనప్రతిబాధకః।
పౌరాణామహితే యుక్తః పుత్రో నిర్వాసితః పురాత్॥ ౯-౭

ప్రజలప్రాణములఁ దృణప్రాయములనుగాఁ జూచినయసమంజుని సగర చక్రవర్తి కుమారుఁ డనితలంపక వెడలనడచెను; ప్రజాశయము భిన్నమైనందున దశరథుఁడు ప్రాణములను విడనాడెను; ప్రజాభిప్రాయమునకు వ్యతిరేకముగఁ బ్రాప్తమైనందున భరతుఁడు సింహాసనమును బరిత్యజించి ప్రజల యభీష్టమును నెరవేర్చుటకు సంకల్పించి శ్రీరాముని దీసికొనివచ్చుట కరణ్యమున కేగెను. శ్రీరాముఁడు భోగలాలసుఁడు కాఁడు. సాకల్యముగ దేశస్థితిని గ్రహించినయతని హృదయమునకు దుకూలములకంటె నారచీరలు మిగుల రుచించెను. స్థండిలశయనము కందమూలఫలాహారము జటాధారణము తనసంకల్పసిద్ధికిఁ బ్రబలసాధనము లనియాతఁడు నిశ్చయించికొనెను. మణిభూషణభూషితు లగునాగరికజనులయవలోకనముకంటె సహజస్నిగ్ధహృదయు లగు వనవాసులపవిత్రసందర్శనమె యాతనికి మిగుల నభిమతమయ్యెను. ప్రజల యుద్దేశమును బూర్తిగా విఫలపఱుచుటకంటె భిన్నమార్గమున నెరవేర్చుట సమంజస మని రాముఁడు తనపాదుకల నొసఁగి భరతుని బంపివైచెను.
అంత వనవాసు లనేకమై శ్రీరాముని—

తే వయం భవతా రక్ష్యా భవద్విషయవాసినః।
నగరస్థో వనస్థో వా త్వం నో రాజా జనేశ్వర।

అనికోరి ప్రజాస్వీకృతుఁడె సమర్థుఁడైనరాజని లోకనాయకుఁడుగాఁ డనిధృవపఱిచిరి.

శ్రీరాముని బ్రార్థించినఋషులు తత్తదాశ్రమముల నివసించుఋషిసంఘములకు నాయకులు. ప్రజానాయకు లందఱుఁ గలిసి నిర్ణయించినవిషయ మగుటచే రాక్షసవధ శ్రీరామున కవశ్యకర్తవ్యమయ్యెను. క్రమముగా శ్రీరాముఁడు రాక్షసనివాస మగుదండకారణ్యమునఁ బ్రవేశించి పంచవటిలో నివసించుచు జనస్థానవాసు లగురాక్షసులకుఁ బ్రకటలోకనిష్కృతమై లంకాద్వీపమున సింహాసనాసీనుఁ డగురావణు నుశిక్షింపఁ జేసెను. ఖరాదు లధర్మమార్గావలంబులై హింసాకర్మము నవలంబించి యాత్మవినాశనమునకుఁ బాల్పడిరి. రావణుఁడు శ్రీరామనిగ్రహమున కుపాయముల నన్వేషింపవలసినవాఁ డయ్యెను.

వల్కలధారి, నిస్సహాయుఁడు, పదాతి, తాపసవేషియు నగుశ్రీరాముని నిగ్రహించుటకు దేవదానవాదుల నిర్జించినరావణున కుపాయమే లేకపోయెను. ధర్మాధర్మముల తారతమ్య మనిర్వాచనీయము !

పుత్రో దశరథ స్యాస్తి సింహసంహననో యువా।
రామో నామ వృషస్కన్ధో వృత్తాయతమహాభుజః॥
వీరః పృథుయశా శ్శ్రీమానతుల్యబలవిక్రమః।
హతం తేన జనస్థానం ఖర శ్చ సహదూషణః॥
తస్యానురూపో బలవాన్ రక్తాక్షో దుందుభిస్వనః।
కనీయాన్ లక్ష్మణో నామ భ్రాతా శశినిభాననః॥
శృణు రాజన్ యథావృత్తం రామస్య బలపౌరుషమ్।
అసాధ్యఃకుపితో రామో విక్రమేణ మహాయశాః॥
ఆపగాయా స్సుపూర్ణాయా వేగం పరిహరే చ్ఛరైః।
సంహృత్య వా పునర్లోకా న్విక్రమేణ మహాయశాః॥
శక్త స్సపురుషవ్యాఘ్ర స్స్రష్టుం పున రపి ప్రజాః॥ ౧౦౪౫

అనియకంపనుండను—

దీర్ఘబాహు ర్విశాలాక్ష శ్చీరకృష్ణాజినాంబరః।
కందర్పసమరూప శ్చ రామో దశరథాత్మజః।
శక్రచాపనిభం చాపం వికృష్య కనకాంగదమ్।
దీప్తాన్ క్షిపతి నారాచాన్ సర్పా నివ మహావిషాన్।
నాదదానం శరాన్ ఘోరా న్నముంచంతం శిలీముఖాన్।
న కార్ముకం వికర్షంతం రామం పశ్యామి సంయుగే।
హన్యమానం తు తత్సైన్యం పశ్యామి శరవృష్టిభిః।
భ్రాతా చాస్య మహాతేజా గుణత స్తుల్యవిక్రమః।
అనురక్త శ్చ భక్త శ్చ లక్ష్మణో నామ వీర్యవాన్।
అమర్షీ దుర్జయో జేతా విక్రాంతో బుద్ధిమాన్ బలీ।
రామస్య దక్షిణో బాహు ర్నిత్యం ప్రాణో బహిశ్చరః॥ ౧౧౦

అనిశూర్పణఖయు శ్రీరామునిపరాక్రమ ముగ్గడించినప్పుడు రావణునకు మనోవ్యథ కలుగుట సహజమె కాని దుష్టపరిపాలనము, దుష్టవ్యవసాయము నాతనియుద్దేశము కానిచో—

నహి రామో దశగ్రీవ శక్యో జేతుం త్వయా యుధి।
రక్షసాం వాపి లోకేన స్వర్గః పాపజనై రివ।
న తం వధ్య మహం మన్యే సర్వై ర్దేవాసురై రపి।
అయం తస్య వధోపాయ స్తం మ మైకమనాశ్శృణు।
తస్యాపహర భార్యాం తం ప్రమథ్య తు మహావనే।
స తయా రహితః కామీ రామో హాస్యతి జీవితమ్॥

అనియకంపనుండును

విజ్ఞాయేహాత్మశక్తిం చ హ్రియతామ బలా బలాత్।
సీతా సర్వానవద్యాంగీ భార్యార్థే రాక్షసేశ్వర॥
యస్య సీతా భవే ద్భార్యా యం చ సీతా పరిష్వజేత్।
అతిజీవే త్స సర్వేషు లోకే ష్వపి పురందరాత్॥ ౧౧౫

అని శూర్పణఖయు బోధించినదుర్మంత్రమునకుఁ జెవియొగ్గి యుండఁడు. తా నొనరించునది యధర్మ మనియెఱింగియే త్రైలోక్యాధిపత్యమువహించు శూరుం డయ్యుఁ బదాతి, మితాహారుఁడు నగురాముని నిగ్రహింప మారీచుని సాహాయ్యము నర్థించి—

మారీచ శ్రూయతాం తాత వచనం మమ భాషతః।
ఆర్తోఽస్మి మమ చార్తస్య భవాన్హి పరమా గతిః॥
చతుర్దశసహస్రాణి రక్షసా ముగ్రతేజసామ్।
నిహతాని శరై స్తీక్ష్ణై ర్మానుషేణ పదాతినా॥
తస్య భార్యాం జనస్థానా త్సీతాం సురసుతోపమామ్।
ఆనయిష్యామి విక్రమ్య సహాయ స్తత్ర మే భవ॥ ౧౧౬

అని తనపరాక్రమము శ్రీరామునిభార్య నపహరించుటకు మాత్రము చాలు నని యొప్పికొనెను. మారీచుఁ డాతనిదుష్టవ్యవసాయము మాన్పింపఁ దలఁచి లోభప్రవృద్ధ మగునిరంకుశాధికారము తప్పక నశించు ననియిట్లు బోధించెను.

అపిత్వా మీాశ్వరం ప్రాప్య కామవృత్తం నిరంకుశమ్।
న వినశ్యే త్పురీ లంకా త్వయా సహ సరాక్షసా॥
త్వద్విధః కామవృత్తో హి దుశ్శీలః పాపమంత్రితః।
ఆత్మానం స్వజనం రాష్ట్రం సరాజా హంతి దుర్మతిః॥

మఱియు నీకన్నులకుఁ బదాతి, వల్కలధారి, కందమూలాశనుఁడు, కృశాంగుఁడు నై కానుపించుచున్నను శ్రీరాముఁడు పురుషసింహుఁడు, మహోరస్కుఁడు, అప్రమేయపరాక్రముఁడు సుమీా యని యొక్కసారి జ్ఞాపకము చేసెను.

శుష్కైః కాష్ఠై ర్భవే త్కార్యం లోష్ఠై రపి చ పాంసుభిః।
న తు స్థానా త్పరిభ్రష్టైః కార్యం స్యా ద్వసుధాధిపైః॥
ఉపభుక్తం యథా వాసః స్రజో వా మృదితా యథా।
ఏవం రాజ్యా త్పరిభ్రష్టః సమర్థోఽపి నిరర్థకః॥

అని యధికారబలమే ప్రధానమని విశ్వసించిన రావణుఁడు —

యదివా జీవితం జహ్యాం త్వాం వా సీతే సలక్ష్మణామ్॥

అని ప్రజాసేవకై సోదరులను ప్రాణములను ప్రాణప్రియనుఁగూడఁ బరిత్యజించుటకు సంసిద్ధముగ నున్న శ్రీరాముని దివ్యతేజము నొక్కసారి గ్రహించుట కెట్లు సమర్థుఁ డగును? చిట్టచివఱకు—

యస్య విక్రమ మాసాద్య రాక్షసా నిధనం గతాః।
తం మన్యే రాఘవం వీరం నారాయణ మనామయమ్॥

అని గ్రహింపక పోలేదు. రావణునకు దుర్మంత్రము దృఢముగాఁ దల కెక్కిన దని గ్రహించి మారీచుఁడు —

కే నాయ ముపదిష్ట స్తే వినాశః పాపకర్మణా।
సపుత్రస్య సరాష్ట్రస్య సామాత్యస్య నిశాచర॥
వధ్యాః ఖలు నహన్యంతే సచివా స్తవ రావణ।
యే త్వా ముత్పథ మారూఢం ననిగృహ్ణంతి సర్వశః।
అమాత్యైః కామవృత్తో హి రాజా కాపథ మాశ్రితః।
నిగ్రాహ్య స్సర్వథా సద్భి ర్ననిగ్రాహ్యో నిగృహ్యసే॥ ౧-౩౬-౪

ధర్మ మర్థం చ కామం చ యశ శ్చ జయతాం వర।
స్వామిప్రసాదా త్సచివాః ప్రాప్నువంతి నిశాచార।
విపర్యయే తు తత్సర్వం వ్యర్థం భవతి రావణ।
వ్యసనం స్వామివైగుణ్యా త్ప్రాప్నువం తీతరే జనాః।
రాజమూలో హి ధర్మ శ్చ జయ శ్చ జయతాం వర॥
తస్మా త్సర్వా స్వవస్థాసు రక్షితవ్యా నరాధిపాః।

అని కఠినముగాఁ బలికి మఱియు—

రాజ్యం పాలయితుం శక్యం నతీక్ష్ణేన నిశాచర।
న చాపి ప్రతికూలేన నావినతేన రాక్షస।
యే తీక్ష్ణమంత్రా స్సచివా భజ్యంతే సహ తేన వై।
విషమే తురగా శ్శీఘ్రా మందసారథయో యథా॥

అని చెప్పి ముఖ్యవిషయము నిట్లు వాక్రుచ్చెను.

స్వామినా ప్రతికూలేన ప్రజా స్తీక్ష్ణేన రావణ।
రక్ష్యమాణా న వర్ధంతే మేషా గోమాయునా యథా॥

ఇట్లు మారీచుఁడు తనవిధాయకకృత్యమును నిర్వహించి పిదప రాజభక్తిఁగనుపఱచుట కాతనివెంటఁ బోయెను. రాజకార్యమును నిర్వహింపలేదని రాజుచే విధింపఁ బడినమరణదండనకుఁ బాలగుటకంటె రాజకార్యధురంధరుండై శ్రీరాముని చేతిలోఁ జచ్చిన నిహపరంబులు సిద్ధించు నని మారీచుని పరమోద్దేశము. ఉత్తమసచివుఁ డిట్టివాఁడుగదా! కావుననే భారవి తనకిరాతార్జునీయమున నిట్లు వ్రాసియున్నాఁడు.

స కింసఖా సాధు నశా స్తి యోఽధిపమ్।
హితా న్న య స్సంశృణుతే సకింప్రభుః।
సదాఽనుకూలేషు హి కుర్వతే రతిమ్।
నృపే ష్వమాత్యేషు చ సర్వసంపదః॥

ఎట్టివారు మంత్రిత్వమున కర్హులో శ్రీరాముఁడు భరతునకుఁ గుశలప్రశ్నరూపమున నిట్లుపదేశించియున్నాఁడు.

కచ్చి దాత్మసమా శ్శూరా శ్శ్రుతవంతో జితేంద్రియాః।
కులీనా శ్చేంగితజ్ఞాశ్చ కృతా స్తే తాత మంత్రిణః॥

మఱియు నాసందర్భమునందే యష్టాదశతీర్థములఁ బేర్కొనుచు నాకాలపురాజ్యాంగవృత్తము నీక్రిందివిధముగా సూచించియున్నాఁడు.

రాజు.

(1) యువరాజు.

సభ్యులు. అంతర్వంశికులు. దౌవారికులు.

(2) సేనాధిపతి.

దుర్గపాలుఁడు. పౌరాధికారి. నగరాధ్యక్షుఁడు.

(3) మంత్రి.

కోశాధ్యక్షుఁడు.

కార్యనియోజకుఁడు. సేనానాయకుఁడు. రాష్ట్రపాలకుఁడు.

(4) పురోహితుఁడు.

ధర్మాధ్యక్షుఁడు.

దండపాలుఁడు. ప్రాడ్వివాకుఁడు.

ఇట్లు గాక యొక స్త్రీ, యొకయకంపనుఁడు, నొక ప్రకంపనుఁడు సాచివ్యము వహింప రావణరాజ్యాంగము నిరుపద్రవమై యెట్లుండఁ గలదు? సీతాహరణముతో శ్రీరాముఁడు లొంగిపోవు నని రావణుఁడు తలంచెను. సీత శ్రీరామునకుఁ బ్రాణములకంటెను బ్రియురా లనుట వాస్తవమె కాని లోకసంరక్షణార్థము సీతావియోగము నాతఁడు సుఖముగా సహింపఁగలఁడు. ఇప్పటికి విశ్వామిత్రునిబీజన్యాసములు కొంతవఱకు ఫలించినవి విషవృక్షమును మూలచ్ఛేదము చేసినఁ గాని యంకురములు నశింపవు. శ్రీరాముఁ డందులకై బయలుదేరి సుగ్రీవునితోఁ జెలిమి చేసికొనెను. హనుమజ్జాంబవదాదులు నీతిరహితముగాఁ బాలించుచున్న తమ పరిభువును బహిష్కరించి కిష్కింధారాజ్యమున వలయు మార్పులం జేసికొనుట కెదురుచూచుచుండిరి. వారు వనచరులైనను దుష్టప్రభుత్వముక్రిందఁ జిరకాలముండ లేకపోయిరి. శ్రీరాముఁడు వాలిని సంహరించి కిష్కింధారాజ్యమును సంస్కరించెను. ఇట్లు దక్షిణాపథమును నిష్కంటకముఁ గావించి లంకాద్వీపముపై దండెత్తెను. వానరులచే సేతువును

నిర్మింపఁజేసి దాక్షిణాత్యులశిల్పచాతుర్యమును బ్రస్ఫుటపఱిచెను. మాఱణ యజ్ఞమున శ్రీరాముఁడు గనుపఱిచినవైశద్యమునకు మేరయే లేదు. రావణాది దుష్టరాక్షసుల నెల్ల సంహరించినపిమ్మట ప్రజాభీప్సితము శిరసా నిర్వహించుటకు సాకేతమున కేగెను శ్రీరాముఁడు సింహాసన మధిష్టించినది తాను సేతువుఁగట్టించితిననియు, జనస్థానముఁ జక్కఁజేసితిననియు, రావణాదిసంహారముచే లోకము నుద్ధరించితి ననియుఁ బ్రజలనుండి యధికముగాఁ బ్రతిఫలముగోరుటకుఁ గాదు. హృదయపూర్వకముగా వారియభీష్టమును నెరవేర్చి వారిని సేవించుటకే రాముఁడు రాజ్యము నంగీకరించెను. ఈయభిప్రాయమును మహాకవి వాల్మీకి 'రామో రాజ్య ముపాసిత్వా' యని వెల్లడించి యున్నాఁడు. మఱియు నారామచంద్రుని పరిపాలనము నిట్లువర్ణించియున్నాఁడు.

స పుత్రమరణం కించి ద్ద్రక్ష్యంతి పురుషాః క్వచిత్।
నార్య శ్చావిధవా నిత్యం భవిష్యంతి పతివ్రతాః॥
ప్రహృష్టో ముదితో లోక స్తుష్టః పుష్ట స్సుధార్మికః।
నిరామయో హ్యరోగశ్చ దుర్భిక్షభయవర్జితః॥
నచాగ్నిజం భయం కించి న్నాప్సు మజ్జంతి జంతవః।
న వాతజం భయం కించి న్నాపి జ్వరకృతం తథా॥
నచాపి క్షుద్భయం తత్ర నతస్కరభయం తథా॥
నగరాణిచ రాష్ట్రాణి ధనధాన్యయుతానిచ॥

మఱియు రాముఁడు రాజవంశములను శతగుణముగా స్థాపించె ననియు వర్ణాశ్రమధర్మములఁ బరిపాలించె ననియు వ్రాయఁబడినది. ఈయర్థమే యుద్ధకాండమున నిట్లనువదింపఁబడినది.

న పర్యదేవన్ విధవా నచ వ్యాళకృతం భయమ్।
న వ్యాధిజం భయంవాపి రామే రాజ్యం ప్రశాసతి॥
నిర్దస్యు రభవ ల్లోకో నానర్థః కించి దస్పృశత్।
నచ స్మ వృద్ధా బాలానాం ప్రేతకార్యాణి కుర్వతే॥ ౧౮౧

ఇట్టిరాజ్యాంగతంత్రముగలవాఁ డగుటచేతనే పెద్దలు నేఁటికిని శ్రీరామరక్ష పెట్టుచున్నారు.

మఱియు గుహ, శబరీవృత్తాంతములచే శ్రీరాముఁ డెల్లజాతులందు సమానురాగము కలిగియుండె ననియు భరతునికంటె ముందుగా గుహుని సం

దర్శింప హనుమంతు నంపుటచే హీనజాతీయు లైనను గుణవంతులు ముం దుగాఁ బరిగ్రహింపఁబడుచుండెడివా రనియు నొకజాతిపై వేరొకజాతి కసూయగాని విజిగీషగాని యుదయించుట కాతని ప్రభుత్వమం దవకాశము లేకుండె ననియుఁ దెలియందగు. ఈయంశము నీక్రిందిశ్లోకము ధ్రువపఱుచుచున్నది.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా శ్శూద్రా లోభవివర్జితాః।
స్వకర్మసు ప్రవర్తంతే తుష్టా స్స్వై రేవ కర్మభిః॥

మఱియు ఋష్యశృంగాదివృత్తాంతములచే రామునికంటెఁ బూర్వమును రాజులు దేశమున దుర్భిక్షాద్యరిష్టములుసంభవించినప్పుడు వెంటనే యందు లకుఁ బ్రతిక్రియ నాలోచించి తమసంతానము నైన సమర్పించి యట్టిబాముల నివారణచేసి ప్రజాక్షేమమునకై పాటుపడుచుండెడివా రనితోఁచెడిని. ఇట్లు రామాయణమునుండి రాజకీయధర్మము లెన్ని వ్రాసిన వ్రాయవచ్చును. కేవల రాజకీయధర్మములు గాక రాజులకు బహుపరిగ్రహము, ఏకగర్భజాతుల కేకకాలమునవివాహము, వన్యస్త్రీలకుద్వితీయపరిగ్రహము, బ్రాహ్మణాదులకు క్షత్రియాదికన్యాపాణిగ్రహణము, భోజనప్రతిభోజనములు మున్నగునాకా లపుసాంఘికాచారము లెన్నియో రామాయణవాఙ్మయమునఁ బ్రతిబింబించు చున్నవి. అన్నియు గ్రంథమును సాకల్యముగఁ జదివి తెలిసికొనవలయును. అయినఁ బాఠకహృదయాహ్లాదమునకై మహాకవి వాల్మీకి శ్లోకరూపమునఁ బొందుపఱచి యున్న మనోహరవిషయములొకటిరెం డుదాహరించి యింత టితో విరమించుచున్నారము.

నాఽహం జానామి కేయూరే నాఽహం జానామి కుండలే।
నూపురే త్వభిజానామి నిత్యం పాదాభివందనాత్॥

ఇందు నెలకొనియెడి లక్ష్మణునకుఁ గలమాతృభక్తి వర్ణింపఁబడినది. ఇంత సరసముగా వర్ణించుట మహర్షియగువాల్మీకికిందక్క కవిమాత్రునకుఁ జెల్లదు.

రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజామ్।
అయోధ్యా మటవీం విద్ధి గచ్ఛ తాత యథాసుఖమ్॥

ఇందు సాపత్నీపుత్రప్రేమ స్వార్థత్యాగము మున్నగుననేకవిషయ ములు నిబిడీకృతంబు లై యున్నయవి.

ప్రియాం తు సీతా రామస్య దారాః పితృకృతా ఇతి।
గుణా ద్రూపగుణా చ్చాపి ప్రీతి ర్భూయోఽభ్యవర్ధత॥

తస్యా శ్చ భర్తా ద్విగుణం హృదయే పరివర్తతే।
అంత ర్జాత మపి వ్యక్త మాఖ్యాతి హృదయం హృదా॥

ఇందు సీతారాములప్రేమ యసాధారణముగ వర్ణింపఁబడినది.

రామం మే ఽనుగతా దృష్టి రద్యాపి ననివర్తతే।
న త్వాం పశ్యామి కౌసల్యే సాధు మా పాణినా స్పృశ॥

ఇందు దశరథునిపుత్రలాలసత్వము నిరుపమానముగ నిరూపింపఁబడినది.

యావ న్న చరణౌ భ్రాతుః పార్థివవ్యంజనాన్వితౌ।
శిరసా ధారయిష్యామి న మే శాంతి ర్భవిష్యతి॥

ఇందు భరతునిభ్రాతృభక్తి సొగసుగాఁ జెప్పఁబడినది. ఆకాలమున స్వయంవరము లంతగా వ్యాప్తిలో లే వని కుశనాభసుతా వృత్తాంతమువలనఁ దెలియుచున్నది. ఈశ్లోకములం జూడుఁడు!

మా భూ త్స కాలో దుర్మేధః పితరం సత్యవాదినమ్।
నావమన్యస్వ ధర్మేణ స్వయంవర ముపాస్మహే।
పితా హి ప్రభు రస్మాకం దైవతం పరమం హి సః।
యస్య నో దాస్యతి పితా స నో భర్తా భవిష్యతి॥

పాదములవైపు తలనుంచి నిద్రించుట అనాచారమని యీక్రిందిశ్లోకమునఁ జక్కఁగా దెలుపఁబడినది.

దృష్ట్వా త మశుచిం శక్రః పాదయోః కృతమూర్ధజామ్।
శిరస్థానే కృతౌ పాదౌ జహాస చ ముమోద చ॥ ౧౫౧

అచ్చటనే పాదౌ కృత్వాఽథ శీర్షతః, యనుటచే కాళ్ళవైపు తలనుంచి నిద్రించుటయుఁ ప్రాప్తే మధ్యం దివాకరే, యనుటచేఁ బగటినిద్రయు నశుచి హేతువులనియు దురాచారములనియు గ్రహింపఁదగు. ఆకాలమున ఋషులు గూడ శకటముల మీఁద నరుగుచుండెడివా రనియు ఋష్యాశ్రమములు బండ్లు రథములు పోవుట కను వగుబాటలు గలిగియుండె ననియు మన మీక్రింది శ్లోకమువలన గ్రహింపఁగలము.

తం ప్రయాతం మునివరం మన్వయా దనుసారిణామ్।
శకటీశతమాత్రం తు ప్రాయేణ బ్రహ్మవాదినామ్॥

దేవతాపితృకార్యాదులందు గృహస్థుఁడు తాననుభవించు పదార్థములనే యుపయోగింప వలె నని యీక్రిందిశ్లోకమువలనఁ దెలియుచున్నది.

ఇంగుదం బదరీమిశ్రం పిణ్యాకం దర్భసంస్తరే।
న్యస్య రామ స్సుదుఃఖార్తో రుద న్వచనమబ్రవీత్॥
ఇదం భుంక్ష్వ మహారాజ ప్రీతో యదశనా వయమ్।
యదన్నః పురుషో భవతి తదన్నా స్తస్య దేవతాః॥ ౧౫౪

---

## శ్రీమద్వాల్మీకిరామాయణాంధ్రవ్యాఖ్యాన పీఠిక.

### చరమభాగము, మహాత్మ్యాదివర్ణనము.

:o:

ఇట్టి మహద్విషయములచే నిబిడీకృత మై యుండుటచేత వక్తృవైలక్షణ్య, ప్రతిపాద్యవైలక్షణ్య, సముపేత మగుటచేతను శ్రీమద్రామాయణము విలక్షణప్రబంధం బై యలరారుచుఁ బఠనశ్రవణలేఖనాదినిరతు లగు భక్తపుంగవులకు సమస్తశ్రేయస్సంపాదక మై యొప్పుచున్నయది. ఈవిషయ మీక్రిందిప్రమాణములవలనఁ దెలియందగు.

బ్రహ్మాండపురాణము. అ. ౧౮౮.

రామాయణస్య మహాత్మ్యం శృణు వక్ష్యే ద్విజోత్తమ।
రామాయణస్థవర్ణస్య శ్రవణా ద్బ్రహ్మప్రదక్షిణమ్॥

ఉమాసంహిత.

శృణ్వన్ రామాయణం భక్త్యా యః పాదం పద మేవ వా।
స యాతి బ్రహ్మణ స్థానం బ్రహ్మణా పూజ్యతే సదా॥
ఏక స్మిన్ శ్లోకమాత్రే తు శ్రుతే నియమతో ద్విజ।
బ్రహ్మహత్యాదిపాపాని తం త్యక్త్వా యాంతి దూరతః॥

ఉమాసంహితయందే రామాయణవైభవ మిట్లు వర్ణింపఁబడినది.

శ్రీరామప్రతిపదిక మవశేనాపి సంగృణన్।
ముక్తిం ప్రాప్నోతి మనుజః కిం పునర్బుద్ధిపూర్వకమ్॥
రాశబ్దోచ్చారణా దేవ పాతకా దేహపంజరాత్।
నిర్యాంత్యాయాంతి పాపాని మవర్ణాదర్శనా త్పునః॥
రాశబ్దోచ్చారణే జాతే వక్త్రా త్పాపం వినిగచ్ఛతి।
మకారశ్రవణే జాతే భస్మభావం గమిష్యతి॥
రామేతి రామచంద్రేతి రామభద్రేతి వానునుమ్।

యావజ్జీవం జపే న్నర్త్యో జీవన్ముక్తో న సంశయః॥
రామాయణస్య మాహాత్మ్యం వక్తుం వర్షశతై రపి।
అశక్యం విస్తరా ద్వక్తుం సంక్షేపా ద్వచ్మి సాంప్రతమ్॥
రామాయణస్య వాక్యం వా పాదం వా పదమేవ వా।
భుక్త్యంతే తు ప్రయుంజానో బ్రహ్మభూయాయ కల్పతే॥
లేఖకున కీక్రిందివిధముగా ఫలము విధింపఁబడినది.

శ్రీమదాద్రిరామాయణము. యు, కాం. స. ౧౩౧ శ్లో. ౧౨౪.

భక్త్యా రామస్య యే చేమాం సంహితా మృషిణా కృతామ్।
లిఖంతి చ మహాత్మాన స్తేషాం వాస స్త్రివిష్టపే॥

తత్త్వసంగ్రహరామాయణము. ఉత్తరకాండము.

రామాయణస్య శ్లోకాని యేలిఖంతి మహీతలే।
తేషాం దేవి మయా సార్ధం నివాసః పరమాత్మని॥

భాషాంతరీకృతగ్రంధములకుఁ బారాయణార్హత లేదని తత్త్వ సంగ్రహరామాయణము నందలి యీశ్లోకములవలనఁ దెలియుచున్నది.

సంస్కృతం రామచరితం పరిత్యజ్య నరాధమః।
పఠన్ భాషాంతరకృతం మృగతృష్ణాజలం పిబేత్॥
పఠన్ భాషాంతరకృతం కథం తరతి పాపధీః।
క్షున్నివృత్తి ర్భోజనేన వినా తత్కథయా కథమ్॥ ౧౬౫

రామాయణ మవ్రతాదుల కుపదేశింపరా దని బ్రహ్మాండపురాణము ౧౫౦ అధ్యాయము నందలి యీక్రిందిశ్లోకములవలనఁ దెలియుచున్నది.

అవ్రతా యాతిమూర్ఖాయ విభిన్నవ్రతినే తథా।
శఠాయాగురుభక్తాయ చలాయానాత్మవేదినే।
అభక్తాయ చ చోరాయ హ్యసత్యనియమాయ చ।
వేదానాం నిందకా యాథ భృతకాధ్యాపకాయ చ।
అవిష్ణుభక్తాయ తథా మద్భక్తిరహితాయ చ।
కులఘ్నా యాభిశస్తాయ తథా వ్యాకులబుద్ధయే॥
రామాయణం పరం వస్తు నేదం వాచ్యం ద్విజన్మనా॥ ౧౭౦

రామాయణపఠనాదులకు యోగ్యాయోగ్యతిథివారాదుల విభాగము బ్రహ్మాండపురాణమున ౧౫౦ అధ్యాయమున నిట్లు చెప్పఁబడినది,

మాసనిర్ణయము.

చైత్రమాసే ధర్మవృద్ధి స్సంపద్వృద్ధి స్తు మాధవే।
జ్యేష్ఠే సర్వార్థసంపత్తి రాషాఢే ధర్మనాశనమ్।
శ్రావణే కర్మవృద్ధి శ్చ ధనవృద్ధి స్తథాఽఽశ్వినే।
సామాన్యం స్యాద్భాద్రపదే ఫలం మునిభి రీరితమ్।
కార్తికే తు యశోవృద్ధి ర్మార్గశీర్షే ఫలాధికమ్।
పుష్యే సర్వార్థనాశ శ్చ మాఘే ధర్మాదిసంపదః।
ఫాల్గునే కార్యసంసిద్ధి రిత్యేత న్మాసలక్షణమ్॥

మౌఢ్యనిషేధము.

శుక్రస్యాస్తమయే చాపి గురో రస్తమయే తథా।
నైవారంభః ప్రకర్తవ్యో రామాయణమహామనోః॥

తిథినిర్ణయము.

ద్వితీయా ప్రథమా చాపి తృతీయా పంచమీ తథా।
త్రయోదశీ సప్తమీ చ దశ మ్యేకాదశీ తిథిః।
పఠనే శ్రవణే చాపి హ్యష్టా వేతా శ్శుభావహాః॥

వారనిర్ణయము.

భానువారే కర్మవృద్ధి స్సోమే సర్వాఘనాశనమ్।
భౌమే దేహవినాశ స్స్యాత్సౌమ్యే కీర్తిస్తు శాశ్వతీ।
గురౌ తు శుభవృద్ధి స్స్యా దర్థవృద్ధి ర్భృగౌ భవేత్।
శనౌ తు కార్యహాని స్స్యా దిత్యేత ద్వారలక్షణమ్॥

నక్షత్రనిర్ణయము.

అశ్విన్యాం చైవ రేవత్యాం త్రిపూర్వాయాం ప్రజాపతౌ।
పునర్వసౌ తథా పుష్యే హ్యుత్తరే హస్తచిత్రయోః।
ఏతేషు ఋక్షముఖ్యేషు పఠనారంభ మాచరేత్।
తే ష్వేవ శ్రవణస్యాఽపి ప్రారంభ స్తు శుభావహః॥

దేశనిర్ణయము.

గోదావర్యా స్తథా తీరే గంగాయా శ్చ మునీశ్వర।
ధర్మక్షేత్రేషు సర్వేషు చాయోధ్యాయాం విశేషతః।
కాశ్యాం సముద్రతీరే వా తథా దేవాలయేఽపి వా।

బ్రాహ్మణానాం సమూహే వా తథా వైష్ణవసన్నిధౌ।
మధ్యే భక్తసన్నిధానే వా తథా వేదాంతవేదినామ్।
క్షేత్రే ష్వేత త్ప్రభృతిషు పరిశుద్ధేషు సర్వదా।
ఆరంభం తు నరః కుర్యా దస్య పారాయణస్య హి॥

బ్రహ్మాండపురాణము. ౧౮౭ అధ్యాయమునవాచార్యలక్షణాదిక

మిట్లు విధింపబడినది.

ఏవం సర్వగుణోపేతదివసే ప్రాత రేవ హి।
వేదాధ్యయనసంపన్నం మహామంత్రార్థపారగమ్।
అనూచానం తథా భక్తం శ్రీరామే చ హనూమతి।
రామాయణార్థ వ్యాఖ్యానే సమర్థం పరివర్ణినమ్।
పాపభీరుం ధర్మరతి మసూయారహితమ్ సదా।
ఏవం బహుగుణం విప్ర మాచార్యం కారయే న్నరః।
తం పూజయిత్వా శృణుయా న్మహామను మిమం శుభమ్।
వాల్మీకిమేవ వక్తారం భావయే చ్ఛ్రావకోత్తమః।
తదన్యం ప్రార్థయే ద్యస్తు సమహారౌరవం వ్రజేత్।
అప్రార్థయిత్వా శృణుయా ద్యది వాచక ముత్తమమ్।
సవిష్ఠాకృమితాం ప్రాప్య బ్రహ్మకల్పం వసే ద్ధ్రువమ్।
గత్వైవ వాచకం మర్త్య స్స్వయ మేవ మునీశ్వర।
అవిఘ్నాయ ప్రార్థ్య దేవం తత్పూజాం తేన కారయేత్।
తత స్సంశృణుయా ద్భక్త్యా నోచే ద్రౌరవ మన్వియాత్।

శ్రావకనియమ మిట్లు పేర్కొనబడినది.

హృదంబుజే రఘుపతిం ధ్యాత్వా రామం జగత్పతిమ్।
విఘ్నాధీశం చ సంపూజ్య తథా దేవా న్నమస్య చ।
హనూమంతం పురస్స్థాప్య వాచకం సన్నివేశయేత్।
పశ్చాన్ముఖస్తు వక్తా చ శ్రావకః పూర్వదిఙ్ముఖః।
వాచకం మత్స్వరూపేణ ధ్యాత్వా శ్రావ్యం ద్విజై స్సహ।
రామాయణే వక్ష్యమాణే న సర్గం శృణుయా ద్యది।
అశ్రుత్వా వా నరో గచ్ఛే త్కుంభీపాకే వసే చ్చిరమ్॥
మనస్సంకల్పకం కృత్వా శ్రోష్యా మ్యేతం మనుం త్వితి।

అశ్రద్ధయా నశ్శృణుయా త్సనరో రౌరవం వ్రజేత్।
ధావతి శ్రవణార్థం యో విఘ్నమాచరతి ద్విజః।
సవీర హేతి విజ్ఞేయో మహారౌరవగో భవేత్॥
ద్విజా న్నత్వా నరశ్లోకాన్ శ్రవణాదా విమాన్ పఠేత్॥
రామాయణమహామంత్రశ్రవణేన సనాతనః।
పరః పుమాన్ సదా రామః ప్రీత్యా దద్యా న్మ మేప్సితమ్॥
బ్రహ్మవిష్ణ్వీశ్వరా నిత్యం గృహే తిష్ఠంతు మే సదా।
ఆకృష్టా రామమంత్రేణ కైంకర్యం సముపస్థితాః॥
ఘటికాపాదుకాద్యష్టసిద్ధయో నిధయో నవ।
పార్వతీ చ రమా వాణీ కింకర్య స్సంవసంతు మే॥
ఇతి వై ప్రార్థనాం కృత్వా కుర్యాత్ శ్రీమంగళాదికమ్।
ఏవం ధ్యాత్వా తతో భక్త్యా శ్రీరామధ్యాన మాచరేత్॥


## శ్రీమద్రామాయణపుస్తకదానఫలము.

———:)o(:———

దదతే సంహితాకోశం యే రామప్రీత్యభీప్సవః।
తేషాం కరతలే హ్యస్తి తద్విష్ణోః పరమం పదమ్॥ ౧౦౫

ఇట్లు పఠనశ్రవణాదులచే నఖండఫలప్రదం బని పురాణాదులచేఁ గొని యాడఁబడిన శ్రీమద్రామాయణము నెల్లఱు భక్తితోఁ జదివియు వినియుఁ జరితార్థు లగుదురుగాక యని కోరుచు నింతటితో విరమించుచున్నాము.

ఓమ్ తత్సత్.



శ్రీరామ పంచాయతనము.

శ్రీరస్తు.

# శ్రీమద్రామాయణపఠనశ్రవణవిధి.

శ్రీరామోత్సవరత్నాకరోక్తప్రకారముగా నీక్రింద వివరింపఁబడుచున్నది.

శ్రీమద్రామాయణమును స్వయముగాఁ బారాయణము చేయుటకుఁ గాని శాస్త్రోక్తలక్షణోపేతుఁ డగుకథకునివలన వినుటకుఁగాని తలంచిన శ్రీరామభక్తుఁడు సద్గురునివలన స్వసాంప్రదాయానుసారముగా శ్రీరామాయణమహామంత్రోపదేశంబు నొంది శుభముహూర్తమునఁ బారాయణమునుగాని శ్రవణమునుగాని యారంభింపవలయును. శ్రవణపరుండు శమదమాదిగుణములతోఁ గూడి కుటుంబికుఁ డగువిద్వాంసు నాచార్యునిగా గ్రహించి శ్రీమద్రామాయణంబు చెప్పఁ బనికోరి యుత్తమాసనమునఁ దూర్పుమొగముగా నైన నుత్తరాభిముఖముగా నైనఁ గూరుచుండఁబెట్టి యమ్మహనీయుఁ గేవలవాల్మీకిమహర్షిఁగాఁ దలంచుచు మధుపర్కాదిసత్కారంబు లాచరించి యాగురువర్యునియెదుట దివ్యసింహాసనమును గల్పించి యందు శ్రీమద్రామాయణము నుంచవలయును. ఆసింహాసనమునకు సమీపమున హనుమంతునియుపవేశనార్థ మొకపీఠము (హనుమత్పీఠము) నుంచవలయును. పిమ్మటఁ గథకునివాక్యములు తనకుడిచెవిలోఁ బ్రవేశించునట్లు ప్రాఙ్ముఖముగానైన నుత్తరాభిముఖముగానైనఁ గూరుచుండి కథను వినవలయును.

స్వయముగాఁ బారాయణము చేయువాఁడు ప్రశస్తమగునాసనముపైఁ దూర్పుమొగముగానైనఁ నుత్తరపుమొగముగానైనఁ గూరుచుండి యెదుటఁ బుస్తకముతోఁగూడిన సింహాసనమును హనుమత్పీఠమును నుంచి పరిశుద్ధాంతఃకరణుండై యాచమనంబుచేసి దేశకాలములను గీర్తించి 'శ్రీసీతారామచంద్రప్రీత్యర్థం శ్రీమద్రామాయణపారాయణ (శ్రోత్ర, శ్రవణ) మహం కరిష్యే' యని సంకల్పము చేయవలయును. పిమ్మట నిర్విఘ్నపరిసమాప్తినిమిత్తము గణపతిపూజయుఁ దదంగకలశారాధనంబును గావించి

కలశోదకంబుచేఁ బూజాద్రవ్యములఁ బవిత్రింపఁజేసి పుస్తకముపై శ్రీరామచంద్రమూర్తికిఁ బురుషసూక్తవిధానంబుగా ధ్యానావాహనాదిషోడశోపచారపూజ గావింపవలయు. (శ్రీవైష్ణవులు గణపతిపూజకుమారుగా విష్వక్సేనపూజ గావింపవలయు) అనంతరమున హనుమదారాధనము చేసి దండప్రణామ మొనర్పవలయు. పిదప శ్రీరామాయణమహామంత్రముయొక్క ఋషిచ్ఛందోన్యాసాదులం గావించి మూలమంత్రమును యథాశక్తిగా జపించి తిరిగి న్యాసాదు లొనర్చి తరువాత నాయాకాండములయొక్క పారాయణ ప్రారంభములం దాయాకాండములకుఁ జెప్పఁబడిన న్యాసధ్యానాదికము లాచరించి ఆయామూలమంత్రములను యథాశక్తిగా జపించి తిరిగి యంగన్యాసాదులఁ జేయవలయును.

విశిష్టశ్రీరామాయణమంత్రన్యాసాదిక్రమము.

అస్య శ్రీరామాయణమహామంత్రస్య, భగవాన్ నారద ఋషిః, అనుష్టుప్ఛందః, శ్రీసీతా,లక్ష్మణ,భరత,శత్రుఘ్న,హనూమత్సమేత శ్రీరామచంద్రో దేవతా, ఓమ్ బీజమ్, ధర్మాత్మా సత్యసంధశ్చ రామో దాశరథ ర్యదీతిశక్తిః, పౌరుషే చాప్రతిద్వంద్వ శ్శరైనం జహి రావణి మితికీలకమ్, శ్రీసీతారామచంద్రప్రీత్యర్థే జపే వినియోగః, ధర్మాత్మా, అంగుష్ఠాభ్యాం నమః, సత్యసంధ శ్చ, తర్జనీభ్యాం స్వాహా, రామః, మధ్యమాభ్యాం వషట్, దాశరథ ర్యది, అనామికాభ్యాం హుం, పౌరుషే చాప్రతిద్వంద్వః, కనిష్ఠికాభ్యాం వౌషట్, శరైనం జహి రావణిమ్, కరతలకరపృష్ఠాభ్యాం, ఫట్, ధర్మాత్మా, హృదయాయ నమః,సత్యసంధశ్చ, శిరసే స్వాహా, రామః, శిఖాయై వషట్, దాశరథి ర్యది, కవచాయ హుం, పౌరుషే చాప్రతిద్వంద్వః, నేత్రత్రయాయ వౌషట్, శరైనం జహి రావణిం, అస్త్రాయ ఫట్, భూర్భువ స్సువరో మితి దిగ్బంధః.

ధ్యానం, సహస్రాదిత్యసంకాశం సర్వశస్త్రనిబర్హణమ్॥
రామశక్తిమయం ధ్యాయే హ్యమోఘం రామసాయకమ్॥

పంచపూజ.

లం, పృథివ్యాత్మనే శ్రీరామచంద్రపరబ్రహ్మణే గంధం సమర్పయామి, హం, ఆకాశాత్మనే శ్రీరామచంద్రపరబ్రహ్మణే పుష్పం సమర్పయామి, యం వాయ్వాత్మనే శ్రీరామచంద్రపరబ్రహ్మణే ధూప మాఘ్రాపయామి,

రం, తేజస్తత్త్వాత్మనే శ్రీరామచంద్రపరబ్రహ్మణే దీపం దర్శయామి, వం, అమృతాత్మనే శ్రీరామచంద్రపరబ్రహ్మణే అమృతనైవేద్యం సమర్పయామి సం, సర్వతత్త్వాత్మనే శ్రీరామచంద్రపరబ్రహ్మణే సర్వోపచారపూజా స్సమర్పయామి.

మూలమంత్రము.

ధర్మాత్మా సత్యసంధశ్చ రామో దాశరథి ర్యది।
పౌరుషే చాప్రతిద్వంద్వ శ్శరైనం జహి రావణిమ్॥

అని యథాశక్తిగా జపించి 'ఓమ్ తత్సత్ శ్రీరామచంద్రపరబ్రహ్మార్పణ మస్తు' అని యుదకంబు విడిచి తిరిగి యంగన్యాసాదిక మొనర్పవలయు.

బాలకాండరామాయణమునకు న్యాసాదిక్రమము.

అస్య శ్రీబాలకాండమహామంత్రస్య, ఋష్యశృంగ ఋషిః, అనుష్టుప్ఛందః, శ్రీరామో దేవతా, రాం బీజమ్, నమ శ్శక్తిః, రామాయేతి కీలకమ్, శ్రీసీతాసహిత శ్రీరామప్రీత్యర్థే జపే వినియోగః, సుప్రసన్నః, అంగుష్ఠాభ్యాం నమః, శాంతమనాః, తర్జనీభ్యాం స్వాహా, సత్యసంధః, మధ్యమాభ్యాం వషట్, జితేంద్రియః, అనామికాభ్యాం హుం, ధర్మజ్ఞో నయసారజ్ఞః, కనిష్ఠికాభ్యాం వౌషట్, రాజా దశరథో జయీ, కరతలకరపృష్ఠాభ్యాం ఫట్, సుప్రసన్నః, హృదయాయ నమః, శాంతమనాః, శిరసే స్వాహా, సత్యసంధః, శిఖాయై వషట్, జితేంద్రియః, కవచాయ హుమ్, ధర్మజ్ఞో నయసారజ్ఞః, నేత్రత్రయాయ వౌషట్, రాజా దశరథో జయీ. అస్త్రాయ ఫట్, భూర్భువస్సువరోమితి దిగ్బంధః, ధ్యానమ్॥

ఇందీవరదళశ్యామః పుండరీకనిభేక్షణః।
త్రైలోక్యనందనో ధీరో రామ ఏవ గతి ర్మమ॥

పూ॥ లం, పృథివ్యాత్మనే శ్రీరామభద్రాయ గంధం సమర్పయామి, హం, ఆకాశాత్మనే శ్రీరామభద్రాయ పుష్పం సమర్పయామి, యం, వాయ్వాత్మనే శ్రీరామభద్రాయ ధూప మాఘ్రాపయామి, రం, తేజస్తత్త్వాత్మనే శ్రీరామభద్రాయ దీపం దర్శయామి, వం, అమృతతత్త్వాత్మనే శ్రీరామభద్రాయ అమృతనైవేద్యం సమర్పయామి, సం, సర్వతత్త్వాత్మనే శ్రీరామభద్రాయ సర్వోపచారపూజా స్సమర్పయామి.

## మూలమంత్రము.

సుప్రసన్న శ్శాంతమనా స్సత్యసంధో జితేంద్రియః।
ధర్మజ్ఞో నయసారజ్ఞో రాజా దశరథో జయీ॥

అని యథాశక్తిగా జపించి 'ఓమ్ తత్సత్ శ్రీరామార్పణ మస్తు', అని జలంబు విడిచి తిరిగి న్యాసాదిక మొనర్పవలయును. (అయోధ్యాదికాండన్యాసాదికము లాయాకాండప్రారంభసమయము లందుఁ దెలుపఁబడును.)

ఇట్లు విశిష్టన్యాసాదికముఁ గాండన్యాసాదికముఁ గావించి పారాయణారంభమున నీక్రిందిశ్లోకములం జదువుచు పుస్తకమును గ్రహింపవలయు.

రామాయణమహామంత్రపఠనేన సనాతనః।
పరశ్శివ స్సదా రామః ప్రీత్యా దద్యా న్మమేప్సితమ్॥

వి॥ సనాతనః=మిక్కిలిపూర్వుండు, పరః=సర్వోత్కృష్టుఁడు, శివః=శుభస్వరూపుఁడునగు, రామః=శ్రీరాముఁడు, రామాయణమహామంత్రపఠనేన=రామాయణమహామంత్రముయొక్క చదువుటచేత (వలన) ప్రీత్యా=సంతోషముచే, సదా=ఎల్లప్పుడు, మమ=నాకు, ఈప్సితమ్=కోరికను, దద్యాత్=ఇచ్చుఁగాక !

భా॥ జగత్కారణుఁడు భక్తులకు శుభపరంపరల నొసంగు సనాతనుఁడైనవా డగురామచంద్రుండు నేనొనర్చు శ్రీమద్రామాయణ మహామంత్రముయొక్క పారాయణమువలన మిగులసంతసించినవాఁడై నాకు సకలాభీష్టములను సిద్ధింపఁజేయుఁగాక !

బ్రహ్మవిష్ణ్వీశ్వరా నిత్యం గృహే తిష్ఠంతు మే సదా।
ఆకృష్టా రామమంత్రేణ కైంకర్యం సముపస్థితాః॥

వి॥ బ్రహ్మవిష్ణ్వీశ్వరాః=బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుఁడు (ముగ్గురు) రామమంత్రేణ=శ్రీరామాయణాత్మక మగురామమంత్రముచే, ఆకృష్టాః=ఆకర్షింపఁబడినవారై, కైంకర్యం=కింకరత్వమును, సముపస్థితాః=పొందినవారగుచు, మే= నాయొక్క, గృహే=నివాసమందు, సదా=ఎల్లప్పుడు, తిష్ఠంతు=నివసింతురుగాక !

భా॥ బ్రహ్మ విష్ణువు రుద్రుండు నే నొనర్చు శ్రీరామాయణమహామంత్రపారాయణముచే నాకర్షింపఁబడినవారై నాగృహమందు నిరంతరము భృత్యులై నివసింతురుగాక !

ఘుటికాపాదుకాద్యష్టసిద్ధయో నిధయో నవ।
పార్వతీ చ రమా వాణీ కింకర్య స్సంవసంతు మే॥

వి॥ ఘుటికాపాదుకాద్యష్టసిద్ధయః=ఘుటికాసిద్ధి, పాదుకాసిద్ధి మొదలగు నెనిమిదిసిద్ధులు, నవ=తొమ్మిదియగు, నిధయః=నిధులు పార్వతీ=పార్వతీదేవి. రమా=లక్ష్మీదేవి, వాణీచ=సరస్వతీదేవియు, మే=నాకు, కింకర్యః=దాస్యము చేయువారై, సంవసంతు=(నాగృహమున) నివసింతురుగాక !

భా॥ ఘుటికాపాదుకాద్యష్టసిద్ధులు, పద్మ, మహాపద్మాది నవనిధులును లక్ష్మీపార్వతీసరస్వతులు నన్ను సేవించుచు నాగృహంబున నివసింతురుగాక,

(అనఁగాఁ బాఠకుఁడు మంత్రిమూర్తియగుంగావున సమస్త దేవతలు నాతనికిం గైంకర్యంబు సేయు చుందు రనిభావము.) ఇట్లు ప్రార్థించి స్వసాంప్రదాయానుసార మగుగురుపరంపరానుస్మృతిపూర్వకముగా నీక్రింద వివరించిన క్రమంబున మంగళశ్లోకముల ననుసంధానము చేయవలయు. అందు శ్రీవైష్ణవులచేఁ బారాయణారంభసమయమునఁ జదువఁ దగినశ్లోకములు.

శ్రీశైలేశదయాపాత్రం ధీభక్త్యాదిగుణార్ణవమ్।
యతీంద్రప్రవణం వందే రమ్యజామాతరం మునిమ్॥ ౧

వి॥ శ్రీశైలేశదయాపాత్రమ్, శ్రీశైలేశ=తిరువాయిమొళిప్పిళ్ళగారి యొక్క, దయా=కృపకు, పాత్రమ్=స్థానమైనట్టియు. ధీభక్త్యాదిగుణార్ణవమ్, ధీ=మోక్షజ్ఞానము, భక్తి=భగవత్కైంకర్యమునం దాదరము, ఆది=మొదలగు, గుణ=గుణములకు, అర్ణవమ్=సముద్రమైనట్టియు, యతీంద్రప్రవణమ్, యతీంద్ర=శ్రీరామానుజాచార్యులయెడ, ప్రవణమ్=నమ్రమైనట్టి, రమ్యజామాతరమ్, మునిమ్=మణవాళమహామునులను, వందే=నమస్కరించుచున్నాఁడను.

భా॥ తిరువాయిమొళిప్పిళ్ళగారి పాదపద్మముల నాశ్రయించి యమ్మహనీయుని కృపారసమును బడసి ధన్యులై సంతతమును శ్రీరామానుజాచార్యుల యెడ విధేయతగలిగి యుండు ముక్తిజ్ఞాన సేవాదిగుణసముద్రులైన మణవాళ మహామునులను నమస్కరించుచున్నాను.

లక్ష్మీనాథసమారంభాం నాథయామునమధ్యమామ్।
అస్మదాచార్యపర్యంతాం వందే గురుపరంపరామ్॥ ౨

వి॥ లక్ష్మీనాథసమారంభామ్, లక్ష్మీనాథ=లక్ష్మీదేవికి భర్తయగు శ్రీమన్నారాయణమూర్తి, సమారంభాం=ఆదియందుఁ గలది, నాథయామునమధ్య

మామ్, నాథ=నాథమునులు, యామున=యామునాచార్యులు, మధ్యమామ్=మధ్యను గలది, అస్మదాచార్యపర్యంతామ్, అస్మత్=మాయొక్క, ఆచార్య=గురువు, పర్యంతామ్=అంతమందుఁ గలదియు నగు, గురుపరంపరామ్=గురుపంక్తిని, వందే=నమస్కరించుచున్నాను.

భా॥ సమస్తకల్యాణస్వరూపురా లగులక్ష్మీదేవికి భర్తయగుశ్రీమన్నారాయణుఁడు ప్రథముఁడుగాఁగలిగి నాథముని, యామునాచార్యులు మధ్యనలంకరింప మాకు పంచసంస్కారంబులం గావించినగురువరేణ్యునివఱకు వ్యాపించియున్న యాచార్యపరంపరను భక్తితో నమస్కరించుచున్నాను.

యో నిత్య మచ్యుతపదాంబుజయుగ్మరుక్మ
వ్యామోహత స్తదితరాణి తృణాయ మేనే
అస్మద్గురో ర్భగవతో ఽస్య దయైకసింధో
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే॥ 3

వి॥ యః=ఏ రామానుజులు, నిత్యం=ఎల్లప్పుడు, అచ్యుతపదాంబుజయుగ్మరుక్మవ్యామోహతః, అచ్యుత=శ్రీమన్నారాయణునియొక్క, పదాంబుజ=పాదపద్మములయొక్క, యుగ్మ=ద్వంద్వమనెడి, రుక్మ=బంగారమందలి, వ్యామోహతః=భ్రాంతివలన, తదితరాణి, తత్=ఆనారాయణుని పాదపద్మములకంటెను, ఇతరాణి=భిన్నములైనవస్తువులను, తృణాయ=తృణముకొఱకు (గడ్డిపోఁచకనుగా నని భావము) మేనే=తలఁచెనో, అస్య=ఇట్టివాఁడు, అస్మద్గురోః, అస్మత్=మాయొక్క, గురోః=గురువు, భగవతః=పూజ్యుఁడు, దయైకసింధోః, దయా=దయారసమునకు, ఏకసింధోః=కేవలసముద్రమైనవాఁడు నగు, రామానుజస్య=రామానుజాచార్యులయొక్క, చరణౌ=పాదములను, శరణమ్=శరణముగ, ప్రపద్యే=పొందుచున్నాను.

భా॥ శ్రీమన్నారాయణునియొక్క పాదపద్మము లను సువర్ణమును బొందవలయు ననెడి పేరాసచే సమస్తజగత్తును తృణప్రాయముగాఁ దలంచినవాఁడు, మాకుఁ గులగురుండు, నిఖిలలోకులకుఁ బరమపూజ్యుండు, భక్తుల నత్యంతదయారసంబుతో మనుచువాఁడు నగు రామానుజాచార్యులయొక్క పాదములను శరణుసొచ్చుచున్నాను.

మాతా పితా యువతయ స్తనయా విభూతి
స్సర్వం య దేవ నియమేన మదన్వయానామ్

ఆద్యస్య నః కులపతే ర్వకుళాభిరామమ్
శ్రీమ త్త దంఘ్రియుగళం ప్రణమామి మూర్ధ్నా॥ ౪

వి॥ మదన్వయానామ్, మత్=నాయొక్క, అన్వయానామ్=వంశీయులకు, నియమేన=నియమముచే, యదేవ=ఏపాదద్వంద్వమే, మాతా=మాతృస్వరూప మైనది, పితా=పితృస్వరూప మైనది, యువతయః=స్త్రీస్వరూప మైనది, తనయాః=పుత్రస్వరూప మైనది, విభూతిః=ఐశ్వర్యరూప మైనదియు, సర్వం=సమస్తము, అభూత్=ఆయెనో, ఆద్యస్య=(ఆళ్వారులలో) మొదటివారు, నః=మాయొక్క, కులపతేః=కులగురువు నగు, నమ్మాళ్వారుల యొక్క వకుళాభిరామమ్, వకుళ=పొగడపువ్వువలె, అభిరామమ్=మనోహరమైన, శ్రీమత్=శోభాయుక్త మగు, తత్=ఆ, అంఘ్రియుగళము, అంఘ్రి=పాదములయొక్క, యుగళమ్=ద్వంద్వమును, మూర్ధ్నా=శిరస్సుచేత, ప్రణమామి=నమస్కరించుచున్నాను.

భా॥ మావంశమున జనించినవారెల్లరందఱుచే నియమముగ మాకు తల్లి, తండ్రి భార్యాపుత్రులు సమస్తైశ్వర్యములు, అనుభావనతో సేవింపబడినది, వకుళపుష్పమువలె మనోహరము నగుమాకులపతియగునమ్మాళ్వారుల పాదద్వంద్వమును శిరస్సుతో నమస్కరించుచున్నాను.

భూతం సరశ్చ మహదాహ్వయభట్టనాథ
శ్రీభక్తిసారకులశేఖరయోగివాహాన్।
భక్తాంఘ్రిరేణుపరకాలయతీంద్రమిశ్రాన్।
శ్రీమత్పరాంకుశమునిం ప్రణతోస్మి నిత్యమ్॥ ౫

వి॥ భూతమ్=పూతత్తాళ్వారులను, సరశ్చ=పొయ్‌గైయాళ్వారులను, మహదాహ్వయభట్టనాథశ్రీభక్తిసారకులశేఖర యోగివాహాన్, మహదాహ్వయ=పేయాళ్వారులను, భట్టనాథ=పెరియాళ్వారులను, శ్రీభక్తిసార=తిరుమళిశైప్పిరానులవారిని, కులశేఖర=కులశేఖరప్పెరుమాళ్ళను, యోగివాహాన్=తిరుప్పాణాళ్వారులను, భక్తాంఘ్రిరేణుపరకాలయతీంద్రమిశ్రాన్, భక్తాంఘ్రిరేణు=తొండరడిప్పొడియాళ్వారులను, పరకాల=తిరుమంగైయాళ్వారులను, యతీంద్రమిశ్రాన్=శ్రీభాష్యకారులవారిని, శ్రీమత్పరాంకుశమునిమ్, శ్రీమత్=శోభాయుతులైన, పరాంకుశమునిమ్=నమ్మాళ్వారులను, నిత్యం=ఎల్లప్పుడు, ప్రణతోస్మి=నమస్కరించుచున్నాను.

భా॥ సర్వజగద్వంద్యు లైనపూతత్తాళ్వారులను, పొయ్‌కైయాళ్వారులను, పేయాళ్వారులను, పెరియాళ్వారులను, తిరుమళిశైప్పిరానులవారిని, కులశేఖరప్పెరుమాళ్ళను, తిరుప్పాణాళ్వారులను, తొండరడిప్పొడియాళ్వారులను, తిరుమంగైయాళ్వారులను, శ్రీభాష్యకారులవారిని, నమ్మాళ్వారులను నే నెల్లప్పుడు నమస్కరించుచున్నాను.

శ్రీశైలపూర్ణవిషయము.

పితామహ స్యాపి పితామహాయ ప్రాచేతసా దేశ ఫలప్రదాయ।
శ్రీభాష్యకారోత్తమ దేశికాయ శ్రీశైలపూర్ణాయనమోనమస్స్యాత్ ॥౬

వి॥ పితామహస్యాపి=బ్రహ్మకును, పితామహాయ=బ్రహ్మయైనవాఁడు, ప్రాచేతసాదేశఫలప్రదాయ, ప్రాచేతస=వాల్మీకిమహర్షియొక్క, ఆదేశ=ఆజ్ఞారూప మైనశ్రీమద్రామాయణముయొక్క, ఫల=ఫలస్వరూప మగు సాంప్రదాయార్థజ్ఞానమును, ప్రదాయ=ఇచ్చునట్టివాఁడు, శ్రీభాష్యకారోత్తమదేశికాయ, శ్రీభాష్యకార=శ్రీభాష్యమునురచించిన రామానుజాచార్యులకు, ఉత్తమదేశికాయ=పూజ్యు లైనగురువులునగు, శ్రీశైలపూర్ణాయ=తిరువాయిమొళిప్పిళ్ళగారికొఱకు,నమః=నమస్కారము, స్యాత్=అగుఁగాక !; నమః=నమస్కారము, స్యాత్=అగుఁగాక!

(నమోనమః, యని యాదరమువలన రెండుసారులు చెప్పఁబడినది.)

భా॥ సమస్తవిద్యలయందుఁ బరిపూర్ణు లై బ్రహ్మకుబ్రహ్మ యనికొనియాడఁబడుచు స్మరించినంతమాత్రమున శ్రీమద్రామాయణముయొక్క సాంప్రదాయార్థసారముఁ గరతలామలక మగునట్లుగావించుమహనీయులు రామానుజాచార్యులకు శ్రీమద్రామాయణాదిగ్రంథముల బోధించినగురుశ్రేష్ఠులు నగుశ్రీశైలపూర్ణులకు నమస్కరించుచున్నాను.

విష్వక్సేనధ్యానము.

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్।
ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వవిఘ్నోపశాంతయే ౭

వి॥ శుక్లాంబరధరమ్, శుక్ల=తెల్లని, అంబర=వస్త్రములను, ధరమ్=ధరించువాఁడు, విష్ణుమ్=ప్రపంచము నంతను వ్యాపించి యున్నవాఁడు, శశివర్ణమ్, శశి=చంద్రునియొక్క, వర్ణమ్=కాంతివంటికాంతిగలవాఁడు, చతుర్భుజమ్=నాలుగుభుజములుగలవాఁడు, ప్రసన్నవదనమ్, ప్రసన్న=భక్తులనుగ్రహించు

టకుఁ దగినదయారసముతో నొప్పుచున్న, వదనమ్=ముఖముగలవాఁడు నగు విష్వక్సేనుని, సర్వవిఘ్నోపశాంతయే, సర్వ=సమస్తములైన, విఘ్న=కార్య భంగములయొక్క, ఉపశాంతయే=నివారించుటకొఱకు, ధ్యాయేత్=ధ్యానింప వలయు.

భా॥ ధవళవస్త్రములను ధరించినవాఁడు సమస్తలోకముల వ్యాపించి యున్నవాఁడు శరత్కాలచంద్రునితో సమానమగుకాంతిగలవాఁడు నాల్గు భుజములతో నొప్పువాఁడుఁ బరమకారుణికుఁడు నగు విష్వక్సేనునిసంకల్పించిన సకలకార్యములఁ గొనసాగించుటకు హృదయమున నిశ్చలభక్తితో నుపాసింప వలయును.

యస్య ద్విరదవక్త్రాద్యాః పారిషద్యాః పరశ్శతమ్।
విఘ్నం నిఘ్నంతి సతతం విష్వక్సేనం త మాశ్రయే॥ ౮

వి॥ యస్య=ఏవిష్వక్సేనునియొక్క, పారిషద్యాః=సభ్యులగు, ద్విరద వక్త్రాద్యాః, గజాననుఁడు మొదలగువారు, పరశ్శతం=శతసంఖ్యాతీతమగు, విఘ్నం=అంతరాయమును, నిఘ్నంతి=కొట్టుచున్నారో, తం=అట్టి, విష్వక్సేనమ్= అంతట నప్రతిహత మగుసైన్యముగలవిష్వక్సేనుఁ డనువిష్ణుసేనాపతిని, ఆశ్రయే=సేవించుచున్నాను,

భా॥ విష్ణుసేనాధిపతి యగునేవిష్వక్సేనునకు సభాసదులై వినాయక ప్రభృతులు భక్తులయొక్క కార్యములను నిర్విఘ్నముగాఁ గొనసాగింతురో అట్టి మహాపూజ్యుం డగువిష్వక్సేను నారాధించుచున్నాను.

హయగ్రీవధ్యానము.

జ్ఞానానందమయం దేవం నిర్మలస్ఫటికాకృతిమ్।
ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవ ముపాస్మహే॥ ౯

వి॥ జ్ఞానానందమయం, జ్ఞాన=జ్ఞానస్వరూపుండు, ఆనందమయం= ఆనందస్వరూపుండు, నిర్మలస్ఫటికాకృతిం, నిర్మల=స్వచ్ఛమైన, స్ఫటిక=స్ఫటిక మాణిక్యమువంటి, ఆకృతిం=ఆకారముగలవాఁడు, సర్వవిద్యానాం=సమస్త విద్యలకు, ఆధారం=అవలంబనమైనవాఁడు, హయగ్రీవం=హయగ్రీవావతారుఁడు నగు, దేవం=దేవుని, ఉపాస్మహే=సేవించుచున్నాము.

భా॥ జ్ఞానానందస్వరూపుం డై స్వచ్ఛ మగుస్ఫటికమాణిక్యమువంటి దేహచ్ఛాయతో నొప్పుచుఁ జతుర్దశవిద్యలకు మూలబీజమై వెలయు హయగ్రీవుఁడను దేవు నారాధించెదము.

అభంగురకలాదానస్థూలలక్షత్వ మీాయుషే।
తుంగాయ మహసేతస్మై తురంగాయ ముఖే నమః॥ ౧౦

వి॥ అభంగురకలాదానస్థూలలక్షత్వం, అభంగుర=స్థిరతరములైన, కలా=విద్యలయొక్క, దాన=ఇచ్చుటయందు, స్థూలలక్షత్వం=మహాదాతృత్వమును, ఈయుషే=పొందినట్టియు, తుంగాయ=ఉన్నతమైనట్టియు, ముఖే=ముఖమునందు, తురంగాయ=అశ్వమైనట్టియు, తస్మై=ఆ, మహసే=తేజస్సుకొఱకు, నమః=నమస్కారము, అస్తు=అగుంగాక!

భా॥ శాశ్వతము లైనసమస్తవిద్యల నిచ్చు మహాదాతయు హయగ్రీవాఖ్యదానం బు నగు తేజస్సునకు నమస్కరించు చున్నాండను.

వాల్మీకిధ్యానము.

కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్।
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్॥ ౧౧

వి॥ కవితాశాఖాం=చెట్టుకొమ్మవంటికవిత్వమును, ఆరుహ్య=అధిష్ఠించి, రామరామేతి=రామరామ యను, మధురాక్షరమ్, మధుర=హృదయానందకరము లైన, అక్షరం=వర్ణములుగల, (పదమ్=)పదమును, మధురమ్=మనోహరముగా, కూజంతం=గానముచేయు చున్న, వాల్మీకికోకిలమ్=కోకిలవంటి వాల్మీకిమహర్షిని, వందే=నమస్కరించుచున్నాను.

భా॥ వసంతకాలమున వృక్షశాఖనధిష్ఠించి వీనులకు విం దొనంగునట్లు పంచమస్వరమున గానముసేయుకోయిలచందంబునం గవితాప్రతిభాశాలియై సులలితవర్ణభూయిష్ఠం బగు 'రామరామ, యనుపదమును దాపసవిద్వత్ప్రముఖసకలప్రాణులకు శ్రోత్రపేయం బగునట్లు గానముచేయు చున్న వాల్మీకిమహర్షిని నమస్కరించుచున్నాను.

వాల్మీకే ర్మునిసింహస్య కవితావనచారిణః।
శృణ్వన్ రామకథానాదం కో న యాతి పరాం గతిమ్॥ ౧౨

వి॥ కవితావనచారిణః॥ అరణ్యమువంటికవిత్వమునసంచరించుచున్న, వాల్మీకేః=వాల్మీకియను, మునిసింహస్య=మునిశ్రేష్ఠునియొక్క, (సింహముయొక్క యనియు) రామకథానాదమ్, రామ=శ్రీరామచంద్రునియొక్క. కథానాదమ్=కథయొక్కధ్వనిని, (గర్జితము ననియు) శృణ్వన్=వినుచున్న, కః=

ఎవ్వఁడు, పరామ్=ఉత్కృష్టమైన, (అధికమైనదనియు) గతిమ్=గతిని, (పాటిపోవుట యనియు) నయాతి=పొందఁడు ?

భా॥ మహారణ్యమున సంచరించుసింహముయొక్క కంఠధ్వని నాలకించి మృగంబులెల్లఁ బరుగిడుపగిదిఁగవికులమూర్ధన్యుఁడగువాల్మీకిమహర్షి చే రచింపఁబడినరామచరిత్రము నాకర్ణించిన వారెల్లమోక్షమునొందుదురు !

యః పిబన్ సతతం రామచరితామృతసాగరమ్।
అతృప్తస్తం మునిం వందే ప్రాచేతస మకల్మషమ్॥ ౧౩

వి॥ యః=ఎవఁడు, రామచరితామృతసాగరమ్, రామ=శ్రీరామునియొక్క, చరిత=సత్కథయనెడి, అమృతసాగరమ్=సుధాసముద్రమును, సతతం=ఎల్లప్పుడు, పిబన్=క్రోలుచున్నవాఁడై, అతృప్తః=తృప్తినొందనివాఁడు (భవతి=అగుచున్నాఁడో) తం=అట్టి, అకల్మషం=పాపరహితుఁడు, ప్రాచేతసమ్=వరుణసంతతిలోనివాఁ డనగు, మునిమ్=వాల్మీకిమహర్షిని, వందే=నమస్కరించుచున్నాను.

భా॥ శ్రీరామచంద్రచరిత్రరూప మగు నమృతమునెల్లప్పుడుఁ గ్రోలుచుండియుఁ దనివినొందనివాఁ డగుపాపరహితుం డైనవాల్మీకిమహర్షినిగూర్చి నమస్కరించుచున్నాను.

ఆంజనేయప్రార్థన

గోష్పదీకృతవారాశిం మశకీకృతరాక్షసమ్।
రామాయణమహామాలారత్నం వందే ఽనిలాత్మజమ్॥ ౧౪

వి॥గోష్పదీకృతవారాశిమ్, గోష్పదీకృత=ఆవుయొక్క అడుగుగాఁ జేయఁబడిన, వారాశిమ్=సముద్రముగలవాఁడు, మశకీకృతరాక్షసమ్, మశకీకృత=దోమలుగాఁ జేయఁబడిన, రాక్షసం=రాక్షసులుగలవాఁడు, రామాయణమహామాలారత్నమ్, రామాయణ=రామాయణమను, మహామాలా=గొప్పదైనహారమునకు, రత్నం=నాయకమణియునగు, అనిలాత్మజమ్=వాయుపుత్రుఁడైనయాంజనేయుని, వందే=నమస్కరించుచున్నాను.

భా॥ సముద్రమును గోష్పదమును బోలె దాటి రాక్షసులను దోమలభంగి సంహరించి రామాయణమహాప్రబంధమను నన్ఘహారమునకు నాయకమణి యైవిలసిల్లుహనుమంతునకు నమస్కరించుచున్నాను.

అంజనానందనం వీరం జానకీశోకనాశనమ్।
కపీశ మక్షహంతారం వందే లంకాభయంకరమ్॥ ౧౫

వి॥ వీరమ్=పరాక్రమశాలి, జానకీశోకనాశనమ్, జానకీ=సీతాదేవియొక్క, శోక=విచారమును, నాశనమ్=పోఁగొట్టినవాఁడు, కపీశమ్=వానరశ్రేష్ఠుఁడు, అక్షహంతారం, అక్ష=అక్షుఁడనురావణపుత్రుని, హంతారమ్=పరిమార్చిన వాఁడు, లంకాభయంకరం, లంకా=లంకానగరవాసులగురాక్షసులకు, భయంకరమ్=భయముఁ గలిగించినవాఁడు, అంజనానందనం, అంజనా=అంజనాదేవియొక్క, నందనం=కుమారుఁడు నగుహనుమంతుని, వందే=నమస్కరించుచున్నాను.

భా॥ శూరాగ్రేసరుఁడై శ్రీరామకుశలవార్త సీతాదేవి కెఱిఁగించి వానరులలో మిగులఁ బూజనీయుండై యక్షకుమారుని సంహరించి లంకానగరమున నివసించురాక్షసులకు విశేషభయముఁ గల్గించిన యంజనాగర్భసంభూతుఁడగుహనుమంతునకు మ్రొక్కుచున్నాను.

ఆమిషీకృతమార్తాండం గోష్పదీకృతసాగరమ్।
తృణీకృతదశగ్రీవ మాంజనేయం నమామ్యహమ్॥ ౧౬

వి॥ ఆమిషీకృతమార్తాండమ్, ఆమిషీకృత= మాంసముగాఁ జేయఁబడిన, మార్తాండమ్, సూర్యుఁడు గలవాఁడు, గోష్పదీకృతసాగరమ్, గోష్పదీకృత= ఆవుయొక్క యడుగుగాఁ జేయఁబడిన, సాగరమ్=సముద్రముగలవాఁడు, తృణీకృతదశగ్రీవమ్, తృణీకృత=తృణముగాఁ జేయఁబడిన, దశగ్రీవమ్=రావణాసురుఁడు గలవాఁడు, ఆంజనేయమ్=అంజనాదేవియొక్క కుమారుఁడు నగుహనుమంతుని, వందే=నమస్కరించుచున్నాను.

భా॥ బాల్యమున సూర్యబింబమును మాంసపుముద్దగాఁదలంచి మ్రింగఁబోయినవాఁడు సముద్రమును గోష్పాదపరిమితప్రదేశంబుం బోలె దాటి రావణాసురుని దృణప్రాయునిగా నెంచినవాఁడు నగునాంజనేయునకు నమస్కరించుచున్నాను.

మనోజవం మారుతితుల్యవేగం జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్।
వాతాత్మజం వానరయూథముఖ్యం శ్రీరామదూతం శిరసానమామి॥ ౧౭

వి॥ మనోజవమ్, మనః=మనస్సుయొక్క జవమ్=వేగమువంటివేగముగలవాఁడు, మారుతతుల్యవేగమ్, మారుత=వాయువుతో, తుల్య=సమానమైన వేగమ్=వడిగలవాఁడు, జితేంద్రియం, జిత=జయింపఁబడిన, ఇంద్రియమ్=ఇంద్రియములుగలవాఁడు, బుద్ధిమతామ్=ప్రజ్ఞావంతులలో, వరిష్ఠమ్=శ్రేష్ఠుఁడు, వాతాత్మజమ్=వాయుపుత్రుఁడు, వానరయూథముఖ్యమ్, వానరయూథ=కపిసంఘము

లలో, ముఖ్యమ్=మొదటివాఁడు, శ్రీరామదూతమ్, శ్రీరామ=శ్రీరాముని యొక్క, దూతమ్=వార్తాహరుఁడు నగుహనుమంతుని, శిరసా=శిరస్సుచేత, నమామి=నమస్కరించుచున్నాను.

భా॥ మనంబునవలెఁ ద్వరగలవాఁడు వాయువువలె వడిగలగతివిశేషము గలవాఁడు నింద్రియసంఘము నెల్ల వశపరచుకొనినవాఁడు విశేషమేధాసంపన్నుఁడు వానరవీరులలోఁ బ్రథముఁడు సీతారాములకుఁ గుశలవార్త లెఱిఁగించినఁవాడు నగుహనుమంతునకు నమస్కరించుచున్నాను.

ఉల్లంఘ్య సింధోః సలిలం సలీలం యశ్శోకవహ్నిం జనకాత్మజాయాః।
ఆదాయ తేనైవ దదాహ లంకాం నమామి తం ప్రాంజలిరాంజనేయమ్॥ ౧౭

వి॥ యః=ఎవఁడు, సింధోః=సముద్రునియొక్క, సలిలమ్=ఉదకమును, సలీలం=విలాసముతోఁగూడినట్లుగా, ఉల్లంఘ్య=దాటి, జనకాత్మజాయాః=సీతాదేవియొక్క, శోకవహ్నిమ్, శోక=విచారమనెడి, వహ్నిమ్=అగ్నిహోత్రమును, ఆదాయ=గ్రహించి, తేనైవ=ఆయగ్నిహోత్రముచేతనే, లంకాం=లంకానగరమును, దదాహ=దహించెనో, తం=అట్టి, ఆంజనేయం=అంజనాపుత్రుని, అహం=నేను, ప్రాంజలిః=దోసిలియొగ్గినవాఁడనై, నమామి=నమస్కరించుచున్నాను.

భా॥ శతయోజనపరిమిత మగుదక్షిణసముద్రమును సులీలగా దాఁటి శ్రీరాముని క్షేమవార్తను సీతాదేవి కెఱిఁగించి యామె పుణ్యమతల్లియొక్క హృదయమునఁ బ్రజ్వరిల్లుచున్నదశిఖానలమును బాపి ఆయ్యనలంబుచేతనుంబోలె లంకానగరమునంతను క్షణమాత్రమున దహించి జగత్ప్రఖ్యాతిఁ గాంచిన హనుమంతునకు దోసిలియొగ్గి నమస్కరించెదను.

ఆంజనేయ మతిపాటలాననం। కాంచనాద్రి కమనీయవిగ్రహం।
పారిజాతతరుమూలవాసినం। భావయామి పవమాననందనమ్॥ ౧౮

వి॥ ఆంజనేయం=అంజనాదేవియొక్క కుమారుఁడు, అతిపాటలాననం, అతిపాటల=మిగుల నెఱ్ఱనగు, ఆననం=మొగముగలవాఁడు, కాంచనాద్రికమనీయవిగ్రహం, కాంచనాద్రి=మేరుపర్వతమువలె, కమనీయ=సుందరమైన, విగ్రహం=శరీరముగలవాఁడు, పారిజాతతరుమూలవాసినం, పారిజాతతరు=

పారిజాతవృక్షముయొక్క, మూల=మొదటను, వాసినం=నివసించుచున్న వాఁడు నగు, పవమాననందనం=ఆంజనేయుని, భావయామి=స్మరించుచున్నాను.

భా॥ మిక్కిలి యొప్పు నగుముఖము మేరుపర్వతమువలె నున్నతముఁ దేజోవంతము నగుశరీరము గలవాఁడై పారిజాతవృక్షముక్రిందఁ గూరుచుండి తపం బొనర్చుచున్న హనుమంతుని ధ్యానించుచున్నాను.

యత్రయత్ర రఘునాథకీర్తనం తత్రతత్ర కృతమస్తకాంజలిం।
బాష్పవారిపరిపూర్ణలోచనం మారుతిం నమత రాక్షసాంతకమ్॥ ౨౦

వి॥ యత్రయత్ర=ఎచ్చటెచ్చట, రఘునాథకీర్తనమ్, రఘునాథ=శ్రీరామునియొక్క, కీర్తనం=కథాగానము, (భవతి) అగుచున్నదో, తత్రతత్ర=అచ్చటచ్చట, కృతమస్తకాంజలిం, కృత=చేయఁబడిన, మస్తకాంజలిం, మస్తక=శిరస్సునందలి, అంజలిం=దోసిలిగలవాఁడు, బాష్పవారిపరిపూర్ణలోచనం, బాష్పవారి=ఆనందబాష్పములచేత, పరిపూర్ణ=నిండింపఁబడిన, లోచనం=నేత్రములుగలవాఁడు, రాక్షసాంతకం, రాక్షస=రాక్షసులకు=, అంతకం=మారకుఁడు నగు, మారుతిం=వాయుపుత్రుని, నమత=మ్రొక్కుఁడు.

భా॥ రఘుకులసంజాతులలో నుత్తముఁడగు శ్రీరామచంద్రునియొక్క సత్కథాగానము చేయఁబడుచుండు తావులందెల్ల శిరంబున దోసిలియిడికొని యానందాశ్రుకణములచే నిండింపఁబడినకన్నులుగలవాఁడై యుండు రాక్షసమర్దనుఁడగుహనుమంతుని నమస్కరింపుఁడు!

శ్రీరామాయణప్రార్థన.

వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే। ౨౧
వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా॥

వి॥ వేదవేద్యే, వేద=చతుర్వేదములచే, వేద్యే=తెలిసికొనఁదగిన, పరే=పరుండైన, పుంసి=పురుషుఁడు (పరమపురుషుం డనుట) దశరథాత్మజే, దశరథ=దశరథమహారాజునకు, ఆత్మజే=కుమారుఁడై, జాతే=పుట్టఁగా, వేదః=వేదము, ప్రాచేతసాత్=వాల్మీకిమహర్షివలన, సాక్షాత్=కేవలము, రామాయణాత్మనా=రామాయణస్వరూపముతో, ఆసీత్=ప్రాదుర్భవించెను.

భా॥ వేదముచే నెఱుంగఁబడుచున్న పరబ్రహ్మము దుష్టశిక్షణశిష్టపరిపాలనార్థము మర్త్యలోకంబున దశరథమహీకాంతునకుఁ గొమరుండై యుదయింప సాక్షాద్వేదము వాల్మీకిమునిపుంగవునివలన రామాయణస్వరూపమున బయలువెడలెను.

చరితం రఘునాథస్య శతకోటిప్రవిస్తరమ్।
ఏకైక మక్షరం ప్రోక్తం మహాపాతకనాశనమ్॥ ౨౨

వి॥ రఘునాథస్య=రఘువంశీయులలో శ్రేష్ఠుఁడైన శ్రీరామచంద్రుని యొక్క, చరితం=చరిత్రము, శతకోటిప్రవిస్తరమ్, శతకోటి=నూఱుకోట్లసంఖ్య చేత, ప్రవిస్తరమ్=వ్యాపించినది, (భవతి)=అగుచున్నది. తస్మిన్=ఆచరిత్రము నందు, ఏకైకం=ఒక్కొకటియగు, అక్షరం=అక్షరము, మహాపాతకనాశనమ్, మహాపాతక=బ్రహ్మహత్యాది పాపములను, నాశనమ్=నశింపఁ జేయునదిగా, ప్రోక్తం=చెప్పఁబడినది.

భా॥ శతకోటిసంఖ్యగల శ్లోకములచే నొప్పుచున్న శ్రీమద్రామాయణమందలి యొక్కొక్కవర్ణంబు సమస్తమహాపాపములఁ బోఁగొట్టు నని చెప్పఁబడినది.

శృణ్వన్ రామాయణం భక్త్యా యః పాదం పదమేవ వా।
స యాతి బ్రహ్మణ స్థానం బ్రహ్మణా పూజ్యతే సదా॥ ౨౩

వి॥ యః=ఎవ్వఁడు, భక్త్యా=భక్తిచేత, రామాయణం=శ్రీమద్రామాయణమును, పాదం=పాదమాత్రమును గాని, పదమేవ వా=పదమాత్రముం గాని, శృణ్వన్=వినుచున్నవాఁడు, (భవతి)=అగుచున్నాఁడో, సః=ఆపురుషుఁడు. బ్రహ్మణః=బ్రహ్మయొక్క, స్థానం=స్థానమును గూర్చి, యాతి=వెళ్ళుచున్నాఁడు, సదా=ఎల్లప్పుడు, బ్రహ్మణా=బ్రహ్మదేవునిచే, పూజ్యతే=పూజింపఁబడుచున్నాఁడు,

భా॥ శ్రీరామచంద్రచరితానువర్ణనాత్మక మగు శ్రీమద్రామాయణము నందలి శ్లోకముయొక్క పాదమాత్రమును గాని పదమాత్రమును గాని నియమముతో నాకర్ణించినమనుజుండు బ్రహ్మలోకమున కేగి యచట బ్రహ్మచేఁ బూజింపఁబడుచుండును.

వాల్మీకిగిరిసంభూతా రామసాగరగామినీ।
పునాతి భువనం పుణ్యా రామాయణమహానదీ॥ ౨౩

వి॥ వాల్మీకిగిరిసంభూతా, వాల్మీకి=వాల్మీకిమహర్షి యను, గిరి=పర్వతము నుండి, సంభూతా=పుట్టినది, రామసాగరగామినీ, రామ=శ్రీరాముఁ డను, సాగర=సముద్రమును, గామినీ=పొందినది, పుణ్యా=పవిత్రమైనదియు నగు, రామాయణమహానదీ, రామాయణ=శ్రీమద్రామాయణ మను, మహానదీ,

మహాత్=గొప్పదియగు, నదీ=నది, భువనం=లోకమును, పునాతి=పవిత్రింపఁ జేయుచున్నది.

భా॥ హిమాలయమున జనించి సముద్రమునఁ బ్రవేశించుచున్న పూజ్యమైనగంగానది జగంబుల నిష్కల్మషంబులం జేయునట్లు మునిమూర్ధన్యుఁడగువాల్మీకియొక్క ముఖాంబుజంబునుండి బయలువెడలి శ్రీరామచంద్రపరబ్రహ్మమును బ్రతిపాదించుచున్న శ్రీమద్రామాయణము లోకములఁ బావనములఁగాఁ జేయుచున్నది.

శ్లోకసారసమాకీర్ణం సర్గకల్లోలసంకులమ్।
కాండగ్రాహమహామీనం వందే రామాయణార్ణవమ్॥ ౨౪

వి॥ శ్లోకసారసమాకీర్ణమ్, శ్లోక=పద్యము లనెడి, సార=జలముచే, సమాకీర్ణమ్=వ్యాప్తమైనది, సర్గకల్లోలసంకులం, సర్గ=సర్గములనెడి, కల్లోల=తరంగములచే, సంకులం=కలఁతినశినది, కాండగ్రాహమహామీనం, కాండ=కాండములనెడి, గ్రాహ=మొసళ్ళు, మహామీనం=గొప్పమత్స్యములుఁగలదియునగు, రామాయణార్ణవం, రామాయణ=రామాయణమను అర్ణవం=సముద్రమును, వందే=నమస్కరించుచున్నాను.

భా॥ విశేషజలతరంగములచే నాకులిత మగుచు గొప్పమొసళ్ళతోఁ దిమితిమింగిలాదిమహామత్స్యంబులతోఁ గూడినసముద్రంబు చందంబున నిరువదినాలుగువేల శ్లోకములతోడ నైదువందలసర్గములతోడ నేడు కాండములతోడఁ నొప్పుచున్న శ్రీమద్రామాయణమునకు మ్రొక్కుచున్నాను.

యః కర్ణాంజలిసంపుటై రహరహ స్సమ్య క్పిబ త్యాదరా
ద్వాల్మీకే ర్వదనారవిందగళితం రామాయణాఖ్యం మధు॥
జన్మవ్యాధిజరావిపత్తిమరణై రత్యంతసోపద్రవం। ౨౫
సంసారం స విహాయ గచ్ఛతి పుమాన్ విష్ణోః పదం శాశ్వతమ్॥

వి॥ యః=ఏజనుఁడు, కర్ణాంజలిసంపుటైః, కర్ణ=చెవులనెడి, అంజలిసంపుటైః=దొప్పలవంటిదోసిళ్ళచేత, అహరహః=ప్రతిదినము, వాల్మీకేః=వాల్మీకిమహర్షియొక్క, వదనారవిందగళితం, వదన=మొగమనెడు, అరవింద=పద్మము వలన, గళితమ్=జారిన, రామాయణాఖ్యం=రామాయణ మను పేరుగల, మధు=మకరందమును, ఆదరాత్=ప్రీతివలన, సమ్యక్=లెస్సగా, పిబతి=గ్రోలు

చున్నాఁడో, సః=ఆ, ప్రమాన్=జనుఁడు, జన్మవ్యాధిజరావిపత్తిమరణైః, జన్మ=పుట్టుకచేత, వ్యాధి=రోగముచేత, జరా=ముసలితనముచేత. విపత్తి=ఆపదచేత, మరణైః=మృతిచేత, అత్యంతసోపద్రవం, అత్యంత=మిక్కిలి, సోపద్రవం=ఉపద్రవముతోఁ గూడిన, సంసారం=సంసారమును, విహాయ=విడిచి, విష్ణోః=విష్ణుమూర్తియొక్క, శాశ్వతం=పునరావృత్తిరహితమైన, పదం=స్థానమును, (అనఁగా వైకుంఠమును) గచ్ఛతి=పొందుచున్నాఁడు.

భా॥ వాల్మీకిమహామునిచే లోకోపకారార్థము రచింపఁబడిన శ్రీమద్రామాయణమునందలి సత్కథను సాదరబుద్ధితోఁ బ్రతిదినము శ్రద్ధగా వినుచుండువారు జననమరణాదిపరివాహాత్మక మగు సంసారమును విడనాడి శాశ్వతానందయుత మగు విష్ణుసాయుజ్యము నందుదురు.

తదుపగతసమాససంధియోగం। సమమధురోపనతార్థవాక్యబద్ధమ్।
రఘువరచరితం మునిప్రణీతం। దశశిరసశ్చ వధం నిశామయధ్వమ్॥ ౧౮

వి॥ ఉపగతసమాససంధియోగమ్, ఉపగత=పొందఁబడిన, సమాస=సమాసములు, సంధి=సంహితలు, యోగ=శబ్దవ్యుత్పత్తులు గలది, సమమధురోపనతార్థవాక్యబద్ధం, సమ=సమములు, మధుర=హృద్యములు, ఉపనత=పొందఁబడిన, అర్థ=అర్థములు గలవియు నగు, వాక్య=వాక్యములచేత, బద్ధమ్=రచింపఁబడినది, రఘువరచరితం, రఘువర=రఘువంశశ్రేష్ఠుఁడైన శ్రీరాముని యొక్క, చరితం=చరిత్రమును, దశశిరసః=రావణాసురునియొక్క, వధంచ=సంహరించుటను (ఉద్దేశించి,) మునిప్రణీతం, ముని=వాల్మీకిమహర్షిచే, ప్రణీతం=రచింపఁబడినదియు నగు, తత్=ఆశ్రీమద్రామాయణమును, నిశామయధ్వం=చూడుఁడు !

భా॥ శాస్త్రసిద్ధములైనసమాసములు సంధులు శబ్దవ్యుత్పత్తులుం గలిగి యెక్కువతక్కువలులేక తులఁదూచినట్లు మధురములు సమంజసార్థములు నగు వాక్యములచేఁ గూర్పఁబడి శ్రీరామునిచరిత్రమును రావణవధను గూర్చి వాల్మీకిమహర్షిచే రచింపఁబడిన శ్రీమద్రామాయణమును సావధానులై యాకర్ణింపుఁడు !

శ్రీరామప్రార్థన,

శ్రీరాఘవం దశరథాత్మజ మప్రమేయం సీతాపతిం
రఘుకులాన్వయరత్నదీపం। ఆజానుబాహు
మరవిందదళాయతాక్షం రామం నిశాచరవినాశకరం నమామి॥ ౧౯

వి॥ శ్రీరాఘవం=శోభాయుక్తమగు రఘువంశమునం దవతరించినవాఁడు, దశరథాత్మజం, దశరథ=దశరథమహారాజునకు, ఆత్మజం=కుమారుండు. అప్రమేయం=బుద్ధిచే నిశ్చయింపశక్యముగాని స్వరూపముగలవాఁడు, సీతాపతిం, సీతా=సీతాదేవికి, పతిమ్=నాయకుండు, రఘుకులాన్వయరత్నదీపమ్, రఘుకుల=రఘువంశమునందుఁ బుట్టినరాజులయొక్క, అన్వయ=వంశమునకు (రఘువంశమున కనుట) రత్నదీపం=మాణిక్యదీపమైనవాఁడు, ఆజానుబాహుం, ఆజాను=మోకాళ్ళవఱకు వ్రేలుచున్న, బాహుం=బాహువులుగలవాఁడు, అరవిందదళాయతాక్షుం, అరవింద=పద్మముయొక్క. దళ=ఱేకులవంటి, ఆయత=పొడవులైన, అక్షుం=నేత్రములుగలవాఁడు, నిశాచరవినాశకరం, నిశాచర=రాక్షసులయొక్క, వినాశ=సంహారమును, కరం=చేసినవాఁడు అగు, రామం=శ్రీరాముని, నమామి=నమస్కరించుచున్నాను

భా॥ రఘువంశమున దశరథమహారాజునకుఁ గుమారుఁడై యవతరించినవాఁడు, వాక్కులకు గోచరముగాని మహిమాతిశయముగలవాఁడు సూర్యవంశమును బ్రకాశింపఁజేసినవాఁడు దీర్ఘము లగు బాహువులుగలవాఁడు నాకర్ణాంతవిశాలము లగునేత్రములుగలవాఁడు దుష్టసంహారకుడు సీతాపతియునగు శ్రీరామునకు నమస్కారముచేయుచున్నాను.

వైదేహీసహితం సురద్రుమతలే హైమే మహామండపే।
మధ్యేపుష్పక మాసనే మణిమయే వీరాసనే సుస్థితమ్।
అగ్రే వాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరమ్।
వ్యాఖ్యాంతం భరతాదిభిః పరివృతం రామం భజే శ్యామలమ్॥ ౨౮

వి॥ వైదేహీసహితం, వైదేహీ=సీతాదేవితో, సహితం=కూడికొనినవాఁడు, సురద్రుమతలే, సురద్రుమ=కల్పవృక్షముయొక్క, తలే=నీడను, హైమే=స్వర్ణవికారమైన, మహామండపే, మహాత్=విశాలమైన, మండపే=మంటపమందు, మధ్యేపుష్పకం= పుష్పకవిమానముయొక్క మధ్యను, మణిమయే=మాణిక్యప్రచురమైన, వీరాసనే=వీరాసన మనుయోగాసనంబున, సుస్థితం=సుఖముగాఁ గూర్చుచున్నవాఁడు, అగ్రే=ఎదుట, ప్రభంజనసుతే, ప్రభంజన=వాయువుయొక్క, సుతే=కుమారుఁడైన, హనుమంతుడు, వాచయతి=చదువుచుండ, మునిభ్యః=మునులకొఱకు, పరం=ఉత్కృష్టమైన, తత్త్వం=పరబ్రహ్మమునుగూర్చి, వ్యాఖ్యాంతం=విస్తరించి చెప్పుచున్నవాఁడు, భరతాదిభిః=భర

తోఁడుమున్నగువారితో, పరివృతం=పరివేష్టింపఁబడినవాఁడు, శ్యామలం=నల్లనివాఁడు, నగు రామం=శ్రీరాముని, భజే=సేవించుచున్నాను.

భా॥ పరమపవిత్రమగువిదేహవంశమున నుదయించిన సీతామహాదేవితోఁ గూడికొని కల్పవృక్షచ్ఛాయను సువర్ణమండపమునఁ బుష్పకవిమానమునుంచి యావిమానముయొక్క మధ్యను రత్నస్థగిత మగుసింహాసనముపై వీరాసనోపేతుఁడై నిశ్చలచిత్తముతోఁ, గూరుచుండి యాంజనేయుఁ డెదుట నుండి చదువుచుండ సమస్తమహర్షులకుఁ బరతత్త్వమును విస్తరించి బోధించుచున్నవాఁడై తమ్ములగుభరతాదులచేఁ బరివేష్టింపఁబడిన మేఘశ్యామల మూర్తియగుశ్రీరాముని సేవించుచున్నాను.

పిమ్మట 'ధర్మాత్మా సత్యసంధశ్చ' యనుశ్లోకంబును 'తపస్స్వాధ్యాయనిరతమ్' అనుశ్లోకమును బఠించి, శ్రీరఘునందనపరబ్రహ్మణే నమః, యని నుడివి పారాయణ మారంభింపవలయును.

పారాయణమును ముగించునప్పుడు శ్రీవైష్ణవులచేఁ జదువఁదగిన శ్లోకములు.

ఏవమేతత్పురా వృత్త మాఖ్యానం భద్ర మస్తు వః।
ప్రవ్యాహరత విస్రబ్ధం బలం విష్ణోః ప్రవర్ధతామ్॥ ౨౯

వి॥ ఏవం=ఇట్లు, ఆఖ్యానం=ఆఖ్యాయికారూప మైన, ఏతత్=ఈరామాయణము, పురా=పూర్వమందు, వృత్తం=జరిగినది, (ఆసీత్=ఆయెను) వః=మీకొఱకు, భద్రం=శుభము, అస్తు=అగుఁగాక! విస్రబ్ధం=ఎడఁదెగకుండునట్లు, ప్రవ్యాహరత=చెప్పుఁడు. విష్ణోః=విష్ణుమూర్తియొక్క, బలం=సత్త్వము, ప్రవర్ధతాం=వర్ధిల్లుఁగాక!

భా॥ ఇప్పుడు నాచేఁ జెప్పఁబడినయీరామాయణాఖ్యానము పూర్వము త్రేతాయుగాంతమున జరిగెను. దీనిఁ జదువుటవలన వినుటవలనను మీకు సమస్తశుభంబులు సమకూరుం గావున విడువక యీకావ్యము నెల్లప్పుడుఁ జెప్పికొనుచుండుఁడు. మీకు శ్రీవైకుంఠనాయకునియొక్క యనుగ్రహము సిద్ధించు.

లాభస్తేషాం జయస్తేషాం కుతస్తేషాం పరాభవః।
యేషా మిందీవరశ్యామో హృదయే సుప్రతిష్ఠితః॥ ౩౦

వి॥ యేషాం=ఎవరియొక్క, హృదయే=హృదయమందు, ఇందీవరశ్యామః ఇందీవర=నల్లగలువవలె, శ్యామః=నల్లనగు దేహకాంతి గలశ్రీరాముఁడు,

నుప్రతిష్ఠితః=స్థిరము చేసికొనఁబడెనో, తేషాం=వారలకు, లాభః=సకల శ్రేయము, (భవతి)అగుచున్నది. జయః=జయము, తేషాం=వారికి (భవతి)అగుచున్నది, తేషాం=వారికి, పరాభవః=తిరస్కారము, కుతః=ఎట్లు, (భవతి) అగుచున్నది.

భా॥ నీలోత్పలమువంటి నల్లని దేహము గల శ్రీరాముని హృదయమున నిలిపి ధ్యానించువారలకు సర్వశ్రేయస్సులు గలుగును; ఎన్నఁడు వారు పరాభవ మెఱుఁగక సకలకార్యములందు విజయము గలిగి మిగుల సుకీర్తితో విలసిల్లుదురు.

కాలే వర్షతు పర్జన్యః పృథివీ సస్యశాలినీ।
దేశోయం క్షోభరహితో బ్రాహ్మణాస్సంతు నిర్భయాః॥ ౩౧

వి॥ పర్జన్యః=మేఘుఁడు, కాలే=తగుకాలములందు, వర్షతు=వర్షించుఁగాక!; పృథివీ=భూమి, సస్యశాలినీ, సస్యైః=సస్యములచే, శాలినీ=ఒప్పుచున్నది. (భవతు)అగుఁగాక!; అయం=ఈ, దేశః=దేశము, క్షోభరహితః, క్షోభ=కఱవు మొదలగువానివలనఁగలుగుపీడ, రహితః=శూన్యమైనది, (అస్తు)అగుఁగాక!; బ్రాహ్మణాః=బ్రాహ్మణులు, నిర్భయాః=భయములేనివారు, సంతు=అగుదురుఁగాక!

భా॥ తగుకాలములయందు సర్వసస్యానుకూలముగా వర్షించుటవలన భూమియంతయు సమృద్ధముగ ఫలింప దేశీయులందఱు పాడి పంటలు గలిగి కఱవులు లోనగుబాధలు లేక సుఖముగా నుండుటచే బ్రాహ్మణులు వేదవేదాంగాధ్యయననిరతులై తపోనిష్ఠాగరిష్ఠులునై యెట్టిభయము లేక యుందురుఁగాక!

కావేరీ వర్ధతాం కాలే కాలే వర్షతు వాసవః।
శ్రీరంగనాథో జయతు శ్రీరంగశ్రీశ్చ వర్ధతామ్॥ ౩౨

వి॥ కావేరీ=కావేరీమహానది, కాలే=దేశోచితసమయమున, వర్ధతాం=సంపూర్ణముగాఁ బ్రవహించుఁగాక!; కాలే=సస్యానుకూలకాలములయందు వాసవః=దేవేంద్రుఁడు, వర్షతు=వర్షించుఁగాక!; శ్రీరంగనాథః=శ్రీరంగస్వామి, జయతు=సర్వోత్కృష్టముగా విలసిల్లుఁగాక!; శ్రీరంగశ్రీశ్చ, శ్రీరంగ=శ్రీరంగ నగరముయొక్క, శ్రీశ్చ=వైభవమును, వర్ధతాం=దినదినాభివృద్ధిఁగాంచుఁగాక!

భా॥ యుక్తకాలమున సర్వసస్యానుకూలముగ వర్షములు గురియుట వలనఁ గావేరినది సంపూర్ణముగాఁ బ్రవహించి దేశమున సుభిక్షము గావింప శ్రీరంగనాయకునియొక్క నిత్యోత్సవములచే శ్రీరంగనగరము మహావైభవముతో వెలయుఁగాక !

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతామ్ న్యాయ్యేన మార్గేణ
మహీం మహీశాః। గోబ్రాహ్మణేభ్య శ్శుభ మస్తు నిత్యమ్
లోకా స్సమస్తా స్సుఖినో భవంతు॥ 33

టీ॥ ప్రజాభ్యః=ప్రజలకొఱకు, స్వస్తి=శుభము, (అస్తు)అగుఁగాక !; మహీశాః=భూపతులు, న్యాయ్యేన=న్యాయమునుండితప్పని, మార్గేణ=మార్గమును చేత, మహీమ్=భూమిని, పరిపాలయంతామ్=పాలించెదరుగాక !, గోబ్రాహ్మణేభ్యః, గో=గోవులకొఱకు, బ్రాహ్మణేభ్యః=బ్రాహ్మణులకొఱకు, నిత్యం=ఎల్లప్పుడు, శుభమ్=శుభము, అస్తు=అగుఁగాక ! సమస్తాః=నిఖిలములైన, లోకాః లోకములు, సుఖినః=సుఖముగలవి, (భవంతు)=అగుఁగాక !

భా॥సమస్తప్రజలు నాయురారోగ్యాదిసకలైశ్వర్యములు గలిగి వర్ధిల్లుదురు గాక ! భూమిపాలకులెల్లరు రాజనీతినిఁ బురస్కరించుకొని న్యాయము తప్పకుండు నట్లు భూమినిఁ బాలింతురు గాక ! ఋషిరాదులచే లోకమునకు మహోపకారమొనర్చు గోవులు మొదలగు జంతువులకు స్వవర్ణాశ్రమోచితకర్మానుష్ఠానముగా ప్రవర్తించు బ్రాహ్మణాదిసమస్తవర్ణములవారికి నిత్యశుభము గలిగి సమస్తలోకములు వర్ధిల్లుచు సుఖములనొందుచున్నవగుగాక !

మంగళం కోసలేంద్రాయ మహనీయగుణాబ్ధయే।
చక్రవర్తితనూజాయ సార్వభౌమాయ మంగళమ్॥ 34

టీ॥ మహనీయగుణాబ్ధయే, మహనీయ=పూజ్యములగు, గుణ=గుణములకు, అబ్ధయే=సముద్రమైన, కోసలేంద్రాయ, కోసల=ఉత్తరకోసలదేశములకు, ఇంద్రాయ=ప్రభువగు శ్రీరామునికొఱకు, మంగళమ్=శుభము, (అస్తు) అగుఁగాక ! చక్రవర్తితనూజాయ. చక్రవర్తి=లోకైకసార్వభౌముండగు దశరథమహారాజునకు, తనూజాయ=కుమారుఁడైన, సార్వభౌమాయ=సమస్త భూమండలమున నేకచ్ఛత్రాధిపత్యము వహించినశ్రీరామచంద్రునికొఱకు, మంగళమ్=శుభము, (అస్తు)అగుఁగాక !

భా॥ అసంఖ్యాకము లగు సద్గుణములచే నొప్పుచు సమస్తభూమండలమున కేకచ్ఛత్రాధిపత్యమువహించి. జనరంజకముగాఁ గోసలదేశముఁబాలించినదశరథసార్వభౌమునికుమారుఁ డగుశ్రీరామునకు నిత్యశుభమగుఁగాక !

వేదవేదాంతవేద్యాయ మేఘశ్యామలమూర్తయే।

పుంసాం మోహనరూపాయ పుణ్యశ్లోకాయ మంగళమ్॥ ౩౫

వి॥ వేదవేదాంతవేద్యాయ, వేద=వేదములచేతను, వేదాంత=ఉపనిషత్తులచేతను, వేద్యాయ=తెలియందగినవాఁడు, మేఘశ్యామలమూర్తయే, మేఘ=వర్షకాలమందలిమేఘమువలె, శ్యామల=నల్లనైన, మూర్తయే=శరీరముగలవాఁడు, పుంసాం=పురుషులకును, మోహనరూపాయ, మోహన=వ్యామోహమునుగలిగించు, రూపాయ=సౌందర్యముగలవాఁడు, పుణ్యశ్లోకాయ, పుణ్య=పవిత్రమైన, శ్లోకాయ=చరిత్రముగలవాఁడు నగుశ్రీరామునకు, మంగళం=శుభము, (అస్తు)అగుఁగాక.

భా॥ వేదవేదాంగముల నభ్యసించి యుపనిషత్సారంబు చక్కఁగా గ్రహించినతపోధనులచేఁ దెలిసికొనఁబడుచుఁ దన్నుఁగీర్తించుభక్తవర్గ్యలకత్యంతసుకృతంబునుగ్రహించుచుఁ బురుషులకును వ్యామోహముం గలిగించుజగద్విలక్షణసౌందర్యముతో నలరారుచు నీలమేఘమువలెఁ గోమలమగుశరీరముతో నొప్పు చున్నశ్రీరామచంద్రునకు శుభ మగుఁగాక !

విశ్వామిత్రాంతరంగాయ మిథిలానగరీపతేః ।

భాగ్యానాం పరిపాకాయ భవ్యరూపాయ మంగళమ్॥ ౩౬

వి॥ విశ్వామిత్రాంతరంగాయ, విశ్వామిత్ర=విశ్వామిత్రమహామునికి, అంతరంగాయ=హృదయప్రియుఁడు, మిథిలానగరీపతేః, మిథిలానగరీ మిథిలయనుపట్టణమునకు, పతేః=ప్రభు వగుజనకమహారాజుయొక్క భాగ్యానాం=అదృష్టములకు, పరిపాకాయ=పంటయైనవాఁడు భవ్యరూపాయ, భవ్య=కల్యాణప్రద మగు, రూపాయ=స్వరూపముగలవాఁడు నగుశ్రీరామునకు, మంగళం=శుభము, (అస్తు)అగుఁగాక !

భా॥ సంయమీంద్రుఁ డగువిశ్వామిత్రునకుఁ బరమానుగ్రహపాత్రుండు నత్యంతపవిత్ర మగువిదేహవంశమునజనించిన జనకమహారాజుయొక్క తపఃఫలంబు శుభస్వరూపుఁడు నగుశ్రీరామునకు శుభమగుఁగాక!

పితృభక్తాయ సతతం భ్రాతృభి స్సహ సీతయా।
నందితాఖిలలోకాయ రామభద్రాయ మంగళమ్॥ ౩౭

వి॥ సతతం=ఎల్లప్పుడు, పితృభక్తాయ=తలిదండ్రులందు భక్తిగల వాఁడు, భ్రాతృభిః=తమ్ములగుభరతాదులతోడ, సీతయా సహ=పత్ని యగు సీతాదేవితోడను, (సమేతాయ=కూడియుండువాఁడు) నందితాఖిలలోకాయ, నందిత=సంతోషపఱుపఁబడిన, అఖిల=సమస్తమైన, లోకాయ=లోకములుగల వాఁడు నగు, రామభద్రాయ=శ్రీరామునికొఱకు, మంగళమ్=శుభము (అస్తు) అగుఁగాక!

భా॥ తల్లిదండ్రులయెడ నెల్లప్పుడు సాదరబుద్ధితో నమితభక్తిఁగను పఱచుచు సీతాలక్ష్మణాదులతోఁ గూడికొని తనసుగుణజాలంబుచే సమస్త జనులను సంతోషపఱచు శుభస్వరూపుం డగుశ్రీరామునకు శుభమగుఁ గాక!

త్యక్తసాకేతవాసాయ చిత్రకూటవిహారిణే।
సేవ్యాయ సర్వయమినాం ధీరోదారాయ మంగళమ్॥ ౩౮

వి॥ త్యక్తసాకేతవాసాయ, త్యక్త=విడువఁబడిన, సాకేతవాసాయ, సాకేత=అయోధ్యానగరమందైన, వాసాయ=నివాసముగలవాఁడు, చిత్రకూటవిహారిణే, చిత్రకూట=చిత్రకూటపర్వతమున, విహారిణే=విహరించినవాఁడు, సర్వయమినాం=నిఖిలమునులకు, సేవ్యాయ=పూజింపఁదగినవాఁడు, ధీరోదారాయ, ధీర=ధైర్యముగలవాఁడు, ఉదారాయ=విశాలహృదయముగలవాఁడు, నగుశ్రీరామునకొఱకు, మంగళమ్=శుభము, (అస్తు)అగుఁగాక!

భా। పితృవాక్యపరిపాలనార్థ మయోధ్యానగరమును విడనాడి చిత్రకూటాద్రియందు నివసించుచు మహర్షులకు రాక్షససంహారార్థ మభయప్రదానము గావించినయుదారపురుషపుంగవుం డగుశ్రీరామభద్రునకు మంగళ మగుఁగాక!

సౌమిత్రిణా చ జానక్యా చాపబాణాసిధారిణే।
సంసేవ్యాయ సదా భక్త్యా స్వామినే మమ మంగళమ్॥ ౩౯

వి॥ సౌమిత్రిణా చ=సుమిత్రాపుత్రుఁ డగులక్ష్మణునితోడ, జానక్యా చ=జనకాధిరాజపుత్రిక యగుసీతాదేవితోడను, సమవేతాయ=కూడికొనినవాఁడు, చాపబాణాసిధారిణే, చాప=ధనుస్సును, బాణ=బాణములును, అసి=

ఖడ్గమును, ధారిణే=ధరించినవాఁడు, సదా=ఎల్లప్పుడు, భక్త్యా=భక్తిచేత, సంసే వ్యాయ=సేవింపఁదగినవాఁడు నగు, మమ=నాయొక్క, స్వామినే=ప్రభు వగు శ్రీరామునికొఱకు, మంగళం=శుభము (అస్తు)అగుఁగాక!

భా. సీతాలక్ష్మణులతోఁ గూడియగస్త్యసంయమీంద్రునియాజ్ఞచే ధనుర్బాణాదులను గ్రహించి సమస్తమునులచేఁ దత్తదాశ్రమములందు భక్తిపురస్సరంబుగాఁ గొలువనంబడిన నాప్రభువగుశ్రీరామచంద్రునకు శుభ మగుఁగాక!

దండకారణ్యవాసాయ ఖండితామరశత్రవే।

గృధ్రరాజాయ భక్తాయ ముక్తిదా యాస్తు మంగళమ్॥ ౪౦

వి॥ దండకారణ్యవాసాయ,దండకారణ్య=దండకాటవి,వాసాయ=నివాస ముగాఁగలవాఁడు, ఖండితామరశత్రవే, ఖండిత=సంహరింపఁబడిన, అమర శత్రవే=రాక్షసులుగలవాఁడు, భక్తాయ=భక్తుఁ డగు, గృధ్రరాజాయ=గ్రద్దలఱేఁ డగు జటాయువుకొఱకు, ముక్తిదాయ=మోక్షమునొసఁగినవాఁడు నగుశ్రీరాము నకు, మంగళమ్=శుభము, అస్తు=అగుఁగాక.

భా॥ మునిపుంగవుల ప్రార్థనలను మన్నించి దండకారణ్యమునఁ గొంతకాలము నివసించి పరమక్రూరు లగురాక్షసులనెల్ల సంహరించి స్వామి కార్యార్థమై ప్రాణములను సమర్పించిన జటాయువునకు వెంటనే మోక్షము నొసంగిన భక్తమందారుఁ డగుశ్రీరామచంద్రునకు నిత్యము శుభము చేకూరుఁగాక!

సాదరం శబరీదత్తఫలమూలాభిలాషిణే।

సౌలభ్యపరిపూర్ణాయ సత్త్వోద్రిక్తాయ మంగళమ్॥ ౪౧

వి। సాదరం=మిగులఁ బ్రీతితోఁ,శబరీదత్తఫలమూలాభిలాషిణే, శబరీ= శబరాంగనచే, దత్త=ఈయఁబడిన, ఫల=పండ్లను, మూల=దుంపలను, అభి లాషిణే=అభిలషించినవాఁడు, సౌలభ్యపరిపూర్ణాయ, సౌలభ్య=సుఖముగాఁ బొందఁదగియుండుటచే, పరిపూర్ణాయ=అంతటనిండియున్నవాఁడు! సత్త్వోద్రి క్తాయ, సత్త్వ=బలముచే, ఉద్రిక్తాయ=అతిశయించిన వాఁడు నగురామ భద్రునికొఱకు, మంగళమ్=శుభము (అస్తు)అగుఁగాక!

భా॥ మిక్కిలిభక్తితోఁ పరివ్రాజిక యగుశబరి యొసంగినఫలమూలా దుల నత్యంతప్రీతితోఁ గ్రహించినవాఁడు భక్తసులభుం డైనతన సమస్త

జగత్తును వ్యాపించినవాఁడు మహాబలసంపన్నుఁడు నగురామభద్రునకు శుభ మగుఁగాక !

హనుమత్సమవేతాయ హరీశాభీష్టదాయినే।
వాలిప్రమథనా యాస్తు మహాధీరాయ మంగళమ్॥ ౪౨

వి॥ హనుమత్సమవేతాయ, హనుమత్=హనుమంతునితో, సమవేతాయ=కలిసికొనినవాఁడు, హరీశాభీష్టదాయినే, హరీశ=సుగ్రీవునకు, అభీష్ట=కోరికను, దాయినే=ఇచ్చినవాఁడు, వాలిప్రమథనాయ, వాలి=వాలిని, ప్రమథనాయ=సంహరించినవాఁడు, మహాధీరాయ=మిగులధైర్యవంతుఁడు నగురామభద్రునికొఱకు, మంగళమ్=శుభము, అస్తు=అగుఁగాక !

భా॥ స్వామిహితాభిలాషి యగుహనుమంతునితోఁ బ్రథమమునఁ గలిసి పిదప వానరోత్తముఁ డగు సుగ్రీవునితో నగ్నిసాక్షికముగాఁ జెలిమి సలిపి యావెంటనే భ్రాతృవిరోధియు లోకైకవీరుఁడు నగువానర రాజైన వాలినిఁ జెండాడి మహాధీరత్వమును లోకమునకుఁ బ్రకటించినశ్రీరామునకు శుభమగుఁగాక !

శ్రీమతే రఘువీరాయ సేతూల్లంఘితసింధవే।
జితరాక్షసరాజాయ రణధీరాయ మంగళమ్॥ ౪౩

వి॥ శ్రీమతే=శోభాయుక్తుఁడు, రఘువీరాయ=రఘువంశపురాజులలోఁ బరాక్రమశాలి, సేతూల్లంఘితసింధవే, సేతు=సేతువుచేత, ఉల్లంఘిత=దాటఁబడిన; సింధవే=సముద్రముగలవాఁడు, జితరాక్షసరాజాయ, జిత=జయింపఁబడిన, రాక్షసరాజాయ=రావణుఁడుగలవాఁడు, రణధీరాయ, రణ=యుద్ధమందు, ధీరాయ=మహాధైర్యముతో నిలువఁబడినవాఁడునగుశ్రీరామునికొఱకు, మంగళం=శుభము, (అస్తు)అగుఁగాక!

భా॥ మిక్కిలి శోభాయుక్తుం డై రఘువంశీయు లగురాజోత్తములలో వీరుం డనిప్రసిద్ధిపడసి వానరులచే సముద్రమున సేతువును నిర్మింపంజేసి తన్మార్గమున లంకానగరమునఁ బ్రవేశించి త్రిలోకకంటకుఁ డగురావణాసురుని సపరివారముగాఁ బరిమార్చినరణపండితుఁ డగుశ్రీరామునకు శుభం బగుంగాక!

ఆసాద్య నగరీం దివ్యా మభిషిక్తాయ సీతాయా।
రాజాధిరాజరాజాయ రామభద్రాయ మంగళమ్॥ ౪౪

వి॥ దివ్యాం=శ్రేష్ఠమైన, నగరీం=సాకేతపురమును, ఆసాద్య=పొంది, సీతయా=జానకీదేవితో, అభిషిక్తాయ=సామ్రాజ్యాభిషిక్తుండైన, రాజాధిరాజరాజాయ, రాజ=మండలాధీశులకు, అధిరాజ=ప్రభువు లగుసామంతరాజులకు, రాజాయ=ప్రభు వగు, (సార్వభౌముం డనుట)రామభద్రాయ=శ్రీరామునికొఱకు, మంగళమ్=శుభము (అస్తు)అగుఁగాక !

భా॥ రావణవధానంతరము ప్రపంచమునం గలరాజధానీనగరములలోఁ దలమానికం బగుసాకేతనగరమున సీతాలక్ష్మణాదిసహితుఁడై ప్రవేశించి మహర్షిపురస్సరముగాఁ బట్టాభిషిక్తుఁడై రాజలలాముం డనిప్రశస్తిఁ గాంచినశ్రీరామభద్రునకు శుభ మగుంగాక !

మంగళాశాసనపరై ర్మదాచార్యపురోగమైః।
సర్వైశ్చ పూర్వై రాచార్యైస్సత్కృతాయాస్తు మంగళమ్॥ ౨౫

వి॥ మంగళాశాసనపరైః=శుభాశీర్వాదతత్పరులైన, మదాచార్యపురోగమైః, మత్=నాయొక్క, ఆచార్యపురోగమైః=కులాచార్యుఁడుమున్నగు, సర్వైః=ఎల్లరునగు, పూర్వైః=ప్రాచీనులైన, ఆచార్యైః=గురుసత్తములచేత, సత్కృతాయ=కొలువఁబడుచున్నశ్రీరామునికొఱకు, మంగళమ్=శుభము, అస్తు=అగుఁగాక !

భా॥ కల్యాణప్రదములగు మహదాశీర్వచనములం గావించుచున్నవారై మాకులాచార్యప్రభృతు లగుసనాతనులైన యాచార్యులెల్లరిచే ననిశము సేవింపఁబడిన శ్రీరామభద్రునకు శుభంబు సమకూరుఁగాక !

కాయేన వాచా మనసేంద్రియైర్వా।
బుద్ధ్యాత్మనా వా ప్రకృతే స్స్వభావాత్।
కరోమి యద్యత్సకలం పరస్మై।
నారాయణా యేతి సమర్పయామి॥ ౨౬

వి॥ కాయేన=శరీరముచేత, వాచా=వాక్కుచేత, మనసా=మనస్సుచేత, బుద్ధ్యా=బుద్ధిచేత, ఆత్మనావా=జీవునిచేత, ప్రకృతేః=ప్రకృతివలన, స్వభావాత్=సహజప్రవర్తనవలన, యద్యత్=ఏయేకర్మమును, కరోమి=చేయుచున్నానో, సకలం=సమస్తము, పరస్మై=పరబ్రహ్మస్వరూపుఁడగు, శ్రీరాఘవాయేతి=శ్రీ రామునికొఱకేయని, సమర్పయామి=సమర్పితముఁజేయుచున్నాను.

భా॥ రఘుకులసంజాతుండ వగు శ్రీరామా! కాయికవాచికమానసిక వ్యాపారములచే జ్ఞానకర్మేంద్రియములచే బుద్ధిచే జీవునిచేఁ బ్రకృతిచే స్వభావంబుచే దివారాత్రములయందు నాచేఁ జేయఁబడు కర్మములనెల్లఁ బరబ్రహ్మస్వరూపుఁడ వగునీకు సమర్పించుచున్నాను.

పిమ్మటఁ పితామహస్య, యనుశ్లోకము మొదలుకొని తమయాచార్యుని వఱకుం గలగురుప్రార్థనఁ జేయువలయును. తమయాచార్యప్రార్థనతోఁ బ్రారంభించి శ్రీధరస్తుతిపర్యంతముగల శ్లోకములం జదివినను జదువ వచ్చును.

శ్రీరస్తు.

## స్మార్తమాధ్వాదులచే రామాయణపారాయణారంభమునఁ జదువఁ దగినమంగళశ్లోకములు.

---

ఓమ్ గురుర్బ్రహ్మా గురు ర్విష్ణు ర్గురు ర్దేవో మహేశ్వరః।
గురు స్సాక్షాత్పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః॥ ౧

వి॥ గురుః=బ్రహ్మోపదేశ మొనర్చినగురువర్యుఁడు, బ్రహ్మా=బ్రహ్మస్వరూపుఁడు; గురుః=ఆచార్యుఁడు, విష్ణుః=విష్ణుస్వరూపుఁడు; గురుః=ఉపదేశకుఁడు, దేవః=పూజ్యుఁడగు, మహేశ్వరః=సదాశివుఁడు; గురుః=ఒజ్జ, సాక్షాత్ కేవలము, పరబ్రహ్మ=పరాత్పర మగుబ్రహ్మము; తస్మై=అట్టి, శ్రీగురవే, శ్రీ=మోక్షలక్ష్మిప్రదుఁ డగు, గురవే=గురుసత్తమునికొఱకు, నమః=నమస్కారము, (అస్తు)=అగుఁగాక!

భా॥ యజ్ఞానాంధకారమును బాపి బ్రహ్మోపదేశ మొనర్చి జ్ఞానతేజమును బ్రసాదించిన శ్రీమదాచార్యవర్యుఁడు జగదుత్పత్తిస్థితిలయకారణములగుబ్రహ్మవిష్ణుమహేశ్వరులస్వరూపుఁడు; కేవలము పరబ్రహ్మస్వరూపుఁడు; కాన మోక్షలక్ష్మిప్రదుం డగునమ్మహనీయునకు నమస్కరించెద.

అజ్ఞానతిమిరాంధస్య జ్ఞానాంజనశలాకయా।
చక్షు రున్మీలితం యేన తస్మై శ్రీగురవే నమః॥ ౨

వి॥ యేన=ఏగురువర్యునిచే, అజ్ఞానతిమిరాంధస్య, అజ్ఞాన=తెలివిలేమియను, తిమిర=చీఁకటిచేత, అంధస్య=గ్రుడ్డివాఁడై యున్నమానవుని యొక్క, చక్షుః=నేత్రము, జ్ఞానాంజనశలాకయా, జ్ఞాన=బ్రహ్మజ్ఞానమను, అంజనశలాకయా=కాటుకకణికచేత, ఉన్మీలితం=వికసింపఁ జేయఁ బడెనో,

తస్మై=అట్టి, శ్రీగురవే, శ్రీ=మోక్షలక్ష్మీప్రదుండగు, గురవే=గురువర్యునికొఱకు, నమః=నమస్కారము, (అస్తు)=అగుఁగాక!

భా॥ సంసారకూపమునం గూలి యొకింతయుఁ దరణోపాయ మెఱుంగక మోహాంధుండై యున్నశిష్యు నపారకృపారసంబునఁ జేపట్టి యాత్మజ్ఞానము నుపదేశించి యుద్ధరించు శ్రీమద్గురువరేణ్యు పాదపద్మములకు నమస్కరించెద.

సదాశివసమారంభాం శంకరాచార్యమధ్యమామ్।
అస్మదాచార్యపర్యంతాం వందే గురుపరంపరామ్॥ ౩

వి॥ సదాశివసమారంభామ్, సదాశివ=ఎల్లప్పుడుభక్తులకు శుభంబుల నొసంగుభగవంతుఁడు, సమారంభాం=మొదటఁగలదియు, శంకరాచార్యమధ్యమామ్, శంకరాచార్య=శ్రీశంకరాచార్యస్వాములు, మధ్యమామ్=మధ్యనున్నవారుగాఁ గలదియు, అస్మదాచార్యపర్యంతాం, అస్మత్=మాకు ఆచార్య= బ్రహ్మోపదేశ మొనర్చినగురువర్యునివఱకు, పర్యంతాం=వ్యాపించి యున్న, గురుపరంపరాం, గురు=గురుశిష్యుల యొక్క, పరంపరాం=పంక్తిని, వందే=నమస్కరించుచున్నాను.

భా॥ సమస్తలోకకారణుండై తన్ను సేవించుభక్తపుంగవుల కఖండమోక్షసామ్రాజ్యం బనుగ్రహించు భగవంతుం డాదియందును శ్రీమదద్వైతమతస్థాపనాచార్యులగు శంకరభగవత్పాదులు మధ్యయందును గలిగి మాకు బ్రహ్మోపదేశ మొనర్చినయాచార్యవర్యునివఱకు వ్యాపించి యున్న గురుపరంపరకు నమస్కరించుచున్నాను.

నారాయణం పద్మభువం వసిష్ఠం శక్తిం చ తత్పుత్ర
పరాశరం చ। వ్యాసం శుకం గౌడపదం మహాంతం
గోవిందయోగీంద్ర మథాస్య శిష్యమ్॥ ౪
శ్రీశంకరాచార్య మథాస్య పద్మపాదం చ హస్తామలకం చ శిష్యమ్।
తం త్రోటకం వార్త్తికకార మన్యా నస్మద్గురూన్ సంతత మానతోస్మి॥ ౫

వి॥ నారాయణమ్, నార=జ్ఞానము, అయనం=స్థానముగాఁ గలవాఁడగు శ్రీమదాదివిష్ణువును, పద్మభువమ్, పద్మ=(విష్ణుమూర్తియొక్క నాభి) కమలమందు, భువమ్=జనించినవాఁడగుబ్రహ్మను, వశిష్ఠమ్=వశిష్ఠమహర్షిని, శక్తిం చ=

శక్తిమహర్షిని, తత్పుత్రపరాశరంచ, తత్పుత్ర=ఆశక్తిమహర్షియొక్క కుమారుఁడైన, పరాశరంచ=పరాశరమహర్షిని, వ్యాసం=కృష్ణద్వైపాయన మహర్షిని, శుకం=శుకయోగీంద్రుని, మహాంతం=మహనీయులగు, గౌడపదం= గౌడపాదాచార్యులను, అథ=పిమ్మట, అస్య=ఈగౌడపాదాచార్యులయొక్క శిష్యం=శిష్యులగు, గోవిందయోగీంద్రం=యోగిశ్రేష్ఠులైన గోవిందస్వామిని, శ్రీశంకరాచార్యం, శ్రీ=శోభాయుక్తులగు, శంకరాచార్యం=శంకరభగవత్పాదులను, అథ=తరువాత, అస్య=ఈపరమపూజ్యునకు, శిష్యం=శిష్యుఁడైన, పద్మపాదం=పద్మపాదాచార్యుని, తం=ప్రసిద్ధుఁడగు, తోటకం=తోటకాచార్యుని, వార్తికకారం=వార్తికములను రచించిన సురేశ్వరాచార్యుని, అన్యాన్=ఇతరులగు, అస్మద్గురూన్=మాగురువర్యులను(గూర్చి) సంతతం=ఎల్లప్పుడు, (అహం=నేను) ఆనతః=నమ్రుఁడను, అస్మి=అగుచున్నాను.

భా॥ జ్ఞానస్వరూపుఁడగు శ్రీమన్నారాయణుఁడు, బ్రహ్మ, వశిష్ఠుఁడు శక్తిమహర్షి, పరాశరమహర్షి, వేదవ్యాసమహర్షి, శుకయోగివర్యుఁడు గౌడపాదాచార్యులు, గోవిందయోగీంద్రులు, శ్రీశంకరాచార్యస్వాములు వయ్యతీంద్రునిశిష్యులగు పద్మపాద, హస్తామలక, తోటక, సురేశ్వరాచార్యులు మొదలుగాఁ గల గురుసత్తముల నందఱ నేనఖండభక్తితో నెల్లప్పుడు నమస్కరించుచున్నాను.

శ్రీగణాధిపతిప్రార్థన.

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్।
ప్రసన్నవదనం ధ్యాయేత్సర్వవిఘ్నోపశాంతయే॥ ౬

వి॥ శుక్లాంబరధరం, శుక్ల=తెల్లని, అంబర=వస్త్రములను, ధరం=ధరించువాఁడు, విష్ణుమ్=ప్రపంచమునంతను వ్యాపించియున్నవాఁడు, శశివర్ణం, శశి=చంద్రునియొక్క. వర్ణం=కాంతివంటికాంతిగలవాఁడు, చతుర్భుజం=నాలుగు భుజములుగలవాఁడు, ప్రసన్నవదనం, ప్రసన్న=భక్తులనుగ్రహించుటకుఁ దగినదయారసముతో నొప్పుచున్న, వదనం=ముఖముగలవాఁడు నగు గణపతి దేవుని, సర్వవిఘ్నోపశాంతయే, సర్వ=సమస్తములైన, విఘ్న=కార్యభంగముల యొక్క, ఉపశాంతయే=నివారించుటకొఱకు, ధ్యాయేత్=ధ్యానింపవలెను.

భా॥ ధవళవస్త్రములను ధరించినవాఁడు సమస్తలోకములను వ్యాపించి యున్నవాఁడు శరత్కాలచంద్రునితో సమాన మగుకాంతిగలవాఁడు నాల్గు

భుజములతో నొప్పువాఁడు, బరమ కారుణికుఁడు నగు విఘ్నేశ్వరుని సంకల్పించినసకలకార్యములను గొనసాగించుటకు హృదయపద్మమున నిశ్చలభక్తితో నుపాసింపవలెను.

వాగీశాద్యా స్సుమనస స్సర్వార్థానా ముపక్రమే।
యం నత్వా కృతకృత్యా స్స్యు స్తం నమామి గజాననమ్॥ ౨

వి॥ వాగీశాద్యాః, వాక్=సరస్వతికి, ఈశ=భర్తయగు బ్రహ్మదేవుఁడు, ఆద్యాః=ప్రథముఁడుగాఁగల, సుమనసః=దేవతలు, సర్వార్థానాం, సర్వ=సమస్తములైన, అర్థానాం=ప్రయోజనములయొక్క, ఉపక్రమే=ప్రారంభమందు, యం=ఏగణపతిని, నత్వా=నమస్కరించి, కృతకృత్యాః=కృతార్థులు, స్యుః=అగుచుండిరో, తం=ఆ, గజాననం, గజ=ఏనుఁగుయొక్క, ఆననం=ముఖముగల విఘ్నేశ్వరుని, నమామి=నమస్కరించుచున్నాను.

భా॥ నిఖిలవిద్యాస్వరూపిణి యగుసరస్వతీదేవికి నాయకుఁడగు పితామహుఁడు లోనుగాఁగల ముప్పదిమూఁడుకోట్ల దేవతలు తమతమ కార్యారంభమున విఘ్నాంధకారభాస్కరుండగు నెవ్వని నుతించి కార్యములఁగొనసాగించుకొనుచుండిరో యట్టిదేవతావందితుఁడగుగణేశుని సంకల్పితకార్యనిర్వాహణము కొఱకు నే నెల్లప్పుడుఁ బ్రణమిల్లుచున్నాఁడ.

అగజాననపద్మార్కమ్ గజాననమహర్నిశమ్।
అనేకదంతం భక్తానా మేకదంత ముపాస్మహే॥ ౩

వి॥ అగజాననపద్మార్కం, అగ=పర్వతమైనహిమవంతునకు, జ=పుట్టిన (అనఁగాఁ గుమార్తె యగు) పార్వతీదేవియొక్క, ఆనన=ముఖమనెడు, పద్మ=కమలమునకు, అర్కం=సూర్యుఁడైనవాఁడు, గజాననమ్, గజ=ఏనుఁగుయొక్క, ఆననం=ముఖముగలవాఁడు. భక్తానాం=తన్నుఁగొల్చుజనులకు, అనేకదం, అనేక=సమస్తమును, దం=ఇచ్చువాఁడు, తం=ప్రసిద్ధుఁడునగు, ఏకదంతం=ఒకదంతము గల గణపతిదేవుని, అహర్నిశం=రేయింబగళ్ళు, ఉపాస్మహే=సేవించుచున్నాము.

భా॥ హిమవంతుని పుత్రికామణి యగు పార్వతీదేవియొక్క ముఖమును సూర్యుఁడు తన కిరణజాలంబుచేఁ బద్మముంబోలె బాల్యక్రీడాసంభాషణాదులచే వికసింపఁజేయువాఁడు మదగజోత్తమాంగముతో సంధింపఁబడిన శరీరముగలవాఁడుఁ దన్నుఁగొలుచు నిఖిలభక్తులకు సమస్తాభీష్టములనిచ్చి ప్రోచువాఁడు నేకదంతుఁడనిప్రసిద్ధివడసినవాఁడు నగుగణాధిపు నెల్లపుడు ధ్యానించెదము.

సరస్వతీప్రార్థన.

శారదా శారదాంభోజవదనా వదనాంబుజే।
సర్వదా సర్వదాస్మాకం సన్నిధి స్సన్నిధిం క్రియాత్॥

వి॥ శారదాంభోజవదనా, శారద=శరత్కాలమందలి, అంభోజ=పద్మమును వంటి, వదనా=ముఖముగలది, సర్వదా, సర్వ=సమస్తములగు కోరికలను, దా=ఇచ్చునట్టిది, సన్నిధిః, సత్=సాధుజనులకు, నిధిః=నిధియైనదియునగు, శారదా=సరస్వతిదేవి, సర్వదా=ఎల్లప్పుడు, అస్మాకం=మాయొక్క, వదనాంబుజే, వదన=ముఖమనెడు,అంబుజే=పద్మమందు సన్నిధిం=చేరుపను, క్రియాత్=చేయుఁగాక.

భా॥ శరత్కాలమందు సంపూర్ణముగా వికసించిన కమలమువలె నలరారుముఖముఁగలిగి సాధుజనమందారమై భక్తాభీష్టదాయిని యగుపలుకులవెలఁది యెల్లప్పుడు మాజిహ్వాగ్రమున నివసించి మమ్ముఁ గృతార్థులంజేయుఁగాక!

యా కుందేందుతుషారహారధవళా యా శుభ్రవస్త్రావృతా।
యా వీణావరదండమండితకరా యా శ్వేతపద్మాసనా।
యాబ్రహ్మాచ్యుతశంకరప్రభృతిభి ర్దేవైస్సదా పూజితా।
సా మాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేషజాడ్యాపహా॥ ౧౦

వి॥ యా=ఏసరస్వతి, కుందేందుతుషారహారధవళా, కుంద=మల్లెపువ్వువలె, ఇందు=చంద్రునివలె, తుషార=మంచువలె, హార=ముత్యాలహారము వలెను, ధవళా=స్వచ్ఛమైనది, (భవతి=అగుచున్నదో) యా=ఏసరస్వతి, శుభ్రవస్త్రావృతా, శుభ్ర=పరిశుద్ధమగు, వస్త్ర=వస్త్రముచే, ఆవృతా=ఆవరింపఁబడినది, (భవతి)=అగుచున్నదో, యా=ఏసరస్వతి, వీణా=కచ్ఛపియనువీణయొక్క, వర=శ్రేష్ఠమైన, దండ=దండముచేత, మండిత=అలంకరింపఁబడిన, కరా=హస్తముగలది, (భవతి)=అగుచున్నదో, యా=ఏసరస్వతి, శ్వేతపద్మాసనా, శ్వేత=తెల్లనగు, పద్మ=పుండరీకము, ఆసనా=ఆస్తరణముగాఁగలది, (భవతి)=అగుచున్నదో, యా=ఏసరస్వతి, బ్రహ్మాచ్యుతశంకరప్రభృతిభిః, బ్రహ్మ=చతుర్ముఖుఁడు అచ్యుత=విష్ణువు, శంకర=మహేశ్వరుఁడు, ప్రభృతిభిః=మొదలగు, దేవైః=దేవతలచే, సదా=ఎల్లప్పుడు, పూజితా=పూజింపబడుచున్నది, (భవతి)=అగుచున్నదో, నిశ్శేషజాడ్యాపహా, నిశ్శేష=సమస్తమైన, జాడ్య=బుద్ధిమాంద్యమును, అపహా=పోఁగొట్టునది, భగవతీ=షడ్గుణైశ్వర్యసంపన్నురాలు నగు, సా=ఆసరస్వతిదేవి, మాం=నన్ను, పాతు=రక్షించుఁగాక.

భా॥ మల్లికా, శారదచంద్ర, నీహార, ముక్తాహారములవలె నత్యంత విశద మగుదేహముగలిగి మిక్కిలి స్వచ్ఛ మగువస్త్రమును ధరించి పుండరీకాసనమునఁ గూరుచుండి వీణ వాయించుచు నిఖిలదేవతలచేఁ గొలువఁ బడుచుఁ ద న్ను పాసించుభక్తులయజ్ఞానముం బారఁ దోలుపరమపూజ్యురాలగుభారతీదేవి న న్ననిశము రక్షించు గాక!

దోర్భి ర్యుక్తా చతుర్భి స్స్ఫటికమణిమయీ మక్షమాలాం దధానా।
హస్తే నై కేన పద్మం సితమపిచ శుకం పుస్తకం చాపరేణ।
భాసా కుందేందుశంఖస్ఫటికమణినిభా భాసమానాఽసమానా।
సా మే వాగ్దేవ తేయం నివసతు వదనే సర్వదా సుప్రసన్నా॥ ౧౧

వి॥ చతుర్భిః=నాలుగయిన, దోర్భిః=బాహువులతో, యుక్తా=కూడినది, ఏకేన=ఒకటియగు, హస్తేన=హస్తముచేత, స్ఫటికమణిమయీం=పటికపురాళ్లతోఁగూర్చఁబడిన, అక్షమాలాం=జపమాలను, దధానా ధరించుచున్నది, ఏకేన=ఒకటియగు హస్తేన=హస్తముచేత, సితం=తెల్లని, పద్మం=పుండరీకమును, దధానా=ధరించుచున్నది. అపిచ=మఱియు, ఏకేన=ఒకహస్తముచే, శుకం=చిలుకను, దధానా=ధరించునది, అపరేణ=వేరొకహస్తముచేత, పుస్తకం=పొత్తమును, దధానా=ధరించునది, భాసా=కాంతిచేత, కుందేందుశంఖస్ఫటికమణినిభా, కుంద=మల్లిపువ్వుతోడ, ఇందు=చంద్రునితోడ, శంఖ=శంఖముతోడ,స్ఫటికమణి=శ్రేష్ఠమగుపటికపుఱాతితోడ,నిభా=సమానురాలై, భాసమానా=ప్రకాశించుచున్నట్టిది, అసమానా=సాటిలేనిది, సా=ప్రసిద్ధురాలు, ఇయం=నాచేధ్యానింపఁబడుచున్నదియునగు, వాగ్దేవతా=సరస్వతీదేవి, మే=నాయొక్క, వదనే=ముఖమందు, సర్వదా=ఎల్లప్పుడు, సుప్రసన్నా నిర్మలానుగ్రహముతో నొప్పుచున్నదై, నివసతు=నెలకొనుఁగాక.

భా॥ స్ఫటికమాణిక్యప్రచుర మైనజపమాల నొకహస్తముచేతఁ దెల్ల తామరపువ్వును వేఱొకకరంబుతోడఁ గ్రీడాశుకమును మఱియొకచేతితోడఁ బుస్తకమునింకొకపాణితోడ ధరియించికాంతిచే మల్లికతోఁ జందమామతో శంఖముతో స్ఫటికమాణిక్యముతోడను సమానముగాశోభిల్లునిరుపమానురాలు విద్యాధిదేవతయునగువాణి నాజిహ్వయందు సానుగ్రహబుద్ధినెప్పుడు నెలకొని నన్ను రక్షించుఁగాక!

## వాల్మీకి స్తుతి.

కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్।
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్॥ ౧౨

వి॥ కవితాశాఖాం=చెట్టుకొమ్మవంటికవిత్వమును, ఆరుహ్య=అధిష్ఠించి, రామరామేతి=రామరామ యను, మధురాక్షరమ్, మధుర=హృదయానందకరము లైన, అక్షరం=వర్ణములుగల, (పదమ్=)పదమును, మధురమ్=మనోహరముగా, కూజంతం=గానముచేయుచున్న, వాల్మీకికోకిలమ్=కోకిలవంటి వాల్మీకిమహర్షిని, వందే=నమస్కరించుచున్నాను.

భా॥ వసంతకాలమున వృక్షశాఖనధిష్ఠించి వీనులకు విందొనంగునట్లు పంచమస్వరమున గానము సేయుకోయిలచందంబున కవితాపరితిభాశాలియై సులలితవర్ణభూయిష్ఠంబగు 'రామరామ' యనుపదమును దాపసవిద్వచ్ఛ్రేష్ఠముఖ సకలప్రాణులకు శ్రోత్రపేయంబగునట్లు గానముచేయుచున్న వాల్మీకిమహర్షిని నమస్కరించుచున్నాను.

వాల్మీకేర్మునిసింహస్య కవితావనచారిణః।
శృణ్వన్ రామకథానాదం కో న యాతి పరాం గతిమ్॥ ౧౩

వి॥ కవితావనచారిణః॥ అరణ్యమువంటికవిత్వమునసంచరించుచున్న, వాల్మీకేః=వాల్మీకియను, మునిసింహస్య=మునిశ్రేష్ఠునియొక్క, (సింహముయొక్క యనియు) రామకథానాదమ్, రామ=శ్రీరామచంద్రునియొక్క, కథానాదమ్=కథయొక్కధ్వనిని (గర్జితముననియు,) శృణ్వన్=వినుచున్న, కః=ఎవ్వడు, పరామ్=ఉత్కృష్టమైన, (అధికమైనయనియు) గతిమ్=గతిని, (పాఱిపోవుట యనియు) నయాతి=పొందడు ?

భా॥ మహారణ్యమున సంచరించుసింహముయొక్క కంఠధ్వని నాలకించి మృగంబులెల్లఁ బఱుగిడుపగిదిఁగవికులమూర్ధన్యుఁడగువాల్మీకిమహర్షిచే రచింపఁబడినరామచరిత్రము నాకర్ణించిన వారెల్లమోక్షమునొందుదురు !

యః పిబన్ సతతం రామచరితామృతసాగరమ్।
అతృప్తస్తం మునిం వందే ప్రాచేతసమకల్మషమ్॥ ౧౪

వి॥ యః=ఎవఁడు, రామచరితామృతసాగరమ్, రామ=శ్రీరామునియొక్క, చరిత=సత్కథయనెడి, అమృతసాగరమ్=సుధాసముద్రమును, సతతం=ఎల్లప్పుడు, పిబన్=క్రోలుచున్నవాఁడై, అతృప్తః=తృప్తినొందనివాఁడు (భవతి=అగు

చున్నాఁడో) తం=అట్టి, అకల్మషం=పాపరహితుఁడు, ప్రాచేతసమ్=వరుణసంతతిలోనివాఁ డునగు, మునిమ్=వాల్మీకిమహర్షిని, వందే=నమస్కరించుచున్నాను.

భా॥ శ్రీరామచంద్రచరిత్రరూప మగు నమృతము నెల్లప్పుడుఁ గ్రోలుచుండియుఁ దనివినొందనివాఁ డగుపాపరహితుం డైనవాల్మీకిమహర్షి నిగూర్చి నమస్కరించుచున్నాను.

ఆంజనేయ నమస్క్రియ.

గోష్పదీకృతవారాశిం మశకీకృతరాక్షసమ్।
రామాయణమహామాలారత్నం వందేఽనిలాత్మజమ్॥ ౧౫

వి॥ గోష్పదీకృతవారాశిమ్, గోష్పదీకృత=ఆవుయొక్క అడుగుగాఁ జేయఁబడిన, వారాశిమ్=సముద్రముగలవాఁడు, మశకీకృతరాక్షసమ్, మశకీకృత=దోమలుగాఁ జేయఁబడిన, రాక్షసం=రాక్షసులుగలవాఁడు, రామాయణమహామాలారత్నమ్, రామాయణ=రామాయణమను, మహామాలా=గొప్పదైనహారమునకు, రత్నం=నాయకమణియునగు, అనిలాత్మజమ్=వాయుపుత్రుఁడైనయాంజనేయుని, వందే=నమస్కరించుచున్నాను.

భా॥ సముద్రమును గోష్పాదముం బోలె దాటి రాక్షసుల దోమలం భంగి సంహరించి రామాయణమహాప్రబంధమను ననర్ఘహారమునకు నాయకమణియై విలసిల్లు వాయుపుత్రుఁడగుహనుమంతునకు నమస్కరించుచున్నాను.

అంజనానందనం వీరం జానకీశోకనాశనమ్।
కపీశమక్షహంతారం వందే లంకాభయంకరమ్॥ ౧౬

వి॥ వీరమ్=పరాక్రమశాలి, జానకీశోకనాశనమ్, జానకీ=సీతాదేవియొక్క, శోక=విచారమును, నాశనమ్=పోఁగొట్టినవాఁడు, కపీశమ్=వానరశ్రేష్ఠుఁడు, అక్షహంతారం, అక్షుండను రావణపుత్రుని, హంతారమ్ = పరిమార్చినవాఁడు, లంకాభయంకరం, లంకా=లంకానగరవాసులగురాక్షసులకు, భయంకరమ్=భయముఁ గలిగించినవాఁడు, అంజనానందనం, అంజనా=అంజనాదేవియొక్క, నందనం=కుమారుఁడు నగుహనునుంతుని, వందే=నమస్కరించుచున్నాను.

భా॥ శూరాగ్రేసరుఁ డై శ్రీరామకుశలవార్తను సీతాదేవి కెఱిఁగించి వానరులలో మిగులఁ బూజనీయుం డై యక్షకుమారుని సంహరించి లంకానగరమున నివసించురాక్షసులకు విశేషభయముఁ గలిగించిన యంజనాగర్భసంభూతుఁడగుహనుమంతునకు మ్రొక్కుచున్నాను.

ఆమిషీకృతమార్తాండం గోష్పదీకృతసాగరమ్।
తృణీకృతదశగ్రీవ మాంజనేయం నమామ్యహమ్॥ ౧౪

వి॥ ఆమిషీకృతమార్తాండమ్, ఆమిషీకృత=మాంసముగాఁ జేయఁబడిన, మార్తాండమ్, సూర్యుఁడు గలవాఁడు, గోష్పదీకృతసాగరమ్, గోష్పదీకృత=ఆవుయొక్క యడుగుగాఁ జేయఁబడిన, సాగరమ్=సముద్రముగలవాఁడు, తృణీకృతదశగ్రీవమ్,తృణీకృత=తృణముగాఁ జేయఁబడిన, దశగ్రీవమ్=రావణాసురుఁడు గలవాఁడు, ఆంజనేయమ్=అంజనాదేవియొక్క కుమారుఁడు నగుహనుమంతుని, వందే=నమస్కరించుచున్నాను.

భా॥ బాల్యమున సూర్యబింబమును మాంసపుముద్దగాఁదలంచి మ్రింగఁ బోయినవాఁడు సముద్రమును గోష్పాదపరిమితప్రదేశముం బోలె దాటి రావణాసురుని దృణప్రాయునిగా నెంచినవాఁడు నగునాంజనేయునకు నమస్కరించు చున్నాను.

ఉల్లంఘ్య సింధోః స్సలిలం సలీలం యశ్శోకవహ్నిం జనకాత్మజాయాః।
ఆదాయ తేనైవ దదాహలంకాంనమామితంప్రాంజలిరాంజనేయమ్॥ ౧౫

వి॥ యః=ఎవఁడు, సింధోః=సముద్రునియొక్క, సలిలమ్=ఉదకమును, సలీలం=విలాసముతోఁగూడికొనినట్లుగాఉల్లంఘ్య=దాటిజనకాత్మజాయాః=సీతాదేవియొక్క, శోకవహ్నిమ్, శోక=విచారి మనెడి,వహ్నిమ్=అగ్నిహోత్రమును, ఆదాయ=గ్రహించి, తేనైవ=ఆయగ్నిహోత్రముచేతనే, లంకాం=లంకానగరమును, దదాహ=దహించెనో, తం=అట్టి, ఆంజనేయం=అంజనాపుత్రుని, అహం=నేను, ప్రాంజలిః=దోసిలియొగ్గినవాఁడనై, నమామి=నమస్కరించుచున్నాను.

భా॥ శతయోజనపరిమిత మగుదక్షిణసముద్రము నవలీలగాదాటి శ్రీరాముని క్షేమవార్త సీతాదేవి కెఱిఁగించి యాసాధ్విమతల్లిక హృదయమునఁ బ్రజ్వరిల్లుచున్నదుఃఖానలముఁ బాపి అయ్యనలంబు చేతనుంబోలె లంకానగరమునంతను క్షణమాత్రమున దహించి జగత్ప్రఖ్యాతిం గాంచినహనుమంతునకు దోసిలియొగ్గి నమస్కరించెద.

ఆంజనేయ మతిపాటలాననం। కాంచనాద్రి కమనీయవిగ్రహం।
పారిజాతతరుమూలవాసినం। భావయామి పవమాననందనమ్॥ ౧౬

వి॥ ఆంజనేయం=అంజనాదేవియొక్క కుమారుఁడు, అతిపాటలాననం, అతిపాటల=మిగుల నెఱ్ఱనగు, ఆననం=మొగముగలవాఁడు, కాంచనాద్రికమనీయవిగ్రహం, కాంచనాద్రి=మేరుపర్వతమువలె, కమనీయ=సుందరమైన,

విగ్రహం=శరీరముగలవాఁడు, పారిజాతతరుమూలవాసినం, పారిజాతతరు=పారిజాతవృక్షముయొక్క, మూల=మొదటను, వాసినం=నివసించుచున్న వాఁడు నగు, పవమాననందనం=ఆంజనేయుని, భావయామి=స్మరించుచున్నాను.

భా॥ మిక్కిలి యెఱ్ఱ నగుముఖము మేరుపర్వతమువలె నున్నతముఁ దేజోవంతము నగుశరీరము గలవాఁడై పారిజాతవృక్షముక్రిందఁ గూరుచుండి తపం బొనర్చు చున్న హనుమంతుని ధ్యానించుచున్నాను.

యత్రయత్ర రఘునాథకీర్తనం తత్రతత్ర కృతమస్తకాంజలిం।
బాష్పవారిపరిపూర్ణలోచనం మారుతిం నమత రాక్షసాంతకమ్॥ ౨౮

వి॥ యత్రయత్ర=ఎచ్చటెచ్చట, రఘునాథకీర్తనమ్, రఘునాథ=శ్రీరామునియొక్క, కీర్తనం=కథాగానము, (భవతి) అగుచున్నదో, తత్రతత్ర=అచ్చటచ్చట, కృతమస్తకాంజలిం, కృత=చేయఁబడిన, మస్తకాంజలిం, మస్తక=శిరస్సునందలి, అంజలిం=దోసిలిగలవాఁడు, బాష్పవారిపరిపూర్ణలోచనం బాష్పవారి=ఆనందబాష్పములచేత, పరిపూర్ణ=నిండింపఁబడిన, లోచనం=నేత్రములుగలవాఁడు, రాక్షసాంతకం, రాక్షస=రాక్షసులకు=, అంతకం=మారకుఁడు నగు, మారుతిం=వాయుపుత్రుని, నమత=మ్రొక్కుఁడు.

భా॥ రఘుకులసంజాతులలో నుత్తముఁ డగుశ్రీరామచంద్రునిసత్కథాగానము చేయఁబడుచుండు తావులయందెల్ల శిరంబున దోసిలినిడికొని యానందాశ్రువులచే నిండింపఁబడినకన్నులుగలవాఁడై యుండు రాక్షసమర్దనుఁ డగుహనుమంతుని నమస్కరింపుఁడు !

మనోజవం మారుతతుల్యవేగం జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్।
వాతాత్మజం వానరయూథముఖ్యం శ్రీరామదూతం శిరసా నమామి॥ ౨౯

వి॥ మనోజవమ్, మనః=మనస్సుయొక్క జవమ్=వేగమువంటి వేగముగలవాఁడు, మారుతతుల్యవేగమ్, మారుత=వాయువుతో, తుల్య=సమానమైన వేగమ్=వడిగలవాఁడు, జితేంద్రియం, జిత=జయింపఁబడిన, ఇంద్రియమ్=ఇంద్రియములుగలవాఁడు, బుద్ధిమతామ్=ప్రజ్ఞావంతులలో, వరిష్ఠమ్=శ్రేష్ఠుఁడు, వాతాత్మజమ్=వాయుపుత్రుఁడు, వానరయూథముఖ్యమ్, వానరయూథ=కపిసంఘములలో, ముఖ్యమ్=మొదటివాఁడు, శ్రీరామదూతమ్, శ్రీరామ=శ్రీరాముని యొక్క, దూతమ్=వార్తాహరుఁడు నగుహనుమంతుని, శిరసా=శిరస్సుచేత నమామి=నమస్కరించుచున్నాను.

భా॥ మనంబువలెఁ ద్వరగలవాఁడు వాయువువలె వడిగలగతివిశేషము గలవాఁడు నింద్రియసంఘము నెల్ల వశపఱచుకొనినవాఁడు విశేషమేధాసంపన్నుఁడు వానరవీరులలోఁ బ్రథముఁడు సీతారాములకుఁ గుశలవార్త లెఱిఁగించినఁవాఁడు నగుహానుమంతునకు శిరసువంచి నమస్కరించుచున్నాను.

శ్రీ రా మా య ణ ప్రా ర్థ న.

వాల్మీకిస్మృతిమందరేణ మథిత స్సీతారమాసంభవ।
స్సుగ్రీవామరభూరుహాంగదగజ స్సౌమిత్రిచంద్రోదయః॥
వాతోత్పన్నమణి ర్విభీషణసుధః పౌలస్త్యహాలాహల।
శ్శ్రీరామాయణదుగ్ధసింధు రమలో భూయాత్సన శ్శ్రేయసే॥ ౨౨

వి॥ వాల్మీకిస్మృతిమందరేణ, వాల్మీకి=వాల్మీకిమహర్షియొక్క, స్మృతి=స్మరణమను, మందరేణ=మందరపర్వతము చేత, మథితః=తరువఁబడినది, సీతారమాసంభవః, సీతా=సీతాదేవియను, రమా=లక్ష్మియొక్క, సంభవః=పుట్టుక గలది, సుగ్రీవామరభూరుహః, సుగ్రీవ=సుగ్రీవుఁడను, అమరభూరుహః=కల్పవృక్షముకలది, అంగదగజః, అంగద=అంగదుఁడను, గజః=ఏనుఁగు (అనఁగా నైరావతము) గలది, సౌమిత్రిచంద్రోదయః. సౌమిత్రి=లక్ష్మణుఁడను, చంద్ర=చంద్రునియొక్క, ఉదయః=పుట్టుక గలది, వాతోత్పన్నమణిః, వాత=వాయుదేవునివలన, ఉత్పన్న=పుట్టినయాంజనేయుఁడను, మణిః=చింతామణిగలది, విభీషణసుధః, విభీషణ=విభీషణుఁడను, సుధః=అమృతముగలది, పౌలస్త్యహాలాహలః, పౌలస్త్య=రావణుఁడను, హాలాహలః=కాలకూటముగలది, అమలః=స్వచ్ఛమైనది, సః=ప్రసిద్ధమైనదియునగు, శ్రీరామాయణదుగ్ధసింధుః, శ్రీరామాయణ=శ్రీమద్రామాయణమను, దుగ్ధసింధుః=క్షీరసముద్రము, నః=మాకు, శ్రేయసే=మోక్షరూపమగుశుభముకొఱకు, భూయాత్=అగుఁగాక!

భా॥ వాల్మీకిమహర్షియొక్క స్మృతి యనుమందరపర్వతము చేఁ దరువఁబడి సీత యనులక్ష్మీదేవియొక్కయు, సుగ్రీవుం డనుకల్పవృక్షముయొక్కయు నంగదుం డనునైరావతముయొక్కయు లక్ష్మణుం డనుచంద్రునియొక్కయు నాంజనేయుం డనుచింతామణియొక్కయు విభీషణుం డనునమృతముయొక్కయు రావణుం డనుహాలాహలముయొక్కయుఁ బుట్టుకకు మూల మైనశ్రీమద్రామాయణ మనుస్వచ్ఛ మైనక్షీరసాగరము మాకు నపవర్గసుఖం బొసంగుగాక!

యః కర్ణాంజలిసంపుటై రహరహ స్సమ్య క్పిబ త్యాదరా।
ద్వాల్మీకే ర్వదనారవిందగళితం రామాయణాఖ్యం మధు।

జన్మవ్యాధిజరావిపత్తిమరణై రత్యంతసోపద్రవం।
సంసారం స విహాయ గచ్ఛతి పుమాన్ విష్ణోః పదం శాశ్వతమ్॥ ౨౩

వి॥ యః=ఏజనుఁడు, కర్ణాంజలిసంపుటైః, కర్ణ=చెవులనెడి, అంజలి సంపుటైః=దొప్పలవంటిదోసిళ్ళచేత, అహరహః=ప్రతిదినము, వాల్మీకేః=వాల్మీకి మహర్షియొక్క, వదనారవిందగళితం, వదన=మొగమనెడు, అరవింద=పద్మము వలన, గళితమ్=జారిన, రామాయణాఖ్యం=రామాయణ మను పేరుగల, మధు=మకరందమును, ఆదరాత్=ప్రీతివలన, సమ్యక్=లెస్సగా, పిబతి=క్రోలుచుండునో, సః=ఆ, పుమాన్=జనుఁడు, జన్మవ్యాధిజరావిపత్తిమరణైః, జన్మ=పుట్టుకచేత, వ్యాధి=రోగముచేత, జరా=ముదిమిచేత, విపత్తి=కష్టముచేత, మరణైః=గిట్టుటచేతను, అత్యంతసోపద్రవం, అత్యంత=మిక్కిలి, సోపద్రవమ్=ఉపద్రవముతోఁగూడిన, సంసారం=సంసారమును, విహాయ=విడిచి, శాశ్వతమ్=పునరావృత్తిరహితమైన, విష్ణోః=విష్ణుమూర్తియొక్క, పదం=స్థానమగువైకుంఠమును, గచ్ఛతి=పొందుచున్నాఁడు.

భా॥ వాల్మీకిమహామునిచే లోకోపకారార్థము రచింపఁబడినశ్రీమద్రామాయణమహాకావ్యమునందుఁ గలసత్కథను నాదరబుద్ధితోఁ బ్రతిదినము శ్రద్ధగా వినుచుండువారు జననమరణాదిప్రవాహాత్మక మగుసంసారమును విడనాడి శాశ్వతానందయుత మగువిష్ణుసాయుజ్యము నొందుదురు.

తదుపగతసమాససంధియోగమ్।
సమమధురోపనతార్థవాక్యబద్ధమ్।
రఘువరచరితం మునిప్రణీతమ్।
దశశిరసశ్చ వధం నిశామయధ్వమ్॥ ౨౪

వి॥ ఉపగతసమాససంధియోగం, ఉపగత=పొందఁబడిన, సమాస=సమాసములు సంధి=సంహితలు, యోగం=శబ్దవ్యుత్పత్తులునుగలదియు, సమమధురోపనతార్థవాక్యబద్ధం, సమ=సమములు, మధుర=హృద్యములు, ఉపనత=పొందఁబడిన, అర్థ=అర్థములుగలవియునగు, వాక్య=వాక్యములచేత, బద్ధం=రచింపఁబడినది, రఘువరచరితం, రఘు=రఘువంశోత్పన్నులలో, వర=శ్రేష్ఠుఁడైనశ్రీరామచంద్రునియొక్క, చరితం=చరిత్రమును, దశశిరసః=రావణాసురుని యొక్క, వధం=వధించుటనునుద్దేశించి, మునిప్రణీతం, ముని=వాల్మీకిమహర్షిచే, ప్రణీతం=రచింపఁబడిన, తత్=ఆశ్రీమద్రామాయణమును, నిశామయధ్వం=చూడుఁడు!

భా॥ శాస్త్రసిద్ధము లైనసమాసములు సంధులు శబ్దవ్యుత్పత్తులుఁ గలిగి యెక్కువదక్కువలు లేక తులఁదూచినట్లు మధురములు సమంజసార్థములు నగువాక్యములచేఁ గూర్పఁబడి శ్రీరామునిచరిత్రమును రావణవధను గూరి వాల్మీకిమహర్షిచే రచింపఁ బడినశ్రీమద్రామాయణమును సావధాను లై యాకర్ణింపుఁడు !

వాల్మీకిగిరిసంభూతా రామసాగరగామినీ।

పునాతి భువనం పుణ్యా రామాయణమహానదీ॥ ౨౫

వి॥ వాల్మీకిగిరిసంభూతా, వాల్మీకి=వాల్మీకిమహర్షియను, గిరి=పర్వతము నుండి, సంభూతా=పుట్టినది, రామసాగరగామినీ, రామ=శ్రీరాముఁడనెడి, సాగర=సముద్రమును, గామినీ=పొందినది, పుణ్యా=పవిత్రమైనదియునగు, రామాయణమహానదీ, రామాయణ=రామాయణమనెడు, మహత్=గొప్పది యగు, నదీ=నది, భువనం=లోకమును, పునాతి=పవిత్రింపఁజేయుచున్నది.

భా॥ హిమాలయమున జనించి సముద్రమునఁ బ్రవేశించుచున్న పూజ్య మైనగంగానది జగంబులను నిష్కల్మషంబులం జేయునట్లు మునిమూర్ధన్యుఁ డగువాల్మీకియొక్క ముఖాంబుజంబునుండి బయలువెడలి శ్రీరామచంద్రపరబ్రహ్మమును బ్రతిపాదించుచున్నశ్రీమద్రామాయణము లోకములఁ బావనములనుగాఁ జేయుచున్నది.

శ్లోకసారసమాకీర్ణం సర్గకల్లోలసంకులమ్।

కాండగ్రాహమహామీనం వందే రామాయణార్ణవమ్॥ ౨౬

వి॥ శ్లోకసారసమాకీర్ణం, శ్లోక=పద్యములనెడి, సార=జలముచే, సమాకీర్ణమ్=వ్యాప్తమైనది, సర్గకల్లోలసంకులమ్, సర్గ=సర్గములనెడి, కల్లోల=తరంగములచే, సంకులం=కలఁతవడినది, కాండగ్రాహమహామీనం, కాండ=కాండములనెడి, గ్రాహ=మొసళ్లు, మహామీనం=గొప్పమత్స్యములుగలదియునగు, రామాయణార్ణవం, రామాయణ=రామాయణమను, అర్ణవం=సముద్రమును, వందే=నమస్కరించుచున్నాను.

భా॥ విశేషజలతరంగములచే నాకులిత మగుచు గొప్పమొసళ్ళతోడఁ దిమితిమింగిలాదిమహామత్స్యంబులతోడను గూడినసముద్రంబు చందంబున నిరువదినాలుగువేలశ్లోకములతోడ నైదువందలసర్గములతోడ నేడుకాండములతోడ నొప్పుచున్నశ్రీమద్రామాయణమునకు మ్రొక్కుచున్నాను.

వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే।
వేదః ప్రాచేతసా దాసీ త్సాక్షా ద్రామాయణాత్మనా॥ ౨౭

వి॥ వేదవేద్యే, వేద=(నాలుగు) వేదములచేత, వేద్యే= తెలిసికొనఁదగిన, పరే, పుంసి=పరమపురుషుఁడు దశరథాత్మజే, దశరథ=దశరథమహారాజునకు, ఆత్మజే=కుమారుఁడై, జాతే=పుట్టఁగా, వేదః=వేదము, సాక్షాత్ = కేవలము, ప్రాచేతసాత్ =వాల్మీకిమహర్షివలన, రామాయణాత్మనా=రామాయణస్వరూపముతో, ఆసీత్ =ప్రాదుర్భవించెను.

భా॥ వేదములచే నెఱుఁగఁ బడుచున్న పరబ్రహ్మము దుష్టశిక్షణశిష్టపరిపాలనార్థము మర్త్యలోకంబున దశరథమహీకాంతునకుఁ గొమరుండై యుదయింప సాక్షాద్వేదము వాల్మీకిమునిపుంగవునివలన రామాయణస్వరూపమున బయలువెడలెను.

శ్రీరామచంద్రధ్యానశ్రమము.

వై దేహీసహితం సురద్రుమతలే హైమే మహామంటపే।
మధ్యేపుష్పక మాసనే మణిమయే వీరాసనే సుస్థితమ్।
అగ్రేవాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరం।
వ్యాఖ్యాంతం భరతాదిభిః పరివృతం రామం భజే శ్యామలమ్॥ ౨౮

వి॥ వైదేహీసతితం. వైదేహీ = సీతాదేవితో, సహితం = కూడికొనిన వాఁడు, సురద్రుమతలే, సురద్రుమ = కల్పవృక్షముయొక్క, తలే = నీడను, హైమే=సువర్ణ వికారమైన, మహామండపే, మహాత్ =విశాలమైన, మండపే= మండపమందు, మధ్యేపుష్పకం = పుష్పకవిమానముయొక్క మధ్యయందు, మణిమయే=మాణిక్యప్రచురమైన, ఆసనే=సింహాసనమున, వీరాసనే=వీరాసనమనుయోగాసనంబున, సుస్థితం=సుఖముగాఁ గూరుచున్నవాఁడు, అగ్రే=ఎదుట ప్రభంజనసుతే, ప్రభంజన=వాయువునకు, సుతే=కుమారుఁ డగునాంజనేయుఁడు, వాచయతి=చదువుచుండఁగా, మునిభ్యః=మునులకొఱకు, పరం=ఉత్కృష్టమైన, తత్త్వం=పరబ్రహ్మమునుగూర్చి, వ్యాఖ్యాంతం=విస్తరించి చెప్పుచున్నవాఁడు, భరతాదిభిః=భరతుఁడు మొదలగువారితో, పరివృతం=పరివేష్టింపఁ బడినవాఁడు నగు, శ్యామలం=నల్లనియాకారముగల, రామం = శ్రీరాముని, భజే = సేవించుచున్నాను.

భా॥ పరమపవిత్ర మగువిదేహవంశమం దుదయమందిన సీతాదేవితోఁ గూడికొని కల్పవృక్షచ్ఛాయను సువర్ణమండపమునఁ బుష్పకవిమానము నుంచి

యావిమానముయొక్క మధ్యను రత్నఖచిత మగుసింహాసనముపై వీరాసనో పేతుఁడై నిశ్చలచిత్తముతోఁ గూరుచుండి యాంజనేయుఁ డెదుట నుండి చదువుచుండ సమస్తమహాత్ములకుఁ బరతత్త్వమును విస్తరించి బోధించు చున్న వాఁడై తమ్ములగుభరతాదులచే నెల్లప్పుడుం గొలువఁ బడుచున్న మేఘ శ్యామలమూర్తి యగుశ్రీరామచంద్రుని సేవించుచున్నాను.

వామే భూమిసుతా పురస్తు హనుమాన్ పశ్చాత్సుమిత్రాసుత।
శ్శత్రుఘ్నో భరతశ్చ పార్శ్వదళయో ర్వాయ్వాదికోణేషు చ।
సుగ్రీవ శ్చ విభీషణ శ్చ యువరాట్తారాసుతో జాంబవా।
న్మధ్యే నీలసరోజకోమలరుచిం రామం భజే శ్యామలమ్॥ ౙ

వి॥ వామే=ఎడమవైపున, భూమిసుతా, భూమి=భూదేవిక, సుతా=కుమార్తెయైనసీతాదేవి, (అస్తి)=కలదు; పురః=ఎదుట, హనుమాన్=ఆంజనేయుఁడు, పశ్చాత్=వెనుక, సుమిత్రాసుతః, సుమిత్రా=సుమిత్రాదేవియొక్క, సుతః=కుమారుం డగులక్ష్మణుండు, పార్శ్వదళయోః=ఇరుప్రక్కలను, శత్రుఘ్నః=శత్రుఘ్నుఁడు, భరతశ్చ=భరతుండును, వాయ్వాదికోణేషు=వాయవ్యము మొదలైనమూలలందు, సుగ్రీవశ్చ=సుగ్రీవుఁడును, విభీషణశ్చ=విభీషణుండును, యువరాట్=యువరాజగు, తారాసుతశ్చ, తారా=తారయొక్క, సుతశ్చ=కుమారుఁడగు నంగదుఁడును, జాంబవాన్=జాంబవంతుడును, (సంతి)కలరు, మధ్యే=మధ్యను (స్థితం)ఉన్నవాఁడు, నీలసరోజ కోమలరుచిం, నీల=నల్లనైన, సరోజ=కలువపువ్వువలె, కోమల=మృదువైన,రుచిం=కాంతిగలవాఁడు, శ్యామలం=నల్లనివాఁడునగు, రామం=శ్రీరాముని, భజే=సేవించుచున్నాను.

భా॥ భూపుత్రిక యగుసీతాదేవి వామభాగమున, నెదుట హనుమంతుఁడు, వెనుక లక్ష్మణుండు, కుడియెడమభాగములందు భరతశత్రుఘ్నులు, నాగ్నేయకోణమున నంగదుఁడు, నైరృతికోణమున జాంబవంతుఁడు, వాయవ్యభాగమున సుగ్రీవుఁడు, నీశాన్యభాగమున విభీషణుఁడు, నిలిచి కొలువ మధ్యభాగంబున నవరత్నఖచితసింహాసనాసీనుఁడై జగద్రక్షణం బొనర్చునీలోత్పలశ్యాముం డగుశ్రీరామచంద్రుని సేవించుచున్నాను.

---

ౙ శ్రీరాముఁడు దూర్వాసునకు విందొనర్పంబూని పారిజాతకల్పతరువులను భూలోకంబునకుఁ దెప్పించెనని యానందరామాయణమునఁ జెప్పఁబడినది.

మాతా రామో మత్పితా రామభద్రో।
భ్రాతా రామో మత్సఖా రాఘవేశః।
సర్వస్వం మే రామచంద్రో దయాళుః।
నాన్యం దైవం నైవ జానే న జానే॥ ౩౦

వి॥ రామః=శ్రీరాముఁడు, మే=నాకు, మాతా=జననీస్వరూపుఁడు,(భవతి) అగుచున్నాఁడు; రామభద్రః=భద్రమూర్తియగు శ్రీరాముఁడు, మత్పితా=నాజనకస్వరూపుఁడు, (భవతి)అగుచున్నాఁడు, రామః=శ్రీరాముఁడు, భ్రాతా=సోదరస్వరూపుఁడు, (భవతి)అగుచున్నాఁడు; రాఘవేశః, రాఘవ=రఘువంశజులలో, ఈశః=అగ్రగణ్యుం డగుశ్రీరాముఁడు, మత్సఖా, మత్=నాయొక్క, సఖా=సుహృత్స్వరూపుఁడు, (భవతి) అగుచున్నాఁడు, దయాళుః=కరుణాస్వభావముగల, రామచంద్రః=చంద్రునివలెఁ బ్రజల కాహ్లాదమును సమకూర్చు శ్రీరాముఁడు, మే=నాయొక్క, సర్వస్వం=సమస్తధనము, (భవతి)అగుచున్నాఁడు; (అహం)నేను, అన్యం=వేఱొక, దైవం=దైవమును, న(జానే)=ఎఱుఁగను; (అహం)=నేను, నైవజానే = ఎంతమాత్రము నెఱుఁగను; (అహం)=నేను, నజానే=ఎఱుఁగను.

భా॥ యోగివర్యులచే హృదయములం దనంతస్వరూపుం డనిధ్యానింపఁబడు రాముని నన్నుఁబెంచిపోషించు జననీస్వరూపునిగాను, భక్తపారిజాత మని ప్రసిద్ధిగాంచిన శుభస్వరూపుఁ డగురాముని నాకువిద్యాబుద్ధులు గఱపి సకలవిధంబుల హితంబు గోరు జనకస్వరూపుని గాను, సుగుణజాలంబుచే సకలప్రాణులను సంతోషమున నోలలాడించు శ్రీరాముని సకలకార్యములందును సాహాయ్య మొనర్చు సోదరస్వరూపునిగాను, రఘుజాతీయు లగురాజశ్రేష్ఠులలో నుత్తముఁ డగుశ్రీరాముని యనవరతముఁ గష్టసుఖములందుఁ దోడ్పడు మిత్రస్వరూపుని గాను, చంద్రుఁడు సమస్తభూతములను సంతోషపఱచునట్లు సకలలోకముల నాహ్లాదపఱచు పరమకారుణికుఁ డైన శ్రీరామచంద్రుని మూలధనస్వరూపునిగాను నెఱుంగుదును; వేఱొక దైవమును నేను ముమ్మాటికి నెఱుఁగను.

సాకేతే శరదిందుకుందధవళే సౌధే మహామండపే।
పర్యస్తాగురు ధూపదీపలలితే కర్పూరదీపోజ్జ్వలే।
సుగ్రీవాంగద జాంబవత్పరివృతం సౌమిత్రిణా సేవితం।
లీలామానుషవిగ్రహం రఘువరం రామం భజే శ్యామలమ్॥ ౩౧

వి॥ సాకేతే=అయోధ్యానగరమందు, శరదిందుకుందధవళే, శరత్=శరత్కాలమందలి, ఇందు=చంద్రునివలె, కుంద=మల్లిపువ్వువలెను, ధవళే=స్వచ్ఛమైన, సౌధే=మేడయందు, పర్యస్తాగురుధూపదీపలలితే, పర్యస్త=వ్యాపించుచున్న, అగురుధూప=అగురుయొక్క ధూపములచేత, దీప=దీపములచేత, లలితే=సుందరమైనది, కర్పూరదీపోజ్వలే, కర్పూరదీప=కప్పురపుదీపములచేత, ఉజ్వలే=ప్రకాశింపఁజేయఁబడుచున్నదియునగు, మహామండపే=గొప్పమండపమునందు, సుగ్రీవాంగదజాంబవత్పరివృతం, సుగ్రీవ=సుగ్రీవునిచేత, అంగద=అంగదునిచేత, జాంబవత్=జాంబవంతునిచేత, పరివృతమ్=ఆవరింపఁబడినవాఁడు సౌమిత్రిణా=లక్ష్మణునిచే, సేవితమ్=సేవింపఁబడుచున్నవాఁడు, లీలామానుషవిగ్రహం, లీలా=విలాసార్థము, మానుషవిగ్రహం=మనుష్యశరీరమునుధరించినవాఁడు, శ్యామలం=నల్లనివాఁడునగు, రామం=శ్రీరాముని, భజే=సేవించుచున్నాను.

భా॥ అయోధ్యాపట్టణమునఁ జంద్రకాంతమాణిక్యములతో నిర్మింపఁబడినమేడలో నానాసుగంధద్రవ్యములచేఁ బరిమళింపఁ జేయఁబడి ధూపదీపాదులచేఁ బ్రకాశితమై కర్పూరదీపములచే దేదీప్యమాన మగుచున్న విశాలమండపమునందు సుగ్రీవాదిస్నేహితులు పరివేష్టింప లక్ష్మణాదిభ్రాతృసమూహముచేఁ గొలువఁబడుచు లోకసంరక్షణార్థము మనుష్యశరీరమును ధరించియున్ననీలమేఘశ్యాముండగు శ్రీరామచంద్రుని సేవించుచున్నాను.

నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ దేవ్యై చ తస్యై జనకాత్మజాయై।
నమోఽస్తు రుద్రేంద్రయమానిలేభ్యో నమోఽస్తు చంద్రార్కమరుద్గణేభ్యః॥ 3

వి॥ సలక్ష్మణాయ=లక్ష్మణునితోఁగూడిన, రామాయ=శ్రీరామునికొఱకు, నమః=నమస్కారము. అస్తు=అగుఁగాక; తస్యై=ప్రసిద్ధురాలు, దేవ్యై=పూజ్యురాలు, జనకాత్మజాయై చ, జనక=జనకమహారాజునకు, ఆత్మజాయై చ=కుమార్తెయునగుసీతాదేవికొఱకును, నమః=నమస్కారము, (అస్తు) అగుఁగాక; రుద్రేంద్రయమానిలేభ్యః, రుద్ర=శివునికొఱకు, ఇంద్ర=దేవేంద్రునికొఱకు, యమ=యమధర్మరాజుకొఱకు, అనిలేభ్యః=వాయుదేవునికొఱకు, నమః=నమస్కారము, అస్తు=అగుఁగాక; చంద్రార్కమరుద్గణేభ్యః, చంద్ర=చంద్రునికొఱకు, అర్క=సూర్యునికొఱకు, మరుద్గణేభ్యః=దేవగణములకొఱకు, నమః=నమస్కారము, అస్తు=అగుఁగాక.

భా॥ సీతారామలక్ష్మణులకు నమస్కారము; పరమేశ్వరునకు దేవేంద్రునకు యమునకు వాయువునకు సూర్యచంద్రులను దేవతాగణములకు నమస్కారము.

కాకపక్షధరం దేవం వనమాలావిభూషితమ్।
శ్రీరామం బాలకం ధ్యాయే ద్బాలకాండే మునీశ్వర॥

భా॥ బాలకాండ పారాయణసమయమునఁ బిల్లజుట్టుతోఁ గూడి వనమాలాలంకృతుండై బాలవేషముతో నొప్పు పూజ్యుఁడైన శ్రీరాముని ధ్యానింపవలయును.

పిమ్మట స్వనియమానుసారముగాఁ బారాయణ మొనర్పవలయును. పారాయణమును బూర్వసర్గాంత్యశ్లోకముతోఁ బ్రారంభించి యుత్తరసర్గాదిమ శ్లోకముతో ముగింపం దగు.

---

## పారాయణము ముగించినపిమ్మట స్మార్తమాధ్వాదులచేఁ జదువఁదగిన మంగళశ్లోకములు.

---

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతామ్।
న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః।
గోబ్రాహ్మణేభ్య శ్శుభ మస్తు నిత్యం।
లోకా స్సమస్తా స్సుఖినో భవంతు॥ 33

ప్రతి॥ ప్రజాభ్యః=ప్రజలకొఱకు, స్వస్తి=శుభము, (అస్తు) అగుఁగాక; మహీశాః=భూపతులు, న్యాయ్యేన = న్యాయమునుండి తప్పని, మార్గేణ= మార్గముచేత, మహీం = భూమిని, పరిపాలయంతాం = పాలించెదరుగాక; గోబ్రాహ్మణేభ్యః, గో=గోవులకొఱకు, బ్రాహ్మణేభ్యః = బ్రాహ్మణులకొఱకు, నిత్యం=ఎల్లప్పుడు, శుభం=శుభము, అస్తు=అగుఁగాక; సమస్తాః=నిఖిలములయిన, లోకాః=లోకములు, సుఖినః=సుఖముగలవి, భవంతు=అగుఁగాక!

భా॥ సమస్తప్రజలు నాయురారోగ్యాదిభాగ్యయులు గలిగి వర్ధిల్లుదురు గాక! భూమిపాలకు లెల్లరు రాజనీతిఁ బురస్కరించుకొని ధర్మమును తప్పకుండునట్లు భూమిని బాలింతురుగాక! క్షీరాదులచే లోకమునకు మహోపకార మొనర్చు

గోవులు మొదలగుజంతువులకు, స్వవర్ణాశ్రమోచితధర్మపురస్సరము గాఁ బ్రవర్తించు బ్రాహ్మణాదిసమస్తవర్ణములవారికి నిత్యశుభము గలిగి నిఖిలలోకములు నఖండసుఖములతోఁ దులతూగుచున్న వగుఁగాక!

కాలే వర్షతు పర్జన్యః పృథివీ సస్యశాలినీ।
దేశో యం క్షోభరహితో బ్రాహ్మణా స్సంతు నిర్భయాః॥ 38

వి॥ పర్జన్యః=మేఘుఁడు, కాలే=యుక్తకాలమందు, వర్షతు=వర్షించుఁగాక, పృథివీ=భూమి, సస్యశాలినీ, సస్య=సస్యములచే, శాలినీ=ఒప్పుచున్నది. భవతు=అగుఁగాక, అయం=ఈ, దేశః=దేశము, క్షోభరహితః, క్షోభ=కఱవులు మొదలగువానివలనఁ గలుగుపీడచే, రహితః=శూన్యమైనది, (అస్తు)అగుఁగాక, బ్రాహ్మణాః=బ్రాహ్మణులు, నిర్భయాః=భయములేనివారు, సంతు=అగుదురుగాక!

భా॥ మేఘుఁడు యుక్తకాలములందు సర్వసస్యానుకూలముగా వర్షించుటచే భూమి యంతయు సమృద్ధముగా ఫలింప దేశీయులందఱుఁ బాడిపంటలు గలిగి కఱవులు లోనగుబాధల నొందక సుఖముగా నుండుటచే బ్రాహ్మణులు వేదవేదాంగాధ్యయనశీలురు లయి తపోనిష్ఠాగరిష్ఠు లగుచు స్వకర్మానుష్ఠానమున నిరతులై యెట్టిభయము లే కుందురుగాక!

అపుత్రాః పుత్రిణ స్సంతు పుత్రిణ స్సంతు పౌత్రిణః।
అధనా స్సధనా స్సంతు జీవంతు శరదాం శతమ్॥ 39

వి॥ అపుత్రాః=పుత్రులులేనివారు, పుత్రిణః=పుత్రసంతానముగలవారు, సంతు=అగుదురుగాక; పుత్రిణః=పుత్రవంతులు, పౌత్రిణః=పుత్రులయొక్క సంతానములతోఁగూడినవారు, సంతు=అగుదురుగాక; అధనాః=ధనములేనివారు, సధనాః=మిక్కిలిధనముగలవారు, సంతు=అగుదురుగాక; సర్వే=ఎల్లఱు, శరదాం=సంవత్సరములయొక్క, శతం=నూటిని, జీవంతు=జీవించెదరుగాక!

భా॥ సమస్తజనులు పుత్రులు, పౌత్రులు గలిగి ధనధాన్యాదులతోఁ గూడికొని నూఱేసిసంవత్సరములు జీవింతురుగాక!

చరితం రఘునాథస్య శతకోటిప్రవిస్తరమ్।
ఏకైక మక్షరం ప్రోక్తం మహాపాతక నాశనమ్॥

వి॥ రఘునాథస్య=రఘువంశీయులలో శ్రేష్ఠుఁడైన శ్రీరామునియొక్క, చరితం=చరిత్రము, శతకోటిప్రవిస్తరం శతకోటి=నూఱుకోట్లసంఖ్యచేతను, ప్రవిస్తరం=వ్యాపించినది,భవతి=అగుచున్నది,(తస్మిన్=ఆచరిత్రమందు)ఏకైకం=ఒక్కొకటియగు, అక్షరం=అక్షరము, మహాపాతకనాశనం, మహాపాతక=బ్రహ్మహత్యాదిపాపములను, నాశనం=నశింపఁజేయునదిగా, ప్రోక్తం=చెప్పఁబడినది.

భా॥ శతకోటిసంఖ్యగల శ్లోకములతో నొప్పుచున్న శ్రీమద్రామాయణమునందలియొక్కొక వర్ణంబు సమస్తమహాపాపములఁ బోఁగొట్టునని చెప్పఁబడినది.

శృణ్వన్ రామాయణం భక్త్యా యః పాదం పద మేవ వా।

స యాతి బ్రహ్మణ స్థానం బ్రహ్మణా పూజ్యతే సదా। 32

వి॥ యః=ఎవ్వఁడు; భక్త్యా=భక్తిచేత, రామాయణం=శ్రీమద్రామాయణమును, పాదం=పాదమాత్రిమును గాని, పదమేవవా=పదమాత్రిముంగాని, శృణ్వన్=వినుచున్నవాఁడు, (భవతి)అగుచున్నాఁడో, సః=ఆపురుషుఁడు, బ్రహ్మణః=బ్రహ్మయొక్క, స్థానం=స్థానమునుగూర్చి, యాతి=వెళ్ళుచున్నాఁడు, సదా=ఎల్లప్పుడు, బ్రహ్మణా=బ్రహ్మదేవునిచే, పూజ్యతే=పూజింపఁబడుచున్నాఁడు.

భా॥ శ్రీరామచంద్రచరితానువర్ణనాత్మకమగు శ్రీమద్రామాయణము నందలి యొకశ్లోకముయొక్క పాదమాత్రిమును గాని పదమాత్రిమును గాని నియమముతో నాకర్ణించిన మనుజుండు బ్రహ్మలోకమున కేగి యచ్చట బ్రహ్మచేఁ బూజింపఁ బడు చుండును.

రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే।

రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః॥ 33

వి॥ రామాయ=మహర్షులనానందపఱచువాఁడు, రామభద్రాయ=శుభస్వరూపుండగుటచే నభిరాముండైనవాఁడు, రామచంద్రాయ, నిఖిలప్రాణులకుఁ జంద్రునివలె నానందముగలుగఁ జేయుటచే మనోహరస్వరూపుండు, వేధసే=పరబ్రహ్మమైనవాఁడు, రఘునాథాయ, రఘు=రఘువంశజు లగురాజులలో, నాథాయ=ఉత్తముండు, నాథాయ=సమస్తలోకములకుఁ బ్రభువు, సీతాయాః=సీతాదేవికి, పతయే=భర్తయునగుశ్రీరామునికొఱకు, నమః=నమస్కారము, (అస్తు=అగుఁగాక !)

భా॥ మహర్షులచే సేవింపఁ బడుచుండువాఁడు లోకములకు క్షేమముఁ గలిగించువాఁడు సకలప్రాణులను సంతోషమున నోలలాడించువాఁడుఁ బరబ్రహ్మస్వరూపుఁడుఁ గకుత్థ్సకులతిలకుఁడు లోకైకనాయకుఁడు నగుజానకీపతికి నమస్కారము.

మంగళం కోసలేంద్రాయ మహనీయగుణాబ్ధయే।
చక్రవర్తితనూజాయ సార్వభౌమాయ మంగళమ్॥ ౩౯

వి॥ మహనీయగుణాబ్ధయే, మహనీయ=పూజ్యములగు, గుణ=గుణములకు, అబ్ధయే=సముద్రమైన, కోసలేంద్రాయ, కోసల=ఉత్తరకోసలదేశములకు, ఇంద్రాయ=ప్రభువగుశ్రీరామునికొఱకు, మంగళం=శుభము, (అస్తు, అగుఁగాక, చక్రవర్తితనూజాయ, చక్రవర్తి=లోకైకసార్వభౌముం డగుదశరథమహారాజునకు, తనూజాయ=కుమారుఁడైన, సార్వభౌమాయ=సమస్తభూమండలమున నేకచ్ఛత్రాధిపతి యగుశ్రీరామునికొఱకు, మంగళం=శుభము) (అస్తు)అగుఁగాక !

భా॥ అసంఖ్యాకము లగుసద్గుణములచే నొప్పుచు సమస్తభూమండలమున నేకచ్ఛత్రాధిపత్యము వహించి జనరంజకముగఁ గోసలదేశమును బాలించిన దశరథసార్వభౌముని కుమారుఁ డగుశ్రీరామునకు నిత్యశుభ మగుఁగాక!

యన్మంగళం సహస్రాక్షే సర్వదేవనమస్కృతే।
వృత్రనాశే సమభవ త్తత్తే భవతు మంగళమ్॥ ౪౦

వి॥ సర్వదేవనమస్కృతే, సర్వదేవ=సమస్తదేవతలచే, నమస్కృతే=మ్రొక్కఁ బడుచున్నసహస్రాక్షే=వేయికన్నులు గలదేవేంద్రునివిషయమై, వృత్రనాశే=వృత్రాసురసంహారరూప మగుకార్యమున, యత్=ఏ, మంగళం=శుభము, సమభవత్=ఆయెనో, తత్=ఆ, మంగళం=శుభము, తే=నీకొఱకు, భవతు=అగుఁగాక !

భా॥ ఓశ్రీరామచంద్రా! వృత్రాసురుని సంహరింపం జనుసమయమున సమస్తదేవతలచేఁ గొలువం బడుచున్నదేవేంద్రున కెట్టిశుభం బయ్యెనో అట్టిశుభము నీ కగుఁగాక !

యన్మంగళం సుపర్ణస్య వినతాఽకల్పయ త్పురా।
అమృతం ప్రార్థయానస్య త త్తే భవతు మంగళమ్॥ ౪౧

వి॥ వినతా=వినత యనెడికశ్యపప్రజాపతియొక్క భార్య, అమృతం=అమృతమును, ప్రార్థయానస్య=కోరుచున్న, సుపర్ణస్య=గరుత్మంతునకు, యత్=ఏ, మంగళం=శుభాశీర్వాదమును, అకల్పయత్=చేసెనో, తత్=అట్టి, మంగళమ్=మంగళాశాసనము, తే=నీకొఱకు భవతు=అగుఁగాక.

భా॥ ఓరామచంద్రా ! తల్లి యగువినతవలన నాశీర్వదింపఁబడి యమృతాహరణార్థ మరిగినగరుత్మంతున కెందరివిజయరూప మగుమంగళ మెట్లులభించెనో యట్లు నీకును శత్రువిజయరూప మగు శుభము సమకూరుఁగాక ।

అమృతోత్పాదనే దైత్యాన్ ఘ్నతో వజ్రధరస్య యత్ ।
అదితి ర్మంగళం ప్రాదా త్తత్తే భవతు మంగళమ్॥ ౪౨

వి॥ అదితిః=దేవమాతయగునదితి, అమృతోత్పాదనే, అమృత=అమృతముయొక్క, ఉత్పాదనే=జనింపఁజేయుటయనుకార్యమునం, దైత్యాన్=రాక్షసులను, ఘ్నతః=కొట్టుచున్న, వజ్రధరస్య=దేవేంద్రునకు, యత్=ఏమంగళాశీర్వచనమును, ప్రాదాత్=ఒసఁగెనో, తత్=ఆ, మంగళం=శుభాశీర్వచనము, తే=నీకొఱకు, భవతు=అగుఁగాక !

భా॥ ఓరామభద్రా! పూర్వము దేవదానవులు క్షీరసముద్రమును మథించి యమృతమును బడయుటకు సమకట్టినసమయమున దేవమాత యగు నదితి తనపుత్రు లగుదేవతలకొసంగిన శుభాశీర్వచనమువలన నాదేవతలకు రాక్షసవిజయరూప మగుమంగళము లభించిన చందమున నీవును దుష్టశిక్షణ శిష్టపరిపాలనరూప మగుశుభముఁ బొందుదువుగాక!

త్రీన్ విక్రమాన్ ప్రక్రమతో విష్ణో రమితతేజసః ।
యదాసీ న్మంగళం రామ తత్తే భవతు మంగళమ్॥ ౪౩

వి॥ రామ=ఓరామా! త్రీన్=మూఁడయిన, విక్రమాన్=పాదన్యాసములను, ప్రక్రమతః=వ్యాపింపఁజేయుచున్న, అమితతేజసః, అమిత=అధికమైన, తేజసః=శక్తిగల, విష్ణోః=శ్రీమన్నారాయణునకు, యత్=ఏ, మంగళం=శుభము, ఆసిత్=ఆయెనో, తత్=అట్టి, మంగళం=శుభము, తే=నీకొఱకు, భవతు=అగుఁగాక.

భా॥ రామచంద్రా! వామనరూపంబుతో నేతెంచి మూఁడడుగులు భూమిని గోరి మూఁడులోకముల నాక్రమించిన త్రివిక్రమదేవునిభంగి సమస్త

శత్రువుల గెలిచి ముజ్జగంబులను స్వాధీనములం జేసికొని యఖండశ్రేయశ్శాలి వై వర్థిల్లుదువుగాక!

ఋతవస్సాగరా ద్వీపా వేదా లోకా దిశశ్చ తే।
మంగళాని మహాబాహో దిశంతు శుభమంగళాః॥ ౪౪

వి॥ మహాబాహో=ఆజానుబాహుండ వగుశ్రీరామా! శుభమంగళాః, శుభ=మంగళద్రవ్యములకును, మంగళాః=శుభము నిచ్చుసామర్థ్యం బొసఁగు, ఋతవః=ఋతువులు, సాగరాః=సముద్రములు, ద్వీపాః=ద్వీపములు వేదాః=వేదములు, లోకాః=లోకములు, దిశశ్చ=దిక్కులు, తే=నీకొఱకు, మంగళాని=శుభములను, దిశంతు=ఇచ్చుఁగాక!

భా॥ మోకాళ్లనంటు వ్రేలుచున్న బాహువులు గలరాముఁడా! మంగళద్రవ్యములకును మహత్త్వమునుగలిగించువసంతాదులగు నాఱుఋతువులు, లవణాదిసప్తసముద్రములు, జంబూద్వీపము మొదలగు సప్తద్వీపములు, ఋగ్వేదము మున్నగునాలుగువేదములు, స్వర్గము మొదలగుమూడులోకములుఁ, దూర్పు మొదలగు నెనిమిది దిక్కులును నీకెల్లప్పుడు శుభంబు లిచ్చి రక్షించుఁగాక!

కాయేన వాచా మనసేంద్రియైర్వా।
బుద్ధ్యాత్మనా వా ప్రకృతే స్స్వభావాత్।
కరోమి యద్యత్సకలం పరస్మై।
శ్రీరాఘవాయేతి సమర్పయామి॥ ౪౫

వి॥ కాయేన=శరీరము చేత, వాచా=వాక్కుచేత, మనసా=మనస్సుచేత, బుధ్యా=బుద్ధిచేత, ఆత్మనా వా=జీవుని చేత, ప్రకృతేః=ప్రకృతివలన, స్వభావాత్=సహజప్రవర్తనవలన, యద్యత్=ఏయేకర్మమును, కరోమి=చేయుచున్నానో, సకలం=సమస్తము, పరస్మై=పరబ్రహ్మస్వరూపుఁడగు, శ్రీరాఘవాయేతి=రఘుకుల సంభూతుఁ డగుశ్రీరామునికొఱకేయని, సమర్పయామి=సమర్పించుచున్నాను.

భా॥ రఘుకులసంజాతుండ వగు శ్రీరామా! కాయికవాచికమానసిక వ్యాపారములచే, జ్ఞానకర్మేంద్రియములచే, బుద్ధిచే, జీవునిచేఁ బ్రకృతిచే, స్వభావముచే, దివారాత్రములయందు నాచేఁ జేయఁబడుకర్మముల నెల్లఁ బరబ్రహ్మస్వరూపుఁడ వగునీకు సమర్పించుచున్నాను.

యదక్షరపదభ్రష్టం మాత్రాహీనం చ యద్భవేత్।
తత్సర్వం క్షమ్యతాం దేవ శ్రీరాఘవ నమోఽస్తు తే॥ ౪౮

వి॥ యత్ =ఏవాక్యము. అక్షరపదభ్రష్టమ్, అక్షర=వర్ణములతో, పద=పదములతో డను, భ్రష్టం=జారినది, భవేత్ =అగునో, యత్ =ఏవాక్యము, మాత్రాహీనంచ, మాత్రా = మాత్రలచే, హీనంచ = శూన్యమైనదియు, భవేత్ =అగునో, దేవ=పూజ్యుఁడ వగురామా! తత్ =ఆ, సర్వం=సమస్త వాక్యజాలము, త్వయా=నీచేత, క్షమ్యతాం=సహింపఁబడుఁగాక! శ్రీరాఘవ=రఘుకులోత్పన్నుండ వగురామచంద్రా! తే=నీకొఱకు, నమః=నమస్కారము, అస్తు=అగుఁగాక!

భా॥ ప్రతిదినము నాచేఁ జదువఁబడుచున్న నీసత్కథలోఁ గలవాక్యములందు వర్ణములు గాని పదములు గాని మాత్రలు గాని లోపించినను వానినన్నిఁటి దయతో సైరింపు మని పూజ్యుండవు రఘువంశీయులలో నుత్తముండవు నగునీకు ప్రమొక్కుచున్నాను.

ఆత్మా త్వం క్షితిజా మతిః పరిజనాః ప్రాణాః శరీరం గృహం।
పూజా తే విషయోపభోగరచనా నిద్రాసమాధిస్థితిః।
సంచారః పదయోః ప్రదక్షిణవిధిః స్తోత్రాణి సర్వా గిరో।
యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం రామాస్తు తే పూజనమ్॥ ౪౯

వి॥ రామ=శ్రీరామా, ఆత్మా=(నా)అంతరాత్మ, త్వం=నీవు, మతిః=(నా)బుద్ధి, క్షితిజా=భూపుత్రికయగుసీతాదేవి, ప్రాణాః=(నా)పంచప్రాణములు, పరిజనాః = (నీ)యనుచరులు, శరీరం = (నా)దేహము, గృహం = (నీ)నివాసమందిరము, విషయోపభోగరచనా, విషయ=స్రక్చందనవనితాదులయొక్క ఉపభోగరచనా=ఆస్వాదనపద్ధతి, తే=నీయొక్క, పూజా = అభ్యర్చనము, నిద్రా=(నా)సుషుప్తి, సమాధిస్థితిః=(నీ)ధ్యానమందునిలుకడఁగా నుండుట, పదయోః=(నా)పాదములయొక్క, సంచారః=సంచరించుట, ప్రదక్షిణవిధిః=(నీ)ప్రదక్షిణములుచేయుట, సర్వాః=సమస్తములగు, గిరః=(నా)వాక్యములు, స్తోత్రాణి=(నీ)సద్గుణములఁ బ్రకటించునుతులు, అహం=నేను, యద్యత్ = ఏయే, కర్మ=పనిని, కరోమి=చేయుచున్నానో, తత్తత్ =ఆయా,అఖిలం=సమస్త కర్మము, తే=నీయొక్క, పూజనం=సంపూర్ణార్చనము, అస్తు=అగుఁగాక!

భా॥ పరమాత్మస్వరూపుండవగునో శ్రీరామా! నాయంతరాత్మనునిన్నుఁగాను నాప్రజ్ఞను సీతామహాలక్ష్మినిగా నాప్రాణపంచకమునునిన్నెల్లప్పుడుఁ గొలుచు

చుండు హనుమదాదిపరివారసులుగా నాశరీరమును నీనివాసగృహమునుగా నాకుఁ గలవిషయానుభవమును నీసపర్యనుగా నానిద్రను నిశ్చలముగా నిన్ను ధ్యానించుటనుగా నేను గమనించుగతులను నీకుఁ బ్రదక్షిణ మొనర్చుటలుగా నే నుచ్చరించు సకలవాక్యములు నీగుణసంకీర్తనములనుగా నేనొనర్చు సమస్తకృత్యములు నీయారాధనములుగాను భావించుచుంటిఁగాన నీ వట్లనుగ్రహింపుము.

గ॥ అనేన శ్రీమద్రామాయణపారాయణేన సర్వదేవాత్మక స్సీతాలక్ష్మణ భరతశత్రుఘ్నహనుమత్సమేతశ్రీరామచంద్ర స్సుప్రీత స్సుప్రసన్నో వరదో భవతు॥

వి॥ అనేన=ఈ. శ్రీమద్రామాయణపారాయణేన, శ్రీమత్=మోక్షసామ్రాజ్యలక్ష్మితోఁగూడిన, రామాయణ=రామాయణమహామనువు(మంత్రము)యొక్క, పారాయణేన=సంపూర్ణాధ్యయనము చేత, భగవాన్=భగవదవతారుండు, సర్వదేవాత్మకః=త్రయస్త్రింశత్కోటిదేవతాస్వరూపుండునగు, సీతాలక్ష్మణభరతశత్రుఘ్నహనుమత్సమేతశ్రీరామచంద్రః, సీతా=సీతాదేవితోడ, లక్ష్మణ=లక్ష్మణునితోడ, భరత=భరతునితోడ, శత్రుఘ్న=శత్రుఘ్నునితోడ, హనుమత్=ఆంజనేయునితోడ, సమేత=కూడుకొనిన, శ్రీరామచంద్రః=శ్రీరామచంద్రమూర్తి, సుప్రీతః=మిగులఁబ్రీతినొందినవాఁడు, సుప్రసన్నః=విశేషానుగ్రహముతోనొప్పుచున్నవాఁడు,వరదః=వరములనిచ్చువాఁడు,భవతు=అగుఁగాక!

గ॥ న్యూనాతిరిక్తం సర్వం సగుణ మస్తు!
సర్వం శ్రీరామచంద్రార్పణ మస్తు! ॥

వి॥ న్యూనాతిరిక్తం=తక్కువయెక్కువ లేని,సర్వం=సమస్తము,సగుణం=విశేషగుణముతోఁగూడినది, అస్తు=అగుఁగాక; సర్వం=సమస్తము, శ్రీరామచంద్రార్పణమ్=రామచంద్రపరబ్రహ్మమున కధీనమైనది,అస్తు=అగుఁగాక !

పిమ్మటఁ బూర్వోక్తఏవంగుణవిశిష్టాయా మనిసంకల్పము చేసి పునఃపూజయు మహానైవేద్యాదికమును జరుపందగు.

# గాయత్రీరామాయణము.

(సంపూర్ణాంధ్రవ్యాఖ్యానసహితము.)

తపస్స్వాధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాం వరమ్।
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకి ర్మునిపుంగవమ్॥ ౧

బా. స. ౧. శ్లో. ౧.

వి॥ తపస్వీ=తపశ్శాలియగు, వాల్మీకిః=వాల్మీకి యనుఋషిసత్తముఁడు, తపస్స్వాధ్యాయనిరతం, తపః=తపస్సులయందు, స్వాధ్యాయ=వేదములయందును, నిరతం=మిగుల నాసక్తిగలవాఁడు, వాగ్విదాం, వాక్=పరబ్రహ్మమును, విదాం=తెలిసికొనినవారిలో, వరం=శ్రేష్ఠుఁడు, మునిపుంగవం, ముని=మననశీలుర యందు, పుంగవం=ఉత్తముండు నగు, నారదం=నారదమహర్షిని, పరిపప్రచ్ఛ=అడిగెను.

భా॥ వాల్మీకిమునిసత్తముఁడు కృచ్ఛ్రచాంద్రాయణాదితపస్సులయందు ఋగ్యజుస్సామాథర్వణము లనుచతుర్వేదములందుఁ బరిపూర్ణుండు బ్రహ్మవేత్తలలో నుత్తముండు మునికులావతంసుండు నగునారదమునీంద్రుని సవినయముగా నిట్లు ప్రశ్నించెను.

స హత్వా రాక్షసా న్సర్వాన్ యజ్ఞఘ్నాన్ రఘునందనః।
ఋషిభిః పూజిత స్సమ్య గ్యథేంద్రో విజయే పురా॥ ౨

బా. స. ౩౦. శ్లో. ౨౨.

వి॥ సః=ఆ, రఘునందనః, రఘు=రఘువంశమునఁ బుట్టినదశరథమహారాజునకు, నందనః=కుమారుఁ డగుశ్రీరాముఁడు, యజ్ఞఘ్నాన్, యజ్ఞ=క్రతువును, ఘ్నాన్=చెఱచుచున్న, రాక్షసాన్=రాక్షసులను, సర్వాన్=అందఱిని, హత్వా=చంపి, తత్ర=ఆసిద్ధాశ్రమమందు, పురా=పూర్వకాలమున, విజయే=రాక్షసవిజయకాలమందు, ఇంద్రో యథా=దేవేంద్రునివలె, ఋషిభిః=మునులచేత, పూజితః=పూజింపఁబడినవాఁడు, (బభూవ)=ఆయెను.

భా॥ విశ్వామిత్రమునీంద్రుని యజ్ఞమునకు విఘ్న మొనరించురక్కసుల నెల్లరఁ జక్కడంచినరఘుకులసంజాతుఁ డగుశ్రీరాముని ఋషులందఱు పూర్వము రాక్షసులను జయించినపిదప దేవేంద్రుని బూజించినట్లు పూజించిరి.

విశ్వామిత్ర స్తు ధర్మాత్మా శ్రుత్వా జనకభాషితమ్।
వత్స రామ ధనుః పశ్య ఇతి రాఘవ మబ్రవీత్॥ ౩

బా. స. ౬౭. శ్లో. ౧౨.

వి॥ ధర్మాత్మా=ధర్మస్వరూపుం డగు, విశ్వామిత్రస్తు=విశ్వామిత్రుండును. జనకభాషితం, జనక=జనకమహారాజుయొక్క, భాషితం=వాక్యమును, శ్రుత్వా=విని, వత్స=బాలుఁడ వగు, రామ=శ్రీరామా! ధనుః=ధనుస్సును, పశ్య=చూడుము, ఇతి=అని, రాఘవం=శ్రీరామునిగూర్చి, అబ్రవీత్=పలికెను.

భా॥ పిమ్మట ధార్మికులలో శ్రేష్ఠుం డగువిశ్వామిత్రుఁడు జనకమహారాజుమాట విని బాలుఁడ వగు శ్రీరామా! నీ వీశైవకార్ముకము వీక్షింపుమని శ్రీరామునితోఁ బలికెను.

తుష్టావాస్య తదా వంశం ప్రవిశ్య స విశాంపతేః।
శయనీయం నరేంద్రస్య తదాఽఽసాద్య వ్యతిష్ఠత॥ ౪

అయో. స. ౧౫. శ్లో. ౨౮.

వి॥ సః=ఆసుమంత్రుఁడు, ప్రవిశ్య=(రాజసౌధమున)ప్రవేశించి. తదా=అప్పుడు, అస్య=ఈ, విశాంపతేః=దశరథమహారాజుయొక్క, వంశం=అన్వయమును, తుష్టావ=నుతించెను., సః=ఆసుమంత్రుఁడు, నరేంద్రస్య=దశరథమహారాజుయొక్క, తత్=ఆ, శయనీయమ్=శయనగృహమును, ఆసాద్య=పొంది, వ్యతిష్ఠత=నిలిచి యుండెను.

భా॥ సుమంత్రుఁ డంతట రాజాంతఃపురమునఁ బ్రవేశించి దశరథమహారాజుయొక్క పూర్వు లగురఘుప్రభృతులఁ గొనియాడి యారాజలలాము శయనగృహముఁ జేరి నిలిచెను.

వనవాసం హి సంఖ్యాయ వాసాం స్యాభరణాని చ।
భర్తార మనుగచ్ఛంత్యై సీతాయై శ్వశురో దదౌ॥ ౫

అయో. స. ౪౦. శ్లో. ౧౫

వి॥ శ్వశురః=మామయగు దశరథుఁడు, భర్తారం=పెనిమిటి యగు శ్రీరాముని, అనుగచ్ఛంత్యై=అనుసరించివెళ్లుచున్న, సీతాయై=సీతాదేవికొఱకు,

వనవాసం=అరణ్యవాసమును, సంఖ్యాయ=లెక్కించి, వాసాంసి=వస్త్రములను, ఆభరణానిచ=అలంకారములను, దదౌ(హి)=ఇచ్చెను.

భా॥ మామగారగుదశరథమహారాజు వనమున కేగుశ్రీరాముని వెంబడించుచున్న జానకీదేవి కరణ్యవాసకాలముం గణుతించి వస్త్రాభరణముల నొసంగెను.

రాజా సత్యం చ ధర్మశ్చ రాజా కులవతాం కులమ్।
రాజా మాతా పితా చైవ రాజా హితకరో నృణామ్॥ ౬

అయో. స. ౬౭. శ్లో. ౩౪.

వి॥ రాజా=రాజు, సత్యంచ=సత్యపరివర్తకుఁడు, ధర్మశ్చ=ధర్మప్రచారకుఁడు, (భవతి=అగుచున్నాఁడు) రాజా=రాజు, కులవతాం=సద్వంశమునజనించినవారికి, కులం=కులాచారపరివర్తకుఁడు, (భవతి=అగుచున్నాఁడు.) రాజా=రాజు, మాతా=తల్లి (వలె కాపాడువాఁడు), పితాచైవ=తండ్రి (వలె హితముఁ గఱుపువాఁడు), (భవతి=అగుచున్నాఁడు.) రాజా=రాజు, నృణాం=మనుష్యులకు, హితకరః=క్షేమమును జేయువాఁడు, (భవతి=అగుచున్నాఁడు).

భా॥ ప్రజలను రంజింపఁ జేయుచు న్యాయముగాఁ బాలించురాష్ట్రాధిపతి తనదేశమున సత్యధర్మముల సంపూర్ణముగా వ్యాపింపఁ జేసి సత్కులసంభూతులఁ జక్కగా సంరక్షించి వారికులాచారములను వృద్ధిపఱచి తలిదండ్రులవలె పురోవృద్ధిం గోరుచు దేశీయుల కనపాయసౌఖ్యముల సమకూర్చుచుండు.

నిరీక్ష్య స ముహూర్తం తు దదర్శ భరతో గురుమ్।
ఉటజే రామ మాసీనం జటామండలధారిణమ్॥ ౭

అయో. స. ౯౯. శ్లో. ౨౫.

వి॥ సః=ఆ, భరతః=భరతుఁడు, ముహూర్తంతు=కొంచెముకాలము మాత్రము, నిరీక్ష్య=చూచి, గురుం=పితృతుల్యుఁడు, ఉటజే=పర్ణశాలయందు, ఆసీనం=కూరుచున్నవాఁడు, జటామండలధారిణం, జటామండల=జటాసమూహమును, ధారిణం=ధరించినవాఁడు నగు, రామం=శ్రీరాముని, దదర్శ=చూచెను.

భా॥ ఆభరతుఁ డొక్కింతతడవు పరికించి జడదారియై యుటజాంగణమునఁ గూరుచున్నపితృసముఁ డగుశ్రీరాముని సహజతేజోవిశేషముచేఁ దెలిసికొనెను.

యది బుద్ధిః కృతా ద్రష్టు మగస్త్యం తం మహామునిమ్।
అద్యైవ గమనే బుద్ధిం రోచయస్వ మహాయశః॥ ౮

అర. స. ౧౧. శ్లో. ౪౪.

వి॥ మహాయశః=పూజ్యమైనకీర్తిగల శ్రీరామా! తం=ఆ, మహామునిం=మహర్షి యగు, అగస్త్యం=అగస్త్యమునీంద్రుని, ద్రష్టుం= చూచుటకు, బుద్ధిః=మనోనిశ్చయము, కృతాయది=చేయఁ బడినచో, అద్యైవ=ఇప్పుడే, గమనే=వెళ్లుటయందు, బుద్ధిం=బుద్ధిని, రోచయస్వ=ఇష్టపఱచుము.

భా॥ జగద్విఖ్యాతమైనమహాకీర్తితో నొప్పారురామచంద్రా! తపోధనులలో నగ్రగణ్యుఁ డగునగస్త్యమహర్షిం దిలకింప నిచ్ఛయించితి వేని వెంటనే బయలుదేరి వెళ్లుము.

భరతస్యార్యపుత్రస్య శ్వశ్రూణాం మమ చ ప్రభో।
మృగరూప మిదం వ్యక్తం విస్మయం జనయిష్యతి॥ ౯

అర. స. ౪౩. శ్లో. ౧౭.

వి॥ ప్రభో=నాథుండ వగుశ్రీరామా! ఆర్యపుత్రస్య=ఆర్యపుత్రుండ వగునీకు, భరతస్య=భరతునకు, మమ-నాకు, శ్వశ్రూణాం=అత్త లగుకౌసల్యాప్రభృతులకు, ఇదం=ఈ, వ్యక్తం=స్పష్టమైన, మృగరూపం=లేడియొక్కస్వరూపము, విస్మయం=ఆశ్చర్యమును, జనయిష్యతి=కలుగఁ జేయఁ గలదు.

భా॥ నాథా! కాంచనవికారమగు లేడియొక్క యంగసౌష్ఠవము నీకు నాకు భరతునకు నాయత్తలకు నందఱ కచ్చెరువుం గలిగింపఁ గలదు.

గచ్ఛ శీఘ్ర మితో రామ సుగ్రీవం తం మహాబలమ్।
వయస్యం తం కురు క్షిప్ర మితో గత్వాద్య రాఘవ॥ ౧౦

అర. స. ౭౨. శ్లో. ౧౭.

వి॥ రామ=శ్రీరాముఁడా! ఇతః=ఇచ్చటనుండి, శీఘ్రం=వెంటనే, మహాబలం= విశేషబలసంపన్నుఁ డగు, తం=ఆ, సుగ్రీవం=సుగ్రీవునిగూర్చి, గచ్ఛ=వెళ్లుము; రాఘవ=రామా! ఇతః=ఇచ్చటనుండి, అద్య=ఇప్పుడు, గత్వా=వెళ్లి, క్షిప్రం=శీఘ్రముగా, తం=ఆసుగ్రీవుని, వయస్యం=స్నేహితునిగా, కురు=చేసికొనుము.

భా॥ ఓరామభద్రా! నీ విచ్చటనుండి యిప్పుడే బయలుదేరి విశేషబాహుబలసంపన్నుఁ డగుసుగ్రీవుని గలిసికొని యాకపిరాజుతో నగ్నిసాక్షికముగాఁ జెలిమిఁ జేసికొనుము.

**దేశకాలౌ భజ స్వాద్య క్షమమాణః ప్రియాప్రియే।**
**సుఖదుఃఖసహః కాలే సుగ్రీవవశగో భవ॥** ౧౧

కి. స. ౨౨. శ్లో. ౨౨.

వి॥ అద్య=ఇప్పుడు, ప్రియాప్రియే = ఇష్టానిష్టములను, క్షమమాణః = సహించుచున్నవాఁడవై, దేశకాలౌ=దేశమును గాలమును, భజస్వ=గుఱుతించుము; కాలే=సమయమందు, సుఖదుఃఖసహః, సుఖదుఃఖ=కష్టసుఖములను, సహః=సహించినవాఁడవై, సుగ్రీవవశగః, సుగ్రీవ=సుగ్రీవునకు, వశగః=అధీనుఁడవు, భవ=అగుము.

భా॥ నా కత్యంతప్రేమాస్పదుండ వగునంగదకుమారా! మేలుకీళ్లనోర్చికొనుచుఁ గాలవశమునసంభవించిన సుఖదుఃఖములసహించుచు దేశకాలపరిస్థితులఁ గుఱుతెఱింగి యిప్పుడు సుగ్రీవున కధీనుఁడ వగుము.

**వంద్యాస్తే తు తపస్సిద్ధా స్తపసా వీతకల్మషాః।**
**ప్రష్టవ్యా చాపి సీతాయాః ప్రవృత్తి ర్వినయాన్వితైః॥** ౧౨

కి. స. ౪౩. శ్లో. ౩౪.

వి॥ వినయాన్వితైః, వినయ=నమ్రతతో, అన్వితైః=కూడుకొనిన, భవద్భిః=మీచేత, తపసా=తపస్సుచే, వీతకల్మషాః, వీత=పోయిన, కల్మషాః=పాపములుగల, తే=ఆ, తపస్సిద్ధాః=సిద్ధతాపసులు, వంద్యాః=నమస్కరింపఁ దగినవారు; తు=మఱియు, సీతాయాః=సీతాదేవియొక్క, ప్రవృత్తిః అపి=వార్తయు, ప్రష్టవ్యా=అడుగఁ దగినది.

భా॥ ఓవానరశ్రేష్ఠులారా! మీరెల్లగుణముల నమ్రతతోఁ గూడికొనినవారై కృచ్ఛ్రచాంద్రాయణాదితపస్సులచేఁ బరిశుద్ధులై యొప్పారు నామునిపుంగవుల నెల్లర నమస్కరించి సీతాదేవియొక్క వృత్తాంతమును గూర్చి యడుగుఁడు!

**స నిర్జిత్య పురీం శ్రేష్ఠాం లంకాం తాం కామరూపిణీమ్।**
**విక్రమేణ మహాతేజా హనూమాన్ కపిసత్తమః॥** ౧౩

సుం. స. ౪. శ్లో. ౧.

వి॥ సః=ఆ, మహాతేజాః=గొప్పతేజస్సుగల, కపిసత్తమః=వానరోత్తముఁడగు హనుమంతుఁడు, విక్రమేణ=పరాక్రమముచేత, కామరూపిణీం=స్వేచ్ఛాధీనరూపముగలదియు, శ్రేష్ఠాం=ఉత్తమమైన, పురీం=పురస్వరూపు

రాలు నగు, తాం=ఆ, లంకాం=లంకయను, రాక్షసస్త్రీని, నిర్జిత్య=జయించి, ప్రాకారం=ప్రాకారమునుగూర్చి, అభిపుప్లువే=ఎగిరెను.

భా॥ మహాశౌర్యసంపన్నుఁ డగునాహనుమంతుఁడు తనపరాక్రమముచే స్వేచ్ఛారూపిణియు లంకానగరముయొక్క ముఖద్వారమున కాపాపహారా లై యున్నలంకానగరరూపిణి యగురాకాసిని జయించి ప్రాకారమున కెగసెను.

ధన్యా దేవా స్సగంధర్వా స్సిద్ధా శ్చ పరమర్షయః।
మమ పశ్యంతి యే నాథం రామం రాజీవలోచనమ్॥ ౧౪

సుం. స. ౨౬. శ్లో. ౪౧.

వి॥ యే=ఏ, దేవాః=దేవతలు, సగంధర్వాః=తుంబురాదిగంధర్వులతోఁగూడిన, సిద్ధాః=విశ్వావసుప్రభృతిసిద్ధులు, పరమర్షయః = మహర్షులు, రాజీవలోచనం,రాజీవ=పద్మములవంటి,లోచనం=నేత్రములుగల,మే=నాయొక్క, నాథం=భర్తను, పశ్యంతి=చూచుచున్నారో, తే=ఆ, దేవగంధర్వసిద్ధాదులు, ధన్యాః=పుణ్యాత్ములు (భవంతి=అగుచున్నారు.)

భా॥ మునిదేవగంధర్వసిద్ధులలో నాకర్ణాంతవిశాలము లగునేత్రపద్మములు గల నానాథుఁ డగుశ్రీరాముని జూచినవారు ధన్యులు.

మంగళాభిముఖీ తస్య సా తదా ఽ సీ న్మహాకపేః।
ఉపతస్థే విశాలాక్షీ ప్రయతా హవ్యవాహనమ్॥ ౧౫

సుం, స. ౫౩. శ్లో ౨౭.

వి॥తదా=అప్పుడు,సా=ఆసీతాదేవి.మహాకపేః=కపిసత్తముఁ డగు, తస్య=ఆహనుమంతునకు, మంగళాభిముఖీ, మంగళ=శుభముఁచేయుటకు, అభిముఖీ=సన్నద్ధురాలు, ఆసీత్=అయెను; విశాలాక్షీ, విశాల=విస్తృతము లైన, అక్షీ=నేత్రములు గలసీతాదేవి, ప్రయతా=నియమముతోఁ గూడిన దై, హవ్యవాహనం=అగ్నిదేవుని, ఉపతస్థే=ఉపాసించెను.

భా॥ కపులందఱిలోఁ గార్యనిర్వాహకుఁ డగుహనుమంతుని శుభముఁ గోరి వ్రతోపవాసాదినియమములతోఁగూడి భగవద్ధ్యానపరాయణురా లగు పద్మపత్రములవంటివిశాలనేత్రములతో నొప్పుజానకీదేవి దేవముఖుం డగు నగ్నిహోత్రునిగూర్చి జపించెను.

హితం మహార్థం మృదు హేతుసంహితమ్।
వ్యతీతకాలాయతిసంప్రతిక్షమమ్।
నిశమ్య తద్వాక్య ముపస్థితజ్వరః।
ప్రసంగవా నుత్తర మేత దబ్రవీత్॥ ౧౬

యు. స. ౧౦. శ్లో. ౨౭.

వి॥ హితం=సర్వజనసమ్మతంబు, మహార్థం=విశేషప్రయోజనముగలది, మృదు = మార్దవము గలది, హేతుసంహితం = హేతువులతోఁ గూడినది, వ్యతీతకాలాయతిసంప్రతిక్షమమ్, వ్యతీతకాల=భూతకాలమందు, ఆయతి=ఉత్తరకాలమందు, సంప్రతి=వర్తమానకాలముననుు, క్షమం=యోగ్య మైనదియు నగు, తద్వాక్యం, తత్ = ఆవిభీషణునియొక్క, వాక్యం = వాక్యమును, నిశమ్య=విని, ఉపస్థితజ్వరః, ఉపస్థిత=పొందఁబడిన, జ్వరః=సంతాపముగలవాఁడై, ప్రసంగవాన్=ప్రసక్తిగలరావణుఁడు, ఏతత్=ఈచెప్పఁబోవు, ఉత్తరం=సమాధానమును, అబ్రవీత్=పలికెను.

భా॥ భూతభవిష్యద్వర్తమానకాలములయందు సుఖకర మగునది సులలిత మైనది హేతుకలాపముతోఁ గూడినది విశేషప్రయోజన ముగలిగి సమ్మత మగునదియు నగు విభీషణవాక్యము నాలకించి విశేషపరితాపము గలవాఁడై రావణుఁడు ప్రసక్తివశంబున నీచెప్పఁబోవునటు లోకవాక్యము బలికెను.

ధర్మాత్మా రాక్షసశ్రేష్ఠ స్సంప్రాప్తో ఽయం విభీషణః।
లంకైశ్వర్యం ధ్రువం శ్రీమా నయం ప్రాప్నో త్యకంటకమ్॥ ౧౭

యు. స. ౪౧. శ్లో. ౬౭.

వి॥ ధర్మాత్మా = ధర్మస్వరూపుఁ డగు, రాక్షసశ్రేష్ఠః = రాక్షసులలో నుత్తముఁడైన, అయం=ఈ, విభీషణః=విభీషణుఁడు, సంప్రాప్తః=వచ్చినవాఁడు, (అభూత్) ఆయెను, శ్రీమాన్=శ్రీరామకైంకర్య మనుమహావైభవము గల, అయం=ఈవిభీషణుఁడు, అకంటకం=నిర్బాధక మగు, లంకైశ్వర్యం=లంకాధిపత్యమును, ధ్రువం=నిశ్చయముగా, ప్రాప్నోతి=పొందు చున్నాఁడు.

భా॥ పరమధార్మికుఁడు రాక్షసులందఱిలో నుత్తముఁడు శ్రీరామసేవారూప మగుమహాదైశ్వర్యముతో నొప్పుచున్నవాఁడు నగువిభీషణుఁ డెట్టిబాధయు లేనిలంకాప్రభుత్వమును దప్పక పొందఁగలఁడు.

యోవజ్రపాతాశనిసన్నిపాతాన్న చుక్షుభే నాపి చచాల రాజా।
స రామబాణాభిహతో భృశార్తశ్చచాలచాపం చ ముమోచవీరః॥౧౮
యు. స. ౫౯. శ్లో. ౧౩౯.

వి॥ యః=ఏ, రాజా=రాక్షసరా జగురావణుఁడు, వజ్రపాతాశనిసన్నిపాతాత్, వజ్రపాత = వజ్రాయుధముయొక్క ప్రయోగమువలన, అశని = పిడుగులయొక్క, సన్నిపాతాత్=ఒక్కమారుగాఁ బడుటవలనను, నచుక్షుభే= క్షోభ నొందలేదో, అపిచ=మఱియు, నచచాల=కదలలే దో, సః=ఆ, వీరః= పరాక్రమశాలి యగురావణుఁడు, రామబాణాభిహతః, రామ=శ్రీరాముని యొక్క, బాణ=బాణములచేత, అభిహతః=కొట్టఁ బడినవాఁడై, భృశార్తః, భృశ=మిక్కిలి, ఆర్తః=పీడితుఁ డగుచు, చచాల=కంపితుఁ డయ్యెను; చాపంచ= ధనుస్సునుగూడ, ముమోచ=జార విడిచెను.

భా॥ దేవేంద్రుఁడు వజ్రాయుధముఁ బ్రయోగించి యొక్కసారిగాఁ బిడుగులవర్షముఁ గురిపించిన నొక్కింతయు మనోదైన్యము నొందక రణరంగమునఁ జలింపక నిలచినయాజగదేకవీరుం డగురావణుఁడు శ్రీరాముని బాణములచేఁ గొట్టఁబడినవాఁడై మిక్కిలిఁ గుందుచుఁ గంపితదేహుఁడై తనచేత నున్న ధనుస్సును జారవిడిచెను.

యస్య విక్రమ మాసాద్య రాక్షసా నిధనం గతాః।
తం మన్యే రాఘవం వీరం నారాయణ మనామయమ్॥ ౧౯
యు. స. ౭౨. శ్లో. ౧౧.

వి॥ యస్య = ఏశ్రీరామునియొక్క, విక్రమమ్ = పరాక్రమమును, ఆసాద్య=పొంది, రాక్షసాః=నిఖిలరాక్షసులు, నిధనం=మరణమును, గతాః= పొందినవారైరో, తం=ఆ, వీరం=సుప్రసిద్ధశౌర్యవంతుఁ డగు, రాఘవం= శ్రీరాముని, అనామయం=ఆధివ్యాధిరహితుఁ డగు, నారాయణం=మహావిష్ణువునుగా, మన్యే=తలంచు చున్నాను.

భా॥ సుప్రసిద్ధశూరులగురాక్షసుల నెల్లఁ దనపరాక్రమనవహ్నికాహుతులం జేయుచున్నయాశ్రీరాముని వటపత్రశాయి యగుశ్రీమన్నారాయణునిగాఁ దలంచుచున్నాను.

న తే దదృశిరే రామం దహంత మరివాహినీమ్।
మోహితాః పరమాస్త్రేణ గాంధర్వేణ మహాత్మనా॥ ౨౦

యు. స. ౯౪. శ్లో. ౨౬.

వి॥ మహాత్మనా=విశేషప్రభావముగల, గాంధర్వేణ=గంధర్వదేవతాక మగు, పరమాస్త్రేణ, పరమ=మిగులగొప్పది యగు, అస్త్రేణ=అస్త్రముచేత, మోహితాః=మూర్ఛనొందింపఁ బడినవా రై, తే=ఆ, రాక్షసాః=రాక్షసులు, అరివాహినీం=శత్రుసైన్యమును, దహంతం=దహించుచున్న, రామం=శ్రీరాముని, నదదృశిరే=కనుగొనఁ జాల రైరి.

భా॥ నిర్దేశింప శక్యముగానిమహాప్రభావము గలగాంధర్వాస్త్రముచే విమోహితు లై యెండ కాలమునందు నున్నయారాక్షసవీరులు వీతిహోత్రుఁడు మహారణ్యమును వలె శత్రుసైన్యముల దహించు చున్నశ్రీరాముని గనువిచ్చి చూడఁజాల రైరి.

ప్రణమ్య దేవతాభ్య శ్చ బ్రాహ్మణేభ్య శ్చ మైథిలీ।
బద్ధాంజలిపుటా చేద మువా చాగ్నిసమీపతః॥ ౨౧

యు. స. ౧౧౯. శ్లో. ౨౩

వి॥ మైథిలీ=సీతాదేవి, దేవతాభ్యశ్చ=దేవతలకొఱకు, బ్రాహ్మణేభ్యశ్చ= బ్రాహ్మణులకొఱకును, ప్రణమ్య=నమస్కరించి, బద్ధాంజలిపుటా, బద్ధ=రచింపఁ బడిన, అంజలిపుటా=దొప్పలవంటిదోసిలిగల దై, అగ్నిసమీపతః, అగ్ని=అగ్ని హోత్రునియొక్క, సమీపతః=దగ్గఱను, ఇదం=ఈచెప్పఁబోవు, వచనం=వాక్య మును, అబ్రవీత్=పలికెను.

భా॥ ఆసీతాదేవి సమస్తదేవతాబ్రాహ్మణులకు నమస్కరించి యగ్ని చెంత నిలువఁ బడి దోసిలియొగ్గి యిట్లు పలికెను.

చలనా త్పర్వతేంద్రస్య గణా దేవా శ్చ కంపితాః।
చచాల పార్వతీ చాపి తదా ఽఽ శ్లిష్టా మహేశ్వరమ్॥ ౨౨

ఉ. స. ౧౬. శ్లో. ౨౬.

వి॥ పర్వతేంద్రస్య = కైలాసపర్వతముయొక్క, చలనాత్ = కదలుట వలన, గణాః=ప్రమథగణములు, దేవాశ్చ=దేవతలును, కంపితాః=చలించిరి; పార్వతీచాపి=పార్వతీదేవియు, తదా=అప్పుడు, మహేశ్వరం=(భర్తయగు)శివుని, ఆశ్లిష్టా=కౌఁగిలించికొనిన దై, చచాల=కంపితురా లయ్యెను.

భా॥ పర్వతశ్రేష్ఠ మగుకైలాసము కదలుటవలన నాపర్వతమునం గలదేవప్రమథగణంబులు కంపితు లైరి. అట్టిసమయమునఁ బార్వతీదేవియు నీశ్వరుని గాఁగిలించికొని విశేషముగ వడంకెను.

దారాః పుత్రాః పురం రాష్ట్రం భోగాచ్ఛాదనభాజనమ్।
సర్వమే వావిభక్తం నో భవిష్యతి హరీశ్వర ! ౨౩

ఉ. స. ౩౪. శ్లో. ౪౧.

వి॥ హరీశ్వర, హరి=వానరులకు, ఈశ్వర=ప్రభు వైన యోవాలీ !, నః=మనకు, దారాః=భార్యలు, పుత్రాః=కుమారులు, పురమ్=పట్టణము, రాష్ట్రమ్=దేశము, భోగాచ్ఛాదనభాజనమ్, భోగ=భోగములు, ఆచ్ఛాదన= ఇండ్లు, భాజనమ్=పాత్రములు, సర్వమేవ=అంతయు, అవిభక్తమ్=వేరుచేయఁ బడని దై, భవిష్యతి=కాఁ గలదు.

భా॥ వానరప్రభు వగువాలీ ! మన మిరువురము నేఁడుమొదలు పరమమైత్రితో మెలంగుదుముగాన మన కిరువురకు భార్యాపుత్రపురరాష్ట్రాది కం బెల్ల యవిభక్త మై యుండఁగలదు. (రావణవాక్యము.)

యామేవ రాత్రిం శత్రుఘ్నః పర్ణశాలాం సమావిశత్।
తామేవ రాత్రిం సీతాపి ప్రసూతా దారకద్వయమ్॥ ౨౪

ఉ. స. ౬౬. శ్లో. ౧.

వి॥ శత్రుఘ్నః=శత్రుఘ్నుఁడు, యామేవ=ఏ, రాత్రిం=రాత్రిని, పర్ణశాలాం=పర్ణశాలను, సమావిశత్=ప్రవేశించె నో, తామేవ=ఆ, రాత్రిం= రాత్రినే, సీతాఽపి = జానకీదేవియు, దారకద్వయం = ఇరువురుఁబుత్రులను, ప్రసూతా=కనెను.

భా॥ శ్రీరామునియొద్దనుండి బయలుదేరి శత్రుఘ్నుఁడు పర్ణశాల కేగిననాఁటిరాత్రియందే సీతాదేవి యిరువురఁగుమారులం గనెను.

ఇదం రామాయణం కృత్స్నం గాయత్రీబీజసంయుతమ్।
త్రిసంధ్యం యః పఠే న్నిత్యం సర్వపాపైః ప్రముచ్యతే॥

వి॥ యః=ఎవ్వఁడు, గాయత్రీబీజసంయుతం, గాయత్రీ=గాయత్రీమహా మంత్రముయొక్క, బీజ=వర్ణములతో, సంయుతం=కూడికొనిన, ఇదమ్=ఈ, రామాయణమ్=రామాయణమును, కృత్స్నం=అంత, నిత్యం = ఎల్లప్పుడు,

త్రిసంధ్యం = మూడుసంధ్యలయందు, పఠేత్ = పారాయణముచేయునో, సః = ఆజనుఁడు,సర్వపాపైః=సమస్తపాపములచే,ప్రముచ్యతే=విడువఁబడుచున్నాఁడు.

భా॥ పరమభక్తితోనీగాయత్రీరామాయణము నెల్లప్పుడు నుదయమున మధ్యాహ్నము ప్రదోషకాలమునఁ బారాయణముచేయుపురుషుఁడు సమస్త పాపములచే విడువఁబడును.

యావ దావర్తతే చక్రం యావతీ వా వసుంధరా।
తావ ద్వర్షసహస్రాణి స్వామిత్వ మవధారయ॥

వి॥ చక్రం=కాలచక్రము, యావత్=ఎంతవఱకు, ఆవర్తతే=తిరుగుచుండునో, వసుంధరా=భూమి, యావతీవా=ఎంతకాల ముండునది, (భవతి) అగుచున్నదో, తావత్=అంతవఱకు, వర్షసహస్రాణి=వేలకొలఁదిసంవత్సరములను, స్వామిత్వం=ప్రభుత్వమును, అవధారయ=పొందుము.

భా॥ ఓజగత్ప్రభూ! సూర్యచంద్రులు భూమి యు నున్నంతకాల మనేక సహస్రసంవత్సరములు నీవు రాజవై యుండుము.

---

శ్రీమద్వాల్మీకిరామాయణమునందాయాఘట్టములందలిశ్లోకములయొక్క పఠనశ్రవణాదులకు ఫలము.

సంసారతాపయుక్తానాం జంతూనాం హతచేతసామ్।
శ్రీమద్రామాయణాఖ్యానం దివ్యౌషధం స్మృతమ్॥ ౧

భా॥ సంసారమునందు దారేషణాధనేషణాపుత్రేషణము లనుతాపత్రియముతోఁ గూడికొని దీనులై యుండుసమస్తజనులకు శ్రీరామాయణకథ యనునమృతము దివ్యౌషధం బగుచున్నది.

దురన్నదగ్ధజిహ్వానాం దుర్దానహతచేతసామ్।
దుస్సంగహతచిత్తానాం కలిపాశానపాయినామ్॥
దేవపూజావిహీనానాం శ్రౌతస్మార్తాతిలంఘినామ్।
శ్రీమద్రామాయణకథా సర్వపాపవినాశినీ॥ ౩

భా॥ శ్రీరామచరితము దురన్నమును భుజించుచు దుర్దానములను గ్రహించుచు దుష్టులతో నెల్లప్పుడు సహవాసము సల్పి దుష్కార్యరతులై దేవపూజలం జేయక వేదములందు స్మృతులందును జెప్పఁబడినకర్మములఁ ద్యజించి కాలముఁ గడపు సమస్తజనులయొక్క సర్వదురితములను రూపుమాపును.

తపస్స్వాధ్యాయనిరతమితిశ్లోకస్య వై శ్రుతేః।
తపసాం సిద్ధిమాప్నోతి స్వాధ్యాయస్య చ మానవః॥ ౪

భా॥ తపస్స్వాధ్యాయనిరత మనుశ్లోకమును వినినంతమాత్రమున మనుజుఁడు వేదాధ్యయనఫలము నొంది తపస్సిద్ధుఁ డగును.

శ్రుత్వా సంక్షేపకం కావ్యం ప్రత్యహం శ్రావయేత వా।
పఠేద్వా ప్రత్యహం మర్త్యో బ్రహ్మభూయాయ కల్పతే॥ ౪

భా॥ శ్రీరామచరితమును బోధించు నట్టియీసంక్షేపరామాయణమును సమగ్రముగా వినినఁ జదివినఁ జదివి యితరులకు వినిపించినను బ్రహ్మత్వమునొందఁగలుగును.

నియమేన చ సంయుక్తః ఫలకామనయా యుతః।
జపన్ వత్సరమాత్రేణ తత్తత్కర్మ సమశ్నుతే॥ ౬

భా॥కోరికనుగోనసాగింపఁజేసిన దంబూనినమనుజుఁడుసదాచారముతోఁ గూడిప్రతిదినము నొకసంవత్సరము పారాయణ మొనర్చిన నభీష్టసిద్ధి చేకూరు.

పఠన్ ద్విజఇతిప్రోక్తశ్లోకస్య పఠనాత్సదా।
సర్వజ్ఞత్వ మవాప్నోతి నాత్ర కార్యా విచారణా॥ ౭

భా॥ ఈసర్గాంతమందలి 'పఠన్ ద్విజ' యనుశ్లోకము నెల్లప్పుడుఁ బఠించుటవలన మనుజుఁడు సర్వజ్ఞత్వము నొందును. ఈవిషయమై యెంతమాత్రము సంశయింప రాదు.

తస్మాదిదం బాలకానాం పాఠ్య మాదరతః పురా।
కృత్స్నశాస్త్రేషు నిపుణో భవిష్యతి న సంశయః।
వక్తా సభాసు సర్వత్ర భవిష్యతి చ వల్లభః॥ ౧౪

భా॥ కావున బాలురకుఁ దప్పక తొలుత నీబాలరామాయణముం జెప్పవలయును. ఆదరముతో ముందుగా బాలరామాయణముఁ బఠించిన విద్యార్థులు సమస్తశాస్త్రములయందు సంపూర్ణపరిజ్ఞానము గలవారై మహాసభలయందుఁ దమవాక్చమత్కృతిచే నగ్రస్థానముఁ బడయఁ గలవక్తృత్వము గలవారై యొప్పఁగలరు. ఇం దెంతమాత్రము సంశయము లేదు.

మానిషాదప్రతిష్ఠాంత్వమితిశ్లోకస్య వై శ్రుతేః।
వాగ్మినాం ప్రథమో మర్త్యో లోకే భూత్వా చరిష్యతి॥ ౯౪

భా॥ మానిషాద యనుశ్లోకమును వినినమానవుఁడు మహాభక్తులలో మొదటివాఁడై భూలోకమున సుఖముగా సంచరింపఁ గలఁడు.

అయోధ్యావర్ణనం శ్రుత్వా ముచ్యేత సకలాఘతః।
మహాభూతసముద్ధానం యే శృణ్వంతి మహీతలే।
తేషాం భూతాదిసంభూతా నాస్తి పీడా కదా చన॥ ౧౧

భా॥ అయోధ్యానగరమును వర్ణించునట్టి కథాభాగమును సావధానముగ నాలకించినఁ జదివినను మనుష్యులు సమస్తపాపములచే విడువఁబడుదురు. సమస్తదేవతలు స్వాంశములచే భూమిపై నవతరించు నట్టిభాగమును వినినవారికి భూతముల వలనఁగలుగుపీడ యెన్నఁడునుఁ గలుగదు.

నృపాంగనానాం రాజ్ఞా తు పాయసస్య ప్రభేదనమ్।
శృణోతి యా స్త్రీ పుత్రం సా లభతే స చిరా దిహ॥ ౧౨

భా॥ దశరథమహారాజు భార్యలకుఁ బరమాన్నముఁ బంచియిచ్చు కథాభాగమును వినినస్త్రీ శీఘ్రకాలములో గుణవంతుఁ డగుకుమారుం గనును.

రామాదీనాం చతుర్ణాం తు ప్రసూతిం య శ్శృణోతి హి।
స పుత్రపౌత్రై స్సంయుక్త స్థ్సిత్వా రామపదం వ్రజేత్॥ ౧౩

భా॥ శ్రీరామలక్ష్మణభరతశత్రుఘ్నులయొక్క జననమును భక్తితో నాలకించినమానవుఁడు కుమారులు మనుమలు గలిగి యీలోకమునఁ జిరకాలము సుఖించి పిమ్మట శ్రీరామసాయుజ్యము నందును.

ఋషేః పూజాం సమాకర్ణ్య ఋణా న్ముక్తో భవే న్నరః॥ ౧౩½

భా॥ దశరథుఁడు విశ్వామిత్రమహర్షిని బూజించుట నాకర్ణించి మనుష్యుఁడు ఋణవిముక్తుం డగును.

తాటకాఖ్యాన మాకర్ణ్య పాపం తరతి మానవః।
తాటకావధ మాకర్ణ్య హ్యవిద్యా నాశ మాప్నుయాత్॥ ౧౪½

భా॥ తాటకాచరిత్రముఁ దాటకావధమును విన్నమనుజుఁడు పాపవిముక్తుఁడై యజ్ఞానమును బాయును.

సహత్వా రాక్షసాన్ సర్వా నతిశ్లోకాదివర్తినః।
శివశేన సకారస్య దూరతో యాతి పాతకః॥ ౧౫½

భా॥ 'నహాత్వా' యనుశ్లోకమునందలిప్రథమవర్ణ మగుసకారము గాయత్రిద్వితీయవర్ణముగాన నాయక్షరము నాలకించినంతమాత్రమున మానవులయొక్క పాపములు దప్పక నాశించిపోవును.

శైలేంద్రో హిమవాన్నామ ధాతూనా మాకరో మహాన్।
ఇత్యుపక్రమ్య గంగాయా వైభవశ్రవణా న్నరః॥
విముక్తభవబంధస్తు గంగాసాయుజ్య మాప్నుయాత్॥ ౧౭

భా॥ సమస్తధాతువులకు నివాస మగుహిమవంతుఁడను పర్వతరాజు గలఁడనువాక్య మారంభించి గంగావైభవముఁ జెప్పినదానిని నాలకించిన మనుష్యుఁడు జన్మరాహిత్యము నొంది గంగానదితో నైక్యము నొందును.

సగరస్యాశ్వమేధస్య కథాం శ్రుత్వా పఠ న్నుత్తమమ్।
బ్రహ్మహత్యాదిపాపేభ్యో ముక్తా స్స్యు స్త్రీ స్త్రియో నరాః॥ ౧౮

భా॥ సగరమహారాజు యశ్వమేధము నొనరించునట్టి శ్రేష్ఠమైనయావిధానమునంతను వినినచో మనుజులను బ్రహ్మహత్యాదిపాపము లైనను విడిచిపోవును.

స గత్వా సగరం రాజా ఇత్యుపక్రమ్య శృణ్వతః।
పితర స్స్వర్గ మాయాంతి నిరయస్థా అనేకశః॥ ౧౯

భా॥ 'సగత్వానగరంరాజా' యనుశ్లోకము మొదలు కథాభాగాంతము వఱకు నాలకించినవారి పితృదేవతలు మహానరకములందుఁ జిరకాలమునుండి యుదకప్రదానము లేక బాధపడుచున్నవారైనను దత్క్షణము స్వర్గమున కేగుదురు.

శాపముక్తిశ్చ భార్యాయా శ్శ్రుతా చే ద్గౌతమస్య తు।
నరః పాపా ద్విముచ్యేత నారీ వా వ్యభిచారజాత్॥ ౨౦

భా॥ అహల్యాశాపవిమోచనము నాలకించినస్త్రీపురుషులు వ్యభిచారదోషమునుండి ముక్తు లయ్యెదరు.

ఇహా కుమారా విత్యాది జనకేన సుభాషితమ్।
హారిస్తోత్ర మాకర్ణ్య ముచ్యతే సర్వబంధనాత్॥ ౨౧

భా॥ 'ఇమౌకుమారౌ' అనుశ్లోకము మొదలుకొని జనకమహారాజుచేఁ జేయఁబడినహరిస్తోత్రమువఱకు నాకర్ణించినజనుఁ డెల్లబంధనములనుండి విడుపఁబడినవాఁ డగును.

విశ్వామిత్రస్సధర్మాత్మేత్యత్రాద్యక్షరసంశ్రవాత్।
నష్టకామో విదోష స్సన్ సోమలోకే మహీయతే॥ ౨౨

భా॥ 'విశ్వామిత్రస్సధర్మాత్మా' యనుశ్లోకప్రథమవర్ణ మగుగాయత్రీ తృతీయాక్షరం బైనవికారము నాలకించుటవలన మానవుఁడు చంద్రలోకమునఁ జిరకాలము సుఖము నొందును.

ప్రసామధ్యే త్వపక్రమ్య జానక్యా మంగళోత్సవమ్।
శ్రుత్వా వివాహసమయే భర్తా దీర్ఘాయు రాప్నుయాత్॥ ౨౩

భా॥ 'ప్రసామధ్యే' యనుశ్లోకము మొదలు సీతాకల్యాణకథాభాగము నాలకించిన స్త్రీయొక్క పెనిమిటి దీర్ఘాయుష్మంతుఁ డగును.

రామ దాశరథే వీర వీర్యం తే శూయతే ఉద్భుతమ్।
ఇత్యాదిశ్రవణా త్పుంసాం బ్రహ్మతేజో ఽభివర్ధతే॥ ౨౪

భా॥ 'రామదాశరథే' యనుశ్లోకము మొదలు కథాభాగాంతమువఱకు నాలకించినవారికి నిరంతరము బ్రహ్మవర్చస్సు వృద్ధినొందును.

కాండాంతం శ్రావయే ద్వాపి శృణుయా ద్వా సరర్షభః।
ఉపేత్య భార్యాం హృద్యాంచ రమతే ప్రీతిపూర్వకమ్॥ ౨౫

భా॥ బాలకాండము మొదటినుంచి యొంతవఱకు శ్రద్ధతోఁ జదివిన, వినిన మనోహరురా లగుభార్యను బడసి ప్రేమతోఁ గ్రీడించుచు సుఖము నొందును.

---

☞ ఈదిగువపఙ్క్తి 30 పేజీ రగ శ్లోకమునకుఁ దరువాతఁ జదివికొనవలయును.

సుతీక్ష్ణంచాప్యగస్త్యంచ అగస్త్యభ్రాతరంతథా॥



నారదుఁడు వాల్మీకికి శ్రీరామచరిత్ర ముపదేశించుట

హరిః ఓమ్.

శ్రీమహాగణాధిపతయేనమః

## ప్రతిపదాంధ్రవివరణాదిసమేత

# శ్రీమద్వాల్మీకిరామాయణము.

## బాలకాండము.

తపస్స్వాధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాం వరమ్
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకి ర్మునిపుంగవమ్.

అవతరణిక :—సచ్చిదానందస్వరూపుండును వైకుంఠనిలయుండును నగులక్ష్మీనారాయణుండు విలాసార్థంబు చరాచరాత్మకప్రపంచంబు నిచ్ఛామాత్రమున సృజించె. అం దఖిలజీవరాసులకుఁ దత్తదుచితవ్యాపారనిర్వహణంబునకుఁ గరచరణాద్యవయవంబులును వాని నుపయోగించికొను తెఱం గెఱుంగుటకు విజ్ఞానసంపదయు నొసంగి ధర్మార్థకర్మపరిజ్ఞానసాధనంబుగా స్వశాసనరూప మగు వేదముం బ్రసాదించె. ఆవ్వేదలతత్త్వంబుఁ దెలియనేరక సదీతరణసాధన మగు నుడుపంబు వీడి ప్రవాహవేగంబునఁ బడి కొట్టికొనువానిచందంబున నిత్యాపాయోపలక్షితంబు నత్యంతనికృష్టంబు నయినసంసారంబునం బడి పరిభ్రమించునిఖిలలోకంబు నుద్ధరింప స్వశాసనము నతిక్రమించుబాలితజనులను జక్కఁబఱుప నరుగుదెంచునవతారములమాడ్కి నీభూలోకంబున దశరథమహారాజునింట శ్రీరామాదిరూపంబులతో నవతరించి స్వాచారముఖంబునఁ బహువిధసనాతనధర్మంబులను వ్యాపింపం జేసె. పిమ్మట నయ్యాచారంబులుం దదీయచరిత్రంబును దాత్కాలికజనులతోడనె పర్యవసితంబులు గాక యాచంద్రతారకంబులుగ వెలయునట్లు సేయందలంచి సర్వలోకహితైకపరుం డగుపితామహుండు శ్రీరామకథాపూతంబు శతకోటిప్రవిస్తరంబు నగు ప్రబంధరాజంబు నిర్మించి నారదాదులచే నభ్యసింపఁజేసి మర్త్యలోకంబునఁ బ్రవర్తింపఁ జేయ సమకట్టి యనవరత

శ్రీరామమంత్రానుష్ఠానతత్పరుండు నిజాంశసంభూతుండు నగువాల్మీకి కడకు నారదుం బుత్తెంచె.

ప్రాచేతసుఁడు యాదృచ్ఛికముగా దనయాశ్రమమున కరుదెంచిన దేవర్షిం బూజించి మధుపర్కాదిసత్కారంబు లొసంగి పరితుష్టుం గావించి తా నఖిలవిద్యాపారీణుం డయ్యు "గురుముఖాచ్ఛ్రోతవ్య" మనునట్లు సద్గురూపదేశంబు లేక యెక్కింతయు సిద్ధింప దని తలంచి యమ్మహనీయు గురువర్యునిగాఁ బరిగ్రహించి వేదాంతరహస్యోపబృంహిత మగుపరతత్వ స్వరూపమును దెలిసికొని లోకానుగ్రహార్థ మప్పరమార్థంబు శ్రీమద్రామాయణమహాకావ్యముఖంబునఁ బ్రకటింప నమకట్టి "మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని శాస్త్రాణి ప్రథంతే" యనునట్లు దేవతాగురునమస్కారరూప మగుమంగళమును గాయత్రీప్రథమబీజసంకలితంబగు నీశ్లోకరూపంబున నాచరించు చున్నాఁడు.

ఆంధ్రవివరణము:— తపస్వీ=తపశ్శాలి యగు, వాల్మీకిః=వాల్మీకి, (యను ఋషిసత్తముఁడు). తపస్స్వాధ్యాయనిరతమ్, తపః=తపస్సులయందును, స్వాధ్యాయ=వేదములందును, నిరతం = మిగులనాసక్తిగలవాఁడును, వాగ్విదాం, వాక్=పరబ్రహ్మమును, విదాం=తెలిసికొనినవారిలో, వరం=శ్రేష్ఠుండును, మునిపుంగవం, ముని=మననశీలురయందు, పుంగవమ్=శ్రేష్ఠుండు (నగు) నారదమ్=నారదమహర్షిని, పరిపప్రచ్ఛ=అడిగెను.

భావము:—వాల్మీకిమునిసత్తముండు కృచ్ఛ్రచాంద్రాయణాదితపస్సులయందును ఋగ్యజుస్సామాథర్వణములను చతుర్వేదములందును బరిపూర్ణుండు బ్రహ్మవేత్తలలోనుత్తముండు మునికులావతంసుఁడు నగునారదమునీంద్రుని సవినయముగా నిట్లు ప్రశ్నించెను.

---

అవ,—విజ్ఞానసంపన్నుం డగువాల్మీకిమహర్షి శ్రీరామచంద్రచరిత్రపవిత్రితం బగుశ్రీమద్రామాయణమహాకావ్యంబు రచియింపఁబూని (ఆశీర్నమస్క్రియా వస్తునిర్దేశో వాపి తన్ముఖమ్) «ఆశీర్వచనముతో నైన నిష్టదేవతావందనముతో నైన వస్తునిర్దేశంబుతో నైనఁ గావ్యం బారంభింప వలయు» ననుశిష్టాచారంబు ననుసరించి గురునమస్కారాదిగర్భితంబుగా నారదమునీంద్రుని దాను బ్రశ్నించుటయను వస్తువును నిర్దేశించుచుఁ గావ్యంబు గాంతాసమ్మితంబు గావున (జీవితం వ్యంగ్యవైభవమ్) 'కావ్యమునకు వ్యంగ్యవైభవమే జీవన, మనుటచేతను వ్యంగ్యప్రధానము లగుమృదుమధురశబ్దములచే నీప్రథమశ్లోకమున సదాచార్యసచ్ఛిష్యలక్షణాదిబహువిధధర్మంబుల నుపదేశించు చున్నాఁడు.

(క) తపస్వీ-మనస్సును బరిశుద్ధముగాఁ జేయునట్టి కర్మవిశేషము గల, వాల్మీకిః-వాల్మీకియ నుజిజ్ఞాసువు (తెలిసికొనఁ గోరినవాఁడు) తపస్స్వాధ్యాయనిరతం, తపః-తపస్సే, స్వ-ధనముగాఁ గలవాఁడును, అధ్యాయ-వేదమునందు, నిరతం-ఆసక్తుండును, వాగ్విదాం, వాక్-సరస్వతిచే, విదాం-(విద్యంతే లభ్యంతఇతి. విద్ల్ లాభే కర్మణి క్విప్.) లభింపఁ బడినవారిలో, అనఁగాఁ ఋషులగుమరీచ్యాదులలో, వరం-భాగవతోత్తముఁ డైనందున శ్రేష్ఠుండును, మునిపుంగవం-ముని సత్తముండు నగు, నారదం, (నరస్యసంబంధి నారం. తత్, ద్యతి, ఖండయతీతి నారదః, దో అవఖండనే తం, అనువ్యుత్పత్తిచే) నార-మనుష్యసంబంధ మగునజ్ఞానమును, దం-నశింపఁజేయువాఁ డగునారదమహర్షి యనుసద్గురువును పరిపప్రచ్ఛ-ప్రణామపురస్సరముగా నడిగెను.

ఇందు "తపస్వీ, వాల్మీకిః యనుటచే వాల్మీకిమునీంద్రున కుత్తమశిష్యలక్షణ మగుజ్ఞాన సాధన మైనశమదమాదిగుణసంపత్తియు, 'తపస్స్వాధ్యాయనిరతం, వాగ్విదాంవరం, మునిపుంగ వం, అనుటచే (అభిజనవిద్యాసముపేతం సమాహితం సంస్కర్తార మీప్సేత్) గొప్పవంశమున జనించినవాఁడును, విద్యావంతుఁడును, నిశ్చలమనస్కుఁడు నగువాని నుపదేశకునిగా గ్రహింపఁ దగు, ననునాపస్తంబవచనప్రకారముగా నారదునకు సదాచార్యలక్షణము లగువిద్యాభిజాత్య సమాహితత్వములు సూచింపఁ బడినవి. ('గాయ న్నారాయణకథాం సదా పాపభయాపహాం, నారదో నాశయ న్నేతి నృణా మజ్ఞానజం తమః) 'నిఖిలపాపముల నడంచు వాసుదేవుని చరిత్రము నెల్లప్పుడు పాడుచు మానవుల మోహాంధకారమును నశింపఁజేయుచు నారదుఁ డేతెంచు చుండు,, నను నారదీయపురాణోక్తివలన 'నారదం' అనుటచే (గుశబ్ద స్స్వంధకారే స్యా ద్రుశబ్ద స్తన్నిరోధకః। అంధకారనిరోధిత్వా ద్గురు రిత్యభిధీయతే, 'గు' యనుపదమున కంధకార మర్థము. దానిని నిరోధించుట 'రు' పదార్థము. అంధకారమును జేర నీయనివాఁ డగుటచేఁ గురుఁ డని చెప్పఁబడు చున్నాఁడు, అనుగురుశబ్దార్థము నిర్వచింపఁబడినది.

'పరిపప్రచ్ఛ' యనుటచే (విధివ దుపసన్నః పప్రచ్ఛ) 'యథాశాస్త్రముగాఁ జేరినవాఁ డై యడిగె' ననుశ్రుతిప్రకారము గురునకుఁ దనయం దనుగ్రహము గలుగునట్లు నమస్కారాది కృత్యము లాచరించి జిజ్ఞాసావిషయము నడిగె నని సూచింపఁ బడు చున్నది.

(ఖ) తపస్వీ-జ్ఞానధనుఁ డగు, వాల్మీకిః-వాల్మీకిమహర్షి, తపస్సు-తపస్సులయందు, నిరతం-పరమాసక్తుండును, వాగ్విదాం, వాక్-విద్యలను, విదాం-ఎఱిఁగినవారిలో, వరం-శ్రేష్ఠుఁ డును, మునిపుంగవం, ముని-మౌనముగలవారిలో, పుంగవం-అత్యుత్తముఁడు నగు, నారదం నారద మహర్షిని, ఆధ్యాయ-మిగులధ్యానించి, పరిపప్రచ్ఛ-చెప్పఁ బోవుప్రకారముగా నడిగెను.

ఇందు గురునమస్కారరూప మగుమంగళము చెప్పఁబడినది. మఱియు 'తపస్స్వాధ్యాయ నిరతం' అనుచోట, తపః, స్వాధ్యాయ, నిరతం, అనిపదచ్ఛేదము చేసికొని తపశ్శబ్దమునకు బ్రహ్మ మర్థముగాన, తపః-బ్రహ్మమును, స్వాధ్యాయ-లెస్సగా ధ్యానించి, నారదుని వక్ష్యమాణప్రకా రముగా నడిగె నని యోజించికొనినచో నిష్టదేవతాప్రార్థనారూప మగుమంగళాచరణము సిద్ధించు చున్నది.

(గ) తపస్వీ, (తస్మా న్న్యాస మేషాం తపసా మతిరిక్త మాహుః) 'ఈతపస్సులలో న్యా సము నధిక మైనదానినిగా జెప్పిరి, అనుశ్రుతిప్రమాణమువలనఁ దప మనఁగా న్యాసము. అదికల

వాఁడు తపస్వి (తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా) 'అజ్ఞానమును శరణాగతిచేతను, సవినయముగా నడుగుటచేతను, సేవించుటచేతను దెలిసికొనుము' అనుగీతావాక్యానుసారముగా శరణాగతిరూప మగున్యాసముగలవాఁ డనుట. అట్టి వాల్మీకిః-వాల్మీకిముని, తపస్స్వాధ్యాయనిరతం, తప మనఁగా జ్ఞానము (తప ఆలోచనె) స్వాధ్యాయ మనగా వేదము, (స్వాధ్యాయో వేద తపసోః అని వైజయంతి) ఆరెంటియందును, నిరతం-ఆసక్తుఁడు, అనఁగా (శ్రోత్రియశ్ఛందోధీతే) 'వేదము నభ్యసించినవాఁడు శ్రోత్రియుఁ డనఁబడు' నన్నట్లు మహాశ్రోత్రియుం డనిభావము. వాగ్విదాం (యశ్చ వ్యాకురుతే వాచం। వాగ్యోగవి ద్దుష్యతి చాపశబ్దైః) ఇత్యాది స్థలములయందు వాక్ఛబ్దము వ్యాకరణపర్యాయముగా శిష్టులచే వ్యవహరింపఁబడినందున 'వాక్' అనఁగా వ్యాకరణము అది యితరవేదాంగముల కుపలక్షకంబు గాన షడంగములను, విదాం-ఎఱిఁగినవారిలో, వరం-శ్రేష్ఠుఁడు, మునిపుంగవం, ముని-మౌనవ్రతులలో, పుంగవం-గరిష్ఠుఁడు నగు, నారదం, (నర ఇతి సర్వప్రోక్తః పరమాత్మా సనాతనః) సర్వము బొందించువాఁడగుటచే సనాతనుఁ డగుపరమాత్మ నరుఁ డనిచెప్పఁబడు చున్నాఁడు. (నర ఏవ నారః) నరుఁడే నారుఁ డనంబడు గాన, నార-పరమాత్మను, దం-ఉపదేశరూపముగా నిచ్చువాఁ డగునారదమహర్షిని, పరిపప్రచ్ఛ-పూజించి యడిగెను.

(ఘ) తపస్వీ, తపశ్శబ్దమునకుఁ దంత్రావృత్తులచేఁ గాని యేకశేషవృత్తిచేఁ గాని కృతి కాలావశబ్దములకువలె నర్థస్మరణముజేయఁగా (తపశ్చ, తపశ్చ, తపశ్చ తపాంసి) వేదము, వ్యాకరణాదిషడంగజ్ఞానము, నిర్వేదము ననియర్థము లభించును. (తపస్వీ తాపసేశోచ్యే. అని, వైజయంతి) తపస్సు గలవాఁడు తపస్వి యగును, అనఁగా సశిరస్కము లగువేదములను వేదాంగములను జక్కగా నభ్యసించి కేవలకర్మము లస్థిరములు నల్పములు నగుఫలములనుమాత్ర మొసంగఁగల వనుజ్ఞానముం బడసినవాఁ డై నిర్వేదము (విరాగము) నొంది మోక్షము నభిలషించుచున్నవాఁ డనుట. అట్టి, వాల్మీకిః (వల్మీకస్య అపత్యం పుమాన్ వాల్మీకిః) పుట్టయొక్క సంతానమైనవాఁడు గావున వాల్మీకి యని పేరొందినమహర్షి, తపస్స్వాధ్యాయనిరతమ్ (బ్రహ్మైత దుపాస్వైత త్తపః) 'ఈబ్రహ్మము నుపాసింపుము. ఇదియే తపస్సు, అనుశ్రుతివలనఁ దప మనఁగా బ్రహ్మము. అదిప్రధానముగాఁ గల స్వాధ్యాయము తపస్స్వాధ్యాయము. (శాకపార్థివాదిస్థలములందువలె మధ్యమపదలోపిసమాసము) అట్టి దానియం దాసక్తుఁడు గాన తపస్స్వాధ్యాయనిరతుఁడు. అనఁగా బ్రహ్మప్రతిపాదక మగు వేదాంతముల నభ్యాసక్తుఁ డనియర్థము. వాగ్విదాం, (అనాదినిధనా హ్యేషా వాగుత్సృష్టా స్వయంభువా) 'ఆద్యంతములు లేని యీవేదము బ్రహ్మచే సృజింపఁబడెను, అని వాక్ఛబ్దము వేదపరముగాఁ జెప్పఁబడుటవలన, వాక్-వేదమును, విదాం-తెలిసికొనినవారిలో, వరం-శ్రేష్ఠుఁడును అనఁగా (యదధీత మవిజ్ఞాతం నిగదేనైవ శబ్ద్యతే। అనగ్నావివ శుష్కైధో నతజ్జ్వలతి కర్హిచిత్) 'ఏవిద్య అర్థవిహీనముగాఁ జదివికొనఁబడి వాక్యాగ్రముచేత ధ్వనిచేయఁ బడునో యట్టి విద్య యగ్నిలేనిచోట నెండుకట్టెవలె నొకప్పుడును బ్రజ్వరిల్ల, దనునట్లు కేవలస్వాధ్యాయపఠనము ఫలప్రదము గానందున సార్థకవేదపారంగతుఁ డనియభిప్రాయము. మునిపుంగవం-మునులలో శ్రేష్ఠుఁడు నగు, నారదం, నార-జ్ఞానమును దం-ఇచ్చువాఁ డగునారదమహర్షిని, పరిపప్రచ్ఛ-సంపూర్ణముగా నడిగెను.

ఎవ్వని యొక్క పుత్రుం డెట్లయ్యె ననఁగా—

(చ ర) ప్రచేతసః పుత్రోస్యాం బ్రహ్మో ప్యన్వమన్యత.)

"బ్రహ్మచే ననుమతుఁడై ప్రచేతసునికుమారుఁ డగువాల్మీకి శ్రీమద్రామాయణమును రచించె నని విష్ణుపురాణోత్తరఖండమందును, (ఋక్షోభూ ద్భార్గవ స్తస్మా ద్వాల్మీకి ర్యోభిధీయతే) 'ఆప్రచేతసునివలన వాల్మీకియనిప్రసిద్ధి వడసినభృగువంశీయుఁ డగుఋక్షుఁడు పుట్టె నని విష్ణుపురాణమందును,

(అథాబ్రవీ న్మహాతేజా బ్రహ్మా లోకపితామహః
వల్మీకప్రభవో యస్మా త్తస్మా ద్వాల్మీకి రిత్యసౌ.)

'మహాతేజశ్శాలి యగుసర్వలోకపితామహుం డైనబ్రహ్మదేవుఁడీఋక్షుఁడు పుట్టవలనఁ బుట్టినవాఁడుగాన వాల్మీకియనంబడు ననిచెప్పె, నని బ్రహ్మవైవర్తమునందును, జెప్పంబడుటచే మొదట నీవాల్మీకి భృగువంశోత్పన్నుం డగుప్రచేతసునకు జనించి ఋక్షుం డనుపేరం బరగుచుండె ననియుఁ జిరకాలము నిశ్చలతరతపోనిష్ఠుఁ డై యుండు నాతనిశరీరము పుట్టచే నావరింపఁబడఁగాఁ బ్రచేతసుఁ డగువరుణదేవుఁడు నిరంతరధారావర్షముచే నావల్మీకావృతింగరఁగింప నందుండిప్రాదుర్భవించినకతన వాల్మీకి యని బ్రహ్మచేఁ బిలువంబడె ననియుఁ బ్రచేతసునిపుత్రుఁ డగుటచేఁ బ్రాచేతసుఁ డనికూడఁ జెప్పఁబడుచుండె ననియుఁ దెలియవచ్చుచున్నది ఋక్షాదిశబ్దంబు లున్నను నిచ్చట వాల్మీకియని పౌరుషనామంబున నిర్దేశించుటచే వాల్మీకిమునీంద్రునకుఁ దపఃప్రాముఖ్యమును శమదమాదిగుణసంపత్తియు సూచింపఁబడుచున్నవి. అట్టితపఃప్రభావసంపన్నుం డైన బోధ్యుం డగువాల్మీకి వేదవేదాంగాదివిద్యలను సాంతముగ నధ్యయనముచేసి యందలి సారము నంతను దెలిసికొని (విహాయ శాస్త్రజాలాని య త్సత్యం త దుపాస్యతామ్) 'తర్కవ్యాకరణాదిశాస్త్రములను విడిచి సత్యశబ్దవాచ్య మగుపరబ్రహ్మము నుపాసింపవలెను, అనుటవలనఁ గేవలశాస్త్రాధ్యయన మెన్నఁటికిని పూర్ణంపఁజేయునది కా దనిరెంచి యాధ్యాత్మికవిద్య నవలంబింపఁ గోరి విరాగి యై బ్రహ్మవిద్యాపారీణుండును వేదార్థమును జక్కఁగా నెఱింగినవాఁడును మానవులయజ్ఞానాంధకారమును బారఁదోలి జ్ఞానతేజము నొసంగ సమర్థుండు నగునారదమహామునియనుబోధకునిం జేరి ప్రశ్నించె నని వాల్మీకినారదులకు బోధ్యబోధకభావము సంగతమగుచున్నది.

(జ) తపస్వీ-ఊపఃణతిప్రయతప్తుం డై శోధ్యుఁడు గా నుండిన యొకగృహస్థుఁడు, వాల్మీకిస్సన్-(విషయనిగరణమువలన) వల్మీకరూప మగుసంసారమునుండి బయలువెడలినవాఁ డై, స్వాధ్యాయనిరతం, స్వాధ్యాయ-ఆత్మవిజ్ఞానమందు, నిష్ణాతుఁడును, వాక్-చెప్పఁదలచినయర్థమును జక్కఁగాబోధించుటయందు సమర్థ మగుశబ్దప్రయోగమును, విదాం-ఎఱింగినవారిలో, వరం శ్రేష్ఠుండును, మునిపుంగవం-భగవత్తత్త్వప్రకాశకులలో నుత్తముండు నగు, నారదం, నార-అమృతస్వరూప మగుమోక్షమును, దం-ఇచ్చునట్టి సిశికవర్యుని, తపః-బ్రహ్మమును గూర్చి, పరిపప్రచ్ఛ-సాదరముగా నడిగెను.

ఇందుఁ జతుర్వింశతితత్త్వాత్మకంబు లగుగాయత్రీబీజములం బురస్కరించికొని యీకావ్యశరీరము నిర్మింపఁబడె ననియు రామలక్ష్మణు లనుజీవేశ్వరులు సీత యనుబుద్ధితో నరణ్య మనుసంసారమునఁజరించు చుండఁ దశవదనుం డను నింద్రియదశకంబుతోఁ గూడినమనంబు జటాయు వనుభగవద్భక్తిని నశింపఁ జేసి యాబుద్ధి నపహరించి దుఃఖాబ్ధిమధ్యంబున నుంచిన హనుమంతుఁ డనుసద్గురుని యుపదేశంబున సుగ్రీవాదిసత్సంసర్గబలంబున రావణాదిసంహార మనుమనస్సంయోగము నధిగమించి జ్ఞానాగ్నిశుద్ధయగుబుద్ధితోఁ గొంతకాలము సామ్రాజ్య మనుజీవన్ముక్తత్వము

కోన్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్
ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో దృఢవ్రతః ౨

అవ:—ప్రశ్నప్రకారమును వివరించుచున్నాఁడు.

వి:-అస్మిన్=ఈ, లోకే=(భూ)లోకమునందు, సాంప్రతం=ఇప్పుడు, గుణవాన్=మంచిగుణములుగలవాఁడు, కోను=ఎవ్వఁడు?, వీర్యవాం శ్చ=వీర్యము గలవాఁడు ను, కః=ఎవ్వఁడు?, ధర్మజ్ఞశ్చ, ధర్మ=ధర్మములను, జ్ఞ శ్చ=ఎఱిఁగినవాఁడును, కః=ఎవ్వఁడు?, సత్యవాక్యః, సత్య=నిజమైన వాక్యః=మాటలుగలవాఁడు, కః=ఎవ్వఁడు?, దృఢవ్రతః, దృఢ=చలింపని, వ్రతః=సంకల్పముగలవాఁడును, కః=ఎవ్వఁడు?.

భా:-ఈభూలోకమునం దిప్పుడు శ్రేష్ఠము లైనగుణములు గలవాఁడు, మొక్కవోనిపరాక్రమముగలవాఁడు, సకలధర్మముల నెఱింగినవాఁడు, సత్యమునే వచించువాఁడు, నిశ్చలమైన సంకల్పముగలవాఁడు నెవ్వఁడు గలఁడు?

ననుభవించి పిదప బుద్ధిపరిత్యాగం బొనర్చి జీవత్వనిరాసపూర్వకముగా నయ్యీశ్వరుం డఖండమోక్షంబు నొందె ననునంతరార్థమున కవతారంబు సూచింపఁ బడినది.

(౨) 'అస్మిన్, లోకే' యనుటచే వాల్మీకిమునీంద్రుఁడు లోకాంతరగతు లగుహరిహరాదులం గూర్చి తెలిసికొనఁ గోరినవాఁడు కాఁ డనియు, 'సాంప్రతం' అనుటచే కాలాంతరములం దున్న నరసింహాద్యవతారంబులం గూర్చి యడుగుట లే దనియు 'గుణవాన్' అనుటచే నిర్దేశింపఁ బడిన వీర్యాదిగుణములకంటె భిన్నము లగుగాంభీర్యచాతుర్యాదినిఖిలసద్గుణసంపన్నుం డగుమహాపురుషుం డీలోకంబున నిప్పు డెవ్వఁడు గలం డని విచారించి ప్రశ్నించె ననియు సూచితమగుచున్నది. 'కోను' యనుచోట, ను, యనునది ప్రశ్నార్థకము. 'నుః పృచ్ఛాయాం వికల్పే చ' అని యమరము 'వీర్యవాన్' అనుచోట వీర్య మనఁగా వికారహేతువు లున్నను వికారము నొంద కుండుట యని యర్థము. చకారము సముచ్చయార్థకము. ఒక చకారంబువలననే వీర్యాదిగుణసంఘమున కేకవస్తుపరముగా సమన్వయము చేకూరుచున్నను బహుచకారప్రయోగము పృచ్ఛకునకు జిజ్ఞాసావిషయంబునం గలయూదరాతిశయమును వ్యక్తీకరించుచున్నది. ధర్మజ్ఞః' యనుచోట ధర్మ మనఁగా పారలౌకికశ్రేయస్సాధనము. అట్టి ధర్మమును స్థూలసూక్ష్మరూపముగా నెఱిఁగినవాఁ డనిభావము. చకారమువలన నధర్మమును గూడ నెఱింగినవాఁ డనియు దానంజేసి ధర్మాధర్మంబులఁ జక్కఁగా విభజించి యధర్మంబు రూపుమాపి ధర్మంబు ప్రవర్తింపఁ జేయువాఁ డనియుఁ దెలియందగు. 'కృతజ్ఞః' యనుటచే (న స్మర త్యపకారాణాం శతమ ప్యాత్మవత్తయా। కథంచి దుపకారేణ కృతే నైకేనతుష్యతి) 'శ్రీరాముఁడు వందలకొలఁదియపకారములుచేసినవారి నైనను దనవారినిగా భావించి వారియపకారములను స్మరింపఁడు. ఎట్టకేలకుఁ జేయఁ బడినయొక యుపకారముచేత నైనను సంతసించు' నన్నట్లు దనకుఁ జేయఁ బడిన యుపకార మాకస్మికము నత్యల్పము నైన నత్యధికముగా గ్రహించువాఁ డనియు, "సత్యవాక్యః" యనుటచే (అనృతం నోక్తపూర్వం మే న చ వక్ష్యే కదాచన) నే నిదివఱ కెన్నఁడు నసత్యము పలికియుండలేదు,

చారిత్రేణ చ కో యుక్తః సర్వభూతేషు కో హితః
విద్వాన్ కః కస్సమర్థశ్చ కశ్చైకప్రియదర్శనః 3

వి॥ చారిత్రేణ=సదాచారముతో, యుక్తశ్చ=కూడియుండువాఁడును, కః=ఎవ్వఁడు?: సర్వభూతేషు, సర్వ=సమస్తములైన, భూతేషు=దేహధారులవిషయమై, హితః=హితమును జేయువాఁడు, కః=ఎవ్వఁడు? సమర్థశ్చ=చేయశక్యములుగానికార్యములను నిర్వహించువాఁడును, కః=ఎవ్వఁడు?; ఏక ప్రియదర్శన శ్చ, ఏక=ఒకేమాదిరిగానుండునట్టి, ప్రియ సంతోషదాయకమగు, దర్శనశ్చ=దర్శనముగలవాఁడును, కః=ఎవ్వఁడు.

భా॥ కులక్రమాగతము లగు సదాచారములతోఁ గూడి యుండునట్టి వాఁడును సర్వదా యెల్లరకును హితమును గల్పించువాఁడు సమస్తశాస్త్రములను దెలిసికొనినవాఁడు నెంతటికార్యములనైన సులభముగాఁ జేయునట్టివాఁడు నెల్లప్పుడు నొకరీతిగా సంతసమును గలుగఁజేయు దర్శనము గలవాఁడు నెవ్వఁడు గలఁడు?

మం దొకప్పుడును బలికను, అనుపశ్యమాణప్రకారముగాఁ గష్టకాలముం దైనను సత్యమును విడువనివాఁ డనియు, 'దృఢవ్రతః' యనుటచే (అప్యహం జీవితం జహ్యాం త్వాం వా సీతే సలక్ష్మణాం। నహి ప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణేభ్యో విశేషతః) 'ఓ జానకి నేను జీవితము నైన విడిచెదను. సౌమిత్రితోఁ గూడ నిన్నైన విడిచెదను. ప్రతిజ్ఞనుమాత్రము విడువం జాలను. అప్రతిజ్ఞ బ్రాహ్మణులకొఱకు చేయఁబడిన దైనచో నించుమాత్రమును విడువ, నని చెప్పఁబోవునట్లు సలింపని ప్రతిజ్ఞగలవాఁ డనియు సూచిత మగుచున్నది 'గుణవాన్' అనుచోట (గుణ్యతే ఆవర్త్యతే పునఃపున రాశ్రితై రనుసంధీయత ఇతి గుణః సౌశీల్యం గుణో స్యాస్తీతి గుణవాన) ఆశ్రితులచే మాటిమాటికి నావృత్తి చేయఁ బడునది గాన సౌశీల్యము గుణ మనఁబడును. గొప్పవాఁడు కొద్దివానితోఁ గలసి యరమరికము లేక యుండుట సౌశీల్య మనఁబడుచున్నది. అట్టిగుణముగలవాఁడు గుణవంతుఁ డనియుఁ జెప్పకొనవచ్చును.

ఇచ్చట కం శబ్దము లేనితావులం దెల్ల ననుషంజనీయము. (మూలమునందుఁగల పదము నన్వయసంసిద్ధికై ప్రత్యన్వయమునందు జేర్చుకొనుట యనుషంజనము. అందులకుఁ దగినపద మను షంజనీయ మనఁబడును.) ఇట్లె యుందును యోజించుకొనవలయును.

(౩) సర్వభూతేషు, యనుటచేఁ బంప భేదముగా నెరివారని కాని భేదములేక తన కపరాధము చేసినవారికైనను హితము చేయువాఁడని భావము. 'ఏకప్రియదర్శనుఁ' డనఁగా (తస్మాద్దుఃఖాత్మకం నాస్తి న చ కించిత్సుఖావహం) 'అంతకంటె దుఃఖాత్మకంబు లేదు. సుఖాత్మకమును వేరొక్కటి యుంటలేదు' అనునట్లు లోకములో నొకవస్తు వొకప్పుడు సుఖకరంబు నొకప్పుడు దుఃఖకరంబు నగును. అట్లుగాక (క్షణేక్షణే య న్నవతాముపైతి తదేవ రూపం రమణీయతాయాః) అనేకపర్యాయములు చూడఁబడుచున్నను మాటిమాటికి నూతనముగా నగుపడునదే రమణీయతాస్వరూప మన్నట్లు జగద్విలక్షణ మగురామణీయత గలవాఁడు.

ఆత్మవాన్ కో జితక్రోధో ద్యుతిమాన్ కోఽనసూయకః
కస్య బిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే, ౪

వి॥ఆత్మవాన్=ధీరుఁడు, కః=ఎవఁడు?; జితక్రోధః, జిత=స్వాధీనము చేసికొనఁబడిన, క్రోధః=కోపముగలవాఁడు, కః=ఎవఁడు?; ద్యుతిమాన్=శ్రేష్ఠమైన శోభగలవాఁడు; కః ఎవ్వఁడు?; అనసూయకః=అసహనము లేనివాఁడు, కః=ఎవఁడు?; జాతరోషస్య, జాత=పుట్టిన, రోషస్య=రోషముగల, కస్య=ఎవనికి, సంయుగే=యుద్ధమందు, దేవాశ్చ=దేవతలును, బిభ్యతి=భయపడుదురు?.

భా॥మిక్కిలి ధైర్యము గలవాఁడు మితిమీఱనికోపముగలవాఁడు పరగుణములయం దసహనము లేనివాఁడు నెవఁడు? యుద్ధమం దెవనికి కోప ముదయింపఁగా దేవతలు సైతము భయపడుదురు?.

ఏత దిచ్ఛా మ్యహం శ్రోతుం పరం కౌతూహలం హి మే
మహర్షే త్వం సమర్థోఽసి జ్ఞాతు మేవంవిధం నరమ్. ౫

వి॥ ఏతత్=ఈచెప్పఁబడిన గుణములు గల మనుష్యరూపమైనవస్తువును, అహం=నేను, శ్రోతుం=వినుటకు, ఇచ్ఛామి=కోరుచున్నాను. మే=నాయొక్క, కౌతూహలం=సంతోషము, పరంహి=విశేషముగదా! మహర్షే=పూజ్యుఁడ వగు నోఋషిశ్రేష్ఠుఁడా!, త్వం=నీవు, ఏవంవిధం=ఇట్టి గుణములు గల, నరం=మనుష్యుని, జ్ఞాతుం=తెలిసికొనుటకు, సమర్థః=తగినశక్తి గలవాఁడవు, అసి=అగుచున్నావు?

(౪) 'ఆత్మా జీవే ధృతౌ దేహే స్వభావే పరమాత్మని' అనియమరమందుఁ జెప్పఁబడుటచే 'ఆత్మవాన్' అనఁగా ధైర్యముగలవాఁ డని చెప్పఁబడినది. 'జితక్రోధః' అనుచోట 'క్రోధ' శబ్దము కామాద్యుపలక్షకముగాన నరిషడ్వర్గమును జయించిన వాఁడనియు (అదండ్యాన్ దండయన్ రాజా దండ్యాం శ్చై వా ప్యదండయన్) అయశో మహ దాప్నోతి నరకం చాధిగచ్ఛతి। 'రాజు శిక్షింపఁ దగనివారిని శిక్షించినను శిక్షింపవలెనవారిని శిక్షింపక విడచినను మిక్కిలి దుష్కీర్తి నొంది తుదకు నరకమునకుఁ బోవు' నని చెప్పఁబడుటచే రాజనీతిప్రకారము దోషులయందు రోషించువాఁ డనియు భావము. 'దేవాశ్చ' యనుచోట 'చ'కార మసురాదిసముచ్చాయకము గాన నొక్కదేవతలకే కాక దైత్యదానవాదుల కెల్ల భయభ్రాంతిం గలుగఁ జేయువాఁ డని యభిప్రాయము. 'అనసూయకః' అనుచోట నసూయ యనఁగా గుణగులయందును దోషము నారోపించుట. (అసూయా తు దోషారోపో గుణేష్వపి అని యమరము) అట్టిది లేనివాఁడనుట.

(౫) మహర్షే యనుచోట 'ఋషగతౌ' అనుధాతువువలన ఋషియనఁగా జ్ఞానముయొక్క యంతమును బొందినవాఁ డని యర్థము గాన నీవట్టిజ్ఞానసంపన్నుఁడ వగుటచే నేతాదృశగుణవంతుఁ డగు నరవర్యుం దెలియఁజాలుదు వనియు 'శ్రోతుం' అనుటచే వినఁ గోరి యడు

భా॥ ఇట్టి గుణములతోఁ నొప్పుచున్న పురుషశ్రేష్ఠుని వినుటకు నాకు మిగుల సంతసము గలుగుచున్నది. పూజ్యుఁడగు నో ఋషిసత్తమా! ఇట్టి గుణగణము గల నరవరుని దెలిసికొనుటకు నీవు సమర్థుఁడవు. కావున నాకుఁ జెప్పుమని యడిగెను.

శ్రుత్వా చైతత్ త్రిలోకజ్ఞో వాల్మీకే ర్నారదో వచః
శ్రూయతా మితి చామన్త్ర్య ప్రహృష్టో వాక్య మబ్రవీత్. ౬

వి॥ త్రిలోకజ్ఞః త్రిలోకీ= మూఁడులోకములను, జ్ఞః= తెలిసికొనిన, నారదః= నారదమునీంద్రుఁడు, ఏతత్ =పూర్వమందుఁ జెప్పఁబడిన, వాల్మీకేః= వాల్మీకిమహర్షి యొక్క, వచః= మాటను, శ్రుత్వా చ=వినియు, శ్రూయతాం= వినఁబడు గాక, ఇతి= అని, ఆమన్త్ర్య=పలిచి (ఎదురుగా జేసికొని) ప్రహృష్టః= సంతోషము గలవాఁడై, వాక్యం=వాక్యమును, అబ్రవీత్ =పలికెను.

భా॥ ముల్లోకములందలి సకలవృత్తాంతముల నెఱిఁగిన నారదమహాముని- వాల్మీకిమహర్షి యొక్క ప్రశ్నమును సంపూర్ణముగా విని ఇదిగో! విను!, మని యభిముఖముగాఁ జేసికొని మిక్కిలిసంతోషముగలవాఁడై యొక వాక్యమును బలికెను.

---

గుచుంటివని గాని పరీక్షించుటకుఁ గాని పరిహాసించుటకుఁ గాని యడుగుట లేదనియు 'ఇచ్ఛామి' యనుటచే ననుగ్రహబుద్ధితో మీ రానతిమ్ముఁగా వినవలతుం గాని తప్పక చెప్పవలయు నని నిర్బంధము సేయఁజాల ననియు 'హి' యనుటచే నాకుం గలకౌతూహలము లోకజ్ఞు లగుమీకు విశదమే యనియు 'సమర్థః' అనుటచే జ్ఞానులయం దెల్ల నగ్రేసరుండ వగుటచే నీకుం దక్క వేరొక్కరును కట్టిపురుషులలోనుం దెలియుపాటిశక్తి లేమిం జేస మీ రొక్క రయి చిరకాలంబు నుండి వేచియుంటి ననియు సూచింపఁబడు చున్నది.

(౬) త్రిలోకజ్ఞుఁ డనుచోట, మహర్లోకపర్యంతము కృతక మనియు జనలోకము, కృతకాకృతక మనియు సత్యలోక మకృతక మనియు విష్ణుపురాణమునందుఁ జెప్పఁబడుటచే నట్టి త్రివిధలోకంబుల నెఱింగినవాఁడు లేక—(లోకస్తు భువనే జనే యనుటవలన) లోకశబ్దము నకు జన మనియర్థము గలదు కావున బద్ధ, ముక్త, నిత్యు లనుత్రివిధజనుల నెఱింగినవాఁడు నని యర్థాంతరము. 'ప్రహృష్టః' యనుటచే 'వాల్మీకి ప్రశ్నించిన మహాగుణములు సార్వభౌమమాత్రుని యం దుండవు. అవి యెల్ల సమస్తజగంబుల నేలం దలంచి మనుష్యస్వరూపంబున నవతరించిన శ్రీరామచంద్రునియందు మాత్రము నెలకొనియున్నవి. అహా! నాయదృష్టము! నే నెవ్వనిఁ గూర్చి చెప్పుటకు బ్రహ్మచేఁ బ్రేరితుఁడనై వచ్చితినో యప్పరమపురుషుండే యీవాల్మీకిప్రశ్నమున కుత్తరం బయ్యె, నని నారదుం డుప్పొంగి చెప్పం దొడంగె, నని సూచింపఁ బడినది.

(నాసంవత్సరవాసినే ప్రబ్రూయాత్) 'సంవత్సరము శుశ్రూష చేసినపిమ్మట శిష్యున కుపదేశింప వలయు' నని శాస్త్రము చెప్పుచున్నను జ్యేష్ఠపుత్రునివిషయమై యట్టినియమము లేదు కావున భృగునారదులు బ్రహ్మసంతతివా రగుటచే భృగుపుత్రుఁ డగువాల్మీకి నారదునకు భ్రాతృపుత్రుఁడు గాన శుశ్రూషానిరపేక్షుండై ప్రీతితో నుపదేశించె నని యూహించికొనవలయును.

బహవో దుర్లభాశ్చైవ యే త్వయా కీర్తితా గుణాః
మునే వక్ష్యా మ్యహంబుద్ధ్వా తై ర్యుక్త శ్శ్రూయతాం నరః. ౭

వి॥ బహవః=అసంఖ్యాకములు, దుర్లభా శ్చైవ=ఇతరుల కేమాత్రము బొంద శక్యములు గానివి యు నగు, యే=ఏ, గుణాః=గుణములు, త్వయా=నీచేత, కీర్తితాః=వర్ణింపఁబడినవో, మునే=ఓతాపసోత్తమా, తైః=ఆగుణములతో, యుక్తః=కూడియున్న, నరః=పురుషుఁడు, శ్రూయతాం=వినఁబడుగాక, అహం=నేను, బుద్ధ్వా=తెలిసికొని, వక్ష్యామి=చెప్పెదను.

భా:-ఓవాల్మీకిమునిసత్తమా! నీవు పరిప్రశ్నించినగుణంబులు లెక్కింప నశక్యంబులు, సాధారణమనుష్యులందుఁ జూపట్టవు. అట్టి సుగుణసమేతుం డగు పురుషపుంగవు నూహించి చెప్పెదను, వినుము!

ఇక్ష్వాకువంశప్రభవో రామోనామ జనైః శ్రుతః
నియతాత్మా మహావీర్యో ద్యుతిమాన్ ధృతిమాన్ వశీ. ౮

వి:-ఇక్ష్వాకువంశప్రభవః, ఇక్ష్వాకు=ఇక్ష్వాకుమహారాజుయొక్క, వంశ=కులము, ప్రభవః=ఉత్పత్తిస్థానముగాఁ గల, రామోనామ=శ్రీరాముఁ డనుప్రసిద్ధపురుషపుంగవుఁడు (గలఁడు. సః= ఆశ్రీరాముఁడు.) జనైః=జనులచేత, శ్రుతః=సాక్షాత్తుభగవంతునితోఁబోల్ప దగినగుణములు గలవాఁడని నిర్ణయింపఁబడినవాఁడు. నియతాత్మా, నియత=స్వాధీనమగు, ఆత్మా=స్వభావముగలవాఁడు. మహావీర్యః, మహత్=ఊహింపశక్యముగాని, వీర్యః=సామర్థ్యముగలవాఁడు; ద్యుతిమాన్=అఖండమగు తేజస్సు గలవాఁడు, ధృతిమాన్=మిక్కిలిధైర్యము గలవాఁడు; వశీ=ఇంద్రియనిగ్రహముతోఁ గూడినవాఁడు,

(౭) 'బుద్ధ్వా, వక్ష్యామి' యనుటచే నారదుఁడు రామచంద్రగుణస్మరణమువలనఁ బారవశ్యము నొందినమనస్సు నొక్కింతతడవునకుఁ దెచ్చికొని చెప్పెద నని నుడివె నని యాశయము.

(౮) ఇక్ష్వాకుమహారాజు తొల్లి చిరకాలము శ్రీహరి నారాధించి తదీయమూర్తి విశేషమగు రంగనాథుం బడసె నదియుఁ దద్వంశీయు లందఱిచే నామూర్తి యారాధింపఁ బడుచుండె ననియుఁ బురాణములు చెప్పుచున్నవి గాన జనకాదిమహావంశము లున్నను నిక్ష్వాకువంశపక్షపాతముచేఁ దద్వంశీయుల పూజాఫలముగా నావంశమునం దవతరించె నని 'ఇక్ష్వాకువంశప్రభవః' యనువిశేషణమువలన ధ్వనించుచున్నది. రాముఁ డనఁగాఁ (రమయతి సర్వాన్ గుణై రితి రామః) తనగుణములచే నెల్లరను సంతసింపఁ జేయువాఁ డనియర్థము. లేక—(రమంతే యోగినో స్మిన్నితి రామః) యోగు లీతనియందు రమించు చున్నారుగాన రాముఁ డనఁబడు చున్నాఁడు.

భా॥ ఇక్ష్వాకుమహారాజువంశమున జనించినశ్రీరాముఁ డనుపురుషశ్రేష్ఠుఁడు విశేషముగాఁ గొనియాడఁబడు చున్నవాఁడు; అతఁడు స్వాధీన మగు నంతఃకరణము గలవాఁడు మిగులసమర్థుఁడుఁ దేజశ్శాలియు ధైర్యముగల వాఁడు నింద్రియనిగ్రహముగలవాఁడు నై యొప్పారుచుండు.

బుద్ధిమాన్ నీతిమాన్ వాగ్మీ శ్రీమాన్ శత్రునిబర్హణః
* విపులాంసో † మహాబాహుః ∬ కంబుగ్రీవో ‡ మహాహనుః. ౯.

వి॥ సః=ఆశ్రీరాముఁడు,బుద్ధిమాన్-శ్రేష్ఠ మైనబుద్ధి గలవాఁడు; నీతిమాన్=నీతిశాస్త్రము నెఱింగినవాఁడు; వాగ్మీ=ప్రశస్తవాక్యములు గలవాఁడు; శ్రీమాన్=నిరుపమాన మగునైశ్వర్యముతోఁ గూడినవాఁడు; శత్రునిబర్హణః, శత్రుః=పగవారిని, నిబర్హణః=నశింపఁజేయువాఁడు; విపులాంసః, విపుల=ఉన్నతము లగు, అంసః=భుజశిరస్సులు గలవాఁడు; మహాబాహుః, మహాత్=పద్రూవ లై బలాఢ్యము లగు, బాహుః, బాహువులు గలవాఁడు; కంబుగ్రీవః, కంబు=శంఖమువంటి, గ్రీవః=కంఠము గలవాఁడు; మహాహనుః, మహాత్=ఉన్నతము లగు, హనుః=గండస్థలములయొక్క పైభాగము గలవాఁడు;

భా॥ మఱియు నారాముఁడు బుద్ధియు, నీతియు, వాక్చాతుర్యము, లక్ష్మియు గలవాఁడు శత్రునాశకుఁడు నున్నతము లగుమూపులు

'జ్ఞైశ్వర్యైః' అనుటచే సాంఖ్యశాస్త్రకారులచేతఁ గల్పింపఁబడిన మహేశ్వరాదిసమర్థులైన వారులవలన శ్రీరాముఁడు శ్రీరుద్రాంశభూతుఁడని నిశ్చయింపఁబడెనని ప్రకటిత మనుట నియతాత్మాదివిశేషణములవలన 'నాస్య జరయైత జ్జీర్యతే న వధే నాస్య హన్యతే, అపహతపాప్మా విజరో విమృత్యు ర్విశోకో విజిఘత్సో ఽపిపాసః, సత్యస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియా చ. ఆనందో బ్రహ్మ! సర్వస్య వశీ,సర్వస్యేశానః, ఇత్యాదిశ్రుత్యుక్త లక్షణగుణసంపత్తి వర్ణిత మైనది. 'సః' యనున దధ్యాహారము, మూలమందు లేని పదమును సందర్భానుసారముగాఁ దెచ్చికొనుట 'అధ్యాహార' మనఁబడును. ఇట్లే ముందును మూలమున లేనిపదములను వ్రాసినస్థలములం దెల్ల నధ్యాహారము లనియూహించి కొనవలయును.

(౯.) *(కక్షః కుక్షి శ్చ వక్ష శ్చ ఘ్రాణస్కంధౌ లలాటికా, సర్వభూతేషు నిర్దిష్టా ఉన్నతా స్తు సుఖప్రదాః) చంక, కడుపు, ఱొమ్ము, ముక్కు,భుజశిరస్సులు, (అనఁగా మూపులు) నొసలు, నున్నతము లై యుండిన సర్వభూతములకును సుఖకరములు.

†(ఆజానులంబినౌ బాహూ వృత్తపీనౌ మహేశ్వరః,) మోకాళ్లవఱకు వ్రేలాడుచు బలిసి గుండ్రముగా నుండిన బాహువులుగలవాఁడు మహారాజగును.

∬(కంబుగ్రీవ శ్చ నృపతిః) శంఖమువంటి కంఠముగలవాఁడు రాజగును.

‡(మాంసలే తు హనూ యస్య భవత స్స్వోష్ఠ దున్నతే। స నరోమృష్ట మశ్నాతి యావదాయు

గలవాఁడు బలిసినభుజములు గలవాఁడు శంఖమువంటికంఠముతో నొప్పువాఁడు నై త్తైనచెక్కిళ్లయొక్క పైభాగములు గలవాఁడు నై యుండును.

* మహోరస్కో మహేష్వాసో § గూఢజత్రు రరిందమః

† ఆజానుబాహు ‡ స్సుశిరా స్సులలాట స్సువిక్రమః॥ ౧౧.

వి॥ సః=ఆరాముఁడు, మహోరస్కః, మహత్=గొప్పది యగు, ఉరస్కః=వక్షస్థలము గలవాఁడు; మహేష్వాసః, మహత్ గొప్ప దైన,ఇష్వాసః=ధనుస్సు గలవాఁడు; గూఢజత్రుః, గూఢ=మాంసముచేఁ గప్పఁబడి కనుపింపకుండునట్టి, జత్రుః=మూపులసంధియెముకలు గలవాఁడు; అరిందమః=కామక్రోధాదిశత్రువులను నశింపఁజేయువాఁడు; ఆజానుబాహుః, ఆజానుః=మోకాళ్ల పర్యంతము వ్రేలుచున్న, బాహుః=భుజములు గలవాఁడు; సులలాటః, సు=శుభలక్షణములు గల, లలాటః=నొసలు గలవాఁడు; సువిక్రమః, సు=శుభప్రదమగు, విక్రమః=పాదన్యాసము గలవాఁడు;

భా॥ విశాల మగువక్షము గలవాఁడు గొప్పవిల్లు దాల్చువాఁడు కనుపింపని భుజశిరస్సులయొక్క సంధియెముకలు గల వాఁడు కామక్రోధాదుల నడంచువాఁడు మోకాళ్లవఱకు దీర్ఘము లగుబాహువులు గలవాఁడును

స్సుభూస్స్నిగ్ధః ఒప్పైనచెక్కిళ్లమీఁదిభాగములు బలిసినవియు కొంచె మెత్తనివియు నై యుండునో యాతఁడు సావిత్రీమయుఁడు పుత్రసౌఖ్యమును పొందును.

(౧౦) *(స్థిరం విశాలం కఠినముచ్చ్రితం మాంసలం సమం। వక్షో యస్య మహీపాలః స్తేన మహాభవేన్నరః) వక్షమును విశాలమును స్థిరమును నెత్తైనదియు బలిసినదియు నగురొమ్ము గలవాఁడు రాజుగాని రాజుతో బ్బఁడుగాని యగును.

§ (విషమైర్జత్రుభిస్సిర్ధనా అస్థిమాంసై శ్చమానవాః। ఉన్నతైర్భోగినో నిమ్నై స్సిర్ధనాః పీనై ర్నరాధిపాః) మెచ్చరింపనుండు మూపుల సంధియెముక లెచ్చుతగ్గులు గల వై యుండినను మిగుల సన్నము లై యుండినను దరిద్రు లగుదురు. ఉన్నతము లై యుండిన భోగములుగలవారగుదురు. లోతుగా నుండిన ధనహీను లగుదురు. బలసి మాంసముచేఁ గప్పఁబడి యుండిన భూపాలకు లగుదురు.

† (దీర్ఘభ్రూబాహుముష్క శ్చ చిరజీవీ ధనీ నరః) పొడవు లగుకనుబొమలును బాహువులును వృషణములును గలవాఁడు ధనవంతుఁ డై చిరకాలము జీవించును.

‡ (సమవృత్తశిరా శ్చైవ ఛత్త్రాకారశిరా స్తథా, ఏకచ్ఛత్త్రాం మహీంభుంక్తే దీర్ఘ మాయుశ్చ విందతి)సమమై గుండ్రముగా నుండు శిరస్సుగలవాఁడు, గొడుగువంటిశిరస్సుగలవాఁడు, దీర్ఘాయుర్దాయముగలవాఁ డై భూమినంతను ఏకచ్ఛత్త్రాధిపత్యముగాఁ బాలించును.

'సులలాటః అనుచోట' సు-రేఖాధిక్యముగల, లలాటః-నొసలుగలవాఁ డనియుఁ జెప్పికొనవచ్చును.

(లలాటేయస్య దృశ్యంతే చతుస్త్రిద్వ్యేక రేఖికాః। శతద్వయం శతం షష్టి స్తస్యాయు

శుభకరము లగుశిరము ఫాలము * పాదవిన్యాసము గలవాఁడు నై యాశ్రీరామ చంద్రుఁ డొప్పుచుండు;

¶ సమ § స్సమవిభక్తాంగః † స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్
పీనవక్షా విశాలాక్షో లక్ష్మీవాన్ శుభలక్షణః॥ ౧౧.

వి॥ సః = ఆశ్రీరాముఁడు; సమః = విశేషదీర్ఘము మిగులహ్రస్వము గానిశరీరము గలవాఁడు; సమవిభక్తాంగః, సమ=ఎచ్చుతగ్గులు లేని, విభక్త=వేరుపఱుపఁబడిన, అంగః=అవయవములు గలవాఁడు; స్నిగ్ధవర్ణః, స్నిగ్ధ=నిగనిగలాడు, వర్ణః=శ్యామలకాంతి గలవాఁడు; ప్రతాపవాన్=ప్రసిద్ధ మగుపరాక్రమము గలవాఁడు; పీనవక్షాః, పీన=బలిష్ఠ మైన, వక్షాః=వక్షస్స్థలము గలవాఁడు, విశాలాక్షః, విశాల=దీర్ఘము లైన, అక్షః=నేత్రములు గలవాఁడు; లక్ష్మీవాన్=అంగసౌష్ఠవము గలవాఁడు; శుభలక్షణః, శుభ=మంగళప్రదము లైన, లక్షణః=చిహ్నములు గలవాఁడు;

భా॥ మిక్కిలి పొడవుఁ బొట్టియును గాని దేహము, సమానములు విభజింపఁబడినవియు నగునవయవములు గలవాఁడును ఇంద్రనీలములయొక్క మృదు

స్నిగ్ధత్వము [illegible] స్వరములును, మూఁడురేఖలుండిన [illegible], అనేకాత్యయ [illegible].

* (సింహర్షభగజవ్యాఘ్ర [illegible]) [illegible] సింహముయొక్కయు [illegible] వ్యాఘ్రముయొక్కయు [illegible] శుభము జయము నొందును.

(౧౧) ¶ (షణ్ణవత్యంగుళోత్సేధః సార్వభౌమో భవేన్నృపః) తొంబదియాఱంగుళముల పొడవు గలవాఁడు సార్వభౌముఁ డగును. అనుసాముద్రికోక్తప్రకారముగా హెచ్చుతక్కువలు లేక శాస్త్రోక్తప్రమాణములతో నొప్పు దేహము గలవాఁ డనుట.

§ (భ్రువౌ నాసాపుటే నేత్రే కర్ణౌ వోష్ఠౌ చ చూచుకౌ। కూర్పరౌ మణిబంధౌ చ జానునీ వృషణౌ కటీ। కరౌ పాదౌ స్ఫిజౌ యస్యసమౌ జ్ఞేయస్స భూపతిః) కనుబొమలు, ముక్కురంధ్రములు, కన్నులు, చెవులు, పెదవులు, చనుమొనలు, మోచేతులు, మణికట్లు, మోకాళ్లు, అండములు, కటితలములు, చేతులు, పాదములు, పిఱుదులు నెవ్వనికి సమానములుగ నుండు నో యతఁడు భూనాథుఁ డగును.

† (చక్షుస్స్నేహేన సౌభాగ్యం దంతస్నేహేన భోజనం। త్వచస్స్నేహేన శయ్యాచ పాదస్నేహేన వాహనం) నిగనిగలాడునేత్రములుగలవాఁడు సౌభాగ్యము నొందును. దంతములు నిగనిగలాడుచుండిన మృష్టాన్నము నొందును. మెఱుఁగుతో నొప్పు దేహము గలవాఁడు హంసతూల్యాది శయ్యలయందు శయనించును. పాదములయందు స్నేహముండిన నశ్వాదివాహనములుగలవాఁ డగును.

వైనకాంతి నీనుమేనిచాయయు గొప్పవీర్యము, బలిసినఱొమ్మును, పద్మపత్ర ములవంటినిడివి గలనేత్రములు బరిపూర్ణమైనయవయవసంపత్తియు, మేలైనచిన్నెలు గలవాఁడు నై యాశ్రీరామచంద్రుఁ డలరారుచుండు.

ధర్మజ్ఞ స్సత్యసంధశ్చ ప్రజానాం చ హితే రతః
యశస్వీ జ్ఞానసంపన్న శ్శుచి ర్వశ్య స్సమాధిమాన్॥ ౧౨.

వి॥ సః=ఆశ్రీరాముఁడు, ధర్మజ్ఞః, ధర్మ=దీనరక్షణాదిధర్మములను, జ్ఞః=ఎఱింగినవాఁడు; సత్యసంధశ్చ, సత్య=సత్యమగునది కాని, సంధశ్చ= ప్రతిజ్ఞగలవాఁడు; ప్రజానాం=జనులకు, హితే=ఇష్టమును జేయుటయందు, రతః=ఆసక్తి గలవాఁడు; యశస్వీ=సుప్రసిద్ధ మగుకీర్తి గలవాఁడు, జ్ఞానసంపన్నః=నిఖిలవిషయములందును సంపూర్ణజ్ఞానము గలవాఁడు, శుచిః=పవిత్రుఁడు; వశ్యః=గురుజనులయెడ విధేయుఁడు; సమాధిమాన్=ఆశ్రితులను ప్రేమించువాఁడు;

భా॥ మఱియు నారామభద్రుఁ డార్తత్రాణాదిధర్మములను సంపూర్ణముగ నెఱింగినవాఁడు, యథార్థమైనప్రతినగలవాఁడు నిఖిలజనులకును క్షేమము నొడఁగూర్చు వాఁడుఁ బరిశుద్ధుఁడు జనకాచార్యదేవతాదులయెడ విధేయుఁడు నాశ్రితులయం దనుగ్రహము గలవాఁడు నై విరాజిల్లుచుండు.

ప్రజాపతిసమ శ్శ్రీమాన్ ధాతా రిపునిషూదనః
రక్షితా జీవలోకస్య ధర్మస్య పరిరక్షితా॥ ౧౩.

వి॥ సః=ఆరాముఁడు, ప్రజాపతిసమః, ప్రజాపతి=బ్రహ్మదేవునితో, సమః=పోల్పఁ దగినవాఁడు, శ్రీమాన్=నిరుపమానైశ్వర్యసంపన్నుఁడు; ధాతా=నిఖిలజగత్తును బోషించువాఁడు; రిపునిషూదనః, రిపు=శత్రువులను, నిషూదనః=హింసించునట్టివాఁడు జీవలోకస్య=ప్రాణిసంఘమునకు, రక్షితా=రక్షించువాఁడు; ధర్మస్య=వర్ణాశ్రమోచితధర్మమునకు, పరిరక్షితా=రక్షకుఁడు;

భా॥ మఱియు రామచంద్రుఁడు లోకసంరక్షణమున బ్రహ్మతో సమానుఁడు నఖండితైశ్వర్యశాలి సకలజగత్తులయొక్కయుఁ బోషణభారమును వహించువాఁడు నాశ్రితవిరోధుల నశింపఁ జేయువాఁడు సమస్తజనులకు ననిష్టముం బారఁదోలి యిష్టంబు సమకూర్చువాఁడు వర్ణాశ్రమధర్మముల బ్రవర్తింపఁ జేయు వాఁడు నై విలసిల్లుచుండు.

---

(౧౨) (౧౩) 'రక్షితా జీవలోకస్య ధర్మస్య పరిరక్షితా' అనుటచే లోకములో రాజగువాఁడు ప్రజలనుమాత్రము రక్షింపఁగలఁడు. శ్రీరాముఁడు ప్రాణిసంఘము నంతను గాపాడు వనియు

రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్య చ రక్షితా
వేదవేదాంగతత్త్వజ్ఞో ధనుర్వేదే చ నిష్ఠితః॥ ౧౪.

వి॥ సః=ఆశ్రీరాముఁడు, స్వస్య=తన దగు, ధర్మస్య=శరణాగతరక్షణాది ధర్మమునకు, రక్షితా=ప్రవర్తకుఁడు, స్వజనస్య చ=ఆశ్రితబాంధవాది స్వజనమునకును, రక్షితా=రక్షించువాఁడు; వేదవేదాంగతత్త్వజ్ఞః, వేద=వేదములయొక్కయు, వేదాంగ=శిక్షావ్యాకరణాదివేదాంగములయొక్కయు,తత్త్వజ్ఞః=స్వరూపము నెఱింగినవాఁడు; ధనుర్వేదేచ=అస్త్రశస్త్రములయొక్క ప్రయోగోపసంహారములను దెలుపునట్టియుపవేదమందును,నిష్ఠితః=స్థిరమగు ప్రవేశముగలవాఁడు.

భా॥ ఆరామభద్రుండు శరణాగతరక్షణాత్మక మగుక్షత్రియధర్మమును బ్రవర్తింపఁజేయువాఁడు ఆశ్రితబాంధవాదిస్వజనమును బోషించువాఁడు వేదవేదాంగరహస్యవేత్తయు ధనుర్వేదపారంగతుఁడు నై విరాజిల్లు చుండు.

సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞః స్మృతిమాన్ ప్రతిభానవాన్
సర్వలోకప్రియః సాధు రదీనాత్మా విచక్షణః॥ ౧౫.

వి॥ సః=ఆరాముఁడు, సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞః, సర్వ=సమస్తములైన, శాస్త్ర=సాంఖ్యయోగాదిశాస్త్రములయొక్క, అర్థ=అర్థములయొక్క, తత్త్వ=స్వరూపమును, జ్ఞః=ఎఱిఁగినవాఁడు, స్మృతిమాన్=మఱపులేనివాఁడు, ప్రతిభానవాన్=సమయోచితస్ఫురణము గలవాఁడు, సర్వలోకప్రియః, సర్వ=సమస్తమైన, లోక=జనులకు=ప్రియః=సమ్మతుఁడు, సాధుః=ఉపకారబుద్ధిగలవాఁడు;అదీనాత్మా, అదీన=గంభీరమైన, ఆత్మా=స్వభావము గలవాఁడు; విచక్షణః=నిఖిలకార్యములను నేర్పుతో నిర్వహించువాఁడు.

---

నంపలి పాపాత్ములనుగైతము వైద్యుఁడు రోగులఁబోలె దోషరహితులం జేసి రక్షించు ననియు సూచింపఁ బడుచున్నది.

(౧౪) 'స్వస్య ధర్మస్య' యనుచోట "స్వామ్య స్వభావ సుకృతే ష్వస్త్రీ) ధర్మం తు కార్ముకః" అనువాఁడు చెప్పినందున, ధర్మస్య- ధనుస్సునకు, రక్షకుఁడు. అనఁగా ధనుస్సారథ్యాశ్వాదుల కుపలక్షకము గాన (ఆత్మానం సారథిం చాశ్వాన్ రక్షన్ యుధ్యేత యో రణే, స మహారథసంజ్ఞ స్స్యా దిత్యుక్తపరాక్రమః) 'తప్పుడు తనను సారథిని గుఱ్ఱములను గాపాడికొనుచు వెనుదిరుగనిపరాక్రమముగలవాఁడై యుద్ధము చేయు నో యట్టివాఁడు మహారథుఁడని చెప్పఁబడును, అనునట్లు మహారథుఁ డనియర్థాంతరము.

స్వజనమునకు రక్షకుఁ డనఁగా (అత్యాసన్నం పరిత్యజ్య మునే దత్తం చ నిష్ఫలం) 'ఆశ్రితుని విడచి మహామునికిచ్చినను ఫలము లేదు, అనుటచే నాశ్రితుల నెల్లప్పుడును విడువక పోషించువాఁ డని భావము.

భా॥ శాస్త్రములయొక్క యర్థసారమును బూర్తిగాఁ దెలిసికొనినవాఁడు, కన్నవియు విన్నవియు నగువిషయములం దేకింతయు మఱపు లేక యతితీవ్రముగా స్ఫురించు ప్రజ్ఞావిశేషముగలవాఁడు సమస్తభూతములకు మిక్కిలి ప్రియుఁడు నపకారుల కైన నుపకారమే చేయువాఁడు దీనముగాక యత్యంతగంభీర మగుప్రకృతి గలవాఁడు సర్వకార్యములందు నిపుణుండునై యావిద్యాణి రాణించు చుండు.

సర్వదాభిగత స్సద్భి స్సముద్ర ఇవ సింధుభిః
ఆర్య స్సర్వసమశ్చైవ సదైకప్రియదర్శనః॥ ౧౬.

వి॥ సః=ఆశ్రీరాముఁడు, సింధుభిః=నదులచేత, సముద్ర ఇవ=సాగరమువలె, సద్భిః=పుణ్యులచేత, సర్వదా=ఎల్లప్పుడు, (అనఁగా శస్త్రాభ్యసనము, అంతఃపురవిహారము మున్నగు సమయములయందుననుట) అభిగతః=సేవింపఁబడుచుండెడివాఁడు, ఆర్యః=సేవింపఁదగినవాఁడు, సర్వసమశ్చైవ=సమస్తభూతములందును వైషమ్యము లేక వర్తించువాఁడు, సదా=ఎప్పుడును, ఏకప్రియదర్శనః, ఏక=ఒకటేమాదిరిగా, ప్రియ=సంతోషదాయకముగు, దర్శనః=చూడఁబడుట గలవాఁడు; (అనఁగా నెల్లపుడు సంతోషముతోఁ జూచువారికిఁ గనఁబడు నని భావము.)

భా॥ ఆరామచంద్రుఁడు శస్త్రాభ్యాసాదిసమయములందును నదులచే సముద్రుండువోలె సజ్జనులచేఁ గొలువఁబడుచుఁ బూజ్యుండై యెల్లరకును సేవింపఁ దగినవాఁడు, శత్రుమిత్రాదిభేదములు గాని జాతిగుణాదులవలనితారతమ్యము గాని పాటింపక అందఱయెడలను సముఁడై వర్తించువాఁడు జూపరుల కెప్పుడును గనువిందు గూర్చువాఁడు నై యొప్పారు చుండు.

---

వేదవేదాంగతత్త్వజ్ఞుఁ డనఁగా (విద్యంతే అనేనేతి వేదః) ధర్మాదిపరిజ్ఞానసాధనము వేదము. ఋ, గ్యజు, స్సా, మాథర్వణము లనివేదములు నాలుగు. వేదములకు సహకారు లగునవి వేదాంగములు శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము అనివేదాంగము లాఱు.

(౧౫) (౧౬) "సర్వ దాభిగత స్సద్భిః, అనుటవలన శ్రీరాముఁ డేకానొకప్పుడు వినోదమునకో ఱకేకాంతదేశమున శృంగారహాస్యరసవేత్తలతోఁ గాలక్షేపము సేయుసాధారణరాజపుత్రులవంటివాఁడు కాఁ డనివ్యక్త మగుచున్నది.

నదులకు సముద్రముకంటె వేఱొకగమ్యస్థాన మెట్లు లేదో యట్లే సజ్జనులకు శ్రీరామచంద్రునికంటె వేఱొకయాశ్రయణీయుఁడు లేఁ డనిసముద్రోపమానమువలన గమ్యమాన మగుచున్నది.

సచ సర్వగుణోపేతః కౌసల్యానందవర్ధనః।
సముద్రఇవ గాంభీర్యే ధైర్యేణ హిమవానివ॥ ౧౭

వి॥ సచ=ఆశ్రీరాముఁడు. సర్వగుణోపేతః, సర్వ=సమస్తములైన, గుణ=మంచిగుణములతో, ఉపేతః=కూడికొనినవాఁడు; కౌసల్యానందవర్ధనః, కౌసల్యా=కౌసల్యాదేవికి, ఆనంద=సంతసమును, వర్ధనః=సమకూర్చువాఁడు; గాంభీర్యే=హృదయమందలియభిప్రాయమును వెలిబుచ్చక పోవుటయందు, సముద్రఇవ=సముద్రునివంటివాఁడు; ధైర్యేణ=ధీరస్వభావముచేత, హిమవానివ=హిమాచలమువంటివాఁడు;

భా॥ ఆరామచంద్రమూర్తి సౌశీల్యాదిగుణసంపత్తి గలవాఁడు దశరథునిప్రధానపట్టమహిషి యగు కౌసల్యాదేవికి విశేషోత్సాహమును గలిగించు కుమారుండు హృదయగతమగువానిఁ బ్రకటింపకపోవుటయందు సముద్రముంబోలి యుండువాఁడు హిమాలయముతోఁ బోల్పఁదగిన ధైర్యము గలవాఁడు నై యొప్పు చుండు;

విష్ణునా సదృశో వీర్యే సోమవత్ప్రియదర్శనః।
కాలాగ్నిసదృశః క్రోధే క్షమయా పృథివీసమః॥ ౧౮

వి॥ సః=ఆశ్రీరాముఁడు, వీర్యే=పరాక్రమమందు, విష్ణునా=విష్ణుదేవునితో, సదృశః=సమానుఁడు; సోమవత్=చంద్రుడుంబోలె, ప్రియదర్శనః, ప్రియ=

(౧౭) కౌసల్యానందవర్ధనుఁ డనుటవలనఁ గౌసల్య ప్రధానపట్టమహిషి గావున శ్రీరామచంద్రునకుఁ బట్టాభిషేకార్హత సూచింపఁబడుచున్నది.

గాంభీర్యమున సముద్రునివంటివాఁ డనఁగా సముద్రుఁడు తనలో నుండురత్నాదివస్తువులను బయటకుఁ గనుపింపకుండ దాఁచియుంచునట్లు శ్రీరాముఁడు తనహృదయమందలి భావములను బరులకుఁ దెలియనీయక నిగూఢముగ నుండువాఁ డనుట.

శోకమునకు హేతువు లున్నను శోకము నొందకుండుట ధైర్యము. అట్టిధైర్యమున హిమవంతునివంటివాఁ డనఁగా (గిరయో వర్షధారాభి ర్హన్యమానా న వివ్యథుః। అభిభూయమానా వ్యసనై ర్యథా ధోక్షజచేతసః) భాగవతోత్తములు విచారములచే నాక్రమింపఁబడుచుండియు శోకింపనట్లు పర్వతములు వర్షధారలచేఁ గొట్టఁబడియుఁ జలనము నొందవు. అట్టిపర్వతము లన్నిటికన్న మేటి యగుహిమవంతునితోఁ బోల్పఁ దగినవాఁ డనియు హిమవంతుఁడు పిడుగులుపడుట చేతను వర్షపాతముచేతను జలింపనట్లు శ్రీరామచంద్రుఁ డెంతటియాపదలు దన్నావరించిన నోకింతయు విచారము నొందక యుండువాఁ డనియు భావము.

(౧౮) శ్రీరాముఁడే విష్ణు వైనను మనుష్యోపాధి భేదము వలన విష్ణునివంటివాఁ డని చెప్పఁబడినది. లేక-(స ఉచ్చైః శ్రేయాన్ భవతి జాయమానః, యనునట్లు శ్రీరాముఁడు విష్ణుని

ఆనందముఁ గలుగఁజేయు, దర్శనః=చూడఁబడుట గలవాఁడు; (అనఁగాఁ జంద్రునివలె చల్లనిహృదయము గలిగి చూడఁదగియుండువాఁ డని భావము.) క్రోధే=కోపమందు, కాలాగ్నిసదృశః, కాల=ప్రళయకాల మందలి, అగ్ని=అగ్నిహోత్రునితోఁ, సదృశః=సమానుఁడు; క్షమయా=ఓర్పుచేత, పృథివీసమః పృథివీ=భూమితోఁ: సమః=పోల్పఁదగినవాఁడు;

భా॥ శౌర్యమునందు విష్ణుమూర్తితోఁ బోల్పఁదగినవాఁడుఁ జంద్రమావలెఁ గనువిందుగా నగుపడువాఁడుఁ గోపమునఁ బ్రళయాగ్నికిఁ దీసిపోనివాఁడు నోరిమిచేఁ బుడమిని ధిక్కరించువాఁడు నై యాశ్రీరాముఁ డొప్పుచుండు;

ధనదేన సమ స్త్యాగే సత్యే ధర్మ ఇవాపరః॥ ౧౯

వి॥ సః=ఆశ్రీరాముఁడు, త్యాగే=ఈవియందు, ధనదేన=కుబేరునితోఁ, సమః=సమానుఁడు; సత్యే=యథార్థభాషణమునందు, అపరః=రెండవది యైన ధర్మ ఇవ=ధర్మదేవతవంటివాఁడు;

భా॥ ఆ శ్రీరాముఁడు దాతృత్వవిషయమునఁ గుబేరునితోఁ దుల్యుండును, సత్యమున వేఱొక ధర్మదేవత యనఁదగువాఁడు నై యొప్పుచుండు.

తమేవంగుణసంపన్నం రామం సత్యపరాక్రమమ్।
జ్యేష్ఠం శ్రేష్ఠగుణై ర్యుక్తం ప్రియం దశరథ స్సుతమ్।
ప్రకృతీనాం హితై ర్యుక్తం ప్రకృతి ప్రియకామ్యయా।
యౌవరాజ్యేన సంయోక్తు మైచ్ఛ త్ప్రీత్యా మహీపతిః॥ ౨౦

యర్థాంశముగాపున భగవదంశసంభూతునకు భగవంతునితో సామ్యము యుక్తమని యట్లు చెప్పఁబడినది.

కాలాగ్నిసదృశుఁ డనఁగాఁ దనకపకారము చేసినను సహించునుగాని తనభక్తులకపకారము చేసినచో మిగులఁ జల్లనగుహృదయమందును బ్రళయాగ్నివంటి కోపమును వహించునని భావము.

(౧౯) "ధనదేన, యనుచోట (ధనం దదా తీతి ధనదః) ధనము నిచ్చువాఁడు గాన ధనదుఁ డనఁబడు నట్టి డనువ్యుత్పత్త్యర్థమువలనఁ గుబేరునియీవి సూచింపఁబడినది.

'అపరః' యనుచోట (న విద్యతే పరో యస్మాత్సః అపరః) 'దేనికంటె నుత్కృష్టవస్తువు లేదో అది యపర మనఁబడు నన్న, దానుసమాసముచేఁ దనకంటె నధికవస్తువు లేనిధర్మదేవతవలె నున్నవాఁ డని యర్థాంతరము.

(౨౦) సత్యపరాక్రముఁ డనఁగా (సత్యం పరాక్రమః యస్య సః సత్యపరాక్రమః) సార్థకపరాక్రముఁ డనుట.

ఇచ్చట నర్థాంతరములు:—

అవ॥ ఇట్లు ఇక్ష్వాకువంశమున జనించినవాఁ డనుటచే శ్రీరామజననము మహావీర్యుఁ డనుటచేఁ దాటకాసుబాహుప్రభృతుల వధించుట శ్రీమంతుఁ డనుటచే సీతాకళ్యాణము మున్నగు బాలకాండవృత్తాంతములను సూచించి పిదప నయోధ్యాకాండకథను బ్రస్తావించుచున్నాఁడు.

వి॥ మహీపతిః, మహీ=భూమికి, పతిః=ప్రభు వగు, దశరథః= దశరథమహారాజు, తం=ప్రసిద్ధుఁడైనట్టియు, ఏవంగుణసంపన్నం, ఏవంగుణ=ఇప్పుడు చెప్పఁబడిన సద్గుణములతో, సంపన్నం=కూడియున్నట్టియు, శ్రేష్ఠగుణైః, శ్రేష్ఠ=పట్టాభిషేకమునకుఁ దగిన, గుణైః=సంధివిగ్రహాదులతోఁ గూడికొనినవాఁడు, సత్యపరాక్రమం, సత్య=వ్యర్థము కాని, పరాక్రమం=శౌర్యము గలవాఁడు, ప్రకృతీనాం=జనులకు, హితైః=సౌఖ్యమును గలిగించు కార్యములతో, యుక్తం=కూడియుండువాఁడు, ప్రియం=ప్రీతిపాత్రుఁడగు, సుతం=కుమారుండు జ్యేష్ఠం=తనకుమారులలో మొదటివాఁడు నగు, రామం=శ్రీరాముని, ప్రకృతిప్రియకామ్యయా, ప్రకృతి=మంత్రిపురోహితాదులకు, ప్రియ=సంతోషమును, కామ్యయా=చేయుకోరికచేత, ప్రీత్యా=ప్రేమచే, యౌవరాజ్యేన= యువరాజాధికారముతో, సంయోక్తుం=కూర్చుటకు, ఐచ్ఛత్=సంకల్పించెను.

భా॥ ఇట్లు వర్ణ్యసామాన్యములైన కల్యాణగుణములు గలిగి యమోఘపరాక్రమశాలియు దేవతలచే శ్లాఘింపఁబడుచు సమస్తజనములకు నగు సంధివిగ్రహాదిగుణంబులన్ మంత్రిప్రజలకు సర్వవిధముల హితంబొనరించుచుఁ దన సత్యవాక్పరిపాలనమునఁ బ్రసిద్ధుఁడై యున్న జ్యేష్ఠకుమారుఁ డగు శ్రీరాముని దశరథమహారాజు ప్రజలకు హితము సేయఁగోరి తనకుం గల ప్రీతిచే యౌవరాజ్యమున నభిషిక్తుం జేయ నిచ్ఛగించెను.

---

(క) (సతాం, అపరాక్రమః సత్యపరాక్రమః) సాధుజనులయందుఁ బరాక్రమములేనివాఁడు, అనఁగా సజ్జనుల నెప్పుడుఁ బరిభవింపనివాఁ డనుట.

(ఖ) (సత్యేన పరాన్ ఆక్రమతీతి సత్యపరాక్రమః) న్యాయముగా శత్రువుల నెదిరికొనువాఁడు.

(గ) (సత్యే సత్యవ్రతే పరాక్రమో యస్య సః,) సత్యవ్రతమం దభినివేశముగలవాఁడు.

(ఘ) (సత్యే పరబ్రహ్మణి పరాన్ ఆక్రమతి తారయతి ఇతి సత్యపరాక్రమః) పరబ్రహ్మమం దాసక్తిగలవారిని (అనఁగా జ్ఞానులను) దరింపఁ జేయువాఁ డనుట.

దశరథుఁ డనఁగాఁ బదిదిక్కులయందు నడ్డులేని రథముగలవాఁడు (దశసు దిక్షు అప్రతిహతః రథః యస్య సః దశరథః)

తస్యాభిషేకసంభారాన్ దృష్ట్వా భార్యాఽథకైకయీ
పూర్వం దత్తవరా దేవీ వరమేనమయాచత
వివాసనంచ రామస్య భరతస్యాభిషేచనమ్. ౧౨

వి॥ అథ=పిదప, తస్య=ఆశ్రీరామునియొక్క, అభిషేకసంభారాన్, అభిషేక=యౌవరాజ్యాభిషేకముయొక్క సంభారాన్=ఉపకరణములను, దృష్ట్వా=చూచి, భార్యా=పత్నియు, దేవీ=పట్టపురాణియు, పూర్వం=మున్ను, దత్తవరా, దత్త=ఈయఁబడిన వరా=వరములుగల, కైకయీ=కేకయరాజకుమారి, ఏనం=ఈదశరథుని, రామస్య=శ్రీరామునకు, వివాసనం=అరణ్యవాసమును, భరతస్య=తనపుత్రుఁడగుభరతునకు, అభిషేచనం=రాజ్యాభిషేక మొనర్చుటయు, వరం=వరమును, అయాచత=కోరెను.

భా॥ దశరథునిపట్టమహిషులలో నొక్కతె యగు కైకేయి శ్రీరాముని యభిషేకప్రయత్నముల నాలోకించి మున్నా రాజన్యునిచే వరములను బడసి యున్నదిగావున నప్పుడుశ్రీరాముని వనమునకుఁబంపుటయుఁదనకొమరుం డగు భరతునకు యౌవరాజ్యాభిషేక మొనర్చుటయు ననునీరెండువరముల నాతనిం గోరను పెన్ను.

స సత్యవచనాద్రాజా ధర్మపాశేన సంయతః
వివాసయామాస సుతం రామం దశరథః ప్రియమ్. ౧౩

వి॥ సః=ఆ, రాజా=ప్రజలను రంజింపఁ జేయు, దశరథః=దశరథమహారాజు, సత్యవచనాత్=యథార్థవాక్యమువలన, ధర్మపాశేన, ధర్మ=న్యాయమనెడు, పాశేన=త్రాటిచే, సంయతః=కట్టఁబడినవాఁడై, ప్రియం=ప్రేమాస్పదుఁ డగు, సుతం=కుమారుఁడైన, రామం=శ్రీరాముని, వివాసయామాస=అడవి కనిచెను.

---

ప్రకృతిప్రియకామ్యయా, అనుచోటఁ బ్రకృతిసంబంధముచేఁ దనకుఁ బ్రీతిం జేయుకోరికచే ననియుఁ జెప్పికొనవచ్చును. యువరాజు ప్రజలయొక్క కార్యములను జక్క బెట్టుచుండఁగాఁ దనకుఁ బరిపాలనాదులనునిర్వహించుట వలనఁ గలిగిన శ్రమ తగ్గుట యను ప్రియమును జేయఁగోరినవాఁడై యనిభావము.

యౌవరాజ్య మనఁగా (యువా చాఽసౌ రాజా చ యువరాజః తస్య భావః కర్మ వా యౌవరాజ్యం) తరుణవయస్కుం డగు రాజుయువరా జనంబడును. అతనిధర్మము (చేయుపని) యౌవరాజ్యము, తండ్రి రాజ్యముచేయుచుండఁగా సమస్తరాజకార్యములం జక్కబెట్టుటకు నభిషిక్తుం డగుకుమారుండు యువరాజనివ్యవహరింపంబడు.

భా॥ సమస్తప్రజలను సంతోషపఱచు దశరథమహారాజు కులక్రమాగత మగురాజ్యమును దనజ్యేష్ఠపుత్త్రునకుఁ దలంచినను దానాఁడె తప్పనివాఁడై యందునఁ బరమ ప్రేమాస్పదుండుఁ బుత్త్రరత్నము నగుశ్రీరామచంద్రు నరణ్యమునకుఁ బంచెను.

స జగామ వనం వీరః ప్రతిజ్ఞా మనుపాలయన్।
పితు ర్వచననిర్దేశా త్కైకేయ్యాః ప్రియకారణాత్॥ ౨౪

వి॥ వీరః=పరాక్రమవంతుఁ డగు, సః=ఆశ్రీరాముఁడు; కైకేయ్యాః=కైకయొక్క, ప్రియకారణాత్, ప్రియ=సంతోషమునకు, కారణాత్=హేతు వగు, పితుః=తండ్రియొక్క, వచననిర్దేశాత్, వచన=వాక్యమనెడి, నిర్దేశాత్=సెలవువలన, ప్రతిజ్ఞాం=తనయొక్క ప్రతిజ్ఞను, అనుపాలయన్=సంరక్షించుచు, వనం=అడవినిగూర్చి, జగామ= వెళ్లెను.

భా॥ జగంబులనెల్ల నేలం జాలునేర్పరి యయ్యు రాముండు తనతండ్రి కైకేయి కోరికఁ దీర్చి సంతోషపెట్టుటకుఁ దన్ను వనమునకుఁ బంచునట్లు చేసిన ప్రతినయుఁ దాను గైకయెదుట 'తండ్రి చెప్పినట్లు చేసెద' ననిన ప్రతిజ్ఞయుఁ బాలింప నడవి కేగెను.

తం వ్రజంతం ప్రియో భ్రాతా లక్ష్మణో ఽనుజగామ హ।
స్నేహా ద్వినయసంపన్న స్సుమిత్రానందవర్ధనః,
భ్రాతరం దయితో భ్రాతు స్సౌభ్రాత్ర మనుదర్శయన్॥ ౨౫

వి॥ ప్రియః=శ్రీరామునియందు నిజమైన ప్రేమ గలవాఁడును, భ్రాతా=శ్రీరామునకుఁ దమ్ముఁడును, వినయసంపన్నః, వినయ=నమ్రతతో, సంపన్నః=గూడియుండువాఁడు, సుమిత్రానందవర్ధనః, సుమిత్రా=(తల్లి యగు)సుమిత్రాదేవికి, ఆనంద=సంతసమును, వర్ధనః=వృద్ధిపొందించునట్టివాఁడు, భ్రాతుః=జ్యేష్ఠుఁ డగు శ్రీరామునకు, దయితః=ఇష్టుండు నగు, లక్ష్మణః=లక్ష్మణుఁడు, సౌభ్రాత్రం=మంచితోఁబుట్టువునమును, అనుదర్శయన్=ప్రకటించుచు, వ్రజంతం=వనమునకు వెడలనున్న, తం=ఆ, భ్రాతరం=అన్న యగుశ్రీరాముని, స్నేహాత్=అనురాగమువలన, అనుజగామ= అనుసరించి వెడలెను.

భా॥ శ్రీరామునకు గారాబుతమ్ముండు సుమిత్రాగర్భశుక్తిమౌక్తికము నగులక్ష్మణుండు రామచంద్రునియెడ నిర్వ్యాజ మగుసౌహార్దముతోఁ గూడినవాఁడు గావున నమ్మహనీయునకు సేవఁ జేయం దలంచి తనమంచితోఁబుట్టువునము సకలజనులకుఁ దెలియఁబఱచుచు వినయముతో నారాముననుసరించి వెళ్ళెను.

రామస్య దయితా భార్యా నిత్యం ప్రాణసమాహితా।
జనకస్య కులే జాతా దేవమాయేవ నిర్మితా।
సర్వలక్షణసంపన్నా నారీణా ముత్తమా వధూః।
సీతాప్యనుగతా రామం శశినం రోహిణీ యథా॥ ౨౭

వి॥ రామస్య=రామభద్రునకు, దయితా=ఇష్టురాలు, భార్యా=పత్నియు, ప్రాణసమా, ప్రాణ=(పంచ)ప్రాణములతో, సమా=తుల్యురాలు, నిత్యం=ఎల్లప్పుడు, హితా=ఇష్టము సలుపునదియు, జనకస్య=జనకమహారాజు యొక్క, కులే=యజ్ఞశాలయందు, జాతా=ఆవిర్భవించినదియు, నిర్మితా=(రాక్షసవిమోహనార్థమై) కల్పింపఁబడిన, దేవ=విష్ణుదేవునియొక్క, మాయేవ=జగన్మోహినీస్వరూపమువలె నున్నదియు, సర్వలక్షణసంపన్నా, సర్వ=నిఖిలము లైన, లక్షణ= శుభలక్షణములతో, సంపన్నా=కూడికొనినదియు, నారీణాం=స్త్రీలలో, ఉత్తమా=శ్రేష్ఠురాలు, వధూః=దశరథునకుఁ గోడలు నగు, సీతాపి=సీతాదేవియు, రామం=శ్రీరాముని, శశినం=చంద్రుని, రోహిణీ యథా=రోహిణీదేవివలె, అనుగతా=వెంబడించెను.

భా॥ శ్రీరామునకుఁ బ్రియపత్నియుఁ బ్రాణములతోఁ బోల్పఁదగినదియు నెప్పుడు హితకారిణి యగునదియు జనకమహారాజుయొక్క యజ్ఞవాటికయందు జన్మించి జగన్మోహినివలెఁ గన్పట్టుచుండినదై శోభిల్లునదై నిఖిలసాముద్రికోక్తలక్షణములతో నొప్పుచు, నుత్తమస్త్రీరత్నమై ప్రకాశించెడిసీతాదేవియుఁ జంద్రుని రోహిణివలె రామభద్రు ననుగమించెను.

పౌరై రనుగతో దూరం పిత్రా దశరథేన చ॥ ౨౮

వి॥ సః=ఆరాముఁడు, పౌరైః=సాకేతపురమందలిజనులచేత, పిత్రా=తండ్రియగు, దశరథేన చ=దశరథమహారాజుచేతను, దూరం=దూరముగా, అనుగతః=అనుసరింపఁబడెను.

---

(౨౭) "నిర్మితా దేవమాయేవ, యనుచోట సుందోపసుందవిమోహనార్థము దేవతలచే నిర్మింపఁబడిన మాయ (అనఁగాఁ దిలోత్తమ) వలెనున్న దనియుఁ జెప్పికొనవచ్చును.

లేక-'ఋతే మాయాం విశాలాక్షీం తవపూర్వపరిగ్రహాం, అనుటచే, దేవ-విష్ణునియొక్క-మాయేవ-మాయా భిన్నురాలగు లక్ష్మివలె నున్న దనిచెప్పి కొనందగు.

'సీతా లాంగలపద్ధతిః, యనుటచే సీత యనఁగా నాగేటిచాలు. (సీతోత్పన్నత్వాత్ సీతా) నాగేటిచాలువలన జనించినదిగాన సీత యనంబడు చున్నది.

భా॥ భక్తిగౌరవములచే నయోధ్యాపురవాసులందఱు, వాత్సల్యముచేఁ దండ్రి యగు దశరథమహారాజును శ్రీరామునిఁ గొంతదవ్వనుసరించి వెళ్ళిరి.

శృంగిబేరపురే సూతం గంగాకూలే వ్యసర్జయత్
గుహమాసాద్య ధర్మాత్మా నిషాదాధిపతిం ప్రియం॥ ౨౯

వి॥ ధర్మాత్మా=ధర్మస్వభావము గల, రామః=శ్రీరాముఁడు, గంగాకూలే, గంగా=గంగానదియొక్క, కూలే=ఒడ్డునందున్న, శృంగిబేరపురే, శృంగిబేర=శృంగిబేరమను, పురే=పట్టణమున, నిషాదాధిపతిం, నిషాద=ఎఱుకలవాండ్రకు, అధిపతిం=ప్రభువైన, ప్రియం=తనయందుఁ బ్రీతి గల, గుహం=గుహుని, ఆసాద్య=పొంది, సూతం=రథసారథి యగుసుమంత్రుని, వ్యసర్జయత్=విడిచిపెట్టెను.

భా॥ ఆశ్రితరక్షణదక్షుఁడగు శ్రీరామచంద్రుఁడు గంగయొడ్డునఁ గలశృంగిబేరపురమున నివసించుచున్నట్టియుఁ గిరాతుల కేలికయుఁ దనయం దత్యంతభక్తియుతుఁడు నగుగుహుని గలిసికొని సీతాలక్ష్మణగుహులతోఁ గూడినవాఁడై తన్ను సాగనంపుటకు వెంటవచ్చినసారథి యగుసుమంత్రుని సాకేతనగరమున కనిచెను.

గుహేన సహితో రామో లక్ష్మణేన చ సీతయా॥ ౨౯¼

వి॥ రామః=శ్రీరాముఁడు, గుహేన=గుహునితోడను, లక్ష్మణేన=లక్ష్మణునితోడను, సీతయాచ=సీతాదేవితోడను, సహితః=లెస్సగాఁగలిసికొనెను.

(౨౯) (శృంగిణాంబేరం శరీరం యస్మిన్ తత్ శృంగిబేరం,) జింకలు మొదలగు నారణ్యకజంతువులను వంచనాబుద్ధితో నాకర్షించుటకు మాటుగానుంచెడి కృత్రిమమృగశరీరములుగలది యగుటచే నాపురము శృంగిబేర మనఁబడుచున్నది. (గుహతి గోపయతి వంచయతి పరస్వ మితి గుహః) ఇతరుల సొత్తు నపహరించువాఁడు గాన గుహుఁ డనఁబడుచున్నాఁడు.

శృంగిబేరపురే, గంగాకూలే, యనుచోట శృంగిబేరపురసన్నిహితమగు గంగాతీరమునందనియుఁ జెప్పవచ్చును.

(౨౯¼) సః-ఆరాముఁడు, లక్ష్మణేన-లక్ష్మణునితోడను, సీతయా-సీతతోడను, గుహేన-గుహునిచే, హితః- పంపఁబడినవాఁ డయ్యె ననియోజనాంతరము. 'గుహం, ఆసాద్య...గుహేన, లక్ష్మణేన, సీతయాచ, సహితః,......రామః, సూతం, వ్యసర్జయత్, అని పూర్వశ్లోకముతోనే కాన్వయముం జేయవచ్చును. ప్రసవించినధేనువు లేఁగయందలివాత్సల్యముచే వెనుకటివత్సను విడచునట్లు శ్రీరాముఁడు గుహునిగలిసికొని సుమంత్రుని విడిచె ననిసారస్యము.

భా॥ శ్రీరామచంద్రుఁడు సీతాలక్ష్మణులయందువలె గుహునియందు నఖండసౌహార్దము గలిగి యుండెను.

తే వనేన వనం గత్వా నదీ స్తీర్త్వా బహూదకాః।
చిత్రకూట మనుప్రాప్య భరద్వాజస్య శాసనాత్।
రమ్య మావసథం కృత్వా రమమాణా వనే త్రయః।
దేవగంధర్వసంకాశా స్తత్ర తే న్యవసన్ సుఖమ్॥ ౩౧౪

వి॥ తే=ఆసీతారామలక్ష్మణులు, వనేన=ఒకయడవినుండి, వనం=వేఱొక యడవిని, గత్వా=పొంది, బహూదకాః, బహు=విస్తారము లగు, ఉదకాః=నీళ్ళు గల, నదీః=నదులను, తీర్త్వా=దాటి, అను=తరువాత, భరద్వాజస్య=భరద్వాజమహర్షియొక్క, శాసనాత్=ఆజ్ఞవలన, చిత్రకూటం=చిత్రకూటపర్వతమును

---

(౩౧౪) 'వనేన' యనుచోటఁ బంచమ్యర్థమునఁ దృతీయ 'నదీః' యనుచోట 'గంగా నదీనాం' గంగ నదులలో ముఖ్యమైనది గావున నుపపదము లేకున్నను గంగానది యని యోజించు కొనవలెను. 'పూజాయాం బహువచనమ్' అనుటచే 'నదీః' అని బహువచనము ప్రయోగింపఁ బడి నది. లేక-వారు వనమునుండి వేఱొకవనమున కేగి రనుటచే గంగానదిని దాటి రని యర్థమువలన సిద్ధించుచున్నది గాన నిచ్చట 'నదీః' అనఁగా యమునానది నని చెప్పికొనంపగు, లేక- గంగాయమునామందాకిను లనునదులను దాటి రనియుఁ జెప్పికొనవచ్చును. మందాకినియనఁగాఁ జిత్రకూటపర్వతసమీపమునఁ బ్రవహించునొకనది. సౌకర్యముకొఱకు కొక్కపర్యాయమె చెప్పఁబడెననియెఱుంగునది.

భరద్వాజుఁ డనఁగా (బిభర్తి వాజం ప్రజా మితి భరద్వాజః) ప్రజను భరించువాఁడు. (శ్రు. ఏష వై బిభ్రద్వాజః భరద్వాజః ప్రజా వై వాజ స్తా ఏష బిభర్తి తస్మా ద్భరద్వాజ ఇత్యాచక్షతే) 'ఇతఁడే బిభ్రద్వాజుఁడు. వాజ మనఁగాఁ బ్రజలు. ఎందువలన నీతఁడు ప్రజలను భరించుచున్నాఁడో అందువలన భరద్వాజుఁ డని చెప్పఁబడుచున్నాఁడు. లేక-వాజీకరణము మున్నగుస్థలములందు వాజశబ్దము రేతఃపరముగాఁ బ్రయోగింపఁబడుటచే రేతస్సును భరించువాఁడుగాన భరద్వాజుఁ డనఁబడుచున్నాఁడు (శ్రు॥ భరద్వాజో హ త్రిభి రాయుర్భిః బ్రహ్మచర్య ముపాసతే) 'భరద్వాజుఁడు మూఁడాయువులచే బ్రహ్మచర్యము నుపాసించుచున్నాఁడు, అనుశ్రుతివలన నిత్యబ్రహ్మచారియనుట.

'దేవ గంధర్వ సంకాశాః' అనుచోట (దేవీ చ దేవ శ్చ దేవౌ, గానం సామగానం ధారయ తీతి గంధర్వః దేవౌ చ గంధర్వ శ్చ దేవగంధర్వాః, తై స్తుల్యాః దేవగంధర్వసంకాశాః) దేవులనఁగా లక్ష్మీనారాయణులు. గానమును ధరించువాఁడు గంధర్వుఁడు. అనఁగా 'ఏతత్సామ గాయ న్నాస్తే' యనునట్లు భగవత్సన్నిధానమున సర్వదా సామగానపరుం డగు ముక్తుఁడు. వారితో సమానులు. సీతారాములు లక్ష్మీనారాయణులతోడను, లక్ష్మణుఁడు తత్సన్నిధానమున సామగాన మొనర్చుచు మోక్షసుఖమనుభవించు ముక్తునితోడను బోల్పఁదగినవారై యుండి రని యర్థాంతరము.

ప్రాప్య=పొంది, రమ్యం=మనోహరమగు, ఆవసథం=నివాసమును. కృత్వా=నిర్మించికొని, తే=ఆ, త్రయః=సీతారామలక్ష్మణులు ముగ్గురు, తత్ర=ఆచిత్రకూటపర్వతమందలి, వనే=వనమందు, రమమాణాః=విహరించుచు, దేవగంధర్వసంకాశాః, దేవ=వేలుపులతోడను, గంధర్వ=దేవగాయకులతోడను, సంకాశాః=సములై, సుఖం=సుఖముగా, న్యవసన్=నివసించిరి.

భా॥ ఆసీతారామలక్ష్మణు లొకయడవినుండి వేరొకయడవి కరుగుచుఁ బెద్ద పెద్ద యేరులను దాటుచు మునిముఖ్యుఁడగుభరద్వాజుని సందర్శించి యతనియాజ్ఞచేత చిత్రకూటపర్వతముఁ జేరి యందొక పర్ణశాలను నిర్మించికొని దేవగంధర్వులతోఁ బోల్పఁదగినవారై పరమసుఖముతో విహరించుచుండిరి.

---

'తే' త్రయః, అనుటచే గుహుండు మరలిపోయెననియు సీతారామలక్ష్మణులు ముగ్గురు మాత్రము నుండిరనియు సూచింపఁబడుచున్నది.

'తే-ఆ, యనఁగా నయోధ్యలో సర్వసుఖముల ననుభవించినవారని భావము. లేక-క్రొత్తగా వనవాసమునకు వచ్చినవారైనను వనవాసక్లేశము ననుభవించుటకు అలవాటుపడినవారనియుఁ జెప్పవచ్చును. 'తే వనేన వనం గత్వా' యనుపాఠమున కర్థాంతరములు:—

(క) తే-ఆసీతారామలక్ష్మణులు, అవనేన-పరస్పరరక్షణముచే,వనం-అడవిని,గత్వా పొంది.

(ఖ) తే-వారు, అవనేన హేతునా-పితృవాక్యపరిపాలన మను హేతువుచే, వనం-అరణ్యమును గూర్చి, గత్వా-వెళ్లి

(గ) తే-వారు, అవనేన హేతునా-లోకరక్షణ మను హేతువుచే, అనఁగా రావణాదిసంహారమొనర్చి లోకసంరక్షణ మొనర్చునుద్దేశముతో, వనం, గత్వా-అడవికేగి-

(ఘ) తేవనేన 'తేవృ దేవనే, యనుధాతువువలన విలాసముచే తే-ఆసీతారామలక్ష్మణులు,వనం-కాననమును, గత్వా-పొంది.

(ఙ) తేవనేన-పాదసంచారముతో, వనంగత్వా-అడవికేగి.

(చ) తే-ఆమువ్వురు, వనేన-జలముతో, (సహితం-కూడిన)వనం, గత్వా-వనమునొంది,అచ్చటచ్చట నీరుగలవనము నొంది యనుట.

(ఛ) తే-వారుముగ్గురు, అవనేన- మధ్యమధ్యను స్థలప్రదేశముతో సహితం-కూడిన, వనం-అరణ్యమును, గత్వా-పొంది- నడుమ నొక్కొక్కచో నరణ్యములు లేని విరళప్రదేశములను నొక్కొక్కచో గాఢారణ్యములను జొచ్చుచు ననుట.

(జ) తే-ఆమువ్వురు, తేవనేన-క్రీడచే, అనఁగా మృగయావినోదముచే, వనం-అరణ్యమును గూర్చి, గత్వా-వెళ్లి, వేటలాడికొనుచు క్రమముగా నరణ్యమునఁ బ్రవేశించి యనుట.

చిత్రకూటం గతే రామే పుత్రశోకాతుర స్తథా।
రాజా దశరథ స్స్వర్గం జగామ విలపన్ సుతమ్॥ ౩౨౪

వి॥ రామే=శ్రీరాముఁడు, తథా=పూర్వమందుఁ జెప్పఁబడినరీతిగా, చిత్రకూటం=చిత్రకూటపర్వతమునుగూర్చి, గతే=వెళ్ళినపిదప, పుత్రశోకాతురః, పుత్రశోక= కుమారుఁ డగుశ్రీరామునిగురించినవిచారముచే, ఆతురః=పీడింపఁబడినవాఁ డై, రాజా= ప్రభు వగు, దశరథః=దశరథమహారాజు. సుతం=కుమారుఁడగురామభద్రునిగూర్చి. విలపన్ = విచారించుచు, స్వర్గం=దేవలోకమును, జగామ= పోయెను.

భా॥ ఆరీతిగా శ్రీరాముఁడు చిత్రకూటాచలమున కరిగినపిమ్మట రాజలలాముఁ డగు దశరథుఁడు శ్రీరాము నెడబాయుటవలనఁ గలిగిన మహత్తర మగువిచారముచే మిగులఁ బాధపడుచు నారాముని పేరే స్మరించుచు స్వర్గస్థుఁ డయ్యెను.

మృతేతు తస్మిన్ భరతో వసిష్ఠప్రముఖై ర్ద్విజైః।
నియుచ్య మానో రాజ్యాయ నైచ్ఛ ద్రాజ్యం మహాబలః॥ ౩౩౪

వి॥ తస్మిన్=ఆదశరథమహారాజు, మృతే=మరణము నొందినపిదప, మహాబలః, మహత్=విశేష మగు, బలః=సామర్థ్యము గల, భరత స్తు=భరతుండును, వశిష్ఠప్రముఖైః=వశిష్ఠ మహాముని మొద లగు, ద్విజైః=బ్రాహ్మణులచేత, రాజ్యాయ=రాజ్యము చేయుట కై, నియుజ్యమానః=ఆజ్ఞాపింపఁబడియు, రాజ్యం=ప్రభుత్వమును, నైచ్ఛత్=ఇచ్ఛయింప లేదు.

భా॥ ఆరాజోత్తముఁ డగుదశరథుఁడు మరణించినపిదప వసిష్ఠుఁడు లోనుగాఁ గల బ్రాహ్మణపుంగవులు భరతుని రాజ్యము సేయ నియోగించిరి. వీరోత్తముఁ డగునాభరతుఁడు పాలించుటకుఁ జాలినమహాబలము గలిగి యుండియు రాగాదులం జయించుకడిమి గలిగి విషయంబులకు లోఁబడనిమానసంబు గలవాఁడు గానఁ దనయన్నయందలినెయ్యంబు పెంపున నతండు విడిచిన యా రాజ్యంబుఁ గైకొన నొల్లఁడయ్యె.

(౩౩౪) (భరణా ద్రాజ్య స్యేతి భరతః) రాజ్యమును భరించుటవలన భరతుఁ డనఁబడుచున్నాఁడు లేక-(బిభర్తి స్వకులధర్మ మితి భరతః) తనకులధర్మమును భరించువాఁడు అనఁగాఁ గులాచార్యు లగువశిష్ఠాదులు రాజ్యమును బాలించు మని యెంతనిర్బంధముతో నియోగించినను జ్యేష్ఠుండు సామ్రాజ్యాభిషిక్తుం డగుటయే మనువంశవృద్ధాచారమని తా నారాజ్యము నొల్లక కులధర్మమును నిలువం బెట్టినవాఁ డని యర్థము.

స జగామ వనం వీరో రామపాదప్రసాదకః ౩౮.

వి॥ వీరః=రాగద్వేషాదులను సంపూర్ణము గా జయించిన, సః=ఆభరతుఁడు, రామపాదప్రసాదకః, రామ * పాద=పూజ్యుఁడైనశ్రీరాముని, ప్రసాదకః=అనుగ్రహింపఁ జేసికొన నిచ్ఛగించినవాఁడై, వనం=అడవినిగూర్చి, జగామ=వెళ్ళెను.

భా॥ రాగద్వేషాదిరహితుం డగునాభరతుఁడు పూజ్యుఁ డగురామ భద్రునియడుగుదమ్ములం గొలిచి యతనిం బ్రసన్నుం జేసికొనుటకు వనంబు నకుఁ బయనం బయ్యె.

గత్వా తు సుమహాత్మానం రామం సత్యపరాక్రమమ్।
అయాచ ద్భ్రాతరం రామ మార్యభావపురస్కృతః॥ ౩౯.

వి॥ సః=ఆభరతుఁడు, ఆర్యభావపురస్కృతః, ఆర్యభావ=పూజ్యత్వముచే, పురస్కృతః=శ్లాఘింపఁ బడుచున్నవాఁడై, సుమహాత్మానం, సుమహాత్=మిక్కిలి పూజింపఁదగిన, ఆత్మానం=మనస్సుగలవాఁడు, సత్యపరాక్రమమ్, సత్య=యథార్థవచనమందు, పరాక్రమమ్=దృఢమైనదీక్ష గలవాఁడు నగు రామం=శ్రీరాముని, గత్వా=పొంది, భ్రాతరం=తోడంబుట్టు వగు, రామం=, శ్రీరాముని, అయాచత్=ప్రార్థించెను.

---

(౩౮) * పూర్వ ... ..., ...

(౩౯) "ఆర్యభావపురస్కృతః, అనుమాటకు వ్యాఖ్యానాంతరము —

(క) (ఆర్యభావః పురస్కృతో యేన సః ఆర్యభావపురస్కృతః, పురస్కృతార్యభావ ఇత్యర్థః, ఆహితాగ్న్యాదిత్వా త్పరనిపాతః) ఎవనిచే నార్యభావము పురస్కరించి కొనఁ బడుచున్నదో యతఁ డార్యభావపురస్కృతుఁ డనఁబడుచున్నాఁడు. (పురస్కృతార్యభావుఁ డనుట) ఆహితాగ్న్యాదిగణములోని దగుటచేఁ బరనిపాతము.

(ఖ) ఆర్య-పూజ్య మగు, భావ-అభిప్రాయముచే, పురస్కృతః-పూజితుఁడు (పూజ్యమగు స్వభావముగలవాఁడగుటచేఁ బూజితుఁడని భావము.)

(గ) ఆర్య-పూజ్య మగు, భావ-మనస్సుగలవారిచే, పురస్కృతః-గౌరవింపఁ బడినవాఁడు.

(సత్సు కార్యవతాం పుంసాం మల మే వాగ్రత స్థితిః) "సత్పురుషులయెదుటఁ గార్యార్థులు నిలచుటయే చాలు, ననునట్లు భరతుఁడు శ్రీరాముని సమీపించె ననుటచేత నే భరతునిహృదయము శ్రీరామచంద్రునకు గోచర మైనట్లు సూచింపఁ బడినను భరతుఁడు మిగుల దైన్యముతో నడిగె నని 'అయాచత్' అనుటవలనఁ దెలియం దగు.

భా॥ వినయాదిగుణములతోఁ గూడినయాభరతుఁడు, పరమప్రాజ్ఞమగుమనంబుతో నొప్పుచున్న సత్యవ్రతదీక్షాపరతంత్రుఁ డగునారాముని సన్నిధిం జేరి యన్న యగుశ్రీరామునితోఁ దనకోరికను వెలిపుచ్చెను.

త్వమేవ రాజా ధర్మజ్ఞ ఇతి రామం వచో౽బ్రవీత్॥ 35.

వి॥ సః=అభరతుఁడు, ధర్మజ్ఞః, ధర్మ=(సద్గుణగరిష్ఠుఁ డగుజ్యేష్ఠుఁ డుండఁగాఁ గనిష్ఠుఁడు రాజ్యార్హుఁడు కాఁ డను) ధర్మమును, జ్ఞః=ఎఱింగిన, త్వమేవ=నీవే, రాజా=రాజవు, ఇతి=అని, రామం=రఘురామునిగూర్చి, వచః=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

భా॥ అభరతుఁడు 'నిఖిలరాజధర్మములను జక్కఁగా నెఱింగిన నీవే ప్రజలను రంజింపఁ జేయుటకుఁ దగినరాజ' వని రామునితో వక్కాణించెను.

రామో౽పి పరమోదారః సుముఖః సుమహాయశాః।

న చైచ్ఛత్ పితురాదేశాద్రాజ్యం రామో మహాబలః॥ 36.

వి॥ రామోపి=(నిఖిలప్రాణులను) సంతోషింపఁజేయువాఁడైనను, పరమోదారః=సకలాభీష్టములనొసంగువాఁడైనను, సుముఖః=(అర్థిజనలాభముచే) ప్రసన్నమగుమోముగలవాఁడైనను, సుమహాయశాః, సుమహాత్=మిక్కిలిగొప్పదైన, [illegible] కీర్తిగలవాఁడైనను, మహాబలః, మహాన్=గొప్పదియగు, బలః అపి=బలముగలవాఁడైనను, రామః=రాముఁడు, పితుః=తండ్రి యగుదశరథునియొక్క, ఆదేశాత్=ఆజ్ఞవలన, రాజ్యం=ప్ర[illegible]మును, నైచ్ఛత్=కోరలేదు.

భా॥ నిఖిలజనులకు విశేషామోద మొసఁగూర్చువాఁ డగుశ్రీరాముఁడు సకలమనోరథముల భక్తుల కిచ్చువాఁడు, దాసజనితమగుకులక్రమాగతసత్కీర్తితో నొప్పుచున్నవాఁడు, నాశ్రితజనమనోరథములఁ గొనసాగించుటకు శక్తుండు, నైనను భరతుం డింత వినయముతోఁ బ్రార్థించినను జనకాజ్ఞను శిరసా వహించినవాఁడై నందున రాజ్యముఁ జేకొన నొల్లఁ డయ్యె.

(36) చకారమువలన పితృాజ్ఞాపరిపాలనానంతరరము రాజ్యమును స్వీకరించుట కంగీకరించె ననిసూచిత మగుచున్నది.

(నహ్యర్థినః కార్యవశా దుపేతాః కకుత్స్థవంశే విముఖాః ప్రయాంతి) కకుత్స్థాన్వయమందు యాచనార్థమై వచ్చినయర్థులు పరాఙ్ముఖులై వెళ్ల, రనివిష్ణుపురాణోక్తప్రకారముగా జగత్ప్రసిద్ధమగుకులక్రమాగతకీర్తిగలవాఁ డనుట.

పాదుకే చాస్య రాజ్యాయ న్యాసం దత్త్వా పునఃపునః।
నివర్తయామాస తతో భరతం భరతాగ్రజః॥ ౩౮.

వి॥ చ=మఱియు, భరతాగ్రజః=భరతుని కన్న యగ్రజుఁడగు శ్రీరాముఁడు, రాజ్యాయ=దొరతనముకొఱకు, అస్య=ఈభరతునకు, పాదుకే=పావకోళ్ళను, న్యాసం=ప్రతినిధినిగా, దత్త్వా=ఇచ్చి, తతః=అటరువాత, పునఃపునః=మాటిమాటికి, భరతం=భరతుని, నివర్తయామాస= మరల్చెను.

భా॥ ఆరామభద్రుఁడు దొరతనంబు నిర్వహింపఁ దన పాదుకల నాభరతునకుఁ దా నేతెంచునందాఁక ప్రతినిధిగా నుంచికొను మని యిచ్చి పిదప సాకేతనగరమున కేగుమని పలుమారు బోధించి మరల్చెను,

స కామ మనవాప్యైవ రామపాదా వుపస్పృశన్।
నన్దిగ్రామే ఽకరో ద్రాజ్యం రామాగమనకాంక్షయా॥ ౩౯

వి॥ సః=ఆభరతుఁడు, కామం=కోరికను, అనవాప్యైవ=పొందకయే, రామపాదౌ, రామ=శ్రీరామునియొక్క, పాదౌ * పావకోళ్ళను, ఉపస్పృశన్= పూజించుచు, రామాగమనకాంక్షయా, రామ=శ్రీరామునియొక్క, ఆగమన= రాకయందలి, కాంక్షయా=కోరికచే, రాజ్యం=ప్రభుత్వమును, నన్దిగ్రామే= అయోధ్యాపట్టణమునకుఁ జేరియున్న నన్దిగ్రామను పురమున, అకరోత్= చేసెను.

భా॥ ఆభరతుఁడు రామచంద్రునియొక్క రాకయందు విశేషాసక్తి గలిగియు నది లభింపనికతన మరలి రామపాదుకలం బ్రతిదినము పూజించుచు రామరహితమగు నయోధ్యయందుండనొల్లక నందిగ్రామమున వసించుచు శ్రీరామునియొక్క రాక నెప్పుడు నభిలషించుచున్నవాఁడై రాజ్యకార్యము లను జక్కఁబెట్టుచుండెను

గతే తు భరతే శ్రీమాన్ సత్యసన్ధో జితేన్ద్రియః।
రామ స్తు పున రాలక్ష్య నాగరస్య జనస్య చ।
తత్రాగమన మేకాగ్రో దణ్డకాన్ ప్రవివేశ హ॥ ౪౦

(౩౮) 'పునఃపునః' యనుటచే రాముని విడచివెళ్లుట కిష్టపడకున్నను భరతుని నెట్టకేల కొప్పించి రాముఁ డింటికిఁ బంపె ననిభావము.

(౩౯) * ఇచ్చట పాదశబ్దము పాదుకాపరము.

వి॥ భరతే=భరతుఁడు, గతేతు=వెళ్ళఁగానే, శ్రీమాన్=విశేష తేజశ్శాలియు, సత్యసంధః, సత్య=యథార్థమగు, సంధః=ప్రతిజ్ఞగలవాఁడు, జితేంద్రియః, జిత=స్వాధీనము చేసికొనఁబడిన, ఇంద్రియః=ఇంద్రియములుగలవాఁడు నగు, రామస్తు=శ్రీరాముండు, నాగరస్య=పురమునందలి, జనస్య చ=జనముయొక్క, తత్ర=ఆచిత్రకూటపర్వతమందు, పునః=తిరిగి, ఆగమనం=రాకను, ఆలక్ష్య=శంకించి, ఏకాగ్రః=నిశ్చల మగుచిత్తముగలవాఁడై, దండకాన్=దండకారణ్యభాగములను ప్రవివేశ=ప్రవేశించెను. హ=ఏంతవిచారము !

భా॥ భరతుఁడు మరలిపోఁగానే మిక్కిలిశోభగలవాఁడుఁ జలింపని ప్రతిజ్ఞగలవాఁడుఁ బ్రాపంచికసౌఖ్యములందు వైరాగ్యముగలవాఁడు నగు శ్రీరాముఁడు భరతుండుగాని సాకేతనగరవాసు లగు ప్రజలుగాని, మరల నాతావునకు రావచ్చునని శంకించి దృఢసంకల్పముగలవాఁడు గాన దండకారణ్యప్రదేశములఁ బ్రవేశించెను.

ప్రవిశ్య తు మహారణ్యం రామో రాజీవలోచనః।
విరాధం రాక్షసం హత్వా శరభంగం దదర్శ హ॥ ౪౧

అవ :—ఇంక మహర్షులచేఁ గానింపఁబడిన రాక్షసవధరూప ప్రతిజ్ఞానిర్వహణపర మగు నరణ్యకాండకథను సంగ్రహముగాఁ జెప్పుచున్నాఁడు.

వి॥ రాజీవలోచనః, రాజీవ=పద్మములవంటి, లోచనః=నేత్రములుగల, రామః=శ్రీరాముఁడు, మహారణ్యం=దండకారణ్యము, ప్రవిశ్యతు=ప్రవేశించినవెంటనే, విరాధం=విరాధుఁ డనురక్కసుని, హత్వా=చంపి, శరభంగం=శరభంగ

(౪౦) 'శ్రీమాన్' అనుటచే భరతుఁ డరుగుదెంచినప్పుడు తన్నుతఁ డెంతనిర్బంధించినను ప్రతిన కట్టిభంగముఁగలుగఁజేయు నో యనిరాగు లొందినవాఁడు గావున నతఁడేగినపిదప నట్టి విచారము పోవుటచే ముఖమునం దుదయించినశోభావిశేషముగలవాఁ డనియు—

'సత్యసంధః' యనుటచే మిగులఁ బ్రేమాస్పదుం డగుభరతుఁ డెంతపట్టుపట్టినను దనప్రతిజ్ఞ నించుకంతయుఁ జలింపనీయనివాఁ డనియు.

'జితేంద్రియః' యనుటచేఁ గౌసల్యాభరతాదులు నిర్బంధించి రనునెపంబున నయోధ్యకరుగుట కవకాశ మున్నను రాజ్యభోగములయం దించుకయు నాశలేనివాఁ డనియు- వ్యక్తము చేయఁబడుచున్నది.

'రామస్తు' యనుతావునందు 'తు' యనునది చకారార్థకము.

దండకమహారాజుయొక్క నివాస మగుదండకగ్రామము శుక్రశాపమువలన నరణ్యమై దండకారణ్యమను పేరం బరఁగుచుండె. 'అవాంతరవనబాహుళ్యము గల దగుటచేఁ' దండకాన్, అనిబహువచనము ప్రయోగింపఁ బడినది. 'దండకాం' అనిపాఠాంతరము.

మునీంద్రుని, సుతీక్ష్ణంచాపి=సుతీక్ష్ణమహామునిని, అగస్త్యంచ=అగస్త్యతాపసోత్తముని అగస్త్యభ్రాతరం, అగస్త్య=అగస్త్యునియొక్క, భ్రాతరం=తమ్ముఁడగుసుదర్శనమహర్షిని, ప్రదర్శ=పేక్షించెను.

భా॥ పద్మపత్రములవలె విశాలము లగుకనులు గలశ్రీరాముఁడు దండకారణ్యమున బ్రవేశించినతోడనే విరాధుం డను రాక్షసుం బరిమార్చి శరభంగయతీంద్రుని, సుతీక్ష్ణతాపసోత్తము, నగస్త్యమహాముని నగస్త్యునితమ్ముండగుసుదర్శన మహర్షిని సందర్శించెను.

అగస్త్యవచనాచ్చైవ జగ్రాహైన్ద్రం శరాసనమ్
ఖడ్గం చ పరమప్రీత స్తూణీ చాక్షయసాయకౌ॥ ౪౨

వి॥ (రామః=రాముఁడు,) అగస్త్యవచనాచ్చైవ, అగస్త్య=అగస్త్యమహామునియొక్క, వచనాచ్చైవ=వాక్యములవలనే, ఐంద్రం=ఇంద్రునిచే నొసఁగఁబడిన, శరాసనం=ధనుస్సును, ఖడ్గంచ=కత్తిని, అక్షయసాయకౌ, అక్షయ=తరుగని, సాయకౌ=బాణములుగల, తూణీచ=అమ్ములపొదులను, పరమప్రీతః, పరమ=మిక్కిలి ప్రీతః=సంతోషముగలవాఁడై, జగ్రాహ=గ్రహించెను.

---

(౪౧) నూతన మగుమహారణ్యసందర్శనముచే నుదయించినవిశేషానందమువలనఁ బద్మపత్రములవలె వికసించిన నేత్రములు గలవాఁ డనిభావము. లేక - చిరకాలమునుండి తపోధను లగుమునిపుంగవుల వెలిగొట్టుచున్న రాక్షసులతో యుద్ధము చేసి దుష్టులను సంహరింపఁ గలమహాభాగ్యము తనకు లభింప నున్న దనుసంతోషముచేఁ దమ్మిరేకులవలె వికసించిన లోచనములుగలవాఁ డనియుఁ జెప్పవచ్చును. విరాధుని సంహరించి శరభంగుని సందర్శించె ననుటచే (రిక్తహస్తేన నోపేయా ద్రాజానం దైవతం గురుమ్) 'రాజును' దేవుని, గురువును శూన్యహస్తములతో దర్శింపరా, దన్నట్లు విరాధహననరూప మగు కానుకను దీసికొని శ్రీరాముఁడు శరభంగదర్శనమున కేగె నని తాత్పర్యము.

'యవీయా నేష మే భ్రాతా సుదర్శన ఇతి స్మృతః' అని యగస్త్యుఁడు చెప్పినట్లు సనత్కుమారసంహితలో నుండుటచే నగస్త్యభ్రాత పేరు సుదర్శనుఁ డని తెలియుచున్నది.

'పదేషు సంహితా నిత్యా నిత్యా ధాతూపసర్గయోః' నిత్యా సమాసే వాక్యేతు సావివక్షామపేక్షతే, యనుటచే సంధి చేయఁబడలేదు.

(౪౨) ''ఐంద్రం, శరాసనం'' అనుచోట 'ఇది' పరమైశ్వర్యే, అనుధాతువువలన నింద్రుఁ డనఁగాఁ బరమైశ్వర్యశాలి యగువిష్ణువు. ఇంద్రుని (అనఁగావిష్ణుని) సంబంధమైన దైంద్రము. అట్టిశరాసనము. విష్ణుధను స్సనుట. రాముఁడు నారాయణాంశసంభూతుఁడగుటచేఁ దనయొక్క ధనుస్సు లభించినకతనఁ బరమప్రీతుం డయ్యె ననియర్థాంతర మూహ్యము.

భా॥ శ్రీరాముఁడు మునికునమూర్ధన్యుఁ డగునగస్త్యమహర్షియొక్క యాజ్ఞం గైకొని యతనికి వాసవుఁ డొసంగినధనుర్బాణములను ఖడ్గమును రణరంగమున నెంతవిశేషముగనుపయోగించిన తఱుగని బాణములచేనొప్పుచున్న రెండమ్ములపొదులను బరిగ్రహించెను.

వసతి స్తస్య రామస్య వనే వనచరై స్సహ।
ఋషయో ఽభ్యాగమన్ సర్వే వధా యాసురరక్షసామ్॥ ౪౩

వి॥ వనే=శరభంగాశ్రమమునందు, వనచరైస్సహ=వానప్రస్థులతోఁ గూడ వసతిః=నివసించుచున్న, తస్య=ఆ, రామస్య=శ్రీరామునియొక్క, సమీపం=సమీపమునకువచ్చి, సర్వే=సమస్తులైన, ఋషయః=మునులు, అసురరక్షసాం, అసుర=దానవులయొక్కయు, రక్షసాం=రాక్షసులయొక్కయు, వధాయ=సంహారమునుగోరుటకొఱకు, అభ్యాగమన్=(శ్రీరామునికడకు) వచ్చిరి.

భా॥ శరభంగాశ్రమమున వానప్రస్థులతో శ్రీరాముఁడు నివసించి యుండఁ జుట్టుప్రక్కల నుండు సకలతాపసోత్తములు దానవులను రాక్షసులను వధింపఁ జేయు మనివేడుట కమ్మహానీయుకడ కేతెంచిరి.

---

(౪౩) యోజనాంతరములు:—

(క) (శరభంగాశ్రమే రామ మభిజగ్ముశ్చ తాపసాః) మునులు శరభంగాశ్రమమున శ్రీరాముని శరణుసొచ్చి, రనుటచే, వనే-శరభంగవనమందు, తస్య- ఆ, రామస్య-రాముఁడు, వసతస్సతః-నివసించుచుండఁగా, సర్వే-అందఱునగు, ఋషయః-శరభంగాశ్రమముననివసించుచున్న మునులు, వనచరై స్సహ-చిత్రకూటాదివనములందునివసించుచున్న తాపసులతోఁగూడ, అసురరక్షసాం అసుర-క్రూరస్వభావముగల, రక్షసాం-రాక్షసులయొక్క, వధాయ-వధనుగోరుటకై, అభ్యాగమన్-వచ్చిరి. క్రూరస్వభావు లనుటచే సత్త్వభావు లగువిభీషణాదులను విడచి శేషించిన రాక్షసుల ననినూహింపఁబడుచున్నది.

(ఖ) వనచరైస్సహ-వనచరులతోఁ గూడ, వనే-అరణ్యమున, తస్య-ఆ, రామస్య- శ్రీరాముఁడు, వసతస్సతః- నివసించుచుండఁగా, సర్వే, ఋషయః-ఋషులందఱు, అసురరక్షసాం, అసు-ప్రాణములను, ర-గ్రహించునట్టి, అనఁగాఁబాధిహింప చేయునట్టి, రక్షసాం- రాక్షసులయొక్క-వధాయ, చంపించుటకు, అభ్యాగమన్-ఏతెంచిరి.

శ్రీరాముఁడు వనచరు లగుకిరాతులతో వనవాసము గడపుచుండ మును లెల్లరు వచ్చి రాక్షసులు దమకుఁ బ్రాణాపాయముఁ గల్పించు చున్నందున రాముని నిస్సహాయత నాలోచింపక, (తే వయం భవతా రక్ష్యా భవద్విషయవాసినః, నగరస్థో వనస్థో వా త్వం నో రాజా జనేశ్వరః) జనులఁ బాలించు రామచంద్రా! నీదేశమున నివసించుమమ్ము నీవేరక్షింపవలయు. పట్టణమందున్నను నరణ్యమం దున్నను నీ వే మాకు రాజ వనిరి.

స తేషాం ప్రతిశుశ్రావ రాక్షసానాం తథా వనే॥ ౪౪

వి॥ సః=ఆరాముఁడు, రాక్షసానాం=రాక్షసులయొక్క, (నివాసమగు) వనే=దండకారణ్యమున, తేషాం=ఆమహర్షులకు, తథా=అట్లు, ప్రతిశుశ్రావ=(చేయుదునని) వాగ్దానము చేసెను.

భా॥ ఆశ్రీరాముఁడు రాక్షసులు నివసించుదండకావనమందు మునులు దన్నుం గోరినచందంబునఁ జేయుట కంగీకరించెను.

ప్రతిజ్ఞాతశ్చ రామేణ వధ స్సంయతి రక్షసామ్।
ఋషీణా మగ్నికల్పానాం దండకారణ్యవాసినామ్॥ ౪౫

వి॥ రామేణ=శ్రీరామచంద్రునిచేత, అగ్నికల్పానామ్, అగ్ని=అగ్నిహోత్రునితో, కల్పానామ్=*ఇంచుమించుగాఁ బోల్పఁదగినవారగు, దండకారణ్యవాసినామ్, దండకారణ్య=దండకావనమందు, వాసినామ్=కాపురమున్న, ఋషీణాం=ఋషులకై, సంయతి=సమరమందు, రక్షసాం=రాక్షసులయొక్క, వధః=సంహరించుట, ప్రతిజ్ఞాతశ్చ=ప్రతిజ్ఞయుఁ గావింపఁబడెను.

భా॥ వీతిహోత్రునితోఁ బోల్పఁ దగినవారుఁ బరిశుద్ధాంతఃకరణులు నగు దండకారణ్యవాసులైనమహర్షులకొఱకుఁ దప్పక యుద్ధములో నిఖిల రాక్షసులను సంహరించెద ననిప్రతిజ్ఞ యొనర్చెను.

తేన తత్రైవ వసతా జనస్థాననివాసినీ।
విరూపితా శూర్పణఖా రాక్షసీ కామరూపిణీ॥ ౪౬

వి॥ తత్రైవ=ఆ దండకావనమందే, వసతా=నివసించుచున్న, తేన=ఆ శ్రీరామునిచేత, కామరూపిణీ, కామ=స్వేచ్ఛాధీనమగు, రూపిణీ=ఆకారము గలదియు, జనస్థాననివాసినీ, జనస్థాన=జనస్థానంబనుదండకారణ్యభాగమున, నివాసినీ=నివసించుచున్నదియు నగు, శూర్పణఖా=శూర్పణఖ యనురాక్షసస్త్రీ, విరూపితా=అంగవైకల్యముగలదిగాఁ జేయఁ బడెను.

భా॥ శ్రీరాముఁ డాదండకాటవిలోనె నివసించుచు నాదండకారణ్యములో రావణాసురునిసేనానివేశస్థాన మగుజనస్థానమున నివసించునదియు

(౪౫) *(ఈషదసమాప్తౌ కల్పప్ ప్రత్యయః) అగ్నికంటె నొక్కింత తక్కువవా రనుట. 'ఋషీణామ్' అనుచోఁ జతుర్థ్యర్థమున షష్ఠి.

(౪౬) శూర్పతుల్యము లగునఖములుగలదిగావున శూర్పణఖ యనఁబడుచున్నది. శూర్పము అనఁగాఁ జేటలు.

స్వేచ్ఛారూపిణియు నగుశూర్పణఖ యనురాక్షసాంగనను ముక్కుం జెవులుం గోసి విరూపితం గావించె.

తతః శూర్పణఖావాక్యా దుద్యుక్తాన్ సర్వరాక్షసాన్।
ఖరం త్రిశిరసం చైవ దూషణం చైవ రాక్షసమ్।
నిజఘాన రణే రామ స్తేషాం చైవ పదానుగాన్॥ ౪౭

వి॥ తతః=పిదప, శూర్పణఖావాక్యాత్=శూర్పణఖయొక్కవచనమువలన, ఉద్యుక్తాన్=పోరునకు సంసిద్ధులైన, సర్వరాక్షసాన్=సమస్తరాక్షసులను, ఖరం=ఖరుని, త్రిశిరసం చైవ=త్రిశిరస్కుని, దూషణం=దూషణుఁడను, రాక్షసం చైవ=రాక్షసుని, తేషాం=ఆఖరత్రిశిరోదూషణులయొక్క, పదానుగాన్=అనుచరులను, రణే=యుద్ధమందు, రామః=శ్రీరాముఁడు, నిజఘాన=కొట్టెను.

భా॥ శూర్పణఖ విరూపిత యైనపిదప శూర్పణఖమాట విని రణమొనర్పవచ్చినఖరుని త్రిశిరస్కుని దూషణుని వారిసేనాపతులను సైన్యములను నిశ్శేషముగా రాముఁడు యుద్ధమందుఁ జెండాడెను.

వనే తస్మిన్ నివసతా జనస్థాననివాసినామ్।
రక్షసాం నిహతా న్యాసన్ సహస్రాణి చతుర్దశ॥ ౪౮

వి॥ తస్మిన్=ఆ, వనే=దండకారణ్యమునందు, నివసతా=నివసించుచున్న (రామేణ=)శ్రీరామునిచే, జనస్థాననివాసినామ్, జనస్థానే=జనస్థానమందు, నివాసినామ్=కాపురమున్న, రక్షసాం=రాక్షసులయొక్క, చతుర్దశ= పదునాలుగు, సహస్రాణి=వేలు, నిహతాని=నిశ్శేషముగా సంహరింపఁబడినవి, ఆసన్=అయినవి.

భా॥ శ్రీరాముఁడు తా నాదండకారణ్యములో నివసించియుండఁగనే జనస్థానవాసు లగుపదునాలుగువేలరాక్షసులఁ దునుమాడినవాఁ డయ్యెను.

తతో జ్ఞాతివధం శ్రుత్వా రావణః క్రోధమూర్ఛితః।
సహాయం వరయామాస మారీచం నామ రాక్షసమ్॥ ౪౯

---

(౪౭) శూర్పణఖను రామాజ్ఞచే లక్ష్మణుఁడు విరూపితం గావించె. అయినను 'రామస్య దక్షిణో బాహుః' అని లక్ష్మణుఁడు రామునికుడిభుజ మనిచెప్పఁబడుటచే విరూపకరణమునకు రాముఁడే కర్త యనునభిప్రాయముతో 'రామేణ విరూపితా' అని చెప్పఁబడినది.

(౪౯)( రావయతీతిరావణః రు, శబ్దే) ధ్వనింపఁ జేయువాఁడు గాన రావణుఁడు. అనఁగా (యస్మా ల్లోకత్రయం హ్యేత ద్రావితం భయమూర్ఛితం, తస్మా త్త్వం రావణో నామ నామ్నా తేన భవిష్యసి) యనునట్లు లోకత్రయమును భయమూర్ఛిత మై యాక్రోశింపఁజేయఁ బడినందున

వి॥ తతః=ఆతరువాత, రావణః=రావణాసురుఁడు, జ్ఞాతివధం, జ్ఞాతి=దాయాదులయొక్క, వధం=చంపుటను, శ్రుత్వా=విని, క్రోధమూర్ఛితః, క్రోధ=కోపముచేత, మూర్ఛితః=ఆవరింపఁబడినవాఁడై, మారీచంనామ=మారీచుఁడను, రాక్షసం=రక్కసుని, సహాయం=సాయముచేయువానిఁగా, వరయామాస=కోరెను.

భా॥ శ్రీరామునిచే ఖరదూషణాదులు చంపఁబడినపిదప రావణుఁడు తనసోదరులగుఖరాదులమరణము నాలకించి యధిక మగుక్రోధముతోఁ గూడినవాఁడై జానకిని హరించుటకై తనకు సాయము చేయు మని మారీచుం డను రాక్షసునిఁగోరెను.

వార్యమాణ స్సుబహుశో మారీచేన స రావణః।
న విరోధో బలవతా క్షమో రావణ తేన తే॥ ౫౦౪

వి॥ సః=ఆ, రావణః=రావణాసురుఁడు, రావణ=రావణుఁడా! తే=నీకు, బలవతా=బలశాలి యగు, తేన=ఆశ్రీరామునితో, విరోధః=శత్రుత్వము, నక్షమః=తగినదికాదు. (ఇతి=అని) సుబహుశః=అనేకపర్యాయములు, వార్యమాణః=నివారింపఁబడినవాఁడు, అభూత్=ఆయెను.

భా॥ మారీచుఁడు 'మిక్కిలి బలసంపన్ను లగుఖరాదుల నొక్కుమ్మడిఁ బరిమార్చినయాదేవదేవుఁ డగుశ్రీరామునితోఁ బగ నీకుఁ దగ' దనియారావణు నెన్నియోభంగుల నివారించెను.

అనాదృత్య తు తద్వాక్యం రావణః కాలచోదితః।
జగామ సహమారీచ స్తస్యాశ్రమపదం తదా॥ ౫౧౪

వి॥ రావణః=రావణాసురుఁడు, కాలచోదితః, కాల=మృత్యువుచే, చోదితః=పురికొల్పఁబడినవాఁడై, తద్వాక్యం, తత్=ఆమారీచునియొక్క, వాక్యం=మాటను, అనాదృత్యతు=ఆదరింపకయే, సహమారీచః=మారీచునితోఁగూడినవాఁడై, తదా=అప్పుడు, తస్య=ఆరామచంద్రునియొక్క, ఆశ్రమపదం, ఆశ్రమ=ఆశ్రమముయొక్క, పదం=ప్రదేశమునుగూర్చి, జగామ=వెళ్ళెను.

---

రావణుఁ డని ప్రసిద్ధిఁ జెందినవాఁ డనుట. లేక-విశ్రవసునికుమారుండు గాన రావణుఁ డనఁబడుచున్నాఁడు (విశ్రవసో పత్యం పుమాన్ రావణః) శివాదిగణములలో 'విశ్రవసో విశ్రవణరవణః' యనిపఠించుటవలనవిశ్రవశ్శబ్దమునకురవణాదేశముపైనణ్ప్రత్యయమురాఁగా,రావణః యగుచున్నది.

భా॥ రావణుఁడు తనకు మృత్యువాసన్నమగుటంజేసి పరమప్రియుఁడగుమారీచుం డెన్నిభంగుల హితంబు కఱపినను బెడచెవిం బెట్టి యతనితోఁగూడ శ్రీరాముఁడు నివసించుచున్న తావునకుం జనెను.

తేన మాయావినా దూర మపవాహ్య నృపాత్మజౌ॥

జహార భార్యాం రామస్య గృధ్రం హత్వా జటాయుషమ్॥ ౫౨

వి॥ సః=ఆరావణుఁడు, మాయావినా=మాయలమారియగు, తేన=ఆమారీచునిచేత, నృపాత్మజౌ=రాజపుత్రులగు రామలక్ష్మణులను, దూరం=దవ్వుగా, అపవాహ్య=వెడలిపోవునట్లు చేయించి, జటాయుషం=జటాయు వను, గృధ్రం=గద్దను, హత్వా=మృతప్రాయునిగాఁ గొట్టి, రామస్య=శ్రీరాముని యొక్క, భార్యాం=భార్య యగుసీతాదేవిని, జహార=అపహరించెను.

భా॥ జిత్తులమారి యగుమారీచుండు దనమాయచే విచిత్రకనకమృగరూపంబు దాల్చి రామలక్ష్మణులను దూరమునకుఁ దీసికొనిపోవ నవ్వేళ రావణుండు శ్రీరామునికళత్ర మగుసీతాదేవిని హరించి యప్పతివ్రతామణిని విడిపించుటకుఁ గయ్యంబునకుఁ దలపడినజటాయు వనుగృధ్రరాజును బ్రాణావశిష్టునిగా నొనర్చెను.

గృధ్రం చ నిహతం దృష్ట్వా హృతాం శ్రుత్వా చ మైథిలీమ్।

రాఘవ శ్శోకసంతప్తో విలలాపాకులేంద్రియః॥ ౫౩

వి॥ నిహతం=మరణోన్ముఖుండై యున్న, గృధ్రం=జటాయువును, దృష్ట్వాచ=చూచియు, మైథిలీం=సీతాదేవిని, హృతాం=ఎత్తికొనిపోఁబడినదానినిగా, శ్రుత్వాచ=వినియు, రాఘవః=రఘుకులోద్భవుఁ డగుశ్రీరాముడు, శోక

(౫౨) (ఆస్యం వ్యాదాయ స్వపితి) 'నోరుఁ దెఱచికొని నిద్రించుచున్నాఁడు,'అనునెడ నిద్రించినపిదప నోరు తెఱువఁబడినను నోరుఁ దెఱచి నిద్రించుచున్నాఁ డనిలోకవ్యవహార ముండుభంగి సీతాహరణానంతరము జటాయువు సంహరింపఁ బడినను జటాయువును గూల్చి సీత నపహరించె నని చెప్పఁబడినది. కావుననే 'హత్వా' యని యపూర్వకాలమున క్త్వాప్రత్యయము ప్రయోగింపఁబడినది.

రావణునిచేఁ దీసికొనిపోఁబడినసీత మాయాసీత యనియుఁ గేవలసీత యగ్నియం దంతర్హిత యయ్యె ననియు రావణవధానంతరము మాయాసీత యగ్నిప్రవేశ మొనర్పఁ గేవలసీత బయలు వెడలె ననియుఁ జెప్పుచున్నారు.

(౫౩) రాఘవమైథిలీశబ్దప్రయోగమువలన రఘుజనకవంశములకు సీతాపహరణము లాఘవకర మని విచారాతిశయమునకు హేతువు సూచింపఁబడినది.

సంతప్తః, శోక=విచారముచేత, సంతప్తః=మిగులఁ దపింపఁజేయఁబడినవాఁడు, ఆకులేంద్రియః, ఆకుల=కలఁతనొందిన, ఇంద్రియః=ఇంద్రియములుగలవాఁడునై, విలలాప=విచారించెను.

భా॥ శ్రీరామచంద్రుఁడు మరణోన్ముఖుఁడై పుడమింబడియున్న జటాయువుం గాంచి యా గృధ్రరాజువలనఁ బులస్త్యవంశసంభూతుఁ డగు రావణుఁడు మిథిలారాజపుత్రిక యగుజానకీదేవి నపహరించినచందం బాకర్ణించి మిగుల దుఃఖాకులితస్వాంతుఁడై పరాయత్తము లగు నింద్రియములతోఁ గూడికొని విచారింపసాగెను.

తత స్తే నైవ శోకేన గృధ్రం దగ్ధ్వా జటాయుషమ్।
మార్గమాణో వనే సీతాం రాక్షసం సందదర్శ హ।
కబంధంనామ రూపేణ వికృతం ఘోరరూపిణమ్॥ ౫౫

వి॥ తేన=ఆ, శోకేనైవ=విచారముచేతనే, తతః=ఆవరింపఁబడినశ్రీరాముఁడు, గృధ్రం=గద్దయైనను, జటాయుషం=జటాయువును, దగ్ధ్వా=సంస్కరించి, వనే=అడవియందు, సీతాం=జానకీదేవిని, మార్గమాణః=వెదకుచు, రూపేణ=స్వరూపముచేత, వికృతం=వికారయుతుఁడు, ఘోరదర్శనం, ఘోర=భయంకరమగు రూపుఁజేయు, దర్శనం=చూపుగలవాఁ డగు, కబంధం నామ=కబంధుఁ డను, రాక్షసం=రాక్షసుని, సందదర్శ(హ)=చూచెను.

భా॥ అటు నా వానరముతోడనే శ్రీరాముఁడు దశరథమహారాజునకుఁ బ్రియమిత్రుఁ డగుటంజేసి తనకార్యార్థము యుద్ధంబున సమసినవాఁ డగుటంజేసి జటాయువునకు శౌర్ధ్వదైహికక్రియలు సలిపి యడవిలో జానకి నన్వేషించుచు సర్వజీవులకును భయముఁగలిగించుచున్న వాఁడు నగు కబంధుఁ డనురాక్షసుని వీక్షించెను.

తం నిహత్య మహాబాహు ర్దదాహ స్వర్గతశ్చ సః॥ ౫౬

వి॥ మహాబాహుః, మహాన్=బలాఢ్యము లగు, బాహుః=చేతులు గల శ్రీరాముఁడు, తం=ఆకబంధుని, నిహత్య=చంపి, దదాహ=దహనము చేసెను; సచ=ఆకబంధుఁడును, స్వః=స్వర్గలోకమును గూర్చి, గతః=వెళ్ళెను.

---

(౫౫) 'హ' కారము పాదపూరణార్థము. తు, హి, చ, స్మ, హ, వై, అనునక్షరములు పాదపూరణమునకు వాడఁబడు చుండును.

భా॥ బలముగలబాహువులతో నొప్పుచున్న శ్రీరాముఁడు కబంధుని రూపుమాపి యతనికాయమును దహనముచేసెను. ఆకబంధుఁడు రఘుకులో త్తముఁ డగుశ్రీరామునిచే దహనసంస్కారమునొందినవాఁడు గావునఁ దత్క్షణమే దేవలోకమున కేగెను.

స చాస్య కథయామాస శబరీం ధర్మచారిణీమ్
శ్రమణీం ధర్మనిపుణా మభిగచ్ఛేతి రాఘవ॥ ౫౬-౪

వి॥ సచ=ఆకబంధుండును, ధర్మచారిణీం, ధర్మ=నిఖిలధర్మములను, చారిణీం=చేయుచున్నదియు, శ్రమణీం=సన్న్యాసినియు, ధర్మనిపుణామ్, ధర్మ=(అతిథిసత్కారరూప మగు)ధర్మమందు, నిపుణామ్=నేర్పుగలదియునగు, శబరీం=శబరస్త్రీనిగూర్చి, అభిగచ్ఛ=వెళ్ళుము, ఇతి=అని, అస్య=ఈరామునకు, కథయామాస=చెప్పెను.

భా॥ పరలోకమునకుఁ బోవు చున్నకబంధుఁడు 'శ్రీరామా! నిఖిలధర్మ సూక్ష్మములను సంపూర్ణముగాఁ దెలిసికొన్నదియు నానాధర్మములను లోక మునఁ బ్రకాశింపఁ జేయు చున్నదియు నగు నొకశబరాంగన కలదు. నీ వా శబరికడ కరుగుము. ని న్నాస్త్రీ మిగులభక్తితో గౌరవించు' నని రామభద్రుని నకు విన్నవించెను.

సోఽభ్యగచ్ఛ న్మహాతేజా శ్శబరీం శత్రుసూదనః। ౫౭

వి॥ మహాతేజాః, మహత్=శ్రేష్ఠమైన, తేజాః=శోభగలవాఁడును, శత్రుసూదనః, శత్రు=పగతుఱను, సూదనః=శిక్షించువాఁడు నగు, సః=ఆశ్రీరాముఁడు, శబరీం=శబరస్త్రీనిగూర్చి, అభ్యగచ్ఛత్=వెళ్ళెను.

భా॥ అధికతేజస్సమన్వితుండు నిఖిలశత్రునాశకుఁడు నగుశ్రీరాముఁడు భక్తత్రాణపరాయణుండు గావున మిగులనింద్య మగుకులమున జన్మించిన దైనశబరాంగనచెంత కరిగెను.

---

(౫౬-౪) 'నృపాణాం వైశ్యతో జాత శ్శబరః పరికీర్తితః। మధూని వృక్షా దానీయ విక్రీణీతే స్వవృత్తయే॥ అనునారదీయవచనమువలన శబరుఁ డనఁగా వైశ్యునకు క్షత్రియస్త్రీయందుఁ బుట్టి చెట్లనుండి తేనెలను దెచ్చి యమ్మికొని జీవించునట్టివృత్తిగలవాఁడు. వానియొక్క స్త్రీ శబరి యనంబడు (చతుర్థ మాశ్రమం ప్రాప్తా శ్శ్రమణా నామ తే స్మృతాః) నాలుగవయాశ్రమ మగు సన్న్యాసమును గ్రహించినవారు శ్రమణు లనఁబడుదురు. (అట్టి స్త్రీ) శ్రమణి)

శబరి శ్రీరాముఁ డేతెంచు ననిచూచి మంచిమంచిఫలముల నేఱియేఱి యాతనికొఱకు దాఁచి యుంచెను.

(౫౭) నీచకులజాత యగుశ్రమణినిగూర్చి యరిగె ననుటచే శ్రీరామునిసౌశీల్యాతిశయము ప్రకటితము.

శబర్యా పూజిత స్సమ్య గ్రామో దశరథాత్మజః॥ ౫౬½

వి॥ దశరథాత్మజః, దశరథ=దశరథభూకాంతునకు, ఆత్మజః=కుమారుండగు, రామః=శ్రీరాముఁడు, శబర్యా=శబరస్త్రీచేత, సమ్యక్=సమంజసముగా, పూజితః=పూజింపఁబడెను.

భా॥ ఆశబరవనిత అతిథి యగుశ్రీరామునకుఁ జక్కఁగాఁ బూజ లాచరించెను.

పంపాతీరే హనుమతా సంగతో వానరేణ హ॥ ౫౭

అవ॥ పిదప మిత్రకార్యనిర్వహణాత్మక మగుకిష్కింధాకాండకథను సంగ్రహముగాఁ జెప్పుచున్నాఁడు.

వి॥ సః=ఆ శ్రీరాముఁడు, పంపాతీరే, పంపా=పంప యనుపద్మసరస్సుయొక్క, తీరే=ఒడ్డున, హనుమతా=హనుమంతుఁ డను, వానరేణ=కపిసత్తమునితోఁ, సంగతః=కలిసికొనెను. హ=చాలసంతోషము!

భా॥ ఆశ్రీరాముఁడు పంప యనుకొలఁకియొడ్డునఁ బరుగాడుచుఁ ద్రైలోక్యమ్ములం దని సుప్రసిద్ధుఁ గాంచినహనుమంతుని గలిసికొనెను.

హనుమద్వచనా చ్చైవ సుగ్రీవేణ సమాగతః॥ ౫౭½

వి॥ సః=ఆరామచంద్రుఁడు, హనుమద్వచనాత్, హనుమత్=ఆంజనేయునియొక్క, వచనాత్=మాటవలన, సుగ్రీవేణచైవ=సుగ్రీవునితోఁ గూడ, సమాగతః=కలిసికొనెను.

భా॥ ఆరామచంద్రునకుఁ గపిసత్తముఁ డగునాంజనేయునినెయ్యము లభించినందున సుగ్రీవునితోఁ గూడ విశేషమైత్రి సమకూరెను.

సుగ్రీవాయ చ త త్సర్వం శంస ద్రామో మహాబలః

ఆదిత స్త ద్యథావృత్తం సీతాయా శ్చ విశేషతః॥ ౫౮½

(౫౬½) దశరథాత్మజః పూజితః, యనుటచే దశరథునకు పదివేలసంవత్సరములు గతించినపిదప నుదయించినశ్రీరామున కత్యంతప్రీతితోఁ దండ్రి యొసంగుభోజనముకంటె శబరిచే నత్యంతభక్తిపూర్వకముగా సమర్పింపఁబడినయెంగిలిఫలములు మిన్నగునవి మృష్టాహార మయ్యెననియు "సమ్యక్" అనుటచే శబరి తురీయాశ్రమస్థయని గావున శరభంగాదు లొనర్చినపూజకంటె నాశబరికొనర్చినసపర్య శ్రీరామున కత్యంతాహ్లాదకర మయ్యె ననియు సూచింపఁబడినది.

(౫౮½) 'సుగ్రీవాయ చ, యనుచోటఁ జకారమువలన హనుమంతునకుఁ గూడఁ జెప్పె ననిభావము.

వి॥ మహాబలః=విశేషబలసంపన్నుఁడగు, రామః=శ్రీరాముఁడు, ఆదితః=పుట్టినదిమొదలుకొని, తత్=ప్రసిద్ధమైనతనయొక్కవృత్తాంతమును, సీతాయాః=సీతాదేవియొక్క, తచ్చ=ఆవృత్తాంతమును, సర్వం=అంతయు, సుగ్రీవాయ=సుగ్రీవునికొఱకు, విశేషతః=విస్తరించి, యథావృత్తం=జరిగినదిజరిగినట్టుగా, శంసత్=చెప్పెను.

భా॥ బలశాలి యగురామచంద్రుఁడు తనయొక్కయు, సీతాదేవియొక్కయు యావద్వృత్తాంతమును మొదటనుండియు విస్తరించి జరిగినదిజరిగినట్టుగా నాసుగ్రీవహనుమంతులతోఁ జెప్పెను.

సుగ్రీవ శ్చాపి త త్సర్వం శ్రుత్వా రామస్య వానరః
చకార సఖ్యం రామేణ ప్రీత శ్చైవాగ్నిసాక్షికమ్॥ ౬౦

వి॥ వానరః=కపిజాతీయుఁడగు, సుగ్రీవశ్చాపి=సుగ్రీవుఁడును, రామస్య=శ్రీరామునియొక్క, సర్వం=సమస్తమగు, తత్=ఆవృత్తాంతమును, శ్రుత్వా=విని, ప్రీతః=ఆనందించినవాఁడై, అగ్నిసాక్షికంచైవ=అగ్నిహోత్రుఁడే సాక్షిగాఁగలుగునట్లుగా, రామేణ=శ్రీరామునితో, సఖ్యం=చెలిమిని, చకార=చేసెను.

భా॥ కపిరాజగుసుగ్రీవుఁడు శ్రీరామునియొక్క నిఖిలవృత్తాంతము నాకర్ణించి తనభంగి దుఃఖితుండై యున్న బాహుబలశాలితోఁ జెలిమిసంఘటించినందులకు సంతసించుచు నారామభద్రునితో నగ్నిసాక్షికముగా హము స్నేచేసికొనెను.

తతో వానరరాజేన వైరానుకథనం ప్రతి।
రామా యావేదితం సర్వం ప్రణయా ద్దుఃఖితేన చ॥ ౬౧

వి॥ తతః=పిదప, దుఃఖితేన=శోకముగల, వానరరాజేన, వానర=వనచరులకు, రాజేన=ప్రభువైనసుగ్రీవునిచేత, వైరానుకథనంప్రతి, వైర=(తనయన్న యగువాలితోఁ దనకుఁ గల) విరోధముయొక్క, అనుకథనంప్రతి=ప్రసంగమునుగూర్చి, రామాయ=శ్రీరామునికొఱకు, ప్రణయాత్=స్నేహము వలన, సర్వం=సమస్తవృత్తాంతమును, ఆవేదితం=తెలుపఁబడెను.

---

'శంసత్', అడభావ మార్షము.

'మహాబలః, యనుటవలన సహాయములేకుండఁగనే సమస్తకార్యములను నిర్వహింపఁగొన సమర్థుండైనను లోకాచారమునకు సుగ్రీవసాహాయ్యమును గోరి తనవృత్తాంతము నంతయు నాతనితోఁ జెప్పె ననితోచుచున్నది.

భా॥ పిదప కపిసత్తముఁ డగుసుగ్రీవుఁడుఁ లోకైకవీరుండు బరమమిత్రుండు నగురామునకు సన్నిధియందుఁ దుందుభికాయమను నస్థిరాశిని జూపి విరియ నిర్విణ్ణుఁడై యుండి తనయన్న యగువాలితోఁ దనకుఁ గలవైరవృత్తాంతమును సాకల్యముగ నారఘుకులోత్తమునితో విన్నవించెను.

ప్రతిజ్ఞాతం చ రామేణ తదా వాలివధం ప్రతి॥ ౬౧.

వి॥ తదా=ఆసమయమున, రామేణ=శ్రీరామునిచేత, వాలివధంప్రతి, వాలి=వాలియొక్క, వధంప్రతి=సంహరించుటనుగూర్చి, ప్రతిజ్ఞాతం(చ)=ప్రతిజ్ఞ చేయఁబడెను.

భా॥ వాలిసుగ్రీవులకుఁ గలవిరోధము నంతను సుగ్రీవునివలన విని శ్రీరాముఁడు వాలిని దునుమాడుటకుఁ బ్రతిజ్ఞఁ జేసెను.

వాలిన శ్చ బలం తత్ర కథయామాస వానరః॥ ౬౨

వి॥ తత్ర=ఆఋష్యమూకపర్వతమందు, వానరః=కపిసత్తముఁ డగుసుగ్రీవుఁడు, వాలినః=వాలియొక్క, బలం=బలమును, కథయామాస చ=చెప్పెను.

భా॥ అవక్రపరాక్రమనిధి యగువాలియొక్క యకుంఠితవీర్యము నంతను శ్రీరామునితో సుగ్రీవుఁ డాఋష్యమూకపర్వతమందు విన్నవించెను.

సుగ్రీవ శ్శంకిత శ్చాసీ న్నిత్యం వీర్యేణ రాఘవే॥ ౬౩.

వి॥ సుగ్రీవశ్చ=సుగ్రీవుండును, రాఘవే=శ్రీరామునియందు, వీర్యేణ=పరాక్రమముచేత, నిత్యం=ఎల్లప్పుడు, శంకితః=సంశయముగలవాఁడు. ఆసీత్=ఆయెను.

భా॥ శ్రీరాముని దర్శించి స్నేహముచేసినదిమొదలుకొని సుగ్రీవుఁడు తనయన్న యగువాలిని సంహరించుటకు సమర్థత యాతనికిఁ గలదాయని యిందు సంశయము గలవాఁ డై యుండెను.

రాఘవప్రత్యయార్థం తు దుందుభేః కాయ ముత్తమమ్।
దర్శయామాస సుగ్రీవో మహాపర్వతసన్నిభమ్॥ ౬౪.

వి॥ రాఘవప్రత్యయార్థంతు, రాఘవ=శ్రీరామునియందు, ప్రత్యయార్థంతు=విశ్వాసము నిమిత్తమై, సుగ్రీవః=సుగ్రీవుఁడు, దుందుభేః=దుందుభియనురాక్షసుని

(౬౨) 'సముద్రాత్పశ్చిమా త్పూర్వం దక్షిణా దపి చోత్తరం। క్రామ త్యనదితే సూర్యే వాలీ వ్యపగతక్లమః' అని చెప్పఁబడినది గాన వాలి సూర్యుఁ డుదయింపకపూర్వము పడమటిసముద్రమునుండి తూర్పుసముద్రమునకు దక్షిణసముద్రమునుండి యుత్తరసముద్రమునకు శ్రమచెందక ప్రతిదినము నర్ఘ్య మిచ్చుటకుఁ బోవుచుండుట మొదలగు వృత్తాంతములను సుగ్రీవుఁడు శ్రీరామున కత్సాహమును వృద్ధిపొందుటకుఁ జెప్పె నని గ్రాహ్యము.

యొక్క, ఉత్తమం=శ్రేష్ఠమైన, మహాపర్వతసన్నిభం, మహత్=గొప్పదగు, పర్వత=కొండతో, సన్నిభం=సమానమగు, కాయం=శరీరమును, దదర్శ=కనుపఱచెను.

భా॥ రామభద్రుడు విశేషముగా దనకు విశ్వాస ముదయించుటకై సుగ్రీవుండు వాలిచే మున్ను చిప్పగా ద్రోయఁబడి పెద్దకొండవలెనున్న దుందుభి యనురాక్షసునియొక్క కళేబరము నమ్మహాత్మునకుఁ గనుపఱచెను.

ఉత్స్మయిత్వా మహాబాహుః ప్రేక్ష్య చాస్థి మహాబలః।
పాదాఙ్గుష్ఠేన చిక్షేప సంపూర్ణం దశయోజనమ్॥ ౮౫.

వి॥ మహాబాహుః=గొప్పబాహువులుగలవాఁడు, మహాబలః=మిగులప్రాణపరాక్రమముగలవాఁడు నగురాముఁడు, అస్థి=ఎముకను, (అనఁగా దుందుభిశరీరమును) ప్రేక్ష్య=చూచి, ఉత్స్మయిత్వా=చిఱునవ్వునవ్వి, పాదాఙ్గుష్ఠేన, పాద=కాలియొక్క, అఙ్గుష్ఠేన = బొటనవ్రేలిచేత, దశయోజనం = పదియామడల దూరము, సంపూర్ణం=తక్కువగాకుండఁగా, ఉచ్చిక్షేప=పైకి విసరివైచెను.

భా॥ వీక్షణమాత్రముచే సకలలోకముల నిర్వీర్యములంగావించునట్టి బాహుబలసంపన్నుఁ డగురామభద్రుఁ డస్థిమయమై పడియున్న దుందుభిశరీరమును జూచి చిఱునవ్వుతో సవ్వితనకాలిబొటనవ్రేలితోఁ బదియామడలదూరము దాటిపోవునట్లు పైకి విసరివైచెను.

బిభేద చ పునస్సాలాన్ సప్తైకేన మహేషుణా।
గిరిం రసాతలం చైవ జనయన్ప్రత్యయం తదా॥ ౮౬.

వి॥ తదా=అప్పుడు, పునశ్చ=తిరిగి, రామః=రాముఁడు, ప్రత్యయం=నమ్మకమును, జనయన్=కలిగించుచు, ఏకేన=ఒకటైయైన, మహేషుణా=గొప్పబాణముచే, సప్త=ఏడైన, సాలాన్=మద్దిచెట్లను, గిరిం=పర్వతమును, రసాతలం చైవ=రసాతల మనులోకమును గూడ, బిభేద=భేదించెను.

భా॥ ఆసమయమున దుందుభికాయమును దన్నినను జిమ్మినను సుగ్రీవునకుఁ దనయెడ విశ్వాస ముదయింపనికతన శ్రీరాముఁడు తనయందు దాతనికి

(౮౫) "ఉత్, అనునది 'స్మయిత్వా', యనునవ్యయముతోఁ జేర్చి 'చిక్షేప' యనియు సమన్వయము చేసికొనవచ్చును. అప్పుడు ఉత్స్మయిత్వా - నావినయమై పరమజ్ఞానులను మోహము నొందుచున్నారు. వీనచుఁ డగుకపిమాత్రుఁ డైనసుగ్రీవుఁడు నాసామర్థ్యమును దెలియఁజాలక సందేహమునొందుటలో నాశ్చర్య మేమున్నదని గంభీరముగా నవ్వి, ... చిక్షేప-విసరివైచెను, అనియర్థము.

సంపూర్ణ మగునమ్మకమును గలిగించుటకు సప్తసంఖ్యతో నొప్పుసాలమహీరుహములను, చేరువం గల పెద్దకొండను, రసాతల మనులోకమును నొకబాణముచే భేదించెను.

తతః ప్రీతమనా స్తేన విశ్వస్త స్స మహాకపిః।
కిష్కింధాం రామసహితో జగామ చ గుహాం తదా॥ ౬౬.

వి॥ తతః=సప్తసాలములను భేదించినపిమ్మట, తేన=(మనుష్యులకుఁ జేయశక్యముగాని) ఆవ్యాపారముచేత, విశ్వస్తః = నమ్మకమును బొందినవాఁడు, ప్రీతమనాః, ప్రీత=ఆనందించిన, మనాః=చిత్తముగలవాఁడు ఐన మహాకపిః= పెద్దవానర మగుసుగ్రీవుఁడు, తదా=అప్పుడు, రామసహితః=శ్రీరామునితోఁ గూడినవాఁడై, గుహాం=గుహవలె నున్న, కిష్కింధాం=కిష్కింధానగరమును గూర్చి, జగామ=వెళ్లెను.

భా॥ సప్తసాలములను బర్వతమును రసాతలము నొక్కబాణముచే భేదించినపిదప శ్రీరామునియందు విశేష మగువిశ్వాసము గలిగి యున్నకపిరాజగుసుగ్రీవుఁడు రఘురామునితోఁ గూడ గుహవంటికిష్కింధానగరమునకు బయలుదేఱి పోయెను.

తతో ౾గర్జ ద్ధరివర స్సుగ్రీవో హేమపింగలః॥ ౬౭।

వి॥ తతః=ఆవెనుక, హరివరః, హరి=వానరులలో, వరః=శ్రేష్ఠుఁడు, హేమపింగలః, హేమ=సువర్ణమువలె, పింగలః=పచ్చనికాంతి గలవాఁడు నగు, సుగ్రీవః=సుగ్రీవుఁడు, అగర్జత్=గర్జించెను.

భా॥ శ్రీరామునిసాహాయ్యము లభించినతోడనే గిష్కింధాపురమునఁ బ్రవేశించి బంగారమువంటిమేనిచాయ గలసుగ్రీవుఁడు దనకు సాటియగుమేటి లేఁడని తలపోయుచు సింహనాదము చేసెను.

తేన నాదేన మహతా నిర్జగామ హరీశ్వరః॥ ౬౮.

వి॥ మహతా=విశేష మగు, తేన=ఆ, నాదేన=చప్పుడుచేత, హరీశ్వరః. కపిరాజగువాలి, నిర్జగామ=(నగరునుండి) బయలువెడలి వచ్చెను.

భా॥ పూర్వముకంటె నతిశయితముగ నున్నట్టి సుగ్రీవుని సింహనాదము నాకర్ణించి వానరప్రభు వగువాలి యింటినుండి వెడలి వచ్చెను.

అనుమాన్య తదా తారాం సుగ్రీవేణ సమాగతః॥ ౬౮।

వి॥ సః=ఆవాలి, తదా=అప్డు బయలుదేఱి వచ్చునప్పుడు, తారాం=తనభార్య యగుతారను, అనుజ్ఞాప్య=సమ్మతింపఁజేసి, సుగ్రీవేణ=సుగ్రీవునితో, సమాగతః=కలిసికొనెను.

భా॥ ఆవాలి గృహమునుండి బయలుదేఱునసమయమున, వీరాగ్రేసరుఁడగుశ్రీరామునితోఁ గూడ సుగ్రీవుండు పోరున కేతెంచినాఁడని మనయంగద కుమారునివలన వినవచ్చుచున్నది. కావున మీ రిప్పుడు సమరమున కరుగవల, దని చెప్పుచు నడ్డము వచ్చినసతీమణి యగుతారను ' నిరపరాధి నగునన్నా శ్రీరాముఁ డేలవధించు నని యొప్పించి సుగ్రీవునితో సమర మొనర్చుటకుఁ బయనం బయ్యెను.

నిజఘాన చ తత్రైనం శరేణైకేన రాఘవః॥ ౧౯.

వి॥ రాఘవశ్చ=రఘుకులసంభూతుఁ డగుశ్రీరాముఁడును, ఏనం=ఈవాలిని, ఏకేన=ఒకటియగు, శరేణ=బాణముచే, తత్ర=ఆయుద్ధమున, నిజఘాన=కొట్టెను.

భా॥ పరమపవిత్ర మగురఘుకులమునం దవతరించి నిఖిలధర్మములను సంపూర్ణముగా నెఱింగి యున్నశ్రీరాముఁడు సుగ్రీవునితో యుద్ధము చేయుచున్న వాని నొక్కమ్ముచే నేలఁ గూల నేసెను.

తత స్సుగ్రీవవచనా ద్ధత్వా వాలిన మాహవే।
సుగ్రీవ మేవ తద్రాజ్యే రాఘవః ప్రత్యపాదయత్॥ ౨౦.

వి॥ సుగ్రీవవచనాత్, సుగ్రీవ=సుగ్రీవునియొక్క వచనాత్=వాక్యమువలన, ఆహవే=యుద్ధమునందు వాలినం=వాలిని, హత్వా=చంపి, తతః=పిమ్మట, రాఘవః=రఘురాముఁడు, తద్రాజ్యే, తత్=ఆవాలియొక్క, రాజ్యే=రాజ్యమందు, సుగ్రీవమేవ=సుగ్రీవునే, ప్రత్యపాదయత్=నిలిపెను.

భా॥ సుగ్రీవునియొక్క కోరికప్రకారము శ్రీరాముఁడు వాలిని సంహరించి యావెనువెంటనే వాలియొక్క రాజ్యమున సుగ్రీవు నభిషిక్తుం జేసెను.

స చ సర్వాన్ సమానీయ వానరా న్వానరర్షభః।
దిశః ప్రస్థాపయామాస దిదృక్షు ర్జనకాత్మజామ్॥ ౨౧

వి॥ సః=ఆ, వానరర్షభశ్చ=వానరశ్రేష్ఠుఁ డగుసుగ్రీవుఁడును, జనకాత్మజాం, జనక=జనకమహారాజుయొక్క, ఆత్మజాం=కుమార్తె యగుసీతాదేవిని, దిదృక్షుః=చూడ నిచ్ఛగలవాఁడై, సర్వాన్=అందఱైన, వానరాన్=కపులను, సమానీయ=రావించి, దిశః=దిక్కులనుగూర్చి, ప్రస్థాపయామాస=పంపెను.

భా॥ రఘుకుల సంజాతుండు లోకైకవీరుండు నగుశ్రీరామునకుఁ బ్రత్యుపకార మొనర్పఁ దలఁచి వానరప్రభు వగుసుగ్రీవుఁడు జానకి నన్వేషించి చూచి వెంటనే చనుదెంచుటకుఁ బరాక్రమవరిష్ఠు లగువానరశ్రేష్ఠులను రావించి నలుదిక్కులకుఁ బంపెను.

తతో గృధ్రస్య వచనా త్సంపాతే ర్హనుమా న్బలీ।
శతయోజనవిస్తీర్ణం పుప్లువే లవణార్ణవమ్॥ ౨౨

అవ॥ సీతాసందర్శనాదివృత్తాంతము ప్రధానముగాఁ గలసుందరకాండ కథను జెప్పుచున్నాఁడు.

వి॥ తతః=పిదప, బలీ=బలశాలి యగు, హనుమాన్=హనుమంతుఁడు, సంపాతేః=సంపాతి యను, గృధ్రస్య=గద్దయొక్క, వచనాత్=మాటవలన, శతయోజనవిస్తీర్ణం=నూఱామడ వెడల్పుగల, లవణార్ణవం=ఉప్పుసముద్రమును, పుప్లువే=దాఁటెను.

భా॥ సుగ్రీవుండు వానరశూరలను నలుదిక్కులకుఁ బంపినపిదప బలవంతులలో మేటి యగు హనుమంతుఁడు సంపాతి యనుగృధ్రరాజము దెలిపిన చందమున నూఱామడల వైశాల్యముతో నొప్పుచున్నలవణసముద్రమును దాఁటెను.

తతో లంకాం సమాసాద్య పురీం రావణపాలితామ్।
దదర్శ సీతాం ధ్యాయంతీ మశోకవనికాం గతామ్॥ 23

వి॥ (హనుమాన్=హనుమంతుఁడు,) రావణపాలితాం, రావణ=రావణాసురునిచే, పాలితాం=పాలింపఁబడుచున్న, లంకాం=లంకయను, పురీం=పట్టణమును, సమాసాద్య=పొంది, తతః=ఆలంకయందు, అశోకవనికాం=అశోకవన

---

(౨౨) "మత్కరోత్సృష్టవజ్రేణ హను స్తస్య తదా క్షతః, నామ్నైష హరిశార్దూలో భవితా హనుమా నితి" అనియింద్రవాక్యముగాఁ జెప్పఁ బడియున్నందున వాయుపుత్రుం డగునాంజనేయుఁడు బాల్యంబున ఫలభ్రాంతిచే సూర్యబింబమును మ్రింగుదలంపుతో నెగిసిపోవుచుండ నింద్రుండు దనచేతివజ్రాయుధమును విసరివైవ వజ్రహతమై యాకపిసత్తముని చెక్కిళ్ళయొక్క మీఁదిభాగము వక్రమైనందున అట్టిహనువు గలవాఁ డగుటచే నాంజనేయుఁడు హనుమంతుఁ డని ప్రసిద్ధుఁడయ్యె నని యెఱుంగునది.

"హనుమాన్, బలీ" యనుటచే జాంబవంతుఁడు పూర్వగాథలఁ జెప్పి ప్రోత్సహింప నాంజనేయుం డత్యుత్సాహము నొంది సముద్రము దాఁటె నని సూచింపఁబడుచున్నది.

మనురావణస్యాన్తఃపురోద్యానమును, గతాం=పొందినట్టియు, ధ్యాయన్తీం=సర్వదా శ్రీరామునే ధ్యానముచేయు చున్నట్టియు, సీతాం=సీతాదేవిని, దదర్శ=చూచెను.

భా॥ హనుమంతుఁడు రావణునిచేఁ బాలింపఁబడు చున్నలంకాపట్టణమునఁ బ్రవేశించి యంతఃపురోద్యాన మగునశోకవనమున సర్వదా శ్రీరామునే ధ్యానించు చున్నసీతాదేవిం గాంచెను.

నివేదయిత్వాఽభిజ్ఞానం ప్రవృత్తిం చ నివేద్య చ।
సమాశ్వాస్య చ వైదేహీం మర్దయామాస తోరణం॥ ౨౪

వి॥ (సః=ఆహనుమంతుఁడు) అభిజ్ఞానమ్=ఆనవాలును, నివేదయిత్వా=సమర్పించి, ప్రవృత్తిం చ=వృత్తాంతమును, నివేద్య చ=తెలిపి వైదేహీం=సీతాదేవిని, సమాశ్వాస్య చ=ఊరార్చియు, తోరణం=బహిర్ద్వారమును, మర్దయామాస=ధ్వంసము గావించెను.

భా॥ ఆయాంజనేయుఁడు శ్రీరామచంద్రునిచేఁ దనచేతి కానవాలుగా నొసఁగఁ బడినయుంగరమును జానకీదేవికి సమర్పించి శ్రీరామసుగ్రీవులకు సఖ్యంబు సమకూరుట మున్నగు నిఖిలవృత్తాంతమును నివేదించి 'శ్రీరామచంద్రుఁ డనతికాలములో నేతెంచుచున్నాఁడు. నీవు విచారింప వల దని' యాసాధ్వీమణి నూరడించి యంతఃపురోద్యానసంబంధ మగువెలుపలిద్వారమును జూర్ణముగాఁ జేసెను.

పంచసేనాగ్రగాన్ హత్వా సప్తమన్త్రిసుతానపి।
శూర మక్షం చ నిష్పిష్య గ్రహణం సముపాగమత్॥ ౨౫.

వి॥ సః=ఆహనుమంతుఁడు, సేనాగ్రగాన్=సేనాధ్యక్షులను, పంచ=అయిదుగురిని, మన్త్రిసుతాన్, మన్త్రి=మన్త్రులయొక్క, సుతాన్=పుత్రులను, సప్తాపి=ఏడ్వురను, హత్వా=పరిమార్చి, శూరం=పోరునందుభయపడనివాఁడగు, అక్షం చ=అక్షుఁ డనురావణపుత్రుని, నిష్పిష్య=ముద్దజేసి, గ్రహణం=పట్టుబడుటను, సముపాగమత్=పొందెను.

భా॥ ఆ హనుమంతుఁడు ప్రసిద్ధచమూపతుల నైదుగురిని, మంత్రికుమారుల నేడ్వురను, మిక్కిలి వీర్యశాలి యైనరావణపుత్త్రుఁ డగునక్షుం డనువానిని సంహరించి యక్షకుమారుదేహమును ముద్దగా నొనర్చి యింద్రజిత్తుచే నభిమంత్రిత మగు బ్రహ్మాస్త్రంబువలన బద్ధుం డయ్యెను.

అస్త్రేణోన్ముక్త మాత్మానం జ్ఞాత్వా పైతామహాద్వరాత్।
మర్షయన్ రాక్షసాన్ వీరో యంత్రిణ స్తాన్యదృచ్ఛయా।
తతో దగ్ధ్వా పురీం లంకా మృతే సీతాం చ మైథిలీం।
రామాయ ప్రియ మాఖ్యాతుం పునరాయా న్మహాకపిః॥ ౭౭.

వి॥ వీరః=శూరుండగు, మహాకపిః=వానరశ్రేష్ఠుఁడగు హనుమంతుఁడు. పైతామహాత్=బ్రహ్మదేవుఁ డొసగిన, వరాత్=వరమువలన, యదృచ్ఛయా=అప్రయత్నముచేతనే, ఆత్మాన=తనను, అస్త్రేణ=బ్రహ్మాస్త్రముచేత, ఉన్ముక్తం=విడువఁబడినవానిఁగా, జ్ఞాత్వా=తెలిసికొని, యంత్రిణః=లెన్నుగట్టిలాగుచున్న, తాన్=ఆ, రాక్షసాన్=రాక్షసులను మర్షయన్=సహించుచు, తతః=ఆకార్యానంతరము, మైథిలీం=జనకమహారాజుయొక్క కుమార్తెయగు సీతాదేవిని, ఋతే=విడనాడి లంకాం=లంకయను, పురీం=పట్టణమును, దగ్ధ్వా=దహించి, రామాయ=శ్రీరామునికొఱకు ప్రియం=సంతోషవార్తను, ఆఖ్యాతుం చెప్పుటకు, పునః=తిరిగి, ఆయాత్=వచ్చెను.

భా॥ దేవదానవుల కైనను దుష్ప్రవేశ మగులంకానగరముం జొచ్చి పతివ్రతామతల్లిక యగుసీతాదేవిం గాంచినకతన సుప్రసిద్ధవీర్యవంతుం డగు హనుమంతుండు తొల్లి విరించి తన కొసంగినవరముయొక్క ప్రభావముచే నేమియుఁ బ్రయత్నము లేకుండఁగనే బ్రహ్మాస్త్రము దన్ను విడుచుటెఱింగియుఁ ద్రాళ్లచేఁ దన్నుంగట్టి లాగుకొని పోవుచున్న రాక్షసుల నెల్ల నొక్కుమ్మడింజంపుటకుఁ జాలియున్నను రావణుం దిలకింప నిచ్ఛయించి వారొనర్చుబాధల నెల్ల సహించుచుఁ దాను లంకాపతితో సంభాషించిన పిదప సీతాదేవి నివసించు తావును మాత్రము విడనాడి లంకానగర మంతయు దహించి శ్రీరామున కీశుభోదంతము నెఱిఁగించుటకు మరలివచ్చెను.

సో ఽభిగమ్య మహాత్మానం కృత్వా రామం ప్రదక్షిణం।
న్యవేదయ దమేయాత్మా దృష్టా సీతేతి తత్త్వతః॥ ౭౮.

(౭౮) 'సీత చూడఁబడిన' దని చెప్పఁ దగియున్నను నట్లు చెప్పక 'చూడఁబడినది సీత,' యని చెప్పుటకుఁ గారణ మేమనఁగా 'సీత, యను శబ్దముచ్చరించి, చూడఁబడె,నని యుచ్చరించునంతలో శ్రీరాముఁడు "సీత చూడఁబడిన దో లేదో" యనిసంశయించి యెట్టిచిత్తవైకల్యము నొందునో యనితలంచి మేధాసంపన్నుఁడగు హనుమంతుఁడు క్రియాపూర్వకముగా నడిచె నని చెప్పుచున్నారు.

వి॥ అమేయాత్మా, అమేయ=అధికమైన, ఆత్మా=బుద్ధిగల, సః=ఆహనుమంతుఁడు, మహాత్మానం,మహాత్=గొప్పదియగు ఆత్మానం=ధైర్యముగల, రామం=శ్రీరాముని అభిగమ్య=పొంది,ప్రదక్షిణం=ప్రదక్షిణమును, కృత్వా=చేసి, సీతా=సీతాదేవి, దృష్టా=చూడఁబడినది, ఇతి=అని, తత్వతః=యథార్థముగా=న్యవేదయత్=విన్నవించెను.

భా॥ విశేషమేధాసంపన్నుండగు నాహనుమంతుఁడు జానకి నెడఁబాసియు నించుకేని దీసిపోవని ధైర్యము గలశ్రీరామునిచెంతకుఁ జేరి యభివందన మొనర్చి ,చూడఁ బడినదిసీత, యని సమ్యఃముగా వచించెను.

తత స్సుగ్రీవసహితో గత్వా తీరం మహోదధేః।
సముద్రం క్షోభయామాస శరై రాదిత్యసన్నిభైః॥ ౨౯.

అవః—ఇప్పుడు రావణాదివధాత్మక మగుయుద్ధకాండవృత్తాంతమును దెలుపుచున్నాఁడు.

వి॥ తతః=తరువాత, (సః=ఆశ్రీరాముఁడు) సుగ్రీవసహితః, సుగ్రీవ=సుగ్రీవునితో, సహితః=కూడికొనినవాఁడై, మహోదధేః, మహాత్=గొప్పదియగు, ఉదధేః=సముద్రముయొక్క, తీరం=ఒడ్డును, గత్వా=పొంది, ఆదిత్యసన్నిభైః, ఆదిత్య=సూర్యునితో, సన్నిభైః=సమానములైన, శరైః=బాణములచేత, సముద్రం=సముద్రమును, క్షోభయామాస=కలఁగుడుపడఁజేసెను.

భా॥ హనుమంతునివలన సీతావృత్తాంతము నంతను వినినవెంటనే రామచంద్రుఁడు సుగ్రీవాదివానరవీరులతోఁ గలిసి దక్షిణసముద్రతీరమును జేరి యాసాగరము దనకు వ్యతిరేకముగనున్నందున సూర్యునిఁబోలుతనబాణములచే నాతనిఁ గలియఁబఱచెను.

దర్శయామాస చాత్మానం సముద్ర స్సరితాం పతిః।
సముద్రవచనా చ్చైవ నలం సేతు మకారయత్॥ ౩౦.

---

'సీతా దృష్టా, యనుచో 'అదృష్టా, యనియుఁ బదవిభాగమున కవకాశ ముండును గాన నుద్దిష్టార్థము సంశయాస్పద మగుననుతలంపుతో నట్టిపదచ్ఛేదమున కవకాశ మొసంగకుండునటు 'దృష్టా సీతా, యని చెప్పఁబడెనని కొందఱిమతము.

హనుమంతుఁడు తానుగార్యసిద్ధిం గాంచివచ్చితి నని పరమోత్సాహముసవ్యక్తము చేయుచుఁ బ్రియుతృప్తఫలమును నివేదించుటకుఁ జూచితి నని ముందుగాఁ జెప్పి పిమ్మట సీత నని చెప్పె నని మఱికొందఱి యభిప్రాయము.

(౩౦) ఏష సేతుం మహోత్సాహః కరోతు మయి వానరః।
త దహం ధారయిష్యామి తథా హ్యేష యథా పితా॥

వి॥ సరితాం=నదులకు, పతిః=నాయకుఁ డగు, సముద్రశ్చ=సముద్రుఁడును, ఆత్మానం=తనరూపమును, దర్శయామాస=కనుపఱచెను. (సః=ఆ శ్రీరాముఁడు) సముద్రవచనాచ్చైవ, సముద్ర=సముద్రునియొక్క, వచనాచ్చైవ=వాక్యమువలననే, నళం=నళుని, సేతుం=సేతువును, అకారయత్=చేయుటకు నియమించెను.

భా॥ నదులకునాయకుం డగుసముద్రుండు రామచంద్రుని పరాక్రమమున కోర్వఁజాలక తనస్వరూప మప్పురుషపుంగవునకుఁ గనుపఱచెను పిమ్మట రామచంద్రుఁడు సముద్రుండు చెప్పినరీతిగా నలునిచే సేతువును గట్టించెను.

తేన గత్వా పురీం లంకాం హత్వా రావణ మాహవే।
రామ స్సీతా మనుప్రాప్య పరాం వ్రీడా ముపాగమత్॥ ౮౧

వి॥ రామః=శ్రీరాముఁడు, తేన=ఆసేతువుచేత, లంకాం=లంకయను, పురీం=పట్టణమును, గత్వా=పొంది ఆహవే=యుద్ధమందు, రావణ=రావణుని, హత్వా=చంపి, సీతాం=సీతాదేవిని, ప్రాప్య=పొంది, అను=పిదప, పరాం=అధికమైన, వ్రీడాం=సిగ్గును, ఉపాగమత్=పొందెను.

భా॥ రామభద్రుఁ డాసేతుమార్గమున లంకానగరముఁ బ్రవేశించి సమరమున రావణుం బరిమార్చి జానకిం గలిసి యనంతరము పరస్థలమునఁ జిరకాల ముండినభార్య నెవ్విధమునఁ బరిగ్రహింతు నని విశేషముగ సిగ్గుపడెను.

తా మువాచ తతో రామః పరుషం జనసంసది॥ ౮౧౪

వి॥ తతః=ఆకారణమున, రామః=రాముఁడు, తాం=ఆ జానకీదేవిని గూర్చి, జనసంసది, జన=జనులయొక్క, సంసది=సభయందు, పరుషం=కఠినవాక్యమును, ఉవాచ=పలికెను.

భా॥ పిదప శ్రీరామచంద్రుఁ డఖండపతిభక్తితో నలరారుచున్నజానకీదేవి నుద్దేశించి దేవవానరరాక్షసు లాకర్ణించుచుండఁ బరుషముగ మాటాడెను.

---

"ఈనలుఁ డనువానరశ్రేష్ఠుఁడు నాయందు సేతువును నిర్మించుఁగాక! నే నాసేతువును వహించెదను. ఇతఁ డీతనితండ్రి యగువిశ్వకర్మయంతటివాఁడు" అని సముద్రుండు చెప్పినరీతిగా నలుని సేతునిర్మాణమునకు నియోగించె నని గ్రాహ్యము.

అమృష్యమాణా సా సీతా వివేశ జ్వలనం సతీ॥ ౮_౨

వి॥ సతీ=పతివ్రతాతిలక మగు, సా=ఆ, సీతా=సీతాదేవి, అమృష్యమాణా=సహింపలేనిదై, జ్వలనం=అగ్నిహోత్రమును, వివేశ=ప్రవేశించెను.

భా॥ పతివ్రతామతల్లిక యగు నాజానకీదేవి మహాజనసమక్షమున రామచంద్రుఁ డాడినపరుషవాక్యము లాకర్ణించి సహింపఁ జాలక యగ్ని ప్రవేశ మొనర్చెను.

తతో ఽగ్నివచనా త్సీతాం జ్ఞాత్వా విగతకల్మషాం।
బభౌ రామ స్సంప్రహృష్టః పూజిత స్సర్వదైవతైః॥ ౮-౩

వి॥ తతః=తరువాత, రామః=శ్రీరాముఁడు, అగ్నివచనాత్, అగ్ని=అగ్నిహోత్రునియొక్క, వచనాత్=వాక్యమువలన, సీతాం=సీతాదేవిని, విగతకల్మషాం. విగత=పోయిన, కల్మషాం=పాపముగలదానినిగా, జ్ఞాత్వా=తెలిసికొని, సంప్రహృష్టః=మిగులనానందించినవాఁడు, సర్వదైవతైః=సమస్తదేవతలచేత, పూజితః=పూజింపఁ బడినవాఁడునై, బభౌ=ప్రకాశించెను.

భా॥ జానకీదేవి యగ్నిప్రవేశ మొనర్చినపిదప రామభద్రుఁడు వీతిహోత్రునివాక్యమును బురస్కరించుకొని యద్దేవి మనోవాక్కాయకర్మంబుల నెట్టి కల్మషముం జెందనిపరిశుద్ధురా లనియెఱింగి సంతోషితస్వాంతుఁడు నిఖిలదేవతలచే నభివందితుఁడునై మిగులఁ బ్రకాశించెను.

కర్మణా తేన మహతా త్రైలోక్యం సచరాచరమ్।
సదేవర్షిగణం తుష్టం రాఘవస్య మహాత్మనః॥ ౮-౪

వి॥ మహాత్మనః, మహత్=విశేషమైన, ఆత్మనః=ధీరత్వముగల, రాఘవస్య=శ్రీరామునియొక్క, మహతా=ఉత్కృష్టమైన, తేన=ఆ, కర్మణా=రావణవధ

(౮-౪) (అంతస్సంజ్ఞా భవంత్యేతే సుఖదుఃఖసమన్వితాః) 'ఈవృక్షాదు లంతస్సంజ్ఞకలవై సుఖదుఃఖములతోఁ గూడిన వగుచున్నవి, అని విష్ణుపురాణమునందుఁ జెప్పఁబడుటచే వృక్షగుల్మాదులకు సుఖదుఃఖము లున్న వనియుఁ బుష్పించుట చిగుర్చుట మున్నగు చేష్టలచేఁ దమయానందమును వెలిపుచ్చె ననియుఁ దెలియందగు.

ఇచ్చటఁగొండలు పర్వతపాషాణవృక్షాదులకు రావణకృతపీడాజ్ఞానములేదు కావున రావణవధవలనఁగలుగు సంతోషపరిజ్ఞానము నసంభవ మే యని 'దేవఋషిగణం, అనుపాఠము ననుసరించి 'సచరాచరం, అనుచోట 'చరము, లనఁగా గతిభక్షణమాత్రప్రధానము లగునైరావతాదితిర్యగ్జంతువు లనియు నచరము లనఁగా వానికంటె భిన్నము (చరములకంటె నితరము) లగు, జ్ఞానయుక్త మనుష్యాదిజీవసమూహము లనియు నర్థముచేసి యట్టి దేవఋషిగణాత్మక మగుత్రైలోక్యము సంతసించె నని యోజించుచున్నారు.

రూప మగువ్యాపారముచేత, సచరాచరం=చలించునదియుఁ జలింపనిదియు నగుజీవగణముతోఁ గూడినది, సదేవర్షిగణం=దేవతలయొక్కయు మునులయొక్కయు సంఘములతోఁ గూడినదియు నగు, త్రైలోక్యం=స్వర్గమర్త్యపాతాళము లనులోకత్రయము, తుష్టం=సంతసించిన దయ్యెను.

భా॥ అతిధీరుఁ డగుశ్రీరామచంద్రుఁ డొనర్చినరావణాదిదుష్టరాక్షససంహారాత్మక మగునక్కార్యముం జూచి మనుష్యపశుపక్ష్యాదులతోడఁ బర్వతారామగృహాదులతోడ మునీంద్రులతోడ నిఖిలదేవతలతోడఁ గూడియుండిన ముజ్జగము మిక్కిలిసంతసించెను.

అభిషిచ్య చ లంకాయాం రాక్షసేంద్రం విభీషణమ్।
కృతకృత్య స్తదా రామో విజ్వరః ప్రముమోద హ॥ ౮౫

వి॥ రామః=శ్రీరాముఁడు, రాక్షసేంద్రం=రాక్షసరా జగు, విభీషణం=విభీషణుని, లంకాయాంచ=లంకాపట్టణమునందును, అభిషిచ్య=పట్టాభిషిక్తునిగాఁ జేసి, తదా=అప్పుడు, కృతకృత్యః=చేసినప్రతిజ్ఞను నిర్వహించుకొనినవాఁడు, విజ్వరః=ఏవిధమైనమనస్తాపము లేనివాఁడు నై, ప్రముమోద=సంతసించెను, హ=ఎంతయాశ్చర్యము,

భా॥ మున్ను సముద్రపుటొడ్డున రాక్షసులకు రాజుగనొనర్చినవిభీషణుని మరల లంకాద్వీపమున సామ్రాజ్యాభిషిక్తుఁ జేసి తాను బూర్వ మొనర్చిన ప్రతిన నిర్వహించికొని యెట్టిసంతాపము లేనివాఁ డై శ్రీరామచంద్రుఁ డప్పుడు మిక్కిలియానందము నొందెను. అమ్మహాత్ముని ప్రతిజ్ఞాపరిపాలన మత్యాశ్చర్యకరముగదా!

---

(౮౫) సీతాసమాగమమునకంటెఁ బూర్వమే విభీషణపట్టాభిషేకము జరిగిన నిచ్చటఁ గ్రమము పాటింపఁబడలే దని తెలియం దగు (విభీషయతీతి విభీషణః) శత్రువులకు భయము గలిగించువాఁడు గాన విభీషణుఁ డనఁబడుచున్నాఁడు.

'లంకాయాంచ' అనుచోట చకారమువలన సముద్రతీరమున వాగ్రూపముగాఁ గావింపఁబడిన యభిషేకము సూచింపఁబడుచున్నది. లేక ఆ 'చ'కారమును 'అభిషిచ్య' యను ల్యబంతముతోఁ జేర్చికొని పట్టాభిషిక్తుం జేసియే కృతార్థుఁ డై యానందించె ననియు సమన్వయము చేసికొనవచ్చును. రాముఁడు విభీషణుని లంకలోఁ బట్టాభిషిక్తుం జేసియే కృతార్థుఁ డయ్యెఁ గాని రావణాదిసంహారముచేఁ గాదనుట. లేక-చకార మనువాచకము. (శరీరారోగ్య మర్థాంశ్చ భోగాం శ్చైవానుషంగికాన్। దదాతి ధ్యాయతాం పుంసా మపవర్గప్రదో హరిః) 'శ్రీహరి దన్ను సర్వదా ధ్యానించువారికి శరీరారోగ్యము, ధనములు, భోగములు మున్నగు నైహికసుఖముల నానుషంగికముగా నొసంగి పిమ్మట శాశ్వత మగుమోక్షముం బ్రసాదించు, నను

దేవతాభ్యో వరం ప్రాప్య సముత్థాప్య చ వానరాన్।
అయోధ్యాం ప్రస్థితో రామః పుష్పకేణ సుహృద్వృతః॥ ౮౬

వి॥ రామః=శ్రీరాముఁడు దేవతాభ్యః=సురలవలన, వరం=వరమును, ప్రాప్య=పొంది, వానరాన్=వానరములను, సముత్థాప్య చ=జీవింపఁజేసియు, సుహృద్వృతః, సుహృత్=చెలికాండ్రతో, వృతః=ఆవరింపఁబడినవాఁడై, పుష్పకేణ=పుష్పకమను విమానముచే, అయోధ్యాం=సాకేతనగరమునుగూర్చి, ప్రస్థితః=బయలుదేరెను.

భా॥ శ్రీరాముఁడు లోకకంటకుఁ డగురావణుని సపరివారముగా సంహరించి జయలక్ష్మీసమేతుం డగు దన్నవలోకింప నేతెంచిన వేలుపులవలన వరములను బడసి నిఖిలవానరములను బ్రతికించికొని విభీషణాదిస్నేహితులతోఁ గలిసి పుష్పకమనువిమానమునధిష్ఠించిసాకేతమునకుఁబయలుదేరెను.

---

నట్లు విభీషణునకుఁ బ్రిధానఫలముగా మోక్షము ననుగ్రహించి యానుషంగికముగా రాజ్యమొసంగె ననియభిప్రాయము.

'విజ్వరః' యనఁగా, వి-పోయిన, జ్వరః-మనస్తాపముగలవాఁడు, విభీషణుఁడు భరతునివలె రాజ్యము నొల్లకపోవునో యనిసంశయాత్ముఁడై యుండి యతఁడు పట్టాభిషిక్తుఁడైన పిమ్మట నట్టిపరితాపములేక మిగుల సంతసించె ననుట. లేక—

(యస్మాన్మయా సకృతో రాజా రాక్షసానాం విభీషణః।
తచ్చ మిథ్యాప్రలప్తం మాం ప్రవక్ష్యతి నసంశయః॥)

'ఎందువలన నాచేత విభీషణుఁడు రాక్షసులకు రాజుగాఁ జేయఁబడలేదో అందువలన జనము తప్పక యసత్యవాది నని నన్ను నిందింపఁ గలదు' అనినాగపాశబంధనాదిసమయములందుఁ బరితపించినవాఁడు గాన నేఁ డట్టిపరితాపము లేకపోవుటచే రాముఁ డభిరాముఁడయ్యె ననిభావము. లేక—'వివిక్తురపతత్రిణః' అనునపురసింహోక్తివలన, వి-పక్షియగుజటాయువు విషయమై, జ్వరః-సంతాపముగలవాఁడై...ప్రముమోద-సంతసించెను. అనఁగా లోకమునం దొకపుత్రునియుతసమయమునఁ దండ్రి పూర్వముగలించినపుత్రుని స్మరించి మనస్తాపము నొందుచున్నను బ్రకృతానందముఁ జెందుట యెట్లు సహజమో యట్లె నిఖిలజనులకుఁ బ్రభువుఁ దండ్రియు నగుశ్రీరాముఁడు విభీషణపట్టాభిషేకకాలమునఁ బట్టాభిషేకము లేకుండ గతించిన జటాయువుం దలంచి లోన సంతాపముగలవాఁడై యానందించె నని తాత్పర్యము.

బొమ్మజెముడుడొంకలను ఛేదించి తియ్యమామిడిని స్థాపించినట్లు లోకకంటకు లగు రావణాదిదుష్టరాక్షసులఁ దునుమాడి శ్రీరామచంద్రుఁడు గుణగరిష్ఠుఁ డగువిభీషణుని లంకారాజ్యమున నెలకొల్పె నని సారస్యము.

భరద్వాజాశ్రమం గత్వా రామ స్సత్యపరాక్రమః।
భరత స్యాంతికం రామో హనూమంతం వ్యసర్జయత్॥ ౮౭

వి॥ సత్యపరాక్రమః, సత్య=నిక్కమందు, పరాక్రమః=నిష్ఠగల, రామః=శ్రీరాముఁడు, భరద్వాజాశ్రమం, భరద్వాజ=భరద్వాజమహర్షియొక్క, ఆశ్రమం=ఆశ్రమమునుగూర్చి, గత్వా=వెళ్ళి, రామః=రాముఁడు, భరతస్య=భరతునియొక్క, అంతికం=సమీపమునుగూర్చి, హనూమంతం=ఆంజనేయుని, వ్యసర్జయత్=పంపించెను.

భా॥ సత్యపరిపాలనమందు దీక్షాపరతంతుఁడగు శ్రీరామచంద్రుఁడు మునికులమూర్ధన్యుఁడగు భరద్వాజు నవలోకించి తదాజ్ఞానుసార మొకదిన మమ్మహనీయు నాశ్రమంబున నుండి తనరాకను భరతున కెఱిఁగించుటకు ముందుగా హనుమంతు నంపెను.

పున రాఖ్యాయికాం జల్పన్ సుగ్రీవసహిత శ్చ సః।
పుష్పకం త త్సమారుహ్య నందిగ్రామం యయౌ తదా॥ ౮౮

వి॥ పునః=తిరిగి, సః=ఆరాముఁడు, సుగ్రీవసహితశ్చ, సుగ్రీవ=సుగ్రీవునితో, సహితశ్చ=కలిసికొనినవాఁడై, తత్=ప్రసిద్ధ మగు, పుష్పకం=పుష్పకవిమానమును, సమారుహ్య=అధిష్ఠించి, ఆఖ్యాయికాం=పూర్వకథను, జల్పన్=మాటలాడుచు, నందిగ్రామం=నందిగ్రామమునుగూర్చి, తదా=అప్పుడు, యయౌ=వెళ్లెను.

భా॥ మరల నాశ్రీరాముఁడు తనకుఁ బరమమిత్రు లగుసుగ్రీవవిభీష ణాదులం గలిసి పుష్పకంబెక్కి పూర్వగాథలు చెప్పికొనుచు నందిగ్రామమును జేరెను.

నందిగ్రామే జటాం హిత్వా భ్రాతృభి స్సహితో ఽనఘః।
రామ స్సీతా మనుప్రాప్య రాజ్యం పున రవాప్తవాన్॥ ౮౯

వి॥ అనఘః=పాపదూరుఁడగు, రామః=శ్రీరాముఁడు, భ్రాతృభిః=తమ్ములతో, సహితః=కలిసినవాఁడై, నందిగ్రామే=నందిగ్రామమందు,

---

(౮౭) ('రామః, గత్వా,' 'రామః, వ్యసర్జయత్') క్రియాభేదమున రెండుసారులు కర్తృపదము ప్రయోగింపఁబడినది.

(౮౯) 'అనుప్రాప్య' యనుచోట 'వనకరించి' యనియుఁ జెప్పవచ్చును. తాపసవేషము విడనాడి మహారాజపుత్రిక యగుసీతాదేవియొక్క సౌందర్యాతిశయమునకుఁ దగినమహారాజోచితంబుపరం బొలుపారుచు నవిభావము.

'పునః' యనుటచే వెనుక దండ్రిచే నొసఁగబడినరాజ్యమునే మరల గ్రహించె ననుట.

జటాం=జడను, హిత్వా=విడిచి, సీతాం=జానకీదేవిని, అనుప్రాప్య=అనుసరించి, పునః=తిరిగి, రాజ్యం=రాచఱికమును, అవాప్తవాన్=స్వీకరించెను,

భా॥ ధూతకల్మషుం డగు శ్రీరాముండు తమ్ములతోఁ గూడి నందిగ్రామమున జడను విసర్జించి సీతాసమేతుఁడై తిరిగి దొరతనమును గ్రహించెను.

ప్రహృష్టా ముదితో లోక స్తుష్టః పుష్ట స్సుధార్మికః।
నిరామయో హ్యరోగ శ్చ దుర్భిక్షభయవర్జితః॥ ౯౦.

వి॥ లోకః=జనము, ప్రహృష్టః=పులకాంకురముగలది, ముదితః=సంతోషించినది, తుష్టః=కోరిక లెల్లసిద్ధించుటచేఁ గలిగినప్రీతితోఁ గూడినది, పుష్టః=విశేషానందముచేఁ బరివృద్ధ మగుదేహముగలది, సుధార్మికః=లెస్సగా ధర్మములను వ్యాపింపఁ జేయునది, నిరామయః=శరీరరోగబాధ లేనిది, అరోగః=మానసికవ్యాధులు లేనిది, దుర్భిక్షభయవర్జితః, దుర్భిక్ష=కఱవుచేత సంభవించు, భయ=భయముచే, వర్జితశ్చ=విడువఁబడినదియు, ఆసీత్=ఆయెను.

భా॥ రామభద్రుఁడు సామ్రాజ్యాభిషిక్తుం డైనతోడనే యావత్ప్రపంచమునకు సంతోషాతిశయమున రోమాంచ ముదయించెను; చిరకాలము నుండి కోరఁ బడుచున్న శ్రీరామపరిపాలనము లభించుటచే మిగులఁ బ్రీతియుక్త మై జగం బెల్లఁ బరివృద్ధం బయ్యెను; మఱియు సర్వాశ్రమధర్మములం దాసక్తి గలది మిక్కిలి యారోగ్యము గలదిఁ గఱవులేమిం జేసి యధికముగా సుఖము గలదియు నయ్యెను.

---

(౯౦) (ఇచ్ఛామో హి మహాబాహుం రఘువీరం మహాబలం।
గజేన మహతా యాతం రామం ఛత్రావృతాననమ్॥)

'దీర్ఘము లగుబాహువులతో నొప్పుచున్నవాఁడు రఘువంశోత్పన్నులలో శూరాగ్రేసరుండు నకుంఠిత మగుసామర్థ్యముగలవాఁడు నగుశ్రీరామచంద్రుఁడు తెల్లనిగొడుగుచే నావరింపఁబడినముఖముగలవాఁడై పట్టపుటేనుఁగు పై నెక్కి యూరేగుచుండఁగాఁ జూడఁగోరెదము' అనురీతి రామచంద్రునిపట్టాభిషేకసంవర్ధనమే ప్రజలకు సర్వాభీష్టసిద్ధి యనియెఱుంగునది.

(విషయే తే మహారాజ రామవ్యసనకర్శితాః, అపి వృక్షాః పరిమ్లానా స్సపుష్పాంకురకోరకాః 'ఓ దశరథుఁడా! పుష్పములు చిగుళ్లు మొగ్గలు వీనితోఁ గూడిననీదేశమందలివృక్షములును శ్రీరామునియెడబాటువలనఁ గల్గినదుఃఖముచేఁ గృశించి మిగుల వాడియున్నవి.' అనువట్లు శ్రీరామవియోగమువలనఁ గలిగినకృశత్వము పోవుటచే లోక మెల్ల బలిసినశరీరముగల దయ్యె ననిభావము.

న పుత్రమరణం కించి ద్ద్రక్ష్యంతి పురుషాః క్వచిత్ ॥
నార్యశ్చావిధవా నిత్యం భవిష్యంతి పతివ్రతాః॥ ౯౧

అవ॥ ఇంక వర్ణాశ్రమధర్మపరిపాలనము ప్రధానముగాఁ గలయుత్తరకాండకథను సంగ్రహించుచున్నాఁడు.

వి॥ పురుషాః=మనుష్యులు, క్వచిత్=ఒకానొకచోటను, కించిత్=కొంచెమైన, పుత్రమరణం, పుత్ర=కొమరునియొక్క, మరణం=చావును, నద్రక్ష్యంతి=చూడఁబోరు. నార్యశ్చ=స్త్రీలును, నిత్యం=ఎల్లప్పుడు, అవిధవాః=వితంతువులుగానివారలు, పతివ్రతాః=భర్తలయందువిశేషభక్తిగలవారును, భవిష్యంతి=కాఁగలరు.

భా॥ శ్రీరాముఁడు సామ్రాజ్యాభిషిక్తుఁడై ప్రజలను బాలించుచున్నప్పుడు జననీజనకులు సజీవులై యుండఁగాఁ గొమరులు మరణించుటయించుకయు నెచ్చటను గలుగక స్త్రీలు సౌభాగ్యసంశోభితలై నిండుపతిభక్తితో నెప్పుడుఁ బ్రకాశించెదరు.

న చాగ్నిజం భయం కించి న్నాప్సు మజ్జంతి జంతవః।
న వాతజం భయం కించి న్నాపి జ్వరకృతం తథా॥
న చాపి క్షుద్భయం తత్ర న తస్కరభయం తథా। ౯—౨౪

వి॥ తత్ర=ఆశ్రీరామప్రభుత్వమందు, అగ్నిజం=అగ్నిహోత్రమువలనఁ బుట్టిన,భయంచ=భయమును, (నభవిష్యతి)=కలుగఁబోదు;జంతవః=పశుపక్ష్యాదులు, అప్సు=నీళ్ళయందు, నమజ్జంతి=మునుగవు, వాతజం వాత=వాయువువలన, జం=సంభవించెడు, భయం=భయము, కించిత్=కొలఁదిగానైన,

(౯౧) ద్రక్ష్యంతి' మొదలగుభవిష్యదర్థక క్రియలచే శ్రీరాముఁడు రావణసంహారమొనర్చి రాజ్యముచేయుచున్నకాలమున రామాయణము రచింపఁబడె ననియు కాఁ గలయుత్తరకాండకథను గూడ రచించుటచే నట్లుభవిష్యదర్థక క్రియలు ప్రయోగింపఁ బడె ననియు గ్రహింపం దగు.

కౌసల్యమొదలగువారు గతభర్తృక లైయున్నను బుత్రవతులగుటచేతను బెద్దవారుగావునను విధవలుగాఁ గ్రహింపఁ బడలే దనియాశయము.

(౯—౨) ఇందు మొదటిమూఁడుపాదములచే నాధిదైవికబాధానివృత్తియుఁ, బిమ్మట రెండుపాదములచే నాధ్యాత్మికబాధానివృత్తియుఁ, గడపటిపాదముచే నాధిభౌతికబాధానివృత్తియుఁ జెప్పఁబడినది.

దైవిక మగునగ్నిజలాదులవలనగలుగుభయ మాధిదైవికము. శరీరమున జ్వరాదులవలన గలుగుభయ మాధ్యాత్మికము. దొంగలుమొదలగువారివలనఁ గలుగుభయ మాధిభౌతికము.

న (భవిష్యతి)=కలుగదు; తథా=అట్లు, జ్వరకృతం,జ్వర=సన్నిపాతాదిజ్వరముల వలన,కృతం=చేయఁబడిన,(భయమపి=భయమును,)న(భవిష్యతి)=కలుగదు;క్షుద్భయంచ, క్షుత్=ఆకఁలిచే నైన భయంచ=భయము, కించిత్=కొంచెమును, న(భవిష్యతి)=కలుగదు; తథా=అట్లు, తస్కరభయం, తస్కర=చోరులవలనఁ గలుగు, భయం=భయము, న(భవిష్యతి)=కలుగదు.

భా॥ రామచంద్రుఁడు పరిపాలనముచేయు కాలమందగ్నిహోత్రుని వలన లోకమున కెట్టి యుపద్రవము జనింపక నీటివలన జీవరాసుల కెట్టివిపత్తును బొడసూపక లోకమున ఝంఝామారుతములవలనను సుడిగాడ్పులవలనను బ్రజల కెట్టి యరిష్టము గలుగక ప్రాణులకు సన్నిపాతాదిజ్వరబాధ యించుకంతయు లేక నిఖిలజంతుజాలము నాఁకటిచే బీడింపఁ బడక దొంగల వలని భయ మెంతమాత్రము లేకయుండును.

నగరాణి చ రాష్ట్రాణి ధనధాన్యయుతాని చ॥ ౯౩

వి॥ నగరాణి=పట్టణములు, రాష్ట్రాణి=దేశములు, ధనధాన్యయుతానిచ, ధన=ధనలక్ష్మితోడను, ధాన్య=ధాన్యలక్ష్మితోడను యుతానిచ=కూడిన వై యుండఁగలవు.

భా॥ శ్రీరాముఁడు దొరతనంబు సలుపు చుండఁగా నాతనియేలుబడిలోని నిఖిలనగరములు సమస్తదేశములు ధనధాన్యములతోఁ దులదూగుచుండును.

నిత్యం ప్రముదితా స్సర్వే యథా కృతయుగే తథా।

వి॥ సర్వే=అందఱు, నిత్యం=ఎల్లప్పుడు, కృతయుగే=కృతయుగమున, యథా=ఎట్లు సంతసించిరో, తథా=అట్లే, ప్రముదితాః=సంతసించినవారు (భవిష్యంతి=కాఁగలరు).

భా॥ కృతయుగకాలమునఁ బ్రజలందఱు నెట్లు ధర్మబుద్ధితో మెలంగి యానందించిరో అట్లే రామభద్రుఁడు పరిపాలించు త్రేతాయుగసమయ మందును సంపూర్ణధర్మనిష్ఠు లై యధికానందముతో నొప్పుచుందురు.

అశ్వమేధశతై రిష్ట్వా తథా బహుసువర్ణకైః॥

గవాం కోట్యయుతం దత్వా బ్రహ్మలోకం ప్రయాస్యతి।

అసంఖ్యేయం ధనం దత్వా బ్రాహ్మణేభ్యో మహాయశాః॥ ౯౪

(౯౪) (దశవర్షసహస్రాణి వాజిమేధ ముపాకరోత్) 'శ్రీరాముఁడు పదివేలసంవత్సరము లశ్వమేధముల నాచరించె' నని చెప్పఁబడుటచే నిచ్చట శతశబ్దమున కనేకశతములనియర్థము.

(సుబహూని సువర్ణాని య త్రోపకరణత్వతః। విందతే న క్రతుస్సృష్టి స్సస్తుతో బహుసువర్ణకః) మిక్కిలియధికము లగుసువర్ణము లుపకరణములుగాఁ గల దగుటచే నాక్రతువు

వి॥ మహాయశాః, మహత్=విశేషమైన, యశాః=కీర్తిగల శ్రీరాముఁడు, అశ్వమేధశతైః, అశ్వమేధ=అశ్వమేధయాగములయొక్క, శతైః=వందలచేతను, తథా=అట్లు, బహుసువర్ణకైః=బహుసువర్ణకము లనుక్రతువులచేతను, ఇష్ట్వా=సమస్తదేవతలను దృప్తిఁబొందించి గవాం=గోవులయొక్క, కోట్యయుతం=పదివేలకోట్లను, అసంఖ్యేయం=లెక్కింపశక్యముగాని ధనం=ద్రవ్యమును, బ్రాహ్మణేభ్యః=బ్రాహ్మణులకొఱకు, దత్వా=ఇచ్చి, బ్రహ్మలోకం=పరబ్రహ్మస్వరూపుఁ డగు తనయొక్కలోకమునుగూర్చి, ప్రయాస్యతి=వెళ్ళఁగలఁడు.

భా॥ పరమపూజ్య మగుప్రశస్తి గల శ్రీరాముఁడు వందలకొలఁది యశ్వమేధయాగములను, నపరిమితము లగు బహుసువర్ణకము లనుమహాక్రతువులను గల్పోక్తరీతిగా నాచరించి బ్రాహ్మణోత్తములకుఁ బదివేలకోట్ల గోవులను లెక్కింప రాని విత్తమును దానముగా నిచ్చి పరబ్రహ్మ మగు తనయొక్క తావుం జేరఁ గలఁడు.

రాజవంశాన్ శతగుణాన్ స్థాపయిష్యతి రాఘవః।
చాతుర్వర్ణ్యం చ లోకే ఽస్మిన్ స్వే స్వే ధర్మే నియోక్ష్యతి॥ ౯౬

వి॥ అస్మిన్=ఈ, లోకే=మర్త్యలోకమందు, రాఘవః=రామభద్రుఁడు, రాజవంశాన్, రాజ=క్షత్రియులయొక్క, వంశాన్=వంశములను, శతగుణాన్=నూఱురెట్లు వృద్ధిగలవానినిగా, స్థాపయిష్యతి=నెలకొల్పఁగలుగును; చాతుర్వర్ణ్యం=బ్రాహ్మణాదివర్ణచతుష్టయమును, స్వేస్వే=తమతమ, ధర్మే=వర్ణాశ్రమోచితధర్మమందు, నియోక్ష్యతి=నియమింపఁగలఁడు,

---

బహుసువర్ణక మనఁబడుచున్నది. పిదపఁ జేయఁ దగినబహుసువర్ణకములం జేసె ననుటచే నయ్యాగమునకుఁ బూర్వమొనర్పవలసిన యగ్నిష్టోమాదిక్రతువుల నాచరించె నని యర్థమువలన సిద్ధించు చున్నది.

'సుమహాయశాః' అనుటచే నొకింత లోకాపవాదమును విని నంతనే సీతను విడిచె నని చెప్పఁ బడు చున్నది.

రావణసంహారమువలనఁ గలిగినపాపమును బోఁగొట్టికొనుటకై యశ్వమేధము లొనర్పం బడెఁ గానఁ బట్టాభిషేకమైన యనతికాలముననే శ్రీరాముఁ డశ్వమేధము లారంభించియుండు ననియు సీత లేకుండఁగనే యశ్వమేధము లొనర్చినవాఁడు గానఁ బట్టాభిషేకానంతరము కొలఁదికాలముమాత్రము సీతాదేవితోఁ గూడియుండె ననియు బిమ్మటఁబదివేలసంవత్సరములకుఁ బైగా సీతావియుక్తుఁడై యుండెననియు నూహింపఁ బడుచున్నది.

భగవదంశసంభూతుఁ డగుదనకుఁ బుణ్యపాపములు లేకున్నను శ్రీరాముఁ డశ్వమేధాదియాగము లొనర్చుట లోకానుకరణార్థ మనియెఱుంగునది.

భా॥ రఘుకులావతంసుఁ డగుశ్రీరాముఁడు రాజన్యులకు విశేష రాజ్యము లొసంగి వందలకొలఁదిగా క్షత్రియవంశముల నభివృద్ధినొందించి బ్రాహ్మణులు లోనుగాఁ గలనాలుగువర్ణములవారిని దత్తద్వర్ణాశ్రమోచిత ధర్మములయందుఁ బ్రవర్తింపఁ జేయఁ గలఁడు.

దశ వర్షసహస్రాణి దశ వర్షశతాని చ।
రామో రాజ్య ముపాసిత్వా బ్రహ్మలోకం గమిష్యతి॥ ౯౭

వి॥ రామః=శ్రీరాముఁడు, దశవర్షసహస్రాణి=పదివేలసంవత్సరములను, దశవర్షశతానిచ=పదివందలసంవత్సరములను, రాజ్యం=ప్రభుత్వమును, ఉపాసిత్వా=సేవించి, బ్రహ్మలోకం, బ్రహ్మ=పరబ్రహ్మస్వరూపుఁ డగుతనయొక్క, లోకం=లోకమగువైకుంఠమును, గమిష్యతి=చేరఁగలఁడు.

భా॥ శ్రీరాముఁడు పదునొకండువేలదివ్యవత్సరములు భూమి నంతను బాలించి పిదపఁ బరబ్రహ్మస్వరూపుఁ డగుతనయొక్క నెల వైనవైకుంఠమును బొందఁగలఁడు.

ఇదం పవిత్రం పాపఘ్నం పుణ్యం వేదైశ్చ సమ్మితమ్।
యః పఠే ద్రామచరితమ్ సర్వపాపైః ప్రముచ్యతే॥ ౯౮

వి॥ పవిత్రం=పరమపావనమగునట్టి, పాపఘ్నం, పాప=సమస్తదురితములను, ఘ్నం=నశింపఁజేయునది, పుణ్యం=మంచిఫలము నిచ్చునది వేదైశ్చ=నాలుగువేదములతో, సమ్మితం=పోల్పఁదగినది యగు, ఇదం=ఈ, రామచరితం, రామ=శ్రీరామునియొక్క, చరితం=కథను, యః=ఎవ్వఁడు, పఠేత్=చదువునో, సః=అతఁడు, సర్వపాపైః, సర్వ=సమస్తములైన, పాపైః=దోషములచేత, ప్రముచ్యతే=విడువఁబడుచున్నాఁడు.

భా॥ మిగులఁ బవిత్రతను గలిగించునది మహాదోషములనడంచునది విశేషఫల మొసంగునది వేదచతుష్టయముతో సమానమైనది నీసంక్షేపాత్మకము నగురామచంద్రునియొక్క యీచరిత్రమును భక్తితో నెవ్వఁడు పఠించు నాతఁడు సకలకలుషములనుండి విముక్తిం గాంచు.

ఏత దాయుష్య మాఖ్యానం పఠన్ రామాయణం నరః।
సపుత్రపౌత్రః సగణః ప్రేత్య స్వర్గే మహీయతే॥ ౯౯

---

(౯౯) 'అయ గతౌ' అను ధాతువువలన (రామస్య అయనం రామాయణం) రామునకు స్థానమైనదిగావున రామాయణమనఁబడుచున్నది. లేక-(రామః అయ్యతే ప్రాప్యతే ఇతి రామాయణం) ఈగ్రంథముచే శ్రీరాముఁడు పొందఁ బడు చున్నాఁడు గాన రామాయణము. లేక (రామః అయనం ప్రతిపాద్యః య స్యేతి రామాయణం) శ్రీరాముఁడు ప్రతిపాద్యవస్తువుగాఁ గలగ్రంథము రామాయణము.

వి॥ ఆయుష్యం=ఆయువేవృద్ధియోజనముగాఁ గలది, ఆఖ్యానం=జరిగినకథను బ్రతిపాదించునదియు నగు, ఏతత్=ఈ, రామాయణం=బాలరామాయణమును, పఠన్=పారాయణ మొనర్చునట్టి, నరః=మనుష్యుఁడు, సపుత్రపౌత్రః=కుమారులతోడను మనుమలతోడను గూడినవాఁడు, సగణః=పరివారముతో, గూడినవాఁడు నై, ప్రేత్య=దేహత్యాగ మొనర్చినపిదప, స్వర్గే=దేవలోకమునందు, మహీయతే=గౌరవింపఁ బడు చున్నాఁడు.

భా॥ ఆయుర్వృద్ధి నిచ్చునది యథార్థ మగునితివృత్తముగలదియు నైన బాలరామాయణమును బారాయణము చేయువాఁడు భూమియందుఁ బుత్రపౌత్రాదిగణయుతుం డై దేహమును విడిచినపిమ్మట స్వర్గమున మిగుల గౌరవింపఁ బడు చుండు.

పఠన్ ద్విజో వాగృషభత్వ మీయాత్ ।
స్యాత్ క్షత్రియో భూమిపతిత్వ మీయాత్ ।
వణిగ్జనః పణ్యఫలత్వ మీయాత్ ।
జన శ్చ శూద్రోఽపి మహత్త్వ మీయాత్ ॥ ౧౦౦

వి॥ (ఇదం=ఈబాలరామాయణమును,) పఠన్=పారాయణ మొనర్చునట్టి, జనః=మనుష్యుఁడు, ద్విజస్స్యాత్=బ్రాహ్మణుం డైన, వాగృషభత్వం, వాక్=విద్యలయందు, ఋషభత్వం=శ్రేష్ఠత్వమును, ఈయాత్=పొందును; క్షత్రియస్స్యాత్=క్షత్రియుఁ డైన, భూమిపతిత్వం, భూమి=భూమికి, పతిత్వం=ప్రభువగుటను, ఈయాత్=పొందును; వణిగ్జనస్స్యాత్=వైశ్యుఁ డైన, పణ్యఫలత్వం, పణ్య=అమ్మంగొనందగు వస్తువులవలన, ఫలత్వం=లాభమునొందుటను, ఈయాత్=పొందును; శూద్రోఽపిచస్యాత్=శూద్రుఁ డైనను, మహత్త్వం=సాటివారిలో గొప్పఁదనమును, ఈయాత్=పొందును.

---

(౧౦౦) 'ఇదం, పఠన్, జనః, అనుపదములు నాలుగువాక్యములందును యోజించుకొనం దగు.

'స్యాత్', అనునది యవ్యయార్థక మగునవ్యయము.

టీక-అల్పార్థకము. అప్పుడు, స్యాద్ద్విజః-అల్పబ్రాహ్మణుఁడు, ఇదం, పఠన్, వాగృషభత్వం, ఈయాత్ అని యర్థము. ఇట్లే తక్కిన వాక్యములందును జెప్పికొనునది.

టీక-స్యా దస్తి. స్యా న్నాస్తి, యని సప్తభంగీవ్యాఖ్యానమున 'స్యాత్', అనునది కించిదర్థకముగాఁ బ్రయుక్త మైనందున స్యాత్-శాస్త్రోక్తనియమములులేకుండఁగాఁ గాని యేకొంచె మైననుగాని, పఠన్, వాగృషభత్వం, ఈయాత్, అనియుఁ జెప్పఁ గొనవచ్చును.

భా॥ పరమపవిత్రము నిహాముత్రఫలదాయకము నగునీబాలరామాయణమును భక్తిశ్రద్ధాసమన్వితుఁడై బ్రాహ్మణుండధ్యయన మొనర్చిన సకలవిద్యాపారీణుం డగును; క్షత్రియుండు పారాయణముచేసిన భూనాయకుం డగు; వైశ్యుండు పఠించినఁ గ్రయవిక్రయవ్యాపారమున విశేషలాభము నొందును; శూద్రుండు చదివినఁ దనజాతివారిలో నత్యంతగౌరవము నొందును.

గ॥ ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాండే సంక్షేపో నామ ప్రథమ స్సర్గః॥

టీ॥ ఆర్షే=ఋషిప్రోక్త మైన, శ్రీమద్రామాయణే, శ్రీమత్=శుభలక్షణములుగల, రామాయణే=రామాయణమను, ఆదికావ్యే=ఆదికావ్యమునందు, బాలకాండే=బాలకాండమున, సంక్షేపోనామ=సంగ్రహరామాయణమనిప్రసిద్ధమగు, ప్రథమః=మొదటిదగు, సర్గః=సర్గము, ఇతి=సమాప్తము.

భా॥ వాల్మీకిమహర్షిచే రచింపఁబడిన శ్రీమద్రామాయణం బను ప్రథమకావ్యంబున బాలకాండమందు సంగ్రహకథారూప మగు మొదటి సర్గము సమాప్త మయ్యెను.

ఇది

ప్రతిపదాంధ్రవివరణభావనానార్థసమేత మగుతత్త్వసంజీవిని
యనుశ్రీమద్వాల్మీకిరామాయణసంపూర్ణాంధ్రవాఖ్యా
నంబున బాలకాండప్రథమసర్గము.

---

అనఁగా నీబాలరామాయణము నియముతోఁ గాని నియమములేక గాని సంపూర్ణముగాఁ గాని యేకొంచె మైనను గాని పఠించినచోఁ జెప్పఁబడిన ఫలములు గలుగుననిభావము.

'నగరార్ణవశైలర్తుచంద్రార్కోదయవర్ణనైః। ఉద్యానసలిలక్రీడామధుపానరతోత్సవైః॥ విప్రలంభై ర్వివాహైశ్చ కుమారోదయవర్ణనైః। మంత్రద్యూతప్రయాణాజినాయకాభ్యుదయై రపి। అలంకృత మసంక్షిప్తం రసభావనిరంతరం। సర్గై రనతివిస్తీర్ణై శ్శ్రావ్యవృత్తై స్సుసంధిభిః॥ సర్వత్ర భిన్నవృత్తాంతై రుపేతం లోకరంజనం। కావ్యం కల్పాంతరస్థాయి జాయతే సదలంకృతి'॥ అని కావ్యలక్షణము.